ఆంధ్రప్రదేశ్

ఉగాది
ప్రత్యేక సంచిక

మార్చి 1968

★

30 పైసలు



ఆంధ్రప్రదేశ్‌ను గురించి...

విస్తీర్ణం	1,06,286 చ. మై.
జిల్లాలు	20
తాలూకాలు	189
గ్రామాలు	28,997
పట్టణాలు, నగరాలు	212
మొత్తం జనసంఖ్య (1961)	359.83 లక్షలు
జన సాంద్రత (1961)	339 చ. మై. 1 కి.
అక్షరాస్యులు (1961)	76.27 లక్షలు
షెడ్యూల్డు కులాలవారు (1961)	49.74 లక్షలు
షెడ్యూల్డు తెగలవారు (1961)	13.24 లక్షలు
నమోదైన కర్మాగారాలు	3,928
విశ్వవిద్యాలయాలు	4
పంచాయతీలు	15,266
పంచాయతీ సమితులు	321
ఆంధ్రప్రదేశ్ నుండి పార్లమెంటు సభ్యులు	61
విధానసభ సభ్యులు	288
శాసనమండలి సభ్యులు	90

ఆంధ్ర ప్రదేశ్

మార్చి — 1968

సంపుటి: 12] 	[సంచిక: 5

ఫాల్గుణ — చైత్ర — 1889—1890 శా.శ.

ప్రధాన సంపాదకులు

బి. యస్. రామన్, ఐ. ఎ. యస్.

సంపాదకులు

ఎస్. వి. గోపాలశాస్త్రి

ఈ సంచికలో....

కీలక ఉగాది సందర్భంగా
మా పాఠకులందరికీ
హృదయపూర్వక శుభాకాంక్షలు


మొదటి అట్ట : మహాశివరాత్రినాడు కీసరగుట్టలో యాత్రికులు

మూడవ అట్ట : రేపటి పౌరులు

నాలుగవ అట్ట : సంధ్యాసమయంలో హుసేన్‌సాగర్

ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినవి కావు. సం॥

పేజీ



భాషా సమస్య

రాష్ట్రపతి ఉద్బోధ

రాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుస్సేన్, ఫిబ్రవరి 12వ తేదీన, ఉభయ పార్లమెంటు సభల సమావేశంలో ప్రారంభోపన్యాసం చేస్తూ, హింసాత్మకమైన ఆందోళనలు జరపడంవల్ల ప్రజాస్వామిక విధానం బలహీనమవుతుందనీ, జాతీయ సమైక్యతకు దెబ్బతగులుతుందనీ హెచ్చరించారు. "మతం, భాష, వర్గం పేరిట విచ్ఛిన్నకర శక్తులు విజృంభించడంపట్ల రాష్ట్రపతి విచారం వెలిబుచ్చారు. చర్చల ద్వారా, సహేతుకమైన విధానాల ద్వారా వివాదాలను పరిష్కరించుకునే ప్రజాస్వామిక పద్ధతులను అనుసరించవలసిందిగా ఆయన ఆందోళనలకు, అలజడులకు దిగుతున్న వారికి విజ్ఞప్తి చేశారు.

భాషా సమస్యపై ప్రదర్శనలు, అరాజకచర్యలు జరగడంపట్ల రాష్ట్రపతి తీవ్రవిచారం వెలిబుచ్చారు. దేశ సమైక్యతను పటిష్ఠంచేయడం, సమాజంలోని అన్నివర్గాల ప్రజలకూ, సాంస్కృతికాభివృద్ధికి సంపూర్ణంగా అవకాశాలు కలిగించడమే ప్రభుత్వ విధానమని ఆయన ఉద్ఘాటించారు. భాషా విషయంలో వుత్పన్నమైన ప్రత్యక్ష సమస్యల పట్ల అవగాహన, సర్దుబాటు వైఖరి వహించడం జరుగుతుందని ఆయన అన్నారు.



'మన పురోగమనం నిరాటంకంగా సాగాలి'

ముఖ్యమంత్రి ఉగాది సందేశం

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి 'ఆంధ్రప్రదేశ్' మాస పత్రిక ద్వారా రాష్ట్ర ప్రజలకు ఈ దిగువ ఉగాది సందేశాన్ని యిచ్చారు :

"ఉగాది ప్రతివారి మనస్సుల్లో కొత్త కోర్కెలు రేకెత్తించే పండుగ. ఇది మన ఆశలకూ, ఆశయాల సఫలతకూ చిహ్నం. అందుకే యీ పండుగకు యింత ప్రాధాన్యం. చెట్లు కొత్తగా చిగిరించినా, కోయిలలు పాడినా – యివన్నీ నూతన జీవితానికీ, కాలంలో కలుగుతున్న మార్పుకూ ప్రతిధ్వనులే.

మార్పు సృష్టిలో ప్రదాన లక్షణం. మానవజీవితంలో మార్పుకోసమే మనం నిరంతరం ప్రయత్నిస్తున్నాం. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో అనేక పథకాల ద్వారా జరుగుతున్న కృషి యీ మార్పుకోసమే.

దేశంలో నేడు జరుగుతున్న శాంతియుత విప్లవ లక్ష్యాలను ప్రజలందరూ చక్కగా అర్థం చేసుకోవాలి. హింసాయుతమైన విప్లవాలు జరిగినచోట్ల కూడా కావలసిన కోర్కెలన్నీ ఒకేసారి తీరలేదనే విషయాన్ని గుర్తుంచుకోవడం అవసరం. జాతి పురోగమించాలంటే మనమందరం ఒకేజాతివారము, ఒకే త్రోవలో పయనిస్తేగాని గమ్యం చేరలేము అనే చైతన్యం ప్రజల్లో కలగాలి. జాతి జీవన విచ్ఛిన్నకరంగా తలయెత్తే శక్తులను మనం ఎప్పటికప్పుడు అదుపులోకి తెచ్చుకుంటూ వుండాలి. ప్రాంతీయ విభేదాలు, జాతీయభాష, ప్రజాస్వామ్య పరిరక్షణవంటి ముఖ్య సమస్యల విషయంలో అన్నివర్గాల ప్రజలు నిగ్రహంతో, పరస్పర అవగాహనతో వ్యవహరించడం చాలా అవసరం. ఈ సమస్యలను ఎవరుగాని స్వప్రయోజనాలకు ఉపయోగించుకోకుండా మనం జాగ్రత్త పడాలి.

అందరికీ స్వేచ్ఛ, అభిప్రాయ ప్రకటనకు స్వాతంత్ర్యంగల ప్రజాస్వామ్య వ్యవస్థను మనం అనుసరిస్తున్నాం. ఆ మార్గంలోనే, అందరికీ సమానావకాశాలు వుండే సామ్యవాద సరళి సమాజం నిర్మించబూనుకున్నాం. సాధించిన ఫలితాలను సమీక్షించుకుంటూ లక్ష్యం వైపు పురోగమిస్తున్నాం.

ఈ నూతన కీలకసంవత్సరంలోకూడా మన పురోగమనం నిరాటంకంగా సాగాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ నిరంతర ప్రగతి యాత్రలో ప్రధాన భాగస్వాములైన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు యితోధిక విజయాలు లభించాలని ఆశిస్తూ, నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేస్తున్నాను."



స్వేచ్ఛాగీతి

జి. జాషువ

అస్తమించినది మ మ్మంధకారమునందు
　　బంధించు జాతుల హానిదాడి
పీడిపోయినది మా వేడి రక్తంబును
　　గావుపట్టిన బూచిగాని భయము
దౌడుదీసినది మా తాత తండ్రుల వెంట
　　దగిలి వచ్చిన యదంతరపు బ్రదుకు
తొలగి పోయినది మా తలలపై నడయాడి
　　కనులెఱ్ఱజేయు కిగ్గాడి జెండ


కునికి నిద్రించు నలుబదికోట్ల వీర
భారతీయుల విక్రమస్ఫార వహ్ని
మేలుకొన్నది నేడు లోకాలు మెచ్చ
భూమి శాసించు సార్వభౌముడను నేను

నాజాతిన్నడపించు కోదగిన
　　పంథాలో సిరోధింపగ
రాజుల్లేరిక నుత్తమోత్తమకళా
　　బ్రాహ్మీసుధా గారముల్
బూజున్దుల్చి యఖండలంబిడి
　　పునఃపూజల్ ప్రతిష్ఠించెదన్
రోజుల్నావి, పొలంబునాది,
　　వెలయింతున్ దిగ్జయ స్తంభముల్

అపరంజిగురిసి మాకన్నంబు దినిపించు
　　తల్లిభారతినేడు దక్కెమాకు
పదియు రెండగు పుణ్య నదులు నపంబులు
　　చిరకాలమునకు జేజిక్కెమాకు
అమర సన్నుతమైన హస్తినాపుర రత్న
　　పీఠంబు తిరుగ బ్రాప్తించెమాకు
తలవంచి పగరకత్తులకు జోహారించు
　　దీనభావము నెమ్మదించెమాకు

అననుభూత రసానంద జనితమైన
చేతనజ్యోతి దిక్కుల చెంగలించి
గోచరంబయ్యె మానేత్ర గోళములకు
అచ్చముగ భారతీయుడ నయితినేడు.

రాష్ట్ర బడ్జెటు



1968 ఫిబ్రవరి 15వ తేదీన అసెంబ్లీలో ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రవేశపెట్టిన 1968_69 సంవత్సరపు రాష్ట్ర బడ్జెటునుబట్టి రెవెన్యూ పద్దున తరుగు రూ. 5.67 కోట్లను, మొత్తం నికరపు తరుగు రూ. 18.07 కోట్లను సూచిస్తున్నది.

పరిస్థితులు క్లిష్టంగా వున్నప్పటికీ, సోషలిస్టు తరహా సమాజావిర్భావానికై ప్రభుత్వం ఉద్దేశించిన వివిధ కార్యక్రమాల నిర్వహణకుగాను యీ బడ్జెటు కేటాయింపులు చేస్తున్నది.

బాలికలకు కల్పిస్తున్న సౌకర్యం మాదిరిగానే బాలురకు కూడా సెకండరీ స్థాయివరకు విద్య ఉచితంగా అందజేయ బడుతుంది.

వార్షిక ప్రణాళికను గురించి ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి 1968_69 వార్షిక ప్రణాళిక వినియోగం విషయమై ప్రణాళికా సమితి తుది నిర్ణయం జరగక పోయినప్పటికీ యీ మొత్తం రూ. 72 కోట్లకు తక్కువ వుండదని తాను భావిస్తున్నానని, ఆ యా విభాగాల కేటాయింపులు కూడా 1967_68లో వలెనే వుండగలవని అన్నారు.

వచ్చే వార్షిక ప్రణాళిక కేటాయింపు రూ. 53 కోట్లు వుండ వచ్చుని భావిస్తున్నారు. వీనిలో కేంద్రం నుంచి వచ్చే గ్రాంటు రూ. 4.30 కోట్లు. ప్రతిపాదించిన ప్రణాళికలో రెవెన్యూ కాతాన వినియోగం రూ. 14.04 కోట్లు.

వర్తమాన సంవత్సరానికి (67_68) సవరించబడిన అంచనాలు : మొదట్లో అనుకున్న రూ. 171.66 కోట్ల స్థానే రెవెన్యూ కాతాన జమ రూ.191.32 కోట్లకు పెరిగింది. రెవెన్యూ కాతాన ఖర్చు మొదట్లో అనుకున్న రూ. 184.42 కోట్ల నుంచి రూ 193.91 కోట్లకు పెరిగింది. కొత్త భూమి పన్ను చట్టంవల్ల రూ. 10 కోట్ల నికర ఆదాయం లభిస్తుంది. రాష్ట్ర ఎక్సైజు సుంకాలు, అమ్మకం పన్ను, స్టాంపుడ్యూటీల వసూళ్లు బాగా జరుగవచ్చు.

ఆర్థికమాంద్యం దేశమంతటా నెలకొని వున్నప్పటికీ పంటలు బాగా పండడంవల్ల పరిస్థితులు సానుకూలంకాగలవనీ, వచ్చే ఏడాది అధిక వ్యవసాయోత్పత్తి లభించగలదనీ, యిప్పుడు పారిశ్రామిక ఉత్పత్తి కొద్దిగా మందంగావున్నా విద్యుచ్ఛక్తి, సేద్యపు నీటి విషయాలలో ఎంతో అభివృద్ధి కనిపించిందనీ ముఖ్యమంత్రి అన్నారు.

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో కరువు పరిస్థితులు ఏర్పడినాయని, కరువుకు గురైన ప్రాంతాలలో ఉదారంగా భూమి శిస్తు రెమిషనుకు ప్రభుత్వం ఉత్తర్వుచేసిందని, కరువునివారణ చర్యల నిమిత్తం యింతవరకు రూ. 50 లక్షలు మంజూరు చేయ బడ్డాయని ముఖ్యమంత్రి అన్నారు.

అడవుల్లో ఉచితంగా పశువులను మేపుకోవడానికి, ఇళ్ళ కప్పులకు గడ్డిని అడవులనుంచి ఉచితంగా తీసుకొని వెళ్ళడానికి ప్రభుత్వం అనుమతించడానికి నిశ్చయించింది.

నాగార్జునసాగర్‌కు వచ్చే యేడాదికి రూ. 8.5 కోట్లు; పోచంపాడుకు రూ. 3 కోట్లు, తుంగభద్ర ఎగువ కాలువకు రూ. 1.45 కోట్లు. గుంటూరు కాలువ పథకానికి రూ 15 లక్షలు కేటాయింపులు జరిగాయి.

పంచాయతీ రాజ్ మంత్రి శ్రీ తోట రామస్వామి రాష్ట్ర శాసన మండలిలో బడ్జెటును ప్రవేశ పెట్టారు.

ముఖ్యమంత్రి బడ్జెటు ప్రసంగం పూర్తిపాఠం

"1967 జూన్‌లో క్రితంసారి బడ్జెటును సమర్పించాను. ఆ తర్వాత దేశంలో ప్రారంభమైన ఆర్థికమాంద్యం ఇంకా సాగుతూనే వుంది. ఇలాంటి పరిస్థితిలో ఆశను కల్గించే విషయం ఏమిటంటే, 1967 సెప్టెంబర్, అక్టోబరునెలల్లో వానలు కురవకపోవటం వలన పంటలు దెబ్బతింటాయేమోనని భయపడినప్పటికీ, ఇప్పుడు పంటలు బాగా పండగలవనే నమ్మకం కలుగుతోంది. వాతావరణ పరిస్థితులు అప్పటికన్న అనుకూలించినై. ధరల పెరుగుదలకూడా మొత్తం మీద జోరు తగ్గింది. నిజానికి ఇటీవలి వారాల్లో కొన్ని వస్తువుల ధరలు తగ్గుముఖం చూపిస్తున్నయ్. ఇక రాబీపంట బాగా వుండటం వల్ల ధరలు ఇంకా స్థిరపడి వుండగలవు. ఆర్థికరంగంలో ఏర్పడిన మాంద్యం పోయి, ఇందుమూలాన మళ్ళీ పూర్వంలోవలె అభివృద్ధి వేగంగా కొనసాగవచ్చు.

అయితే మన ఆర్థిక స్థితిగతులను గురించి సరిగా తెలుసుకోవాలంటే, మన రాష్ట్రం అవతరించినప్పటినుంచి ఈనాటిదాకా మనం సాధించుకోగల్గిన ఆర్థిక అభివృద్ధినిగురించి సమీక్షించటం అవసరం.

మన రాష్ట్రం ఏర్పడి, ఒక దశాబ్దం గడచింది. ఈ పదేళ్ళ కాలంలో రెండవ, మూడవ పంచవర్ష ప్రణాళికలు పరిసమాప్తమైనయ్. 1956_57 లో 57.99 లక్షల టన్నులుగవున్న ఆహారధాన్యాల ఉత్పత్తి 1964_65 లో 75.82 లక్షల టన్నులకు పెరిగింది. అంటే 100 కి 30.7 పాళ్ళు పెరిగింది. కాని 1965_66 లో 60.01 లక్షల టన్నులకు తగ్గింది ఉత్పత్తి. అయితే 1966_67 లో 62.42 లక్షల టన్నులకు పెరిగింది. గడచిన సెప్టెంబర్, అక్టోబరు మాసాల్లో వానలు కురవకపోయినప్పటికీ, ఈ ఏడాది మొత్తంమీద ఆహారధాన్యాల ఉత్పత్తి క్రితం సంవత్సరంకన్న అధికంగానే ఉంటుంది.

గడచిన రెండు ప్రణాళికల కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి కూడా పెరిగింది. పెరుగుదల రెండవ ప్రణాళికలో 100 కి 63 పాళ్ళు వుంటే, మూడవ ప్రణాళికలో 42 పాళ్ళు వుంది. జాయింట్ స్టాక్ కంపెనీల జమ అయిన పెట్టుబడి ధనం 1955_56 లో రూ. 20.75 కోట్లు వుంది. 1964_65 లో రూ. 38 కోట్లకు పెరిగింది. ఫ్యాక్టరీస్ చట్టంకింద రిజిష్టరయిన ఫ్యాక్టరీల్లోని కార్మికుల సంఖ్య 1956 లో 1.79 లక్షలు. 1966 లో ఈ సంఖ్య 2.26 లక్షలకు పెరిగింది. ఈ పెరుగుదలలు చెప్పుకోదగ్గవిగానే ఉన్నాయి. అయినా, రాష్ట్రంలోని పారిశ్రామిక వ్యవస్థ దుర్బలంగానే వుంది. మొత్తం దేశపు పారిశ్రామిక ఆదాయంలో 100 కి సుమారు 3½ పాళ్ళు మాత్రమే మన రాష్ట్రంనుంచి లభిస్తోంది.

ఈ రెండు పంచవర్ష ప్రణాళికల మొత్తం వినియోగం రూ. 541.02 కోట్లు. అందులో 59 శాతం నీటిసాగు, విద్యుచ్ఛక్తిపై వినియోగమయింది. అందువలన కొత్తగా 21 లక్షల ఎకరాలకు సాగువసతి సమకూరింది. విద్యుచ్ఛక్తి స్థాపితశక్తి 193 మె.వా.కు పెరిగింది. గడచిన రెండు సంవత్సరాల్లో, నీటిసాగు వసతి మరొక 11 లక్షల ఎకరాల ప్రాంతానికి సమకూరింది. విద్యుచ్ఛక్తి ఉత్పాదనశక్తి 300 మె. వా. కు పెరిగింది. వీటన్నిటి ఫలితంగా మనకు ఉత్పత్తికి కావలసిన వనరు పటిష్ఠంగా ఏర్పడినై. ఆర్థికాభివృద్ధి వేగపరచటానికి ఇవి ఉపకరిస్తాయి. ఇదివరకే ఏర్పరచుకున్న వసతులను వినియోగించుకొనేందుకై మన పెట్టుబడులను సమీకరించుకోవలసి వుంటుంది. కొత్తవాటిపై పెట్టుబడులు పెట్టుకోటకన్న ఇది మంచిది. ఈ విధంగా రాష్ట్రపు మొత్తం ఆర్జనస్థాయి పెరుగుతుంది. అలాగే రాష్ట్ర ఆదాయమూ పెరుగుతుంది.

ప్రణాళికల్లో నిర్దేశించిన రీతిని ఆర్థికాభివృద్ధిని సాధించాలంటే, ప్రణాళికా కార్యక్రమాల నిర్వహణను సమన్వయపరచి సమీకృతం చేయాలి. ఏరంగలోకూడా లక్ష్యాలను సాధించటంలో వెనకబడి వుండకూడదు. ఒక రంగంలో వెనకబడటంవలన మరొక రంగం దెబ్బతినకూడదు. వివిధ ప్రణాళికా పథకాలను అమలు జరిపే వివిధ సంస్థలు చేస్తున్న పనిని సమీక్షించేందుకుగాను, ఇప్పటి ప్రధాన కార్యదర్శి శ్రీ యం. టి. రాజు అధ్యక్షతన ఒక సంఘం నియమించబడింది. ఈ సంఘం చేసిన ముఖ్యమైన సిఫార్సుల్లో కొన్ని ఆర్థికాభివృద్ధిని దోహదపరచటం ప్రథమకర్తవ్యంగా ఉండేటట్లుగా జిల్లా పరిపాలనను తీర్చిదిద్దటం; జిల్లా పరిషత్తు అధ్యక్షుడు, కలెక్టరు సభ్యులుగా వుండే జిల్లా అభివృద్ధి సంఘాలను ఏర్పరచటం; జిల్లాలో ఆర్థిక అభివృద్ధిని సాధించవలసిన బాధ్యతను నిష్కర్షగా వారి కప్పగించటం; వ్యవసాయ ఉత్పత్తికి ప్రధానంగా కావలసిన వసతులను, అంటే, పరపతి వగైరా సౌకర్యాలను సమకూర్చే విషయంలో బాధ్యత కలెక్టరుపైనే వుండాలి. కాబట్టి ఈ వివిధ శాఖలన్నిటికి జిల్లాస్థాయిలో కలెక్టరు అధిపతిగా వుండాలి. ఈ సిఫార్సులను గౌరవ సభ్యులు పరిశీలించిన సంగతి గుర్తుచేస్తున్నాను. జిల్లా అభివృద్ధి సంఘాలు ఇప్పుడే ఏర్పాటు చేయబడినై. వచ్చే ఖరీఫ్ పంట తరుణానికి కావలసిన వ్యవసాయ కార్యక్రమాలను ఈ సంస్థలిప్పుడు తయారు చేస్తున్నయ్. ఒక్కొక్క సమితి ప్రాంతాన్ని కార్యరంగంగా పరిగణిస్తారు.

ప్రస్తుత కార్యక్రమాలు

వివిధరంగాల్లో ఇప్పుడు అమలు జరుగుతున్న కొన్ని ముఖ్య కార్యక్రమాలనుగురించి వివరిస్తాను.

వ్యవసాయం

వ్యవసాయ రంగంలో అధికోత్పత్తిని సాధించేందుకై రూపొందించిన కొత్త విధానంలోని ఒక ముఖ్యాంశం —1966_67 లో ఎక్కువ రాలుబడినిచ్చే రకాలను ప్రవేశపెట్టటం. 1967_68 ఖరీఫ్, రాబీ తరుణాలలోపు 9 లక్షల ఎకరాలకుపైగా వరి సాగయ్యే ప్రాంతంలో ఈ కార్యక్రమం అమలు జరుగుతుంది. వచ్చే

బడ్జెటులో కొన్ని ముఖ్యాంశాలు

పెట్టుబడి కేటాయింపు రూ. 33.08 కోట్లు

[illegible]

నాగార్జున సాగర్ కు రూ. 8.5 కోట్లు

పోచంపాడుకు రూ. 3 కోట్లు

హైదరాబాదు అభివృద్ధికి రూ. 20 లక్షల గ్రాంటు

పంట సమయాల్లో ఇంకా విస్తారంగా. ఒక్క పరిపైరు విషయంలోనే కాక, జవార్, బాజ్రా, మొక్కజొన్న పైర్ల విషయంలోకూడా లక్షల కొద్ది ఎకరాల్లో ఎక్కువ పండే రకాలు ప్రవేశ పెట్టబడుతై.

పొడుగు పత్తిని పండించేందుకై ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టబడిన పథకాలవలన ప్రోత్సాహకరమైన ఫలితాలు లభిస్తూ వున్నాయి. తుంగభద్ర ప్రాజెక్టు, కర్నూలు పథకం కింద Sea-island పత్తి సాగు ఎంతో ఆశాజనకంగా వుంది. అలాగే మరొక రకం P. 216 F కూడ డెల్టా ప్రాంతాల్లో త్వరితంగా వ్యాపిస్తోంది.

విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టబడిన బెంగాల్ జనుము సాగుకూడా ప్రోత్సాహకరంగా వుంది. తక్కువ కాలంలో ఫలించే H C. 6 వ రకం ఆముదపు విత్తనాలు రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో రూపొందించబడినై. ఈ కార్యక్రమాన్ని విస్తృతం చేయటం కూడా జరుగుతోంది.

నీటి సాగు

నీటి సాగు రంగంలోకూడ మన పురోగమనం సుస్థిరంగా వుంది. నాగార్జున సాగర్ జలాశయం నుంచి కాలువల్లోకి 1967 ఆగస్టు 4 వ తేదీన మన ప్రధాన మంత్రి నీటి విడుదలకు ప్రారంభోత్సవం చేశారు. ఇప్పటివరకు 5.33 లక్షల ఎకరాల ప్రాంతం సాగులోకి తేబడింది. కాగా, కృష్ణా డెల్టా ప్రాంతంలో 7 లక్షల ఎకరాల ప్రాంతానికి ఈ రెండవ పంట తరుణంలో నీరు లభిస్తుంది.

1966_67 లో రూ. 16.5 కోట్లు ఖర్చు అయింది. 1967_68 లో రూ. 12 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేయబడింది. 1968_69 లో సూచించిన కేటాయింపు రూ. 8.5 కోట్లు మాత్రమే వుంటుంది. ఈ పరిమితమైన కేటాయింపు ఫలితంగా అదనంగా కుడి కాలువ కింద 30 వేల ఎకరాలకు, ఎడమ కాలువ కింద 20 వేల ఎకరాలకు 1968 జులై నాటికి నీటిసాగు లభిస్తుంది. నాగార్జునసాగర్ ఆనకట్ట పూర్తి నిర్మాణం 1968_69లో సంపూర్తి అవుతుంది.



"ప్రజల సంక్షేమానికి - ముఖ్యంగా బలహీనవర్గాలవారి సంక్షేమానికి సంబంధించిన పథకాలకు కేటాయింపులు చేయటం ప్రభుత్వం తన ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నది"

పోచంపాడు ప్రాజెక్టు పని అప్పుడే చురుగా సాగుతోంది. ఇంకా త్వరితంగా కొనసాగుతుంది. ఇందుకని 1968_69 సంవత్సరానికి రూ. 300 లక్షలు కేటాయించబడినై — 1967_68లో రూ. 160 లక్షలు కేటాయించబడినై.

పని జరుగుతున్న మిగతా ముఖ్య ప్రాజెక్టులు — తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలవ పథకం, గుంటూరు కాలవ పథకం. తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలవ ప్రస్తుత కేటాయింపు రూ. 56.65 లక్షలు. ఈ మొత్తాన్ని 1968_69 లో రూ. 145 లక్షలకు పెంచాలని అనుకుంటున్నాం. గుంటూరు కాలవ పథకానికి 1968_69 కేటాయింపు రూ. 15 లక్షలు వుంటుంది.

లాభంపొందే రైతులనుంచి ముందుగానే విరాళాలు సేకరించే ప్రాజెక్టులు — గోదావరి బ్యారేజ్, యేలేరు జలాశయపథకం, నిజాం సాగర్ అభివృద్ధి పథకం. గోదావరి బ్యారేజ్ విషయంలో విరాళాల కోసం అప్పుడే ప్రకటించటమైంది. మిగతా రెండు పథకాల విషయంలోకూడా త్వరలో ప్రకటించటం జరుగుతుంది.

వంశధార ప్రాజెక్టులో ఒక భాగమైన నేరడి బ్యారేజ్ అతి ముఖ్యమైన మధ్యరకం నీటిసాగు ప్రాజెక్టు. దీని విషయంలో అప్పుడే ప్రాథమిక కార్యక్రమాలు అమలు జరుగుతున్నయి. కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నాం.

డబ్బు తగినంతగా లేనందువల్ల, కొన్ని నీ సాగు ప్రాజెక్టుల విషయంలో పనివేగాన్ని తగ్గించక తప్పలేదు. ఈ సందర్భములో దురదృష్టకరమైన విషయమేమిటంటే, చాలా మంది ఇంజనీర్ల ఉద్యోగాలను తీసివేయాల్సిరావటం. అయితే వీరిని మళ్లీ లాభసాటిగా నియోగించేందుకుగాను, వచ్చే సంవత్సరాల్లో అమలు జరిగే ప్రాజెక్టుల పరిశీలనను ప్రారంభించాలని అనుకుంటున్నాం. అలాగే, ఇప్పుడు కొనసాగుతున్న ప్రాజెక్టుల చివరి దశలకు

సంబంధించిన అంచనాలను వివరాలతో తయారుచేయించాలని అనుకుంటున్నాం. ఇలాచేస్తే, మన ఆర్థిక వసతుల వెసులుబాటు దృష్ట్యా ఆలస్యాలు రాకుండా ఈ కార్యక్రమాలను అమలు జరుపవచ్చు. రాష్ట్ర రంగంలోగాని, కేంద్ర రంగంలోగాని నాల్గవ ప్రణాళికలో ప్రారంభమయ్యే పథకాలను గురించి పరిశీలన జరుగుతుంది.

విద్యుచ్ఛక్తి

శ్రీశైలం ప్రాజెక్టు పని చురుగ్గా సాగుతోంది. నది మధ్య లోతుగా వున్నచోట కాఫర్ డామ్‌ను కట్టే విషయంలో పెద్ద ఇంజనీరింగ్ సమస్య ఏర్పడింది. ఇంచుమించు 40 అడుగుల లోతుగావున్న నీళ్ళలో కాఫర్ డామ్‌ను జయప్రదంగా నిర్మించిన మన ఇంజనీర్లందరినీ నేను ఈ సందర్భంలో అభినందిస్తున్నాను.

విద్యుచ్ఛక్తి బోర్డు ఆర్థిక పరిస్థితి మెరుగై, వినియోగదార్లకు ఇంకెక్కువ సౌకర్యాలు లభించగలవని క్రితం సంవత్సరం నేను ఆశాభావాన్ని వెలిబుచ్చాను. చాలామట్టుకు ఇది నెరవేరింది. ప్రస్తుత సంవత్సరం మొత్తం ఆదాయం సుమారు రూ. 25 కోట్లు వుంటుంది. క్రితం సంవత్సరం ఆదాయం రూ. 18 కోట్లు. వచ్చే ఏడాదికి ఆదాయం రూ. 33.5కోట్లకు పెరగవచ్చు. నిర్వహణ ఖర్చు గత సంవత్సరం 70% వుండగా, ఈఏడాది 49% వుంది. వచ్చే ఏడాది 44 శాతానికి తగ్గిపోవచ్చు. అఖిల భారత స్థాయిలో నిర్వహణ ఖర్చు 45 నుంచి 50 శాతం వరకూ వుంటోంది. అందుకు తగ్గట్టుగా వుంటుంది ఇక్కడ కూడా. గత సంవత్సరం 9 వేల పంపు సెట్లకు, ఈ సంవత్సరం 20 వేల పంపు సెట్లకు విద్యుచ్ఛక్తి లభించింది. ప్రస్తుత సంవత్సరం పెట్టుబడి రూ. 28.14 కోట్లు. 1968_69 కేటాయింపు రూ. 30 కోట్లు. పంపు సెట్లకు, ప్రసార సౌకర్యాలను బలపరచటానికి తగు మొత్తం కేటాయించబడుతుంది.

మూడవ ప్రణాళిక ముగింపు నాటికి మొత్తం స్థాపిత శక్తి 292 మె.వా. క్రితం ఏడాది కొత్తగూడెం వల్ల 120 మె. వా. విద్యుచ్ఛక్తి లభించింది. 1967 జులైలో పని ప్రారంభించిన కొత్తగూడెం మూడవ, నాల్గవ యూనిట్లు ఒక్కొక్క దానివలన అదనంగా 60 మె. వా. విద్యుచ్ఛక్తి లభించింది. ఎగువ సీలేరుకు చెందిన 60 మె. వా. మొదటి విభాగం వినియోగంలోకి వచ్చింది. మొత్తం స్థాపిత శక్తి ఇప్పుడు 592 మె. వా. కు పెరిగింది. ఎగువ సీలేరు రెండవ విభాగం గూడా త్వరలో వినియోగంలోకి రావడంతో, మొత్తం స్థాపిత శక్తి 652 మె.వా. కు పెరుగుతుంది. వరంగల్ ద్వారా డబుల్ సర్క్యూట్ 132 కె. వి. లైన్‌తో కొత్తగూడెం హైదరాబాద్‌తో జతపరుచ బడింది. మహబూబ్ నగర్‌కు 132 కె. వి. లైన్ వచ్చే ఏడాది పూర్తి అవుతుంది. గాజువాకవద్ద సబ్_స్టేషన్ కూడా వినియోగంలోకి వస్తుంది. హైదరాబాద్ కు మరొక సౌకర్యం వుండేందుకు గాను, నాగార్జున సాగర్ 132 కె. వి. లైనుతో జతపరుచ బడింది. జంట నగరాలకు పరిసర తెలంగాణా జిల్లాలకు విద్యుచ్ఛక్తి సప్లైను స్థిర పరచడానికి గాను 75 యం.వి. ఎ. ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబడింది.

గ్రామీణ విద్యుచ్ఛక్తి విస్తరణను వేగిర పరచటానికిగాను ఒక పథకం రూపొందించబడింది. విద్యుచ్ఛక్తి కావలసిన వారి నుంచి, అందనా ఖర్చులో నాల్గవ భాగాన్ని ముందుగానే వసూలు చేయటం జరిగింది. ఈ ఏడాది 20 వేల పంపు సెట్లకు విద్యుచ్ఛక్తి లభించింది. వచ్చే ఏడాది 30 వేల పంపు సెట్లకు విద్యుచ్ఛక్తిని సమకూర్చాలని ఉద్దేశింపబడింది.

తెలంగాణా మిగులు ధనంలోంచి అదనంగా ఒక కోటి రూపాయలు తెలంగాణా గ్రామీణ విద్యుచ్ఛక్తికై 1968_69 లో కేటాయించ బడుతాయి. మిగతా రంగాల్లో తెలంగాణాలో వాటి మిగులులోంచి ఖర్చు అయ్యే రూ. 1.8 కోట్లకు అదనంగా ఈ మొత్తం ఖర్చు అవుతుంది.

పరిశ్రమలు

రూ. 50 కోట్లు ఖర్చయ్యే కోరమాండల్ ఎరువుల కేంద్రానికి విశాఖపట్టణంలో డిప్యూటీ ప్రధాన మంత్రి 1967 డిసెంబర్ 10 వతేదీన ప్రారంభోత్సవం చేశారు. ఈ కేంద్రం పూర్తిగా పని చేయటం ప్రారంభిస్తే, రాష్ట్రంలో ఎరువుల సప్లయి పరిస్థితి బాగా మెరుగవుతుంది.

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సంస్థల్లో అణుశక్తి విభాగం త్వరితగతిన పని చేస్తోంది. అణు రియాక్టర్లకు కావలసిన వస్తుసామగ్రి విషయంలోనూ, ఎలెక్ట్రానిక్ పరికరాల విషయంలోనూ ఉత్పత్తికై విభాగాల నేర్పరచే పని చురుగ్గా సాగుతోంది. విశాఖపట్నంలో ప్రెషర్ వెసెల్స్ ఉత్పత్తికి గాను ఏర్పాటు అవుతున్న ప్రాజెక్టు పని ప్రారంభమైంది. బాల్, రోలర్, బేరింగ్స్ ఉత్పత్తికై ఒక కేంద్రాన్ని ఏర్పాటుచేసే పథకాలను ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ రూపొందిస్తోంది. ఇవి పూర్తి అవుతున్నాయ్. ఖర్చు రూ. 3.5 కోట్లు వుంటుంది. హంగరీ సహకారంతో గాజు సామగ్రిని తయారు చేసే ప్రాజెక్టును అమలు జరిపేందుకుగాను, కేంద్ర ఆర్థిక సంస్థలనుంచి తగిన సహాయం లభించగలదు అని అనుకుంటున్నాం.

కడప జిల్లాలో ఏస్‌బెస్టాస్ పరిశోధనను ఆంధ్రప్రదేశ్ ఖనిజ కార్పొరేషన్ ప్రారంభించింది. పశ్చిమ గోదావరి జిల్లాలోని ద్వారక తిరుమలవద్ద క్లేలేవిగేషన్ ప్లాంటును కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు ఈ కార్పొరేషన్ 3.5 లక్షల టన్నుల ముడి ఇనుమును ఎగుమతి చేసింది. రూ. 1.75 కోట్ల విదేశీ మారకద్రవ్యం లభించింది.

రాష్ట్రంలో పూర్తి చేయబడినట్టి, లేదా ఇంకా కొనసాగుతున్నట్టి భారీ పరిశోధనల గురించి దిగువన ఉదహరిస్తున్నాను:

*రాగి, సీసం:*_గుంటూరు జిల్లాలోని అగ్నిగుండాల ప్రాంతంలో రాగి, సీసపు నిక్షేపాలను గురించి వివరంగా పరిశీలించటం:

బండలమొట్టు, నల్‌గొండ, ధూకొండ మండలాల్లో సుమారు 14 మిలియన్ల టన్నుల ముడి సీసం, రాగి ఇదివరకే పరిశోధించబడినై. డ్రిల్లింగ్ పని చురుగ్గా సాగుతోంది.

రాగి:- కర్నూలు జిల్లాలోని గానికొలవ ప్రాంతంలో రాగి నిక్షేపాలను అంచనావేయటం:

1968-69 లో ఇంకా లోతుగా డ్రిల్లింగ్ జరుపబడుతుంది.

సీసం, తుత్తునాగం:- కడప, కర్నూలు జిల్లాల్లో చెలిమ వారికుంట, జంగంరాజుపల్లె ప్రాంతంలో సీసం, తుత్తునాగం నిక్షేపాలను అంచనావేయటం:

నిక్షేపాల తుదిఅంచనాలుగాను డ్రిల్లింగ్ ఇంకా కొనసాగించబడుతుంది.

బంగారం:- అనంతపురం జిల్లాలోని రామగిరి బంగారపు క్షేత్రంలో బంగారపు డ్రిల్లింగ్, ఖనిజ పరిశోధన:

యేపమానగనిలో మొత్తం 400 మీటర్ల పొడవున ore-shoo's రెండవ స్థాయిలో ఏర్పాటు చేయబడినై. సగటున 1 మీటరు వెడల్పు మేరలో టన్నుకు 5 నుంచి 8 గ్రాముల బంగారం వుంటుంది. యేపమాన గనిలోని 3 వ స్థాయి పనికూడా ప్రారంభించబడింది.

ఏస్‌బెస్టాస్:- కడప జిల్లాలోని పులివెండ్ల ప్రాంతంలో ఏస్‌బెస్టాస్, రాగి డ్రిల్లింగ్‌కు, వివరంగా మేపింగ్‌కు ఏర్పాట్లు:

ప్రాథమిక అంచనాలవల్ల ఏస్‌బెస్టాస్ 0.25 మిలియన్ టన్నులుంటుందని తేలింది. నిక్షేపాల తుదిఅంచనాలను వివరంగా తయారుచేసే పని ప్రారంభమైంది.

రాగి:- ఖమ్మంజిల్లాలోని మైలారం ప్రాంతంలోని రాగి నిక్షేపాలను వివరంగా అంచనా వేయటం:

డ్రిల్లింగ్ మొదటిదశలో 2 శాతం రాగితో సుమారు 0.46 మిలియన్ టన్నుల ముడిరాగి పరిశోధించబడింది. లోతుగా డ్రిల్లు చేసే పనిలో రెండవదశ పని చురుగ్గా సాగుతోంది.

వ్యవసాయ పరిశ్రమల కార్పొరేషన్

1968 మార్చి నెలాఖరులోపు ఒక వ్యవసాయ పరిశ్రమల కార్పొరేషన్ను ఏర్పాటు చేయాలని అనుకుంటున్నాం. దాని మొత్తం వాటాధనం రూ. 2 కోట్లు వుంటుంది. ఇందులో 51 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం, మిగతా 49 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తాయి. ఇప్పుడు వెంటనే సమకూర్చిన వాటా ధనం రూ. 60 లక్షలు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వపు వాటా రూ. 30 లక్షలు; కేంద్ర ప్రభుత్వపు వాటా రూ. 30 లక్షలు. వ్యవసాయ యంత్రాలను, పనిముట్లను, పరికరాలు వగైరాలను ఈ సంస్థ క్రయ విక్రయాలు చేయటంతోపాటు, వ్యవసాయదార్లకు సరస ధరలకు యంత్రాలను కిరాయి పద్ధతిన సప్లై చేస్తుంది. ట్రాక్టర్లు, పవర్-టిల్లర్లు, త్రవ్వకపు యంత్రాలు వగైరాలాంటి దిగుమతి అయ్యే యంత్రాలను కేంద్రప్రభుత్వం ఈ సంస్థకు కేటాయిస్తుంది. జీడి పప్పు, బియ్యం, పత్తి, పొగాకు, వేరుశనగ, పళ్లు, కూరగాయలు వగైరాల తయారీ పరిశ్రమల్లాంటి వ్యవసాయ పరిశ్రమలకు కూడా ఈ సంస్థ కృషి విస్తరిస్తుంది.

విద్య

త్రిభాషా సూత్రంప్రకారం, ప్రతి విద్యార్థి ఆంగ్లం, హిందీ, తన మాతృభాష - ఈ మూడు భాషలను నేర్చుకోటం అవసరం. ఈ సూత్రం మన రాష్ట్రంలో ఏడేళ్లకు పైగా అమలులో వుంది. ఈ సూత్రాన్ని అమలుజరపటంలో పెద్ద ఇబ్బందులేవీ తటస్థించలేదు. కాని ఇటీవల పార్లమెంటు ఆమోదించిన తీర్మానాల ఫలితంగానూ, కొన్ని రాష్ట్రాలవలంభిస్తున్న దృక్పథం ఫలితంగానూ ఈ త్రిభాషా సూత్రాన్ని అమలుజరపటం ఇబ్బందిగానే వుంది. జాతీయ సమైక్యాన్ని భద్రపరచుకొనవలసిన ఆవశ్యకతను మనస్సులో వుంచుకొని ఈ సమస్యను పరిశీలించి తగువిధంగా పరిష్కరించాలని వినయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాను. గౌరవ శాసనసభ్యులు తమ అభిప్రాయాలను నిష్పాక్షికంగా ప్రకటించటానికి తగిన అవకాశం సమకూరగలదని అనుకుంటున్నాను.

కళాశాలల్లో క్రమంగా తెలుగునే బోధనా భాషగా ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఇక పరిపాలనా విషయాల్లో కూడా సుమారు 25 శాఖల్లో తాలూకాస్థాయి వరకు తెలుగు భాషను వాడాలని ప్రభుత్వం ఉత్తర్వు చేసింది. క్రమంగా ఇదికూడా విస్తరించబడుతుంది.

వరంగల్, గుంటూరు, అనంతపురం నగరాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ కేంద్రాలు మూడు ఏర్పాటు చేయబడినై. ఒక్కొక్క దానికయ్యే ఖర్చు రూ. 25 లక్షలు ఉంటుంది. పట్టభద్రానంతర విద్యకు ఈ కేంద్రాలు ఆధారాలుగా వుండి, క్రమంగా సమగ్ర విశ్వవిద్యాలయాలుగా వృద్ధిచెందగలవు.

సహకార రంగం

1666-67 లో సహకార సంఘాల ఉత్పత్తికి సమకూర్చిన ధనం రూ. 17 కోట్లు వుంటుంది. ఈ యేడాది రూ. 25 కోట్లకు, వచ్చే యేడాది రూ. 40 కోట్లకు పెరుగుతుంది. దీర్ఘకాలపు ఆర్థిక సహాయం కూడా 1966-67 లో రూ. 11 కోట్లు వుంటే, 1967-68 లో రూ. 15 కోట్లు వుంది. 1968-69లో ఇది రూ. 20 కోట్లకు పెరుగుతుంది. వ్యావసాయిక రీఫైనాన్స్ కార్పొరేషన్ సహాయం చేయవలసిన ప్రాంతాభివృద్ధి పథకాలను పెద్ద స్థాయిన ప్రారంభించటం జరుగుతోంది.

హైదరాబాద్‌లోని సూపర్ బజార్ బాగా పేరు సంపాదించుకుంటోంది. ఇప్పుడు రోజుసరి అమ్మకం రూ. 38,000 ల దాకా వుంది. ధరలను అదుపులో పెట్టేందుకై మరికొన్ని ముఖ్య పట్టణాల్లోకూడా ఇదేమాదిరి సూపర్ బజార్లను ఏర్పాటు చేయాలని వుంది. శనగపప్పు, జవార్ లాంటి ముఖ్యవస్తువులను సేకరించటానికి ప్రభుత్వం నిశ్చయించింది—సప్లై సన్నగిల్లే నెలల్లో పేద వర్గాల వారికి వీటిని సప్లై చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

భూమి కేటాయింపు

బంజరు భూముల విషయంలో భూమిలేని పేదవారికి పట్టాలు త్వరగా మంజూరయ్యేట్టు చూస్తానని నేను మాటయివ్వటం గౌరవ

సభ్యులకు గుర్తువుంటుంది. ఈ మాట పూర్తిగా నెరవేరిందని చెప్పటానికి ఎంతో సంతోషిస్తున్నాను. 1967 జులై ఆఖరునాటికి దాఖలు చేసిన 1,21,878 దరఖాస్తుల్లో ఒక లక్షమందికి పైగా పట్టాలు మంజూరు చేయబడినై. మిగతావాటి పనికూడా వచ్చే నెలల్లో పూర్తి అవుతుంది.

షెడ్యూలు జాతులవారి నుంచి ఇతరులు తీసుకున్న భూముల సందర్భంలో, ఇతరులను వాటినుంచి తొలగించటానికై తీవ్ర చర్యలు తీసుకొనబడినై. ఈ విధానంకింద షెడ్యూలు జాతులవారికి సుమారు 37 వేల ఎకరాల భూమి కేటాయించబడుతుంది.

కౌలు సంస్కరణ

1950 ఆంధ్ర ప్రదేశ్ (తెలంగాణా ప్రాంతం) టెనన్సీ అఫ్ అగ్రికల్చరల్ లాండ్ ఆక్టులో ఒక నిబంధన వుంది. భూమి ఏదయినా సరే, యాజమాన్యాన్ని రక్షణపొందిన కౌలుదార్లకు ఈ నిబంధన ప్రకారం మార్చవచ్చు. భూస్వాములనుంచి భూములను కొనుక్కునే హక్కు కౌలుదార్లకు వుంది. వరంగల్ జిల్లాలోని ములుగు తాలూకాకు, ఖమ్మం జిల్లాకు ఈ నిబంధనను వర్తింప జేయటం జరిగింది. తెలంగాణాలోని మిగతా ప్రాంతాలకుకూడా ఈ నిబంధనను 1968 ఆగస్టు 15 నుంచి విస్తరింప జేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. దాదాపు 21 లక్షల ఎకరాలు అధీనంలో వున్న (రక్షణ పొందిన) కౌలుదార్లు సుమారు 3 లక్షల మంది ఈ నిబంధన ప్రయోజనాలను పొందుతారు.

వర్షాభావం, సహాయం

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మళ్ళీ వర్షాభావం ఏర్పడింది. భూమిశిస్తు మినహాయింపు ధారాళపు పద్ధతిన మంజూరు చేయబడింది. అన్ని బకాయీల చెల్లింపుకూడా ఆ ప్రాంతాల్లో వాయిదా వేయబడింది. సహాయ కార్యక్రమాల ప్రారంభానికై ఇప్పటివరకు రూ. 50 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాంతాల్లో బావుల త్రవ్వకానికీ, లోతు చేయటానికి ఋణాల పంపకానికిగాను రూ. 2 కోట్లను భూమి తనఖా బ్యాంకు కేటాయించింది.

1967-68, 1968-69 సమీక్ష

ఈ సంవత్సరపు, వచ్చే సంవత్సరపు ఆర్థిక పరిస్థితిని గురించి ఇప్పుడు సమీక్షిస్తాను.

1967_68 వార్షిక ప్రణాళిక వినియోగం రూ. 74.87 కోట్లు అని మొదట్లో నిశ్చయించాం. అయితే ప్రణాళికా సమితి గరిష్ఠ పరిమితి రూ. 68.98 కోట్లు అని నిర్దేశించింది. నాగార్జునసాగర్‌కు రూ. 8.5 కోట్లు అని మేము నిశ్చయిస్తే, ప్రణాళికా సమితి రూ. 12 కోట్లు కేటాయించింది. ప్రణాళికా సమితి సిఫార్సుల దృష్ట్యా, మన ప్రణాళికను రూ. 71.15 కోట్లు వుండేట్టు సవరణ చేశాం.

1968_69 వార్షిక ప్రణాళిక వినియోగం విషయమై, ప్రణాళికా సమితితో ఇంకా తుదినిర్ణయాన్ని తీసుకొనలేదు. కనీసం రూ. 72 కోట్లు అయినా వుండాలని మనం భావిస్తున్నాం. అలాగే 1968_69లో ఆయా విభాగాల కేటాయింపులుకూడా 1967_68లో వలెనే వుండాలనే భావిస్తున్నాం. ఇప్పటి బాధ్యతలను నెరవేర్చటానికి కావలసిన కనీస వినియోగం ఇది.

కాబట్టి ప్రస్తుత సంవత్సరపు ప్రణాళిక కన్న 1968_69 ప్రణాళిక తక్కువగా ఉండకూడదని, అలాగే 1968_69 లో కేంద్ర సహాయం కూడా ఆవిధంగానే నిర్ణయింపబడాలని మా ఉద్దేశం.

1969_70 నుంచి నాల్గవ పంచవర్ష ప్రణాళిక ప్రారంభమవుతుందని. నాల్గవ ప్రణాళికను రూపొందించే కార్యక్రమం 1968_69 లో పూర్తి కావాలని ప్రణాళికా సమితి నిశ్చయించింది. ప్రణాళికా సమితి నుంచి కొత్త నాల్గవ ప్రణాళికను గురించిన సూచనలు మూలంగా లభించగానే ఈ విషయం గురించిన పని మన రాష్ట్రంలోనూ ప్రారంభ మవుతుంది.

1966-67 లెక్కలు

1966_67 లో రివిన్యూకాతాన జమ రూ. 172.26 కోట్లు. రెవిన్యూ కాతాన ఖర్చు రూ. 184.68 కోట్లు. అంటె లోటు రూ. 12.42 కోట్లు—1966_67 సవరించిన అంచనాల్లో తరుగు రూ. 8.41 కోట్లు వుండగలదని అనుకున్నాం. 1962 అదనపు ఎసెస్ మెంటు చట్టాన్ని రద్దు చేస్తూ సుప్రీం కోర్టు చేసిన తీర్పు ఫలితంగా శిస్తు వసూళ్ళను నిలుపు చేయటం వలన భూమి శిస్తు పద్దున తరుగు ఏర్పడటం ఈ లోటుకు ప్రధాన కారణం.

1967-68 సవరించిన అంచనాలు

మొదట్లో అనుకున్న రూ. 171.66 కోట్ల స్థానే రివిన్యూ కాతాన జమ రూ. 191.32 కోట్లకు పెరిగింది. ఈ పెరుగుదల దిగువ పేర్కొన్న విషయాల ఫలితంగా ఏర్పడింది:

(1) కొత్త రివిన్యూ చట్టం కింద సుమారు రూ. 10 కోట్ల నికర ఆదాయం.

(2) స్టేట్ ఎక్సైజు సుంకాలు, వాహనాలపై పన్నులు, అమ్మకపు పన్ను, స్టాంపులు వగైరాల విషయంలో ఇంకాఎక్కువగా వసూళ్ళు చేయగలగటం.

(3) ఇతర రాష్ట్రాలకు వరి ధాన్యాన్ని, బియ్యాన్ని ఎగుమతి చేసినందు వలన కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బోనసు కింద రూ. 50 లక్షలు.

రివిన్యూకాతాన ఖర్చు కూడా మొదటి రూ. 184.42 కోట్ల నుంచి రూ. 193.91 కోట్లకు పెరిగింది.

1967_68 బడ్జెటులో మొత్తం పెట్టుబడి వినియోగం కింద రూ. 40.14కోట్లు కేటాయించ బడినై. సవరించిన అంచనా ప్రకారం ఈ మొత్తం రూ. 38.93 కోట్లు అని నిర్దేశించ బడింది. పంచ

న్లను కమ్యూట్ చేయటం, జాగీర్దారుకు చెల్లింపులు, నీటి సాగు, విద్యుచ్ఛక్తి, కట్టడాలు, పారిశ్రామిక అభివృద్ధి వగైరా పథకాల ఖర్చును ఈ పెట్టుబడి వినియోగం భరిస్తుంది.

ఈ పై చెప్పిన వ్యవహారాలను, ఋణాలు, అడ్వాన్సులు, పబ్లిక్ ఋణం, డిపాజిట్లను లెక్కలోకి తీసుకుంటే, ఈ యేడాది రూ. 2.56 కోట్ల తరుగు రొక్కపు నిలవతో ముగియవచ్చునని అనుకుంటున్నాం.

1968-69 బడ్జెట్ అంచనాలు

1968-69 బడ్జెట్ అంచనాల్లో మొత్తం రివిన్యూ రూ. 199 కోట్లు అని, రివిన్యూ కాతాన ఖర్చు రూ. 204.67 కోట్లు అని కేటాయించడం జరిగింది వచ్చే యేడాది ప్రణాళికకు కేంద్ర సహాయం రూ. 53 కోట్లు ఉండగలదని ఆశిస్తున్నాం. ఇందులో కేంద్ర గ్రాంటు రూ. 4.31 కోట్లు వుండవచ్చు. మనం ప్రతిపాదించిన ప్రణాళికలో రివిన్యూకాతాన వినియోగం రూ. 14.04 కోట్లు, రివిన్యూకాతాన నికరపు తరుగు రూ. 5.67 కోట్లు వుండవచ్చు.

1968-69 బడ్జెటులో ప్రణాళికకు సంబంధించని కొన్ని ముఖ్య కార్యక్రమాల ఖర్చును వివరిస్తున్నాను:

(1) వరి విత్తనాలు, ఇతర విత్తనాలు, తెగుళ్ళ మందులు వీటి కొనుగోలుకు రూ. 81 లక్షలు.

(2) నీటి సాగుశాఖ ప్రధాన ఇంజనీర్ అజ్మాయిషీలోవున్న పంపింగ్ పథకాలకు రూ. 16.19 లక్షలు—మామూలు నిర్వహణకు అదనంగా అన్నమాట ఈ మొత్తం.

(3) కళాశాలల అధ్యాపకులకు యు. జి. సి. నిర్దేశించిన జీతాలను అమలు జరపటానికి రూ. 48 లక్షలు.

(4) స్వీడన్‌నుంచి కాగితం ఏమీ విరాళంగా లభించకపోతే, జాతీయంచేయబడిన పాఠ్యపుస్తకాలకై కాగితపు కొనుగోలుకు రూ. 40 లక్షలు.

(5) షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులు, మిగతా వెనుకబడిన వర్గాలకు కేంద్ర స్కాలర్ షిప్పుల గ్రాంటుకు రూ. 13 లక్షలు.

మొత్తం పెట్టుబడి వినియోగం రూ. 33.68 కోట్లు అని అంచనావేయబడింది—ప్రస్తుత సంవత్సరపు బడ్జెట్ అంచనాలు రూ. 40.14 కోట్లు. సవరించిన అంచనాల ప్రకారం రూ. 38.93 కోట్లు. ఋణాలు, అడ్వాన్సులకింద పంపిణీలకుగాను రూ. 9.01 కోట్ల మొత్తం కేటాయించబడింది.

1967-68 రూ. 63 లక్షల తరుగు రొక్కపు నిల్వతో ప్రారంభమై, రూ. 2.56 కోట్ల తరుగు రొక్కపు నిల్వతో అంతం కాగలదని అనుకుంటున్నాం. రివిన్యూ, ఖర్చు, పెట్టుబడి వినియోగం ఋణాలు, అడ్వాన్సులు, అప్పు, డిపాజిట్ వగైరా పద్దుల దృష్ట్యా, 1968-69 సంవత్సరం రూ. 18.07 కోట్ల తరుగు రొక్కపు నిలవతో ముగియవచ్చు. ఇందులో కొంత భాగం అదనపు పన్నుల ద్వారా భర్తీ అవుతుంది. ఇక మిగతా మొత్తం ప్రస్తుతానికి అలాగే వుండాల్సి వుంటుంది.

1968-69 లో సంక్షేమ కార్యక్రమాలు

మన ఆర్థిక పరిస్థితి ఎంతో నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ, ప్రజల్లో ఆర్థికంగా, సాంఘికంగా, బలహీనంగా ఉన్న వర్గాలవారి సంక్షేమ కార్యక్రమాలకై కేటాయింపులు చేయటం ప్రథమ కర్తవ్యంగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ కేటాయింపులు పెట్టుబడి తరగతికి చెందకపోయినప్పటికీ, ఇంకెక్కువ కేటాయింపులు చేయలేకపోయామంటె, అందుకు కారణం డబ్బు తగినంతగా లేకపోవటమే.

(1) సోషలిస్టు పద్ధతి సమాజపు ప్రాథమిక కర్తవ్యం ఆర్థిక వసతులతో నిమిత్తంలేకుండా విద్య విషయంలో సమాన అవకాశాలను సమకూర్చటం. ప్రస్తుతం హయ్యర్ సెకండరీ స్కూలు స్థాయిదాకా బాలికలకు ఉచిత విద్య ఏర్పాటు చేయబడింది. ఉన్నత ప్రాథమిక స్థాయి వరకు మాత్రమే ఉచితవిద్య బాలురకు వర్తిస్తుంది. ఈ ఉచితవిద్య బాలురకుకూడా సెకండరీ స్థాయివరకు సమకూర్చాలని ప్రభుత్వం నిశ్చయించింది. అయితే ఇందుమూలాన ఏడాదికి జీతాల ఆదాయంలో రూ. 75 లక్షల నష్టం వాటిల్లుతుంది. విద్యపై పెట్టే పెట్టుబడి నిజానికి మానవులపై పెట్టే పెట్టుబడే కాబట్టి, ఈ ఖర్చు అంతా పూర్తిగా సమర్థనీయమే.

(2) షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులు, విముక్త జాతుల సంక్షేమ కార్యక్రమాలను విస్తరించాలని ప్రభుత్వం ఎంతగానో అనుకుంటోంది. ఇన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం సహాయం చేస్తున్నప్పటికీ, వీరి విద్యా గృహ వసతుల సమస్య బహుక్లిష్టంగానే వుంది. ప్రతి కుటుంబానికి గృహ వసతిని, పిల్లలకు విద్యా వసతులను సమకూర్చేటట్టుగా ఒక సమగ్ర పథకాన్ని కొన్ని సంవత్సరాల కాలంలో అమలుజరపటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

(3) ఇళ్ళస్థలాలను మంజూరు చేయటంతో పాటు, ఈ కులాలవారు ఇళ్లు కట్టుకోగలిగేందుకుగాను రొక్కపు గ్రాంటులను కూడా మంజూరు చేయటం అవసరం. అందుకని ఇకముందు ఇళ్ళస్థలాల కేటాయింపుతోపాటు, ప్రతి వ్యక్తికీ ఇంటికికావలసిన సామగ్రిని కొనుక్కొనేందుకుగాను రూ. 100 ల గ్రాంటు నివ్వాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఈ గ్రాంటు కొంతవరకు వారికి సహాయపడుతుంది. 1967 డిసెంబర్ 6వ తేదీనగాని, ఆతర్వాతనుంచి గాని ఇళ్ళస్థలాలు మంజూరైన వారందరికీ ఈ సౌకర్యం వర్తిస్తుంది. ఆ తేదీ నుంచి రొక్కపు గ్రాంటు రూ. 50ల నుంచి రూ. 100ల వరకు పెంచబడింది షెడ్యూల్డు కులాలకు భూమి సేకరణకు, గృహ నిర్మాణ పరికరాలను కొనటానికి గత సంవత్సరంచేసిన కేటాయింపు రూ. 13 లక్షలు. ఈ కేటాయింపు ఇప్పుడు రూ. 40 లక్షలకు పెంచబడుతుంది. షెడ్యూల్డు కులాలవారి విషయంలో, ఈ కేటా

యింపు ఈ ఏడాది రూ. 2 లక్షలు. వచ్చే యేడాది ఇది రూ. 5 లక్షలకు పెంచబడుతుంది. విముక్త జాతులకు కొత్తగా రూ. 5 లక్షలను కేటాయించాలని అనుకుంటున్నాం. అలాగే షెడ్యూల్డు కులాల బోరింగ్ గ్రాంటుల కేటాయింపును రూ. 121 లక్షల నుంచి రూ. 129 లక్షలకు ఈ యేడాది పెంచటమైంది. వచ్చే సంవత్సరం రూ. 138 లక్షలకు పెంచబడుతుంది. ఈ ప్రతిపాదన అన్నిటి ఫలితంగా అదనపు ఖర్చు ఏడాదికి సుమారు రూ. 62 లక్షల దాకా వుంటుంది.

(4) అడవుల్లో పశువుల మేతకు రుసుమును విధించటం చిన్నకారు రైతులకు ఎంతో ఇబ్బందిని కలిగిస్తుంది. అందుకని ఎలాంటి రుసుమూ లేకుండా, అడవులన్నిటిలో ఉచితంగా మేపు కొనటాన్ని అనుమతించటానికిగాను ప్రభుత్వం నిశ్చయించింది. దీనిమూలంగా ఆదాయంలో ఏడాదికి రూ. 15 లక్షల నష్టం వాటిల్లుతుంది. అలాగే గృహ నిర్మాణంకోసం అడవులన్నిటి నుంచి గడినికోసుకుని తీసుకువెళ్ళటానికి కూడా ఎలాంటి రుసుమూ లేకుండా పర్మిట్లు నివ్వటానికి కూడా ప్రభుత్వం నిశ్చయించింది.

(5) గడచిన కొలది సంవత్సరాల్లో హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలు ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నయి. ఈ వృద్ధికి అనుగుణంగా కావలసిన ప్రాథమిక వసతులను, ముఖ్యంగా రోడ్డు, పారిశుద్ధ్యంలాంటి వసతులను హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సమకూర్చ గలిగేందుకై, కార్పొరేషన్‌కు సహాయక గ్రాంటును రూ. 9 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

(6) యన్.జి.ఓ.లు, తాత్కాలిక సిబ్బంది, వర్క్‌ఛార్జిడ్ సిబ్బంది, ప్రభుత్వ పారిశ్రామిక సంస్థల సిబ్బంది, అన్నిస్థాయిల ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల ఉద్యోగులందరు, గ్రామోద్యోగులు ఇత్యాదులతోసహా అన్ని తరగతుల ప్రభుత్వోద్యోగులకు 1967 లో అదనపు కరువుభత్యం మంజూరుచేయబడింది. దీనిమొత్తం ఖర్చు రూ. 13 కోట్లు. 1968 జనవరిలో కరువుభత్యం మళ్ళీ అధికం చేయబడింది. దీని సాలుసరి అదనపు ఖర్చు సుమారు రూ. 8.5 కోట్లు. సాధన సదుపాయాల పరిస్థితి మహాగడ్డుగా వుండటంవలన, ఇందులో 50 శాతం ఉద్యోగుల ప్రావిడెంట్ నిధికి జమకట్టాలని ప్రభుత్వం ఉత్తర్వుచేసింది. ఆర్థిక పరిస్థితులు సావకాశమివ్వగానే కరువు భత్యం లోని రొక్కపుభాగం పెంచబడుతుంది.

(7) ఉద్యోగుల సంక్షేమం సర్వదా ప్రభుత్వానికి ముఖ్య విషయంగానే వుంటుంది. ఉద్యోగుల సంక్షేమాన్ని పెంపొందిం చేందుకై గృహనిర్మాణపు ఋణాల మంజూరును ఈ యేడాది కేటాయించిన రూ. 8 లక్షల నుంచి వచ్చే యేడాది రూ. 20 లక్షలకు పెంచాలని ప్రతిపాదించబడింది.

శాంతి భద్రతలు

ఇటీవల మనను కలవరపరుస్తున్న విషయం ఒకటి వుంది. ప్రజల శాంతిభద్రతలను భగ్నపరచటం, అక్రమ దౌర్జన్యం, దహనాలు, ప్రభుత్వపు ఆస్తిపాస్తులను నష్టం చేయటం ఈ మధ్యకాలంలో ఎక్కువగా ఉన్నయి. అంతేకాదు, ఈ అల్లరులకు పూనుకునేవారు నిజానికి ఎలాంటి ఇబ్బందులకు గురైనవారు కానేకారు. సరే. కొంతమంది విద్రోహ నాయకులకు అశాంతికోసమే అశాంతిని కలిగించటం సహితం లక్ష్యమైనప్పటికీ, మరికొందరున్నారు. శాంతిభద్రతలకు భంగంవాటిల్లినప్పటికల్లా, వీరు ఈ అల్లరులద్వారా స్వార్థ ప్రయోజనాన్ని కాంక్షించటమే వీరి స్వభావం. వీరు సమాజానికి శత్రువులు. మనమందరంకూడా వీరి నెదుర్కోవాలి. వీరిలో మరీ నికృష్టులెవరంటే, యువకులను ఉద్రేకపరచి, రెచ్చగొట్టేవారు. పార్టీ విభేదాలు లేకుండా, వీరిని అరికట్టే గురుతర బాధ్యత మనందరిపై వుంది. లేకపోతే సక్రమపద్ధతిన సమాజం సాగిపోవటం కష్టం అవుతుంది. మా తరఫున ఒకమాట చెప్పుతున్నాను. ఈ సంఘ వ్యతిరేక శక్తులతో వ్యవహరించటంలో అత్యంత కఠినమైన చర్యలను తీసుకుంటామని, వివాదాలన్నిటిని శాంతియుత విధానాల ద్వారా పరిష్కరించేట్టు చేస్తామని హామీ యిస్తున్నాను.

మనరాష్ట్ర ప్రణాళిక పరిమాణం క్రమేపీ కుంచించుకుపోతోందని గుర్తుచేయవలసిన బాధ్యత నాపై వుంది. 1965_66లో ప్రణాళికా వ్యయం రూ. 105 కోట్లు. తర్వాత సంవత్సరంలో రూ. 95 కోట్లకు తగ్గింది. ప్రస్తుతసంవత్సరంలో ఇంకా, అంటే రూ. 71 కోట్లకు తగ్గిపోయింది. గౌరవసభ్యులకు తెలుసు—ప్రణాళికా వ్యయంలో రెండు విభాగాలు ఉన్నాయి. ఒకటి కేంద్రసహాయం. రెండవది రాష్ట్ర స్వంత వసతులు. రాష్ట్రప్రభుత్వపు పన్నులను బాగా వినియోగంలోకి తెచ్చుకోటం జరిగింది. కాగా ఈ పన్నులు పరిమితమైనట్టివి. కేంద్రసహాయం విస్తారంగా లభిస్తేతప్ప, లేదా కేంద్ర రివిన్యూల పంపిణీ ఇంకా పూర్తిగా జరిగితేతప్ప, లేకపోతే వచ్చే సంవత్సరాల్లో భారీ పథకాలకు అవకాశాలు సన్నగిల్లిపోతై.

నాలవ పంచవర్ష ప్రణాళిక రూపొందించ బడేముందు ఒక ఆర్థికసంఘం ఈ విషయాలన్నిటిని పరిశీలించవలసి వుంటుంది. ఈ సంఘం తగు పరిష్కారాలు చేయగలదని, తత్ఫలితంగా వచ్చే సంవత్సరాల్లో ఇంకెక్కువ భారీ పథకాలను ప్రారంభించగలమని నాకుగట్టి నమ్మకం వుంది. సరే, కాని ఇంకొకవిషయం వుంది. భారీ పథకాల నిర్వహణకు కావలసిన రాష్ట్ర వసతులను మనం సమీకరించుకోవలసి వుంటుంది. గడచిన ప్రణాళికల ఫలితంగా ఇదివరకే ఏర్పడిన ఉత్పత్తి వసతులను ఇంకెక్కువగా వినియోగించుకోటంతో, మనమీ బాధ్యతను నిర్వర్తించగలమని, మన ఆర్థికవ్యవస్థ సత్వరంగా అభివృద్ధిచెందగలదని నేను ఆశిస్తున్నాను."

*

ఆంధ్ర ప్రదేశ్‌లో సాంఘిక సంక్షేమం

—సి. వి. హెచ్. రావు

ఒక వైపున షెడ్యూలుకులాలు, షెడ్యూలు తరగతులు, అప్రకటిత జాతులవారికీ మరొకవైపు మహిళలు, బాలలకూ చట్టబద్ధమైన సంక్షేమ సేవలను అందజేసే కృషికే యీనాడు ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ కార్యక్రమాలు పరిమితమైవున్నాయి. భిక్షుకులు, బాల నేరస్తులు, ఖైదీలు, విధివంచితలు, వివాహితలుకాని తల్లులు మొదలైన సాంఘికంగా దూరంగావుంచబడే వారికి కూడా సంక్షేమ సేవాకార్యక్రమాలు విస్తరించివున్నాయి. ఈ కార్యక్రమాలను చాలావరకు ప్రభుత్వ ఏజన్సీలే నిర్వహిస్తుంటాయి. అయితే స్వచ్ఛందసంస్థలుకూడా చాలావరకు ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వంవద్దనుండి సహాయక గ్రాంటులుపొంది మహిళలు, బాలల కొరకు సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తుంటాయి. వీటికి సాంఘిక సంక్షేమ మండలిగాని, మహిళా సంక్షేమశాఖగాని గ్రాంటులను అందజేస్తుంటాయి.


విశాలంగా ఆలోచిస్తే సాంఘిక సంక్షేమంలో కుటుంబ నియంత్రణ, మద్యపాన నిషేధం వంటి సాంఘిక_ఆర్థిక లక్షణాలు గల పథకాలుకూడా కలిసివుంటాయి. వివిధ సంక్షేమ సేవలతో నిండివున్న కార్యక్రమాలను అమలు పరచడంలో విస్మరించరాని విషయం ఒకటివుంది. ఈ కార్యక్రమాలకు వెచ్చించే నిధులనుండి గరిష్ఠ మొత్తంలో ఫలితాలను సాధించడానికై వీటిని చాలా జాగ్రత్తగాను సక్రమంగాను రూపొందించి అమలు పరచవలసివుంది. అనేక సాంఘిక సంక్షేమ సేవా కార్యక్రమాలను అమలు పరిచేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వశాఖలమధ్య, స్వచ్ఛంద సంస్థలమధ్య సహకారం, సమన్వయం వుండడం చాలాఅవసరం. మొట్టమొదటి లక్షణం అది. స్వచ్ఛంద సంస్థలకు యీ విధమైన సేవాకార్యక్రమాలను అమలు జరిపేటందుకు ప్రభుత్వం ఆర్థికసహాయాన్ని కల్పిస్తే, ఈ స్వచ్ఛంద సంస్థలు వీటిని అమలు పరచడానికి అవసరమైన శిక్షణపొందిన, సేవా కృషికి అంకితమైన కార్యకర్తలను రూపొందించి సమాజానికి అందజేస్తాయి.

షెడ్యూలు కులాలు, షెడ్యూలు తరగతుల సంక్షేమ పథకాలలో యీ కులాలవారికి స్కాలర్‌షిప్పులను మంజూరుచేయడం, ప్రభుత్వ సహాయం క్రింద నడిచే హాస్టళ్ళకు బోర్డింగు గ్రాంట్లను మంజూరు చేయడం, ఆశ్రమ పాఠశాలలను నిర్వహించడం, హరిజనులు, గిరిజనుల సంక్షేమానికి కృషిచేసే స్వచ్ఛంద సంస్థలకు సహాయక గ్రాంట్లను మంజూరుచేయడం, యీ తరగతులవారికి యిళ్ళనిమిత్తం గ్రాంట్లను అందజేయడం, మంచి నీటి సౌకర్యాలను



కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖామంత్రి శ్రీ జగ్జీవన్ రామ్ హైదరాబాదులోని ఫలక్‌నుమా దగ్గర స్కేవెంజర్లు, స్వీపర్ల కాలనీకి ఫిబ్రవరి 4వ తేదీన ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం

కల్పించడం వంటి వివిధ కార్యక్రమాలువున్నాయి. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తరగతులు, యితర వెనుకబడిన తరగతుల వారికి చట్టబద్ధంగా కల్పించే సహాయక సేవలు చాలావరకు ప్రభుత్వశాఖల ద్వారానైనా, లేదాస్వచ్ఛంద సంస్థలద్వారానైనా నిర్వహింపబడే పాఠశాలల ద్వారానూ, హాస్టళ్ళు, బోర్డింగు గృహాల ద్వారానూ కల్పించబడుతున్నాయి. మహిళా సంక్షేమ కార్యక్రమాలను బాలల సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో అమలు పరిచే యీ కార్యక్రమాలను మహిళా సంక్షేమశాఖ అక్కడి పంచాయతీరాజ్‌సంస్థల అజ్మాయిషీక్రింద మహిళా, మండలులు, బాలగృహాలు, బాలవాడీల ద్వారా అమలు జరిపిస్తుంటుంది.



ఫలక్‌నుమాలోని స్కావెంజర్లు, స్వీపర్ల కాలనీ

విస్తృతంగా పిల్లల సంక్షేమ కార్యక్రమాలను అమలుపరచడం కొన్నేళ్లుగాబాగా ఎక్కువ అయ్యింది. ఇందుకుగాను కొన్నేళ్ళ క్రిందట కొన్ని కొన్ని సమితులలో సంక్షేమవిస్తరణ ప్రాజెక్టులను ప్రారంభించారు.

రాష్ట్ర చతుర్థ ప్రణాళిక కేటాయింపు రూ. 635 కోట్లను రూ. 623 కోట్లకు తగ్గించారు. దానిని మళ్ళీ గత రెండేళ్ళనుండి యింకా తగ్గిస్తూనే వున్నారు. దీనిలో విద్యుచ్ఛక్తి, నీటిపారుదల వంటి ప్రధానమైన పథకాలకు కేటాయింపులు పెద్ద మొత్తాలలో వున్నాయిగాని, సంక్షేమ పథకాలకు కేటాయింపులు అంత పెద్ద మొత్తాలలో లేవు.

సాంఘిక భద్రత, బాలల సంక్షేమం, సమన్వయ సంక్షేమ విస్తరణ పథకాలకు రూ. 1.52 కోట్లు మాత్రమే కేటాయించారు. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తరగతులు తదితర వెనుకబడిన తరగతుల సంక్షేమానికి మాత్రం రూ. 3.87 కోట్లు కేటాయించారు. చతుర్థ ప్రణాళిక మొత్తం కేటాయింపును రూ. 535 కోట్లకు తగ్గించినప్పుడు సాంఘిక సంక్షేమం కేటాయింపును కూడా రూ. 1.25 కోట్లకు తగ్గించారు. దీనిప్రకారం 1966_67 సంవత్సరానికి ప్రణాళికా కేటాయింపు రూ. 5.26 లక్షలు మాత్రమే. దీనిలో నికరంగా ఖర్చు చేసినది రూ. 3.61 లక్షలే. 1967_68 సంవత్సరానికి రూ. 7.83 లక్షల్ని కేటాయించారు. స్త్రీ సంక్షేమ కార్యక్రమాలక్రింద హైదరాబాదులో ఒక ట్రైనింగు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, బాలలకై 10 క్రీచేలను, 8 బాలగృహాలను నెలకొల్పడం జరుగుతుంది. యితర సంక్షేమ పథకాలతోపాటు యీ పథకాల అమలుకుకూడా పై కేటాయింపునుండే వెచ్చించడం జరుగుతుంది.

రెండు సేవాగృహాలను నెలకొల్పే అంశంకూడా యిందులో చేరివుంది. సంక్షేమ సంస్థలకు సహాయక గ్రాంట్లక్రింద రూ. 52 లక్షలను కేటాయించే పథకంకూడా దీనిక్రిందకే వస్తుంది. 1967_68లో వికలాంగుల నిమిత్తం ఒక వర్కుషాపును నిర్మించడానికిన్నీ, వృద్ధులకు సంబంధించిన సంక్షేమ సేవల నిమిత్తమున్నూ రూ. 1.32 లక్షలు కేటాయించారు. స్త్రీ సంక్షేమానికి, బాలల సంక్షేమానికి సంబంధించిన పథకాలకు రూ. 6.26 లక్షలు వెచ్చించారు. కరక్షనల్ సంస్థల నిమిత్తం రూ. 0.68 లక్షలు, సమన్వయ విస్తరణ సంక్షేమ పథకం క్రింద రూ. 0.41 లక్షలు వెచ్చించారు.

గత రెండేళ్లుగా వార్షిక ప్రణాళికల క్రింద సాంఘిక సంక్షేమానికి చేసిన ఆర్థిక కేటాయింపులుగాని, సాంఘికంగానూ, శారీరకంగానూ వైకల్యంగల వారికి అందజేసే సంస్థాగత సేవలుగాని సంక్షేమ పథకాలక్రింద చేస్తున్న ఖర్చుగాని తగినంతగా లేదు. దీనివల్ల మన శ్రేయోరాజ్య స్థాపనలక్ష్యం నెరవేరడానికి ఆస్కారం కలుగడం లేదు. అయితే వివిధ అభివృద్ధి పథకాలక్రింద యీనాడు పెద్ద మొత్తాల్ని వ్యయపరచడంద్వారా యితోధికమైన వనరులు లభించి, ముందుముందు సంక్షేమ కార్యక్రమాలకు అధిక మొత్తాలను ఖర్చుచేయగల వాతావరణం ఏర్పడక పోదు. ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి, జనుల జీవనస్థాయి బాగుపడితే సంక్షేమ సేవల అవసరం వున్నవారుకూడా తదనుగుణంగా తక్కువ సంఖ్యలోనే వుంటారు. సంక్షేమ సేవలు క్రమక్రమంగా పునరావాస సేవలుగా రూపాంతరం చెందడానికి మనం తోడ్పడాలి. బాలనేరస్తులే కానీయండి, వికలాంగులే కానీయండి లేదా నైతికంగా పతనమైన మహిళలే కానియ్యండి సంక్షేమ పథకాల లక్ష్యం అట్టివారికి సమాజంలో తోటి సభ్యులుగా పునరావాసం కల్పించడమే. సాంఘిక అభివృద్ధికి అత్యావశ్యకరమైన సాంఘిక దృక్పథాన్ని కల్పించే నిమిత్తం సాంఘిక సేవాకార్యక్రమాలలో పెట్టుబడిని వాస్తవంగా శ్రామిక వనరులలో పెట్టుబడిగా భావిస్తూ వాక్సానుభూతితో ప్రస్తుతానికి మనం సంతృప్తిచెందాల్సి ఉంది.

ఇతర మానవసేవా కార్యక్రమాలలో మాదిరిగానే, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలుజరుపడానికి సంబంధిత సంస్థల యోగ్యత, తీరు తెన్నులు ప్రధానమైనవి. ఈ విషయాలలో యితర ప్రదేశాలలో వలనే ఆంధ్రప్రదేశ్‌లో కూడ చాలాపని జరగాల్సి ఉంది. సంక్షేమ సంస్థలకు కేటాయించిన నిధులకు సమానంగా వాటిద్వారా సంతృప్తికరమైన ఫలితాలు లభించడంలేదు. పైన పేర్కొన్నవిధంగా యితర ప్రణాళికలలో వలనే రాష్ట్ర నాలుగవ ప్రణాళికలోకూడ మొత్తం పెట్టుబడిలో చాలా కొద్ది మొత్తాన్ని మాత్రమే అన్ని రకాలైన సాంఘిక సంక్షేమ కార్య క్రమాలకు కేటాయించారు. మూడవ ప్రణాళికలోకూడ పరిస్థితి యథాతథంగానే వుంది. ఈ ప్రణాళికలో అన్నిరకాలైన సాంఘిక సంక్షేమ కార్య క్రమాలపై మొత్తం రూ. 4.43 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అయితే సాధించిన ఫలితాలేమిటి? ఎన్ని వర్గాలవారు, ఎందరు వ్యక్తులు సంక్షేమ పథకాలద్వారా ప్రయోజనం పొందారు? ఎంతమంది పతితస్త్రీలు, శిశువులు, బాలనేరస్థులు సాంఘికంగాను, ఆర్థికంగాను పునరావాసం పొందగలిగారు? అనే విషయాలను మదింపువేసి, సమీక్షించడం జరుగలేదు.

ఏదో ఒక వర్గానికి చెందిన సంక్షేమ కార్య క్రమాలను అమలు జరిపే అధికార సిబ్బంది కార్య విధులు భిన్న రీతులలో

ఉండడం సాంఘిక సంక్షేమంలో మరొక ముఖ్య అంశం. రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖ, స్త్రీలు, శిశువుల సంక్షేమ కార్యక్రమాలను అమలు జరుపుతూ, సంబంధిత సంస్థల నిర్వహణపై అజమాయిషీ చేస్తున్నది. సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యంగా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, యితర వెనుకబడిన తరగతులకు సంబంధించిన సంక్షేమ పథకాలను అమలు జరుపుతున్నది. బాలనేరస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ పాఠశాలలు, రిమాండు గృహాలవంటి బాలల సంస్థలను జైళ్ళ శాఖ నిర్వహిస్తున్నది. వ్యభిచార నిరోధక చట్టాన్ని అమలుచేసే బాధ్యత ప్రధానంగా పోలీసుశాఖపై ఉంది. ఈ సంస్థలన్నీ వేటికవి వాటి పరిధులలో వేర్వేరుగా పనిచేస్తున్నాయేగాని వాటిమధ్య సమన్వయం ఉండాల్సిన అవసరాన్ని గుర్తించడం జరగలేదు. వాటన్నిటికితోడు రాష్ట్ర సాంఘిక సంక్షేమ మండలికూడ వికలాంగులు, సాంఘికంగా వెలివేయ బడిన స్త్రీలు, పిల్లలు, అవివాహిత తల్లులు, ఉద్యోగం చేస్తున్న స్త్రీల సంక్షేమం, విద్యాకార్యక్రమాల నిమిత్తం అనేక స్వచ్ఛంద సంస్థలకు గ్రాంట్లు మంజూరు చేస్తున్నది. మరోవిధంగా చెప్పాలంటే రాష్ట్రస్థాయిలో గ్రాంట్లు మంజూరుచేస్తూ నిర్వహణ బాధ్యతలను వహిస్తున్న రాష్ట్ర మహిళా సంక్షేమశాఖ చేసే పనినే యీ మండలికూడ నిర్వహిస్తున్నది.

సమన్వయకృషి

జిలా, పంచాయతీ సమితి, పంచాయితీల స్థాయిల్లోనయితే మహిళా సంక్షేమానికి, బాలల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను అమలు పరచడంలో సమన్వయ కృషికి అవకాశం వుంది. పట్టణ ప్రాంతాలలోనయితే సంక్షేమ శాఖతోపాటు స్వచ్ఛంద సంస్థలే యీ కార్యక్రమాలను అమలు జరిపే బాధ్యతలను స్వీకరించవలసి వుంటుంది. హైదరాబాదు, మరికొన్ని ముఖ్య పట్టణాలలో యాచక గృహాలు మొదలైన సంస్థలను పురపాలక సంఘాలే నిర్వహిస్తున్నాయి. షెడ్యూలు, కులాలు షెడ్యూలు తరగతులవారికీ, బాలనేరస్తులకూ, యాచకులు, పతితలు మొదలైన సాంఘికంగా సమాజానికి దూరమైపోయినవారికీ సంక్షేమ సేవా కార్యక్రమాలను అమలు జరిపే బాధ్యత ప్రభుత్వమో, పురపాలక సంఘాలో వహిస్తూవుండగా బాలలు, మహిళలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను అమలు జరిపే బాధ్యతను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించి వాటికి సహాయక గ్రాంటులను ప్రభుత్వం యిస్తూవున్నది. అయితే ఈ కార్యక్రమాలను అమలు పరచడంలో వున్న యీ రకమైన వత్యాసాలను తొలగించి సమన్వయ పూర్వకమైనకృషి జరిపించడం అవసరం. వివిధ సంక్షేమ కార్యక్రమాలను జరిపించడానికి వివిధ విభాగాలుగలిగి, కేటాయించబడిన నిధులను వాటి అవసరాలనుబట్టి వరుస క్రమంలో ఆయా కార్యక్రమాలకు వెచ్చించే సర్వాంగులూగల సంక్షేమశాఖద్వారా మాత్రమే యీ కృషి కొనసాగగలదు.

ఏవిధమైన సాంఘిక సంక్షేమపథకాలను చేపట్టినప్పటికీ, సంక్షేమ కార్యక్రమాలకు ఎంత మొత్తంలో నిధుల్ని కేటాయించినప్పటికీ వీటన్నిటినీ అతి జాగ్రత్తగా నిర్వహించాలి. కేటాయించబడిన గ్రాంట్ల నుండి గరిష్ఠప్రయోజనాలు సిద్ధించే విధంగా వీటిని వెచ్చించాలి. గ్రాంట్లను పొందే సంస్థల కృషిని ఎప్పటికప్పుడు సమర్థవంతంగా పకడ్బందీగా మదింపువేయాలి. సాంఘిక సంక్షేమానికి కేటాయించబడిన నిధులు చాలాతక్కువ అనేవిషయాన్ని గుర్తించాలి. ఉన్నకొద్దిపాటి నిధులూ ముందుముందు సాంఘికంగానూ, శారీరకంగానూ దుర్బలులైన వారికి వీలైనంత ఎక్కువమందికి సంక్షేమ సేవలను అందచేసే విధంగా వుండేట్టుచూడడం చాలా అవసరం అనేవిషయాన్ని విస్మరించరాదు.

1968_69 బడ్జెటు ప్రతిపాదనలో రాష్ట్రప్రభుత్వం సంక్షేమ కృషిని ఎక్కువ చేయదలచడం హర్షనీయం. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తరగతులు, యితర అప్రకటిత జాతుల వారి సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యంగా వారి గృహ నిర్మాణ, విద్యా సౌకర్యాలను కలిగించే కార్యాక్రమాలను ఎక్కువచేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. "ఈవర్గాల వారికి ప్రతికుటుంబానికి గృహ వసతిని, వారి పిల్లలకు విద్యా వసతులను సమకూర్చేట్టుగా ఒక సమగ్ర పథకాన్ని వచ్చే కొన్ని సంవత్సరాల కాలంలో అమలు జరపడానికి ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది." ఈఉద్దేశానికి 1968_69 వార్షిక ప్రణాళిక వాస్తవ రూపాన్నివ్వకలదని భావిద్దాం.

★

ఈ సంచికలోని వివిధ శీర్షికలను గురించి, ఇందలి రచనలను గురించి మీ అభిప్రాయాలు తెలుపండి. మీ సూచనలకు, సలహాలకు, విమర్శలకు స్వాగతం.

పరిపాలనా విషయాలు

తెలంగాణా నిధుల వినియోగం-ముఖ్యమంత్రి హామీ

హైద్రాబాదులో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో, మూడవ ప్రణాళికలో తెలంగాణా మిగులు నిధులను రూ. 30.54 కోట్లకు స్థిరీకరించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. 1969-70వ సంవత్సరంనుంచి ప్రారంభమయ్యే నాలుగవ ప్రణాళికలో, పోచంపాడు ప్రాజెక్టు, విద్యుద్దీకరణ, నీటి సరఫరా పథకాలు, తెలంగాణా ప్రాంతంలో అమలుజరిగే యితర అభివృద్ధి కార్యక్రమాలకు ఈ మొత్తం వినియోగించ బడుతుందని ముఖ్యమంత్రి అన్నారు.

రెవెన్యూబోర్డు పాత్ర: రెవెన్యూమంత్రి వివరణ

రెవెన్యూ, పౌర సరఫరాలశాఖా మంత్రి శ్రీ వి.బి. రాజు, ఫిబ్రవరి 11వ తేదీన ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసు (ఎగ్జిక్యూటివ్ బ్రాంచి) సంఘం వార్షిక మహాసభను ప్రారంభించారు. ప్రభుత్వానికి రాబడిని పెంపొందించడంలో రెవెన్యూబోర్డుకు ప్రముఖపాత్ర వుంటుందని ఆయన అన్నారు. జిల్లాపరిపాలనను పునర్వ్యవస్థీకరించడానికై శ్రీ ఎం. టి. రాజు కమిటీ రూపొందించిన పథకం అమలు పరచబడుతున్నది కాబట్టి ఈ సంవత్సరం. గణనీయమైనదని రెవెన్యూమంత్రి అన్నారు.

కొత్త తెలుగు టైపురైటరు

ప్రామాణికమైన కీబోర్డుతో తయారుచేసిన క్రొత్త తెలుగు టైపురైటరుకు రాష్ట్ర శాసనసభాపతి శ్రీ బి. వి. సుబ్బారెడ్డి ఫిబ్రవరి 14వ తేదీన ప్రారంభోత్సవంచేశారు. ఆరోగ్యమంత్రి శ్రీ పి.వి. నరసింహారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగును అధికారభాషగా అభివృద్ధిపరచడంలో తెలుగు టైపురైటర్లు చాలా వరకు తోడ్పడ గలవని అన్నారు. తెలుగు టైపిస్టులకు శిక్షణయివ్వడానికై ప్రభుత్వం నిర్వహిస్తున్న తరగతులకు 1000 మంది హాజరుకా గలరని ప్రభుత్వం ఆశిస్తున్నదని మంత్రి తెలియజేశారు.

పరిపాలనా విషయాలలో తెలుగు భాషను ఉపయోగించడానికి రాష్ట్ర ప్రభుత్వంచేస్తున్న కృషిని సభాపతి శ్లాఘించారు. షార్ట్ హాండ్ మాన్యుయల్‌ను కూడా ఆయన ఆవిష్కరించారు. శాసన మండలి అధ్యక్షులు శ్రీ జి. బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. టి. రాజు వందన సమర్పణచేశారు.

★

శాసనపర్వం

అధికార భాషా సమస్య

భాషా సమస్యపై హిందీయేతర రాష్ట్రాల భయసందేహాలను నివారించడానికి వీలుగా పార్లమెంటు తీర్మానాన్ని సవరించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్రశాసనసభ ఫిబ్రవరి 15వ తేదీన ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

ఈ సమస్యను విజయవంతంగా పరిష్కరించడానికి మార్గాలను అన్వేషించేందుకు అన్నిరాజకీయ పార్టీల నాయకుల, ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధికి విజ్ఞప్తిచేసే ప్రతిపక్షాల సవరణను యీ తీర్మానంలో చేర్చారు.

త్రిభాషా సూత్రాన్ని బలపరుస్తూన్నట్టు యీ తీర్మానంలో పునరుద్ఘాటిస్తూ హిందీ భాషా రాష్ట్రాలు యీ సూత్రాన్ని ఖచ్చితంగా అమలు జరపాలని కోరారు.

ముఖ్యమంత్రి చర్చకు సమాధానమిస్తూ భాషా సమస్యను సంతృప్తికరంగాను, విశ్వసనీయంగాను, పరిష్కరించడానికి కేంద్ర నాయకులకు కొన్ని సూచనలు చేయడానికి మాత్రమే యీ తీర్మానం ఉద్దేశించ బడిందని అన్నారు.

వివాదం తీవ్రరూపం దాల్చి ఉద్వేగాలు, విద్వేషాలు రగులు కొన్న యీ విపత్కర సమయంలో వివాదాస్పదమైన అభిప్రాయాలను సమన్వయ పరచడానికి తమ శక్తి యుక్తులను వినియోగించాలనే విషయాన్ని సభ గుర్తించుకోవాలని ఆయన అన్నారు.

ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన సమస్యలను పరిష్కరించే వరకు భాషా సమస్యను వెనక్కు నెట్టాలనే వాదన మనలను "తప్పుదోవ"ను పట్టిస్తుందనీ, ఆర్థిక అభివృద్ధి అనేది నిరంతరకృషి అనీ, బాగా అభివృద్ధి చెందిన సోవియట్ యూనియన్, అమెరికాలకు కూడ ఆర్థిక పరమైన సమస్యలు ఎన్నో ఉన్నాయి అనీ ఆయన అన్నారు.

తరచుగా తలెత్తే సమస్యలను పరిష్కరించకుండా ఉండడం వల్ల జరిగే ప్రయోజనం యేమిలేదు. ఆలస్యం చేయడంవల్ల అవి మరింత జటిలమౌతాయని ఆయన అన్నారు.

తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ ఏదో ఒకభాషను, అది హిందీగాని, ఇంగ్లీషుగానీ, ఒకరిపై రుద్దుతున్నారనే తత్వాన్ని విడనాడాలని ముఖ్యమంత్రి అన్నారు.

* * *

"ఫిబ్రవరి 14వ తేదీన రాష్ట్ర శాసనసభ అధికార భాషా సమస్యకు సంబంధించిన తీర్మానాన్ని ఆమోదించడంతో యింత వరకు రాష్ట్రంలో యీ సమస్యపై బయలుదేరిన ఆందోళన అరాచకం కొంతసద్దు మణిగింది. జాతీయ ప్రయోజనాలను విస్మరించి రాజకీయ ప్రయోజనాల నిమిత్తం వినియోగించుకున్న యీ సమస్య యీ తీర్మానం ఫలితంగా రాజకీయాలనుండి దానిని దూరంగా ఉంచే అవకాశం ఏర్పడుతుంది. ఈ తీర్మానానికి తగిన ప్రచారం లభించినప్పుడు యీ సమస్యపై చెలరేగిన వివాదాలు, ఆందోళనలు సమసిపోతాయి.

ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో వివిధ కారణాలతో విస్తృత ప్రాతిపదికపై ఆందోళనలకు దారితీసిన పార్లమెంటు ఆమోదించిన భాషాతీర్మానంలోని కొన్ని అంశాలను తీసివేస్తూ భాషావిధానం ప్రధాన సూత్రాలను యీ తీర్మానంలో పొందుపరచారు. పార్లమెంటు ఆమోదించిన తీర్మానంలో హిందీయేతర రాష్ట్రాల ప్రజలకు నష్టం కలిగించే కొన్ని తీవ్రమైన అంశాలు ఉన్న వాస్తవాన్ని యీ తీర్మానం వెల్లడించింది. అన్నిరాష్ట్రాలు విద్యారంగంలో త్రిభాషా సూత్రాన్ని కచ్చితంగా అమలు జరపాలనే అంశాన్ని హిందీయేతర రాష్ట్రాల ప్రజలపై "అసమాన"మైన బరువు రుద్దుతున్న చర్యకు పరిష్కారంగా అనేక మార్గాలను యీ తీర్మానంలో సూచించారు.

అఖిల భారత సర్వీసులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో నియామకాల సందర్భంలో "ఏభాషకు నష్టం కలుగని రీతి"లో కళాశాలలో వారు అభ్యసించిన మూడు భాషలలోను అభ్యర్థులకు పరీక్ష నిర్వహించాలని యీ తీర్మానంలో పేర్కొన్నారు.

కేంద్రపరిపాలనా వ్యవహారాలలో త్వరితగతిని హిందీని ప్రవేశపెట్టాలనే ఆత్రతతో కొన్ని సందర్భాలలో బహిరంగంగాను పరోక్షంగాను హిందీయేతర ప్రాంతాలలో హిందీని రుద్దడాన్ని నిరసించడం జరిగింది. దేశంలో హిందీని అధికార భాషగా ప్రవేశపెట్టాలనే రాజ్యాంగ పరమైన అంశాన్ని అంగీకరిస్తూనే "భారతీయ సమిష్టి సంస్కృతిని వ్యక్తంచేసే సాధనగా" ఉపయుక్తమయ్యే రీతిలో హిందీభాషను అభివృద్ధిపరచి, హిందీ బోధనను ఏర్పాటు చేయాలని యీ తీర్మానంలో సూచించారు. దానికి తోడు హిందీ భాషాభివృద్ధికి ప్రాంతీయ భాషల అభివృద్ధి దోహదం కల్పిస్తుందనే అంశాన్ని కూడ నొక్కి చెప్పారు. "ఆధునిక విజ్ఞానాన్ని అందజేసే అనువైన సాధనగాను, పరిపాలనలోను, విద్యాబోధనలోను అనుసరించడానికి వీలుగాను", ప్రాంతీయ భాషలను త్వరిత గతిని అభివృద్ధి చేయాలని కూడా తీర్మానంలో సూచించారు.

అఖిల భారత సర్వీసులలోను, కేంద్ర ప్రభుత్వ సర్వీసులలోను రాష్ట్రాల ప్రాతినిధ్యానికి సంబంధించి, యిప్పటి అంచనాలను బట్టి కాలక్రమాన యీ సర్వీసులకు చెందిన పరీక్షలలో ఇంగ్లీషుకు బదులు హిందీ భాషను ప్రవేశపెట్టినప్పుడు హిందీప్రాంతాల వారికి ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయనే హిందీయేతర ప్రాంతాలవారికిగల భయ సందేహాలను కూడ యీ తీర్మానంలో పరిశీలించడం జరిగింది. తత్కారణంగానే జాతీయ సమైక్యతను పరిరక్షించడానికి వీలుగా యీ సర్వీసులలో అన్ని రాష్ట్రాలకు సమానమైన ప్రాతినిధ్యం యివ్వాలని తీర్మానంలో పేర్కొన్నారు.

పైన తెల్పిన సూచనల ప్రాతిపదికగా భాషా తీర్మానాన్ని తగిన విధంగా సవరించాలని శాసనసభ తీర్మానంలో తెల్పారు. అయితే యికముందు, ఏభాషా ప్రాంతాలలోనైనా, వారికి నష్టం కలుగుతుందనేభయ సందేహాలు కొనసాగినప్పుడు ప్రజలప్రయోజనాలను పరిరక్షించడానికి ఆ ప్రాంతంవారు తమకు అనువైన విధానాన్ని రూపొందించుకునే హక్కుగలిగి ఉంటారనికూడ యీ తీర్మానంలో హెచ్చరించారు."

—సి. వి. హెచ్. రావు

ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయోత్పత్తులు, పశువుల) మార్కెట్ల చట్టం, 1966

వ్యవసాయ విషయాలకు సంబంధించిన రాయల్ కమిషను సిఫార్సుల ననుసరించి మనదేశంలోని వివిధ రాష్ట్రాలలో వ్యవసాయోత్పత్తుల మార్కెట్ల చట్టాలు అమల్లోనికి వచ్చాయి. పూర్వ హైద్రాబాదు రాష్ట్రంలో 1930 వ సంవత్సరంలోనే ప్రథమంగా హైద్రాబాదు వ్యవసాయ మార్కెట్ల చట్టాన్ని రూపొందించారు. అవిభాజిత మద్రాసు రాష్ట్రంలో 1933 లో మద్రాసు వాణిజ్య పంటల మార్కెట్ల చట్టాన్ని అమల్లోనికి తెచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలలో ఇప్పుడు ఈ రెండు చట్టాలు వర్తింపులో నున్నాయి. నూతన వ్యవసాయ మార్కెట్ల చట్టం ఆచరణలోనికి రావడంతో ఈ రెండు చట్టాలు రద్దయిపోతాయి. కొత్తచట్టాన్ని అనగా ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయోత్పత్తులు, పశువుల,) మార్కెట్ల చట్టాన్ని 1966 జులైలో రాష్ట్ర ఉభయ శాసన సభలు ఆమోదించాయి. దీనికి 1966 నవంబరులో రాష్ట్రపతి ఆమోదం లభించింది. అదేనెలలో ఇది గెజెటులో ప్రచురించబడింది.

వ్యవసాయోత్పత్తులు, కోళ్లు, చేపలు, పశువులు, పశువుల ఉత్పత్తులు, తోటలు అటవీ వుత్పత్తుల కొరకు మార్కెట్లను నెలకొల్పడాన్ని ఈ నూతన చట్టం ఉద్దేశిస్తున్నది. కొత్త చట్టంప్రకారం మార్కెటు కమిటీ అధికార పరిధి, కార్యకలాపాల పరిమాణాన్ని బట్టి ఒక తాలూకాకు కానీ లేక కొన్ని తాలూకాలకు కానీ విస్తరించివుంటుంది. ఈ సమీకృత చట్టం క్రింద మార్కెటు కమిటీలు తమ విధులను మరింత సమర్థవంతంగా నిర్వర్తించ గలుగుతాయి. మార్కెటు సభ్యుల కనీస సంఖ్య 12 కు, గరిష్ఠ సంఖ్య 16 కు నిర్ణయించబడింది. మార్కెటు కమిటీలో 50 శాతానికి తగ్గకుండా ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా వ్యవసాయదార్ల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఈ చట్టంలో అవకాశం కల్పించబడింది. స్థానిక సహకార మార్కెటింగ్ సంఘాలు, మునిసిపాలిటీలు మొదలైన వాటికికూడా ప్రాతినిధ్యం లభింపజేయబడింది. ఇంతేగాక స్థానిక సంస్థల ప్రతినిధుల సంఖ్యను ఒకటి నుంచి రెండుకు పెంచారు.

రాష్ట్రవ్యాప్తంగా మార్కెటు యార్డులను అభివృద్ధి పరిచే నిమిత్తం కేంద్ర మార్కెటు నిధిని ఏర్పాటు చేయడానికై నూత్న చట్టంలో ఒక నిబంధనను చేర్చారు. దీని ననుసరించి మార్కెటు కమిటీలు తమ వార్షిక ఆదాయంలో నుంచి 10 శాతం మొత్తాన్ని కేంద్రనిధికి ఇవ్వవలసి వుంటుంది. కొత్త మార్కెటు కమిటీలకు సహాయక గ్రాంటు మంజూరు చేయడానికీ, ఆర్థిక ఇబ్బందులలో వున్న మార్కెటు కమిటీలకు ఋణాలు, సహాయక గ్రాంటు లభింప జేయడానికీ ఈ నిధిని వినియోగిస్తారు.

ఈ కొత్త చట్టం క్రింద మార్కెటు కమిటీలు తమ ప్రాంతంలోని వర్తకులకు లైసెన్సులు జారీచేస్తాయి. లైసెన్సులు ఇచ్చే పద్ధతి సులభం చేయబడింది. మార్కెటు కమిటీలకు సంబంధించిన భవననిర్మాణాలు మొదలైన పనులను చేపట్టే నిమిత్తం మార్కెటు ఇంజనీరు ఆధిపత్యం క్రింద ప్రత్యేకంగా ఒక ఇంజనీరింగ్ విభాగాన్ని ఏర్పర్చడానికి కొత్త చట్టం ఉద్దేశిస్తున్నది.

పాత చట్టాలతో పోల్చినప్పుడు, 1966 సం|| పు వ్యవసాయోత్పత్తులు, పశువుల మార్కెట్ల చట్టం నిబంధనలు విపులమైనవీ, సులభతరమైనవీ కాబట్టి వీటిని అమలు పరచడంతో ప్రస్తుతపు మార్కెటు శాసనాలను అమలు పరచడంలో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోగలవనీ, వుత్పత్తిదార్లకూ, విక్రేతలకూ, వర్తకులకూ ఎదురవుతున్న సమస్యలు సమసిపోగలవనీ అనడంలో సందేహం లేదు.

ఆంధ్రప్రదేశ్ (షెడ్యూలు ప్రాంతాలు) రుణదాతల (సవరణ) నిబంధనావళి, 1967

1967 వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ (షెడ్యూలు ప్రాంతాలు) రుణదాతల (సవరణ) నిబంధనావళికి రాష్ట్రపతి ఆమోదం లభించింది.

1960వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ (షెడ్యూలు ప్రాంతాలు) రుణదాతల నిబంధనావళి ప్రకారం రాష్ట్రంలోని షెడ్యూలు ప్రాంతాలలో అప్పులుపెట్టే రుణదాతలు లైసెన్సు పొందడము, నిర్దిష్టపరిచిన రేటు ప్రకారం వడ్డీ తీసుకోవడం అవసరం. "రుణదాత" అంటే అప్పులు ఇచ్చే వ్యక్తి అనీ, తన క్షేత్రంలో పనిచేసే సేవకునికి ధాన్యం అప్పుగా ఇచ్చే భూస్వామి, మండీ వర్తకుడుకూడా ఈ నిర్వచనం క్రిందికి వస్తారనీ, అయితే బ్యాంకు, కంపెనీ లేక సహకార సంఘానికి ఇది వర్తించదనీ వివరించడం అవసరమని రాష్ట్రప్రభుత్వం భావించింది. లిఖితపూర్వకంగా ఒప్పందం కుదుర్చుకొనకుండా రుణదాతలెవ్వరూ అప్పులు పెట్టకూడదనీ, అట్టి ఒప్పంద పత్రంపైన ఇద్దరు సాక్షుల సంతకాలు వుండాలనీ, అట్టి సాక్షులలో ఒకరు రుణ స్వీకర్త నివసించే ప్రాంతానికి సంబంధించిన గ్రామపంచాయతీ సర్‌పంచ్ కానీ లేక గ్రామాధికారికానీ అయివుండాలనీ, ఈ సెక్షను నిబంధనలకు వ్యతిరేకంగా ఇచ్చిన అప్పులను రాబట్టడానికి వేసే వ్యాజ్యాలను న్యాయస్థానాలేవీ చేపట్టరాదనీ నిర్దిష్టపరచడం అవసరమనికూడా ప్రభుత్వం ఉద్దేశించింది. దీని దృష్ట్యా 1967 వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ (షెడ్యూలు ప్రాంతాలు) రుణదాతల (సవరణ) నిబంధనావళిలో పైనపేర్కొన్న అంశాలు పొందుపరచబడ్డాయి. ★

న్యాయపాలన

—పి శేషాద్రి

ప్రొబేషనర్లు

ప్రభుత్వోద్యోగాలలో నియమించే అభ్యర్థులను, ఆ ఉద్యోగాలకు వర్తించే నియమ నిబంధనలు నిర్దిష్టపరిచే గడువు వరకు తప్పనిసరిగా ప్రొబేషను మీద వుంచుతారు. అభ్యర్థిని ఆ ఉద్యోగంలో ఖాయం చేయడానికి పూర్వం అతని సామర్థ్యాన్ని గురించిన అంశాలను సమీక్షించడానికి ఈ విధానం వల్ల అధికార్లకు అవకాశం కలుగుతుంది. అభ్యర్థి కార్య నిర్వహణ పట్ల అధికార్లు సంతృప్తి చెందని పక్షంలో, ప్రొబేషను కాలంలో వారు అతనిని నియమ నిబంధనల ప్రకారం పనిలో నుంచి తొలగించ వచ్చు. ఈ విధంగా అభ్యర్థిని తొలగించడం జరిగినప్పుడు దానికి, భారత రాజ్యాంగం 311(2) వ సూత్రం ఇచ్చే అర్థం వర్తించదని ఆర్. సి. బెనర్జీ, భారత యూనియన్‌లకుమధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీం కోర్టు పేర్కొన్నది.

అధికార్లు పరిస్థితులను బట్టి ప్రొబేషను గడువును పెంచవచ్చు. ప్రొబేషను గడువును పెంచుతూ ఉత్తర్వు చేయటాన్ని శిక్ష విధించటంగా పరిగణించరాదు. ఈ అంశాన్ని కూడా సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

ప్రొబేషను గడువు ముగిసిన తరువాత అభ్యర్థిని ఖాయ పరచడం జరగనట్లయితే అతనికి ఆ ఉద్యోగంలో శాశ్వత ప్రతిపత్తి లభించ నట్లుగానే పరిగణించాలని మనదేశంలోని కొన్ని హైకోర్టులు స్పష్టంగా పేర్కొన్నాయి. ప్రొబేషను గడువు పూర్తి కావడానికి ముందు ఆ గడువు పొడగించబడని అభ్యర్థులను లేదా ఆ గడువు ముగిసిన తరువాత ఖాయ పరుచబడని అభ్యర్థులను "ప్రొబేషను మీద" వున్నట్లుగానే ఎంచాలని న్యాయ స్థానాల సాధారణ అభిప్రాయం.

అయితే ఇటీవల సుప్రీం కోర్టుకు సంబంధించిన ఒక కాన్స్టిట్యూషను బెంచి, పంజాబుకు చెందిన ఒక కేసు విషయంలో భిన్నమైన తీర్పు ఇచ్చింది. ప్రొబేషను గరిష్ఠ గడవు గడచిన తరువాత అభ్యర్థి ఉద్యోగంలో కొనసాగినప్పుడు_ అధికార్లు అతనికి వ్యతిరేకంగా ఉత్తర్వులు చేయని సందర్భంలో_ అతను తన ఉద్యోగంలో ఖాయ పడినట్లేననీ, రాజ్యాంగం చేకూర్చే రక్షణలన్నీ అతనికి వుంటాయనీ సుప్రీం కోర్టు అభిప్రాయ పడింది. ఇటువంటి ఉద్యోగిని ' ప్రొబేషను మీద ' వున్నట్లుగాగాక ఖాయ పరచబడినట్లుగానే పరిగణించ వలసి వుంటుంది. ప్రొబేషనర్ల విషయంలో వ్యవహరించే అధికార్లందరూ గుర్తుంచుకోవలసిన తీర్పు ఇది. ★

ఓ కీలక! ఓ కీలక!

మధురాంతకం దొరస్వామి

విశ్వాసం ! ధరిత్రిలోని
బాధిత జనహృత్సీమల
పాదు కొల్పి !

అవశ్యం దివినుండి
వసుంధరయును దిగరమ్మిక
ఓ కీలక ! ఓ కీలక !

నిశ్వాసం ; పేదవారి బ్రతుకెండిన
అంతిమ నిశ్వాసం
కానివ్వక

ఉచ్ఛ్వాసం, స్వేచ్ఛామారుతతతిచే
నిండిన నవజీవన ఉచ్ఛ్వాసం
పూరించుచు హృదయాలను
దిగిరమ్మిక దివినుండిక
ఓ కీలక ! ఓ కీలక !

నిరూపం భువనైక మోహనంగా
ఏకైక భారతాభ్యుదయంగా
మంజుల మనోజ్ఞ స్నేహ
విర్భావంగా

చనుదెమ్మిక ! దివినుండిక !
ఓ కీలక ! ఓ కీలక !

సాహిత్యం వెన్నెల నటనకు
సహాసం సుహాసినులకు
సీమంతం కలకంఠాలకు
మెరుగులు దిద్దగా
దివినుండిక ! దిగిరమ్మిక
ఓ కీలక ! ఓ కీలక !

ఉద్యానం! నవ నందన మంద మలయానిల
వీచుల దోగెడి భారతమొక యుద్యానం—
అందలి ప్రజలందరు తరువులు
అందున ఆ ర్థులు కల్పద్రుమములు
ఆవనిలో :
నీరాకకు ఎదవిచ్చిన
నును వెచ్చని హృదయాలతో
అరవిచ్చిన కన్నులతో
భారత జనయిత్రి యదిగో
తోబుట్టువు ఆంధ్రితోడ
దిగిరమ్మిక ! దిగిరమ్మిక
ఓ కీలక ! ఓ కీలక !

ఓ ! ఉగాది !

ముదిగొండ వీరభద్రమూర్తి

రంగుల నద్ది మా ప్రకృతిరామహారంగుల దిద్దినావు శ్రీ
రంగ ముగాది! మా మనసు రమ్మిక చయ్యన పల్లెపల్లెలన్
మంగళ దేవతామృదుల మంజుల భవ్యకటాక్ష వీక్షణా
లింగన లంగనల్ తెనుగులేమలు వేచిరి నీదు రాకకై.

వచ్చినావ మే మన్నది తెచ్చినావ
ఏది అందిమ్ము వేగ నుగాది ! మాకు
పచ్చతోరణ మియ్యది వాడిపోవ
రాదుసుమి ! దేశనిత్య కల్యాణమందు.

కిసలిత రసాలతరుగ తకింకిరాత
గణము శ్రవణ తర్పణ నిత్యచణము కాని
హృదయ తర్పణ శక్తి నీయదియకద ! మ
హోజ్జ్వల శుభమ్ముల పునాది ఓ ! ఉగాది !

పరభృత కూజితమ్ము మధుపాయి నినాదము చిల్కపల్కు లి
త్తరి తనియింప లేవు మము తావక పండితకంఠముక్త నూ
త్నరవముతోడ నోయి శరదాదిమణీ వినిపింపవే ! యికన్
భరతవసుంధరన్ నిరతభాగ్యధురంధర జేయు పద్ధతిన్.

పాలక ధర్మపటిష్ఠత
కీలక మగు వత్సరమున కీవేకద ! సం
చాలకము వుగాదీ ! నీ
వాలకమున ముద్రవేయవా ! మా యెదదన్.

ఓ ! మానవుడా ! అమని
ఏమని చెప్పెనో ఉగాది యెఱిగించెను నీ
సేమముకై బలె నంద జీ
సేమముకై గడగు మనుచు చెప్పెను వినరా !

నా స్మృతి పథంలో......

శ్రీ అడివి బాపిరాజు

— పంద్రంగి రాజేశ్వరరావు

బాపిరాజు పరమపదించి పది హేనేళ్ళు దాటింది. అప్పటికి అనగా ది. 24_9_'52 వ తేదీకి ఆయన వయస్సు ఏబదిఏడేళ్లు మాత్రమే. ఈయనను తలుచుకున్నపుడు ఇటాలియన్ చరిత్రకారుడైన వాసరి అన్న యీ క్రిందిమాటలు గుర్తుకు వస్తాయి:—

"ఒకేవ్యక్తిలో అందము, నాజూకు, నమ్రత, ప్రజ్ఞ, చాకచక్యం సమపాళ్ళలో వుండటం అపుడపుడు చూస్తూవుంటాము. వారి ప్రతిభ దైవప్రసాదముకాని, సాధనవల్ల వచ్చినదికాదు. వారి చేతలు, మాటలు హృదయపరిణతి వున్నత స్థాయిలో ఆదర్శప్రాయంగా వుంటాయి." బాపిరాజు సౌందర్యంలో దేవత్వం చూచేవారు. ప్రతి విషయాన్ని పరిపూర్ణ దృష్టితో కూలంకషంగా పరిశీలించేవారు. ఇట్టి అరుదైన వ్యక్తులే చరిత్రను సృష్టిస్తారు. చిరకాలం గణనీయులుగాను, మననీయులుగాను నిల్చివుంటారు.

ఆయన జన్మించినది 8_10_1895వ తేదీన మధ్యతరగతి మర్యాద కుటుంబంలో. ఆస్తితోపాటు పేచీలు, వ్యాజ్యాలు, ఋణాలుకూడా సంక్రమించటంచేత సుఖంకంటె కష్టంపాలే ఎక్కువగా వుండేది. జర్మను తత్వవేత్త అయిన హెగల్ చెప్పినట్లు ఏవ్యక్తి జీవితమన్నా సార్థకము కావాలంటే ఎట్టి యిబ్బందులు లేకుండా ఎల్లప్పుడూ హితమైన పని చేస్తూవుండాలి. ప్రేమను చూరగొని మనస్ఫూర్తిగా సేవచేసి సుఖపెట్టే భార్య వుండాలి. మరొకరైతే మతిపోయేటంతటి ప్రతికూల వాతావరణంలో సహితము బాపిరాజు వుత్సాహంతో వుండేవారు. అన్నిరకాల యిబ్బందులు సదా వెంటనంటి యుండినా వాటికెన్నడూ జంకి లొంగలేదు. సంకుచిత తత్వము లేకుండా, అపోహలకు గురి కాకుండా నిర్మలంగా, నిశ్చలంగా వుండేవారు. ప్రజ్ఞ, కరుణ వీరిలో జీర్ణించాయి. సనాతన విలువలవైపు మొగ్గినా వివిధ దృక్పథాలను సానుభూతితో పరిశీలించి నిగ్గును గ్రహించేవారు. నమ్మకాలు, ఆలోచనలు, చేతలు హేతుబద్ధంగా వుండి వ్యక్తిత్వాన్ని ప్రజ్వలింపచేసేవి. ఒక్కముక్కలో చెప్పాలంటే వారి దృక్పథము రసమయంగా వుండేది. నైతికసంపత్తిగల రమణీయత నారాధించేవారు. ఇది జన్మాంతర సంస్కారము.

రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలోచేరి కళాకోవిదుడైన ఆస్వాల్డు కూల్డ్రె ప్రియశిష్యులయ్యారు. శిల్పము చిత్రకళలోంచి, చిత్రకళ సంగీతములోంచి, సంగీతము సాహిత్యములోంచి వుద్భవించుటచేత వీరు అన్నిటిలోను సిద్ధహస్తులయ్యారు. 1920లో పట్టభద్రులయ్యేసరికి గాంధీమహాత్ముని సహాయ నిరాకరణోద్యమము ప్రజ్వలించింది. దేశభక్తితో పులకాంకితులై అందులో దూకి ఏడాది జైలుజీవితం గడిపారు. తత్రాపి ప్రభుత్వాదరణకు దూరులయ్యారు.

తర్వాత బందరులో ఆంధ్రజాతీయ కళాశాలయందు ప్రముఖ చిత్రకారుడైన శ్రీ ప్రమోదకుమారఛటర్జీ వద్ద శాస్త్రబద్ధంగా కళోపాసన చేశారు. వందేమాతరం వుద్యమఫలితంగా శ్రీ కోపల్లె హనుమంతరావు, డాక్టరు పట్టాభి సీతారామయ్య దీనిని స్థాపించి చక్కగా నిర్వహించారు. జాతీయనాయకుల ఆదరాభిమానాలు పూర్తిగా లభించాయి. చివరకు బాపిరాజు దీనికి ప్రిన్సిపాలు అయ్యారు. అదేం చిత్రమో స్వాతంత్ర్యం వచ్చాక దేశభక్తి, జాతీయసంస్కారం సన్నగిల్లాయి. అందుచేత యీ సంస్థకూడ మామూలు కళాశాలగనే మారవలసివచ్చింది. ప్రవాహానికి ఎదురీదటం కష్టం. అట్లాచేసినా మిగిలేది శ్రమ. కాని అట్లా కాలగతిని ప్రతిఘటించి ఆహుతిఅయి కొద్దిమంది మాత్రమే చరితార్థులౌతారు.

రస హృదయుడు

బాపిరాజు ప్రముఖ చిత్రకారుడేకాక సంగీతప్రియుడు. మృదుమధురమైన కంఠస్వరము, స్వీయకవిత వారి ముఖతావింటే హృద్యంగా వుండేది. వీరి కథలు మనోహరంగా హృదయాన్ని స్పందించేలా వుంటాయి. గద్యపద్యాలందలి ధార సహజంగాను, సరళంగాను వుంటుంది. కొన్నిటిని ప్రముఖ రచయిత అయిన శ్రీమాస్తి వెంకటేశఅయ్యంగారు కన్నడంలోకి అనువదించారు. వీరి "నారాయణరావు" విశ్వనాథ సత్యనారాయణగారి "వేయిపడగలు"తో ఆంధ్రవిశ్వవిద్యాలయంవారి బహుమతిని పంచుకుంది. నవలలో నారాయణరావు శ్రీ బాపిరాజుకు ప్రతిబింబము. అందలి తదితర పాత్రలు చాలవరకు వారి కుటుంబీకులే అని ఆయన నాతోఅన్నారు. సాదా కలపతో రమ్య హర్మ్యాన్ని నిర్మించారు. హిమబిందు, తుఫాను, కోనంగి, గోనగన్నారెడ్డి వీరి సర్వతోముఖ పాండిత్యానికి

గీటురాళ్లు. గోదావరి, గంగిరెద్దు తదితర జానపదగేయాలు సనాతన సంస్కారాన్ని హృదయపరిణతిని సూచిస్తాయి వాటిని సవివరంగా సమీక్షించటానికి యిది సమయమూ, సందర్భమూ కాదు. అట్లాటి ప్రయత్నము చేసినా సూర్యుని బేటరీలైటుతో చూపించినట్లుంటుంది.

కళాసేవలో తన్మయుడైనా బ్రతుకుతెరువుకంటె వుద్యోగం పురుషలక్షణమని న్యాయవాదవృత్తిని నాలుగేళ్లపాటు చేపట్టారు. నిజంగా వారు వృత్తిలో రాణిస్తే వారిలో దాగివున్న కవి, కళాకారుడు మాయమయ్యేవారు. శ్రీ నండూరి సుబ్బారావు న్యాయవాదవృత్తి చేపట్టకపూర్వమే "ఎంకిపాటలు" వ్రాశారు. వృత్తి బాగా సాగాక అట్టే వ్రాయలేదు. వ్రాసినది రక్తికట్టలేదు. వృత్తిలో సంపన్నులు, సరసులు, సహృదయులు అయిన శ్రీ గంధం వెంకయ్య నాయుడుగారి అండ బాపిరాజుకు దొరికింది. కాని వృత్తిలో పురోగమించటానికి బదులు ఖులాసాగా కాలక్షేపం చేశారు. 1942 లో "క్విట్ఇండియా" వుద్యమమందు చిక్కుపడిన డాక్టరు పాల కోడేటి సత్యనారాయణ శర్మ తరపున తాను గవర్నమెంటు ప్లీడరుగా వున్నా, నాయుడుగారు ధైర్యంతో క్రిమినలు కోర్టులో వాదించి తమ జాతీయాభిమానాన్నీ, దేశభక్తినీ ధృవపరుచుకున్నారు. ఒకసారి ప్రయింటు వ్రాయవలసిన విలువైన స్టాంపుమీద అనుకోకుండా బాపిరాజు బొమ్మ వెయ్యగా నాయుడుగారు నవ్వి, "అదృష్టవశాత్తు యింకారంగు పుయ్య లేదు కనుక రబ్బరుతో చెరిపెయ్య వచ్చును" అన్నారు. పెద్ద కేసులో జూనియర్‌గా రికార్డు చూడమంటే, "నీ పోరు పడలేను నాయుడు బావా, నేను రంగమెళ్లి పోతాను నాయుడు బావా" అని పాడారు.

సాహిత్య ప్రియులైన డాక్టరు చెన్నాప్రగడ సుబ్బారావు (కవిశేఖర భానుమూర్తి గారి కుమారుడు) వీరి కుటుంబానికి వుచితంగా వైద్యం చేసేవారు. ఒకనాడు ముష్టి లక్ష్మినారాయణ గారి పూలతోటలో (యీయన తోటమాలిగా వుంటూ భీమవరంలో ప్లీడరీ చేసేవారు. దర్మిలాను ప్లీడరీకి స్వస్తి చెప్పి జాతీయోద్యమములో పాల్గొని యిపుడు హైదరాబాదు సమీపంలో కర్షకులుగా వున్నారు) బాపిరాజు పాడుకుంటూ పచార్లు చేస్తూవుంటే నేను కొంటెగా, "బావా, (మా తండ్రి గారి నెప్పుడూ మామయ్యా అని నోటి నిండా పిలచేవారు. ఒకసారి వారంటు వచ్చేసరికి మా తండ్రి గారు వీరికి హామీ వున్నారు కూడాను. దర్మిలాను వీరి మేన కోడలిని మా మేనల్లున కియ్యటంతో యీ వరస స్థిరపడింది. బాపి బావ అనేందుకు నాకే ఎక్కువ హక్కు వుందనుకుంటాను.) యీ "నందనవనంలో అప్సరసలేరీ", అన్నాను. తల ఎత్తి, "నువ్వు రావటంతోనే వాళ్ళు బెదిరి పారిపోయారు," అని సరసంగా సమాధాన మిచ్చారు. తర్వాత గుంటూరు వెళ్ళి అచట కళాపీఠాన్ని స్థాపించి కొంతమంది కళాకారులను తీర్చిదిద్దారు. "కులపతి" అనే బిరుదు వీరి ఎడ సార్ధకమైంది. ఇటీవల వీరి రచనలను గురించి ఒకరు తెలుగులో డాక్టరేటుకు థీసెస్ వ్రాస్తున్నట్టుగా విని సంతోషించాను. అపుడు సంపాదనలేకుండా వదిన గారింట్లో తిష్ఠవేసి కాలక్షేపం చెయ్యటం ఆయనకు కించగా వుండేది. సున్నితమనస్కులైన మేధావులకు, కవులకు, కళాకారులకు యీతి బాధలు తప్పవు. కష్టాల నడుమనుండే అద్వితీయమైన రచనలు బయలు దేరతాయి. శ్రీ రెంటాల వెంకట సుబ్బారావు చరమ దశలో అష్ట కష్టాలు పడుతూ "Hamlet unveiled" "Othello unveiled" అనే వుద్గ్రంథాలను రచించి ఆంగ్ల ప్రపంచంలో ఓ హో అనిపించుకున్నారు. సోక్రటీసు భార్య తిట్టిపోసి కుండెడు నీళ్ళు నెత్తిన దిమ్మరించగా వురుముల తర్వాత వాన కురవటం సహజమని సరిపెట్టుకున్నారు. టాల్‌స్టాయికి భార్య అంపశయ్యలా వుండేది. ఇటాటి వారందరిని బయటివారే అర్థం చేసుకుని ఆదరిస్తారు. వాల్మీకి అనుభూతినిబట్టి రామాయణమే, శ్లోకంగా మారిన శోకం అనే ప్రతీతి వుంది. భవభూతి ఉత్తర రామ చరిత్రలో "ఏకో రసః కరుణ ఏవ నిమిత్త భేదాత్........." అనే చక్కటి శ్లోకాన్ని యథోచితంగా వుటంకించారు.

పాత్రికేయుడుగా

"త్రివేణి" నడపటలో శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావుతో సహాయ సంపాదకుడుగా సహకరించారు బాపిరాజు. శ్రీ రామకోటేశ్వరరావు ఖర్చుకు వెనుదీయకుండా అందచందాలు వుట్టిపడేటట్లు చక్కగా ప్రచురించేవారు. ఆయన పైమీద కండువా వేసుకోవటమే కళాత్మకంగా వుండి రసశుద్ధిని సూచిస్తుంది. "లండన్‌టైమ్స్ లిటరరీ సప్లిమెంటు" మన్ననలను పొందినాకూడా వ్యాపారదృష్టి లేకుండా వున్నతాదర్శాలవల్ల కట్టుబడటంచేత యీ పత్రిక నిలువలేక పోయింది. ఈ ఇంగ్లీషు మాస పత్రిక మదరాసులో పుట్టి యుద్ధకాలంలో శ్రీ సంపత్ గిరిరావు సహకారముతో బెంగుళూరు వెళ్ళి ద్వి మాసపత్రికగావుండి, బందరు వచ్చి త్రై మాస పత్రికగామారి, హైదరాబాదులో శ్రీ బుర్రా సుబ్రహ్మణ్యం (అడ్వకేటు జనరలు) గారి నీడను కాలం గడిపి తిరిగి బందరులో ప్రచురణకర్తయగు శ్రీ భావరాజు నరసింహరావు వద్దకు చేరింది. దీనిని ఆరు నెలలకోసారి (అయినానికి) ప్రచురింపమని రాజాజీ సలహా యిచ్చారు కూడాను. నేడు బక్కచిక్కిన "మాడరన్ రివ్యూ" తప్ప "ఇండియన్‌రివ్యూ" "హిందూస్తాన్ రివ్యూ" లాంటి వన్నీ అర్ధశతాబ్దం దాటాక అంతరించటంచేత "త్రివేణి" మనుగడ మనకు బాధ కల్గింప నక్కరలేదు.

బాపిరాజుకు మెరుపులాంటి అవకాశం వచ్చి హైదరాబాదులో "మీజాన్" అనే తెలుగు దిన పత్రికకు సంపాదకులయ్యారు. బామషావారి హుజూరున (పత్రికా యజమాని యగు కలకత్తావాలా ముస్లిం కోటీశ్వరుడు) సిక్కా రూపాయలు పుష్కలంగా వస్తున్నందుకు నేను అభినందించాను కూడాను. కొన్నాళ్లు వీరి జీవితం అచట సాఫీగా సాగింది. "మీరాబాయి" చిత్రానికి ఆర్టు డైరక్టరుగావున్నా వర్తక దృష్టి లోపించుటచేత వీరికేమీ కలిసి రాలేదు. అవిభక్త మదరాసు రాష్ట్రంలో మంత్రిగా వుండిన శ్రీ బెజవాడ గోపాలరెడ్డి పనుపున సిలోను వెళ్ళి అచట సిగేరియా గుహలలో వున్న చరిత్రాత్మకమైన కుడ్య శిల్పాల కాపీలను తయారుచేసుకు వచ్చారు. విజయవాడ రేడియో స్టేషను సలహా సంఘంలో సభ్యులుగా వున్నారు. శ్రీమతి మేడమ్ సోఫియా నడిపే పి. ఇ. యన్., (Poets, Essayists and Novelists) సంఘ

ములో వీరికి విశిష్టమగు స్థానముండేది. జ్యోతిషము బాగా తెలుసు. హస్త సాముద్రికము కొట్టిన పిండి. నా యెరుకను వీరు ఒకరికి చెప్పిన భవిష్యత్తు తూ. చ. తప్పకుండా నడిచింది. వైద్యం, చరిత్ర, ఆర్థిక, సాంఘిక, రాజకీయ శాస్త్రాలు వీరికి కరతలామలకం. ఇన్ని విషయాలెట్లు తెలుసునంటే 'అడివిలో అన్నిజాతుల చెట్లు వుంటాయ'ని చమత్కరించారు. బ్రతికి బాగుంటే వివిధ రంగాలకు తమ సేవల నందిచ్చేవారు.

తీయని తెలుగు కవి, కథకుడు

కొందరు భౌతికంగాను నైతికంగాను హిమాలయాల వలె వున్నతంగా వుంటారు. అధిరోహించటం కష్టం. భయంవేస్తుంది కూడాను. విశ్వనాథవారి రామాయణం చూస్తే నాకు అట్లా అనిపించింది. తొలుత వారిని 'కిన్నెరసాని' లోను 'నర్తనశాల' లోను చూచాను. 'చెలియలికట్ట' (నవల) చదివి ఆనందించాను. అపుడు వారిది కదళీపాకం కనుక నాస్థాయికి సరిపోయింది. "నిండు మనంబు నవ్యనవనీత సమానము, పల్కు దారుణాఖండల శస్త్ర తుల్యము..." అనే నుడికారము వీరికి పూర్తిగా వర్తిస్తుంది. సదానంద నీయులు. అద్వితీయమైన వీరి సర్వతోముఖ పాండిత్యమును ఆస్వాదించి ఆనందించే సంస్కారం నాకు లేదని వాపోతూ వుంటాను. కవి సామ్రాట్ అనే బిరుదుకు పూర్తిగా అర్హులు. సాహిత్య అకాడమీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం వీరిని వుచిత రీతిని గౌరవించాయి. బాపిరాజు అట్లాకాక ఎల్లప్పుడూ ద్రాక్షపాకంలో వుండేవారు కనుక అవగాహన చేసుకోవటానికి యిబ్బంది, విలంబన కాలేదు. విశ్వనాథవారు హిమాలయమైతే బాపిరాజు గంగానది. ఎవరెస్టు ఏ కొద్దిమందో ఎక్కగలరు. గంగలో అంతా నిర్భయంగా దిగి ఈదులాడ వచ్చును. ఎట్టి ప్రమాదము వుండదు. విశ్వనాథవారు సంస్కృతపు పునాదిపై వెలసిన పండిత కవులైతే బాపిరాజు మృదుమధురమైన తెలుగు గడ్డలోంచి పుట్టుకువచ్చిన ప్రజాకవి. రెండు పంథాల గమ్యము విశ్వశ్రేయము. గంగానది హిమాలయం మీదుగానే వచ్చింది కనుక వీరు వృషయులు నాకు సమానంగా గౌరవనీయులు, అభిమాన పాత్రులు.

శ్రీ బాపిరాజు భేషజమెరుగని నిరాడంబర వ్యక్తి. ఎవ్వరితోను రొష్టు, మర్యాద పడేవారు కాదు. ఆయన పేరు ప్రతిష్ఠలకు ప్రాకులాడక పోయినా వారు జీవించి వుండగానే అందరి మన్ననలను, ఆదరాభిమానాలను చూరగొన్నారు. వారిలో మనసంస్కృతి, సంస్కారం, సంప్రదాయం నవీనరూపంలో మూర్తీభవించాయనడంలో అతిశయోక్తి లేదు. చంటిపిల్లవాడి తత్వము. నిష్కళంక హృదయము. దాపరికమెరుగని వ్యక్తి. బెల్లం ఎవరు నోట్లో వేసుకున్నా తియ్యగా వున్నట్లు అందరకు ఆత్మీయులుగా వుండేవారు. "బాపిరాజు పాడింది కవిత్వము, గీసిందల్లా చిత్రలేఖనము" అన్న శ్రీ విశ్వనాథవారి పలుకు ముమ్మాటికీ యథార్థము. బాపిరాజు మధురమూర్తి అని శ్రీ గుడిపాటి వెంకటచలం మెచ్చుకున్నారు.

శ్రీ బాపిరాజుకు జరిగిన సన్మానాలు వొటంతట అవి హృదయ పూర్వకంగా జరిగాయి. జన్మస్థలంలో ఎవ్వరికీ గౌరవం వుండదని ఒక ఆంగ్లసూక్తి. అయినా వీరికి జన్మస్థానమైన భీమవరంలోనేక నకాభిషేకం జరిగింది. వీరంటే ఎవ్వరికీ ఈర్ష్య, అసూయలు లేవు.

*

మన వాణిజ్య పంటలు

చెరకు

ఆంధ్రప్రదేశ్‌లో 2.40 లక్షల ఎకరాలలో చెరకును పండిస్తున్నారు. ఇక్కడ ఏటా 70 లక్షల టన్నుల చెరకు దిగుబడివుంది. 8.5 లక్షల టన్నుల బెల్లం ఉత్పత్తి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 19 పంచదార మిల్లులు పనిచేస్తున్నాయి. వీటన్నిటికీ కలిపి రోజువారీ 21,150 టన్నుల చెరకుగడను ఆడేశక్తి వుంది. యేటాదికి యీ పంధొమ్మిది పంచదార మిల్లులు కలిపి మొత్తం 3 కోట్ల చెరకును ఉత్పత్తి చేస్తున్నాయి. ఎకరా దిగుబడిని పెంచే ఉద్దేశంతో చెరకు అభివృద్ధి పథకం అని ఒకటి ప్రారంభించబడింది. ఈ పథకం క్రింద చెరకు పండించే రైతులకు ఆ పంటను పండించే విషయంలో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందజేయబడుతుంది. చెరకు పండించే ప్రాంతాల్లో తీవ్రతర వ్యవసాయ కార్యక్రమాలను ప్రదర్శనా పూర్వకంగా తెలియజెప్పడం జరుగుతుంది.

రాష్ట్రంలోని ఆరు జిల్లాలలో ఆరు పంచదార మిల్లుల్లో చెరకు సమన్వయ క్షేత్రాలు మొత్తం ఆరువున్నాయి. ఇవి ప్రదర్శనా పరిశోధక క్షేత్రాలుగా పనిచేస్తాయి.

1970_71 నాటికి, యిప్పుడున్న చెరకు సగటు దిగుబడిని 31.16 నుండి 36.24 టన్నులకు పెంచుతూ అదనంగా 2.70 లక్షల ఎకరాలను యీ పంటక్రిందకు తెచ్చి, తద్వారా 15 లక్షల టన్నుల అదనపు చెరకు ఉత్పత్తిని సాధించడం యీ పథకం ప్రధాన లక్ష్యం. 1950_51లో యీ పథకాన్ని అమలు పరిచినందువల్ల రాష్ట్రంలో 1950_51 నాటి ఎకరా ఉత్పత్తి 25.25 టన్నుల నుండి 1965_66 నాటికి 31.61 టన్నులకు పెరిగింది.

ప్రత్తి

చతుర్థ పంచవర్ష ప్రణాళికలో అదనంగా 1.11 లక్షల బేళ్ళ ప్రత్తిని ఉత్పత్తి చేయాలని ఉద్దేశించారు. ఒక సమన్వయ ప్రత్తి అభివృద్ధి పథకంక్రింద తీవ్రతర వ్యవసాయ కార్యక్రమాలు, విస్తరణ వ్యవసాయ కార్యక్రమాలు అమలుపరచి యీ లక్ష్యాన్ని సాధించాలని భావించారు. తదనుగుణంగా పి. 216 ఎఫ్ పొడుగు పింజె, సీఐలండ్ రకాలు పండించడం జరుగుతున్నది.

పి_216 ఎఫ్ రకం ప్రత్తిని వరి మళ్ళలో రెండవ పంటగా వేసారు. 1967_68 లో యిది బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ ఏడాది యీపంటను 82,000 ఎకరాలలో వేశారు. చతుర్థ పంచవర్ష ప్రణాళికలో యీ రకం ప్రత్తిని 1.60 లక్షల ఎకరాలలో పండించాలని ఉద్దేశించారు. క్రిమిసంహారక మందులు, పరికరాలను సబ్సిడీ ధరలకు అందజేయడం, నత్రజని సంబంధమైన ఎరువుల్ని ప్రత్యేక కోటా క్రింద సరఫరా చేయడం వంటి ప్రోత్సాహక, సహాయ కార్యక్రమాలను అమలు జరుపుతున్నారు. వరి మళ్ళలో రెండవ పంటగా వేసే యీ పి_216 ఎఫ్ రకం ప్రత్తి పంటవల్ల వ్యవసాయదారులకు ఎకరాకు రూ 500 నుండి రూ 1000 లు వరకు నికర ఆదాయం వస్తున్నది.

నేర్యాపుసీటి సౌకర్యంగల ప్రాంతాలలోని నల్లరేగడి నేలలో పండించే సీఐలండ్ రకం ప్రత్తి కూడా బాగా ప్రసిద్ధికెక్కింది. కర్నూలు జిల్లాలోని తుంగభద్ర ప్రాజెక్టు ప్రాంతంలో ప్రస్తుతం 575 ఎకరాలలో యీ పంట వుంది. చతుర్థ పంచవర్ష ప్రణాళికాంతానికి 6,000 ఎకరాలలో దీనిని పండించాలని ఉద్దేశిస్తున్నారు. విత్తనాలను, సస్యరక్షణ మందులు, పరికరాలను సబ్సిడీధరలకు అందజేయడం; నత్రజని సంబంధమైన ఎరువులను ప్రత్యేక కోటా క్రింద లభింప జేయడంవంటి సహాయక చర్యలను అమలు పరుస్తున్నారు.

పొగాకు

ఎగుమతి చేయదగిన అతిప్రధానమైన పొగాకు రకాలను మన రాష్ట్రం పండిస్తున్నది. ఎఫ్. సి. వి. రకం అలాంటిది. ఏటా మనకు పొగాకు వల్ల రూ 25 కోట్ల విదేశీ మారకం లభిస్తున్నది. పైగా బీడీలు, సిగరెట్ల తయారీకి వాడే పొగాకు, జర్దాలో వేసే పొగాకు వంటి రకరకాలు అనేకం మన రాష్ట్రంలో పండిస్తున్నారు. రాష్ట్రంలో ఎఫ్. సి. వి. రకం పొగాకు 1800 లక్షల పౌనులు, యితర రకాలు అన్నీ కలిపి 3800 లక్షల పౌనులు పండుతున్నాయి. తృతీయప్రణాళిక ఆఖరునాటికి యీ రకం పొగాకు ఉత్పత్తి 1800 లక్షల పౌనులు వుండగా దీనిని చతుర్థ ప్రణాళికాంతానికి 2500 లక్షల పౌనులకు పెంచాలని ఉద్దేశించారు.

జనపనార

భీమునిపట్నం జనుము రకం ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమైన వాణిజ్యపంట. ఇది రాష్ట్రంలో సుమారుగా 2.40 లక్షల ఎకరాలలో పండుతున్నది. 4.90 లక్షల బేళ్ళ (1 బేలు అనగా 400పౌ) జనపనార ఉత్పత్తి అవుతున్నది. రాష్ట్రంలోని జనుము మిల్లులు 1.5 లక్షలబేళ్ళను మాత్రమే ఉపయోగించే శక్తి గలిగివున్నాయి. అందువల్ల మిగిలినదంతా కలకత్తాకు ఎగుమతి చేయవలసి వస్తున్నది. చతుర్థ పంచవర్షప్రణాళికలో ఉత్పత్తిని 1.10 లక్షల బేళ్ళకు పెంచాలని ఉద్దేశించారు. రాష్ట్రంలోని మిల్లులు బెంగాలు నుంచి 60_70 వేల బేళ్ళను దిగుమతి చేసుకొని, భీమునిపట్నం జనుముతో కలిపి గోనెపట్టాలవంటి వాటిని ఉత్పత్తి చేస్తున్నాయి. భీమునిపట్నం జనపనారను, బెంగాలు జనపనారను 7:3 నిష్పత్తిలో కలిపి పురికోసతో తయారయ్యే గోనెపట్టాలు, తదితర వస్తువులను తయారుచేస్తుంటారు. దీనికిగాను బెంగాలు నుంచి జనపనారను మనం దిగుమతి చేసుకుని భీమునిపట్నం రకాన్ని ఎగుమతి చేయాల్సివుంది. కనుక మనమే ఆరకం జనపనారను పండించుకున్నప్పుడు దిగుమతి ప్రస్తావనే వుండదు. చతుర్థ పంచవర్ష ప్రణాళికాంతానికి 20,000 ఎకరాలలో యీ రకం జనపనారను పండించాలని ఉద్దేశించారు. ★

మన పరిశ్రమలు

గత పదహారు సంవత్సరాల కాలంలో దేశంలో ఫ్యాక్టరీలలో ఉత్పత్తి 162 శాతం పెరిగింది. భారీ ఉక్కు మిల్లులు, ఎరువుల ఫ్యాక్టరీలు, భారీ యంత్రాల కర్మాగారాలు, నూనె శుద్ధి కర్మాగారాలు మొదలైనవి ఏర్పడ్డాయి. వీటిలో కొన్ని ప్రపంచంలోని అత్యాధునిక మైన యంత్రాగారాలలో లెక్కకు వస్తాయి.

మనం సాధించిన అభివృద్ధిని సూచించే కొన్ని వివరాలు:

ప్రాతిపదిక పరిశ్రమలు

క్రమ సంఖ్య	పరిశ్రమ	యూనిటు	1950_51	1966_67	
1.	బొగ్గు	మిలియన్ టన్నులు	32.8	71.0	
2.	ఉక్కు	,, ,,	1.47	6.6	
3.	ముడిఇనుము	,, ,,	3.0	19.3	
4.	యంత్ర పరికరాలు	లక్షల రూపాయలు	34	2,650	
5.	ఎలక్ట్రిక్ మోటార్లు	1,000 అ. శ.	99	2,080	
6.	సల్ఫ్యూరిక్ ఆసిడ్	1,000 టన్నులు	101	692	
7.	నత్రజని ఎరువులు	1,000 టన్నులు	9	311	
8.	రైల్వే వ్యాగన్లు	సంఖ్య	2,900	33,800	(1965_66)
9.	అల్యూమినియం	1,000 టన్నులు	4	73	
10.	పెట్రోలియం ఉత్పత్తులు	మిలియన్ టన్నులు	0.2	11.7	
	వినియోగ వస్తువులు				
11.	నూలు వస్త్రం	మిలియన్ మీటర్లు	3,398	4,202	
12.	చక్కెర	1,000 టన్నులు	1,134	2,900	
13.	టీ	మిలియన్ కిలోగ్రాములు	277	370	
14.	బైసికిళ్లు	సంఖ్య	99,000	17,19,000	
15.	రేడియో రిసీవర్లు	,,	54,000	7,60,000	
16.	కుట్టు మెషిన్లు	,,	33,000	4,01,000	
17.	ఎలక్ట్రిక్ పంఖాలు	,,	1,99,000	13,63,000	
18.	సిగరెట్లు, సిగార్లు	మిలియన్లు	24,000	56,804	
19.	రేజర్ బ్లేడ్లు	,,	107	8,845	
20.	వాచీలు, టైమ్‌పీస్‌లు	సంఖ్య	లేదు	4,50,000	(1965_66)
21.	ఆటోమొబైల్స్		16,500	75,100	

ఇప్పటికీ, జాతీయాదాయంలో పదవవంతు వరకు మాత్రమే వ్యవస్థీకృతమైన పరిశ్రమలవల్ల లభిస్తున్నది. గ్రామీణ, లఘుపరిశ్రమల నుంచి కూడా దాదాపు ఇంతే లభిస్తుంది. పారిశ్రామికోత్పత్తిలో చెప్పుకోదగినంత భాగం గ్రామీణ పనివారలవల్ల జరుగుతున్నది.

కుటీర పరిశ్రమలు

కుటీర పరిశ్రమలలో దాదాపు రెండు కోట్లమంది నిమగ్నులై వున్నట్లు అంచనా. ఒక్క చేనేత పరిశ్రమలో సుమారు 50 లక్షల మంది వున్నారు. వ్యవస్థీకృతమైన ఆధునిక పరిశ్రమలు,

గనులన్నింటిలోనూ కలిపి మొత్తం ఎంతమంది పని చేస్తున్నారో దాదాపు అంతమంది ఈ పరిశ్రమలో వున్నారు.

1964వ సంవత్సరంలో 12,252 ఫ్యాక్టరీలు (రిజిస్టరయినవి) రూ. 5,257.30 కోట్లమూలధనాన్ని కలిగివున్నాయి. ఉత్పత్తి రూ. 5,595.60 కోట్లు.

విజయాలు

కొన్ని గణనీయమైన విజయాలు :–

ప్రభుత్వరంగంలో మూడు ఉక్కు కర్మాగారాలు యేర్పడ్డాయి. ప్రైవేటు రంగంలోని కర్మాగారాల వుత్పత్తి శక్తి రెట్టింపుకు పెరిగింది.

యంత్రాల నిర్మాణం శ్రీఘ్రస్తాయిలో ప్రారంభమైంది. ఈశతాబ్ది అయిదవ దశాబ్దివరకూ భారత దేశంలో వస్త్రపరిశ్రమ(ఇది పురాతనమైన పెద్ద పరిశ్రమ అయినప్పటికీ), చక్కెర, సిమెంటు, కాగితం పరిశ్రమలలో ఉపయోగించే యంత్ర పరికరాలేవీ వుత్పత్తి అయ్యేవికావు.

రసాయనిక ఎరువులు, ఖనిజతైలం పరిశ్రమల రంగాలు బాగా అభివృద్ధిజెందాయి.

ప్లాస్టిక్, రబ్బరు వస్తువులు, రసాయనికాలు, రంగులు, మందులు, ఇంజనీరింగు పరికరాల వుత్పత్తికొరకు ఫ్యాక్టరీలు యేర్పడ్డాయి.

1965 మార్చి నెలాఖరునాటికి ప్రైవేటు రంగం (బ్యాంకులు మినహా) లో 1966 మిలియన్ల మేరకు విదేశీ పెట్టుబడులున్నాయి.

విద్యుచ్ఛక్తి

గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా - కార్యక్రమాల ప్రగతి

ముందుముందు గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేసేందుకు పూనుకునేటప్పుడు అధికాహారోత్పత్తి సాధనకు ప్రాధాన్యం చూపవలసిఉంటుంది. గ్రామాలలో నివసించే లక్షలాది ప్రజల ఉపయోగానికై విద్యుచ్ఛక్తిని సరఫరా చేసేందుకు సకల ప్రయత్నాలూ జరుగుతున్నాయి. ఇప్పటికప్పుడే 12 కోట్ల మంది ప్రయోజనం పొందారు కూడా.

ప్రస్తుతం దేశంలో దాదాపు 50 వేల గ్రామాలకు విద్యుత్ సరఫరా సదుపాయం ఉన్నది. ఒక లక్ష పైచిలుకు గ్రామాలకు ఈ సౌకర్యాన్ని కలుగ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జాతిపిత గాంధీజీ జయంతి శతవార్షికోత్సవాల సందర్భంగా, 1969 అక్టోబర్ నాటికి ఈ లక్ష్యాన్ని సాధ్యమైనంత వరకూ చేరుకోడానికి చర్యలు తీసుకుంటున్నారు.

స్వాతంత్ర్యం లభించినది లగాయతు భారతదేశంలో గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరాచేసే కార్యక్రమాల తీరుతెన్నులు అనేకవిధాల గమనించదగ్గవి. ప్రథమ పంచవర్ష ప్రణాళికను కూడా చేపట్టక పూర్వం 1951 కి ముందు, మనదేశంలోని ప్రతి 150 గ్రామాలలోనూ ఒక గ్రామానికి మాత్రమే విద్యుత్ సరఫరా సదుపాయం ఉంటూండేది. అలాంటిది ఇప్పుడు ప్రతి 10 గ్రామాలలోనూ ఒక గ్రామానికి విద్యుచ్ఛక్తి సరఫరా అవుతున్నది. 1951కి పూర్వం, దేశంలో మొత్తం 3,677 గ్రామాలకు మాత్రం విద్యుచ్ఛక్తి సరఫరా అవుతూ ఉండినదల్లా ఈ సంవత్సరం మార్చి నెలాఖరునాటికి 61,092 గ్రామాలకు ఈ సౌకర్యం కల్పించగలిగారు. ఒకటిన్నర శతాబ్దం అయ్యీ కాకుండానే దేశంలో విద్యుత్పాదకశక్తి 23 లక్షల కిలోవాట్ల నుండి కోటీ 23 లక్షల కిలోవాట్లకు పెరిగింది.

స్వాతంత్ర్య సముపార్జనకు పూర్వం దేశంలో విద్యుత్పత్తి సరఫరా కార్యక్రమాలు ఏమంత చెప్పుకో తగినంతగా ఉండేవి కావు. అందుకై లైసెన్సు పొందిన ప్రయివేటు ఆసాముల అధ్వర్యాన ఆ పనులు జరుగుతూ ఉండేవి. 1948 లో విద్యుచ్ఛక్తి సరఫరా వ్యవహారాల శాసనాన్ని రూపొందించినప్పటినుంచే దేశంలోని వివిధ రాష్ట్రాలలో విద్యుత్పత్తి సరఫరా కార్యక్రమాలను సహేతుకమైన ఒక పద్ధతిని సమన్వయించడానికి పూనుకోవటం మొదలయింది.

మొదటి పంచవర్ష ప్రణాళికను చేపట్టడంతోనే, గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయడంతోసహా విద్యుచ్ఛక్తి అభివృద్ధికి సంబంధించిన వివిధ కార్యకలాపాలను ముందుగా అనుకున్న ఒక పద్ధతి ప్రకారం సమన్వయ పూర్వకంగా చేపట్టడం కూడా మొదలయింది. మొదటి ప్రణాళికలో ఈ యీ పనులకుగాను 27 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. అలాంటిది మూడవ ప్రణాళికా కాలంలో ఇందుకు 110 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది.

అనేక కారణాల మూలంగా గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరాచేసే పని అన్ని రాష్ట్రాలలోనూ ఒకరకంగా సాగలేదు. ఇంతవరకూ, ప్రధానంగా పరిశ్రమలలో వాడకానికి పట్టణాలకు సరఫరా చేయడానికి గాను విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతూ వచ్చింది. ఉత్పత్తి అయిన మొత్తం విద్యుచ్ఛక్తిలో కేవలం 7 లేక 8 శాతం మాత్రమే గ్రామాలలో వాడకం అవుతూ ఉంది.

ఐతే రాష్ట్రంలోని మొత్తం గ్రామాలలో సగానికి పైచిలుకు గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయగలిగిన ఘనత మద్రాసుకు దక్కింది. ఈ విషయంలో ద్వితీయస్థానం కేరళ రాష్ట్రానిది. అక్కడ 39.70 శాతం గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా అవుతున్నది.

మూడవ ప్రణాళిక ముగుస్తూన్న దనగా, 1966లో, గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరాచేసే విషయమై అనుసరిస్తూండిన వైఖరిలో కొంత మార్పువచ్చింది. ఇళ్లలో వాడకానికంటె, పొలాలకు నీరు సప్లయిచేయడానికవసరమైన పంప్ సెట్లకూ, గొట్టపు బావులకూ

విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికి అధిక ప్రాధాన్యం చూపడం మొదలయింది. అధికాహారోత్పత్తి సాధనకు తోడ్పడే నిమిత్తం తలపెట్టిన ఈ మార్పును పురస్కరించుకుని, మూడవ ప్రణాళిక చివరి రెండు సంవత్సరాలలోనూ, గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేసే పథకాలకు మామూలుగా కేటాయించే సొమ్ముకు మించి 11 కోట్ల 21 లక్షల రూపాయలు కేటాయించారు.

గ్రామాలలో, భూమి అడుగున సమృద్ధిగా తగినంత నీరు లభ్యమయ్యే ప్రదేశాలలో ఏర్పాటై ఉన్న పంప్ సెట్లకు విద్యుచ్ఛక్తి సరఫరా చేసేందుకు ప్రాధాన్యం చూపుతూనే, పల్లెల్లో ఇతర వాడకాలకు కూడా విద్యుచ్ఛక్తి లభించేట్లు చూడడానికై సమగ్రమైన పథకాలను రూపొందించవలసిందిగా వివిధ రాష్ట్రాలను కోరడం జరిగింది.

దేశంలో వరుసగా రెండు సంవత్సరాలపాటు వర్షాలు పడకపోవడాన అంతకంతకూ ఎక్కువ పంప్ సెట్లకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయవలసిన ఆవశ్యకత పెరిగింది. మూడవ ప్రణాళిక ఆఖరుకు, మొత్తం 5,10,000 పంప్ సెట్లకు విద్యుచ్ఛక్తి సరఫరా మొదలయింది. వీటిలో 1,06,000 పంప్ సెట్లకు, ప్రణాళిక చివరి సంవత్సరంలోనే ఈ సదుపాయాన్ని కల్పించగలిగారు.

1966_67 సంవత్సరంలో బాగా పెద్దఎత్తున కార్యక్రమాన్ని చేపట్టి దాదాపు 1,43,000 పంప్ సెట్లకు, గొట్టపుబావులకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడమయింది. పంప్ సెట్లనూ, గొట్టపు బావులను ఏర్పాటు చేసుకొనుటలో మద్రాసు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు దేశం మొత్తంమీద ప్రథమ, ద్వితీయ స్థానాలు వహిస్తాయి. మద్రాసులో అవి 2,77,891, ఆంధ్రప్రదేశ్‌లో 73,959 ఉన్నాయి. గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేసే పని కుంటుపడకుండా చూడడానికై ప్రభుత్వం గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరాకై చాలినంత సొమ్ము కేటాయిస్తున్నది. 1966_67లో వేర్వేరు రాష్ట్రాలకు సహాయంగా 39 కోట్ల 38 లక్షల రూపాయలు కేటాయించారు. ఇదికాక, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొనే సందర్భంలో గొట్టపు బావులకూ పంప్ సెట్లకూ విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికిగాను మరో 22 కోట్ల 79 లక్షల రూపాయలను కూడా రాష్ట్రాలకు సహాయంగా ఇచ్చారు.

చార్జీల తగ్గింపు

1966_67లో చేపట్టడానికై మామూలుగా రూపొందించిన కార్యక్రమానికి అదనంగా వీలైనన్ని ఎక్కువ పంప్ సెట్లకు విద్యుచ్ఛక్తి సరఫరాచేసేందుకు సమగ్రమైన పథకాలను తయారు చేయవలసిందిగా బీహార్, ఉత్తర ప్రదేశ్‌లను కోరడమయింది. ఆ రెండు రాష్ట్రాలకూ 6 కోట్ల రూపాయలు అదనపు సహాయంగా సమకూర్చారు కూడా. దీనిమూలంగా బీహార్‌లో 14,000 పంప్ సెట్లకూ, ఉత్తర ప్రదేశ్‌లో దాదాపు 17,000 పంప్ సెట్లకూ కొత్తగా విద్యుచ్ఛక్తిని సరఫరాచేయగలిగారు.

పొలాలకు నీరు పెట్టుకునేందుకై గ్రామస్థులకు వీలైనంత చవకగా విద్యుచ్ఛక్తి సరఫరా అయేటట్లు చూడాలనుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, రైతాంగానికి ఉపయోగపడే విద్యుచ్ఛక్తి ఛార్జీని యూనిట్‌కు 12 పైసలకు మించకుండా చూడవలసిందని రాష్ట్రాలను కోరింది. ప్రస్తుతపు రేట్లు ఇంతకుమించి ఉన్నట్లయితే ఆ వ్యత్యాసాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం చొప్పున సబ్సిడీగా 1966_67 నుంచి మూడేళ్ళపాటు భరించాలని నిశ్చయించారు.

విద్యుచ్ఛక్తి ఉత్పత్తి ఖర్చులను మరింత తగ్గించే ఉద్దేశంతో అమెరికా తోడ్పాటుతో, గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికై ఆంధ్రప్రదేశ్‌తో సహా అయిదు రాష్ట్రాలలో కొద్ది ఎత్తున సహకార సంస్థలను నెలకొల్పేందుకు పూనుకోవడం జరిగింది. ప్రాథమిక పరిశీలన పూర్తిఅయి సవివరమైన పరిశీలన జరుగుతూంది.

చవకగా విద్యుచ్ఛక్తిని గ్రామస్థులకు సరఫరా చేసేందుకేకాక విద్యుత్ సరఫరా విషయంలో అజ్మాయిషీ అధికారాలను కొంతవరకూ స్థానిక ప్రజలకు ఇవ్వటంద్వారా వారు బాధ్యతాయుతంగా వ్యవహరించేట్లు చూడడానికీ, అవసరమయిన పరికరాలనూ ఇతర సరంజామానూ సేకరించడానికీ, నెలకొల్పడానికీ, అవసరమైన పెట్టుబడి పెట్టడానికిగాను స్థానికంగా కొన్ని సంస్థలను ఏర్పాటు చేయడానికీ, గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరాచేసే కార్యక్రమాలను దేశమంతటా చురుకుగా ప్రామాణికమైన పద్ధతిన జరపడానికికూడా ఈ సహకార సంస్థలు తోడ్పడతాయి.

"శ్రమదాన" పథకాలు

స్థానిక ప్రజల "శ్రమదానం"తో గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరాచేసేందుకు కూడా కృషి జరుగుతూంది. కృష్ణాజిల్లాలోని నందిగామ తాలూకాలో కొద్దిఎత్తున ఇలాంటి పథకం ఒకటి అమలు జరిపారు. 7 లక్షల 95 వేల రూపాయలఖర్చుతో ఈ పథకం మేరకు 150 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరాచేయడం మొదలయింది. 263 పంప్ సెట్లకు విద్యుచ్ఛక్తి లభిస్తూంది. ఈ పెట్టిన ఖర్చులో దాదాపు 10 శాతం అనగా 83 వేల రూపాయలు, సాలీనా రాష్ట్ర విద్యుచ్ఛక్తి వ్యవహారాల మండలికి లభిస్తుంటాయి.

ఈ పథకం వల్ల ప్రయోజనంపొందిన గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి, బండరాళ్లను పగలకొట్టడం, స్తంభాలను పాతడానికి అవసరమైన గోతులు త్రవ్వటం, సరఫరా తీగెలను స్తంభాలకు బిగించడం వంటి పనులను శ్రమదాన రూపేణా ఉచితంగా చేయటం ఇక్కడి విశేషం. డబ్బు ఏదీ తీసుకోకుండా, సామాన్లు మోయడానికి బండ్లను 363 సార్లు యిచ్చారు. ఒక్కొక్క మనిషి ఒక రోజుచేసే పనికి 2,183 రెట్లపనిని, ఈ గ్రామస్థులు ఉచితంగా చేశారు. ఇందువల్ల విద్యుత్ సరఫరా పథకానికయ్యే ఖర్చు చాలావరకు తగ్గింది. ఇలాంటి పనివిషయంలో స్థానిక ప్రజలకు ఉత్సాహము, ఆసక్తి కలిగాయి కూడా. ★

ఆంధ్రులు - నాట్యకళ

నటరాజ రామకృష్ణ



ఆంధ్రుల ఆలయ పూజా విధానంలో సంగీత, నృత్యాలకు ప్రాముఖ్యం ఉంది. ఆలయాలలో నాట్యం చేయుటకు సుశిక్షితులైన ఆచార్యుల వద్ద నాట్య శాస్త్రాభ్యాసం చేసిన దేవదాసీలు నియోగింపబడేవారు. వీరు తమ జీవితాలను భగవత్సేవకై అంకితం చేసేవారు. ఆయా దేవతలకు జరుగు ఆరాధన ననుసరించి నాట్య ప్రదర్శనలు జరిగేవి. ఇవి శుద్ధ నృత్యరీతికి చెందినవి. ఇవికాక దేవతలను కళ్యాణ మంటపంలో ఆసీనుల చేసినప్పుడు కేళికా నృత్యాలు చేసేవారు. వీటిలో భక్తికన్న కమనీయ కవితా కల్పనకు ప్రాధాన్యత ఉండేది. కాలక్రమేణ పండితుల, కవుల, రాజపోషకుల అభిరుచుల కనుగుణంగా ఏర్పడిన సంప్రదాయమే భరత నాట్యము. ఈ సంప్రదాయాన్ని అవలంబించి స్త్రీలు నాట్యం చేసేవారు. వీరికి జనసామాన్యం ఎదుట నాట్యం చేసే అవకాశం ఉండేది. కాని రాజసభలలో, వీరికి నాట్యంచేసే అర్హత లేకుండేది. దేవదాసీలు రాజాస్థానాలలో నాట్యంచేయ మొదలిడిన నాటినుండి వారి నాట్యకళ అధోగతి పాలైంది.

స్త్రీలు ప్రదర్శించు నాట్యకళకు 'నట్టువ మేళము' అని పేరు. వీరు దేవాలయాలలో, రాజసభలలో, నాట్య శాస్త్రజ్ఞుల సమక్షంలో నాట్యం చేసేవారు. స్త్రీలకున్న కొన్ని ఇబ్బందుల వల్ల పురుషులు ఊరూర తిరిగి నాట్య ప్రదర్శన లిచ్చేవారు. దీనికి 'నాట్యమేళము' అని నామధేయము. వైష్ణవమత వ్యాప్తితో ఉద్భవించిన నాట్య సంప్రదాయమే 'భాగవతము'. కృష్ణుని జీవిత గాథలే దీనికి ఇతివృత్తాలు.

తరతరాల నుండి ఎటువంటి మార్పులు లేక ఈ నాటికీ జీవించియున్న నాట్య సంప్రదాయమే వైదిక కర్మసంబంధమైన నాట్య సంప్రదాయము.

ఆంధ్ర దేశాన్ని పాలించిన శాతవాహనుల, ఇక్ష్వాకుల నాటి సాహిత్య పరిశీలన చూస్తే అప్పటి నాట్యకళయొక్క స్థితి బోధపడుతుంది. నాగార్జునకొండ, అమరావతులలోని శిల్ప సంపద కూడా నాట్య కళా చరిత్రను తెలుసుకొనుటలో తోడ్పడుతుంది. మహాభారత, భాగవత, పురాణాదుల పఠనం వల్ల బౌద్ధ యుగము తరువాత వృద్ధికి వచ్చిన నాట్యకళను గురించి తెలుసుకోగలము. బౌద్ధమతం క్షీణించిన తరువాత శైవ, వీరశైవ తెగలు నాట్యకళకు అపారమైన దోహదం చేశాయి. కాకతీయ సామ్రాజ్యంలో 'పశుపతి' ఆరాధనకు ప్రాముఖ్యం ఉండుట చేత, ఆ కాలము నాటి ప్రతి దేవాలయంలోను గర్భ గృహమున కెదురుగా బలిపీఠం ఉండేది. ఆలయంలో ప్రతి దినము విభిన్న సమయాలలో జరుగు ఆరాధన కనుగుణంగా దేవదాసీలు ఈ పీఠము మీద నాట్యం చేసేవారు. ఆలయంలో బలిపీఠముండడం ఆంధ్రదేశంలోని దేవాలయాల ప్రత్యేకత అని చెప్పవచ్చు.

కాకతీయుల నాటి నాట్యకళా వైభవమును తెలియజేయు ప్రామాణిక గ్రంథాలలో 'భరతార్ణవము', 'నృత్తరత్నావళి' ముఖ్యమైనవి. వరంగల్లు కోటలోని శిల్పఖండాలు మనకు లభించక పోయినను, పాలంపేటలోని రామప్ప దేవాలయ శిల్పాలు కొంతవరకు ఈ కాలం నాటి నాట్యకళా స్థితిని తెలియజేస్తాయి. ఇవికాక పండితారాధ్య చరిత్ర, బసవ పురాణం, పల్నాటి వీరచరిత్ర మొదలైన గ్రంథాల వల్ల మనకు అప్పటి నాట్యకళను గురించి అనేక విషయాలు తెలుస్తాయి.

దేవదాసీలు, భగవన్నారాయణుని అంశముకలిగిన ఊర్వశి సంతతివారని అనేవారు. వీరు వైష్ణవ దేవాలయాలలో నాట్య ప్రదర్శనలు జరిపేవారు. వీరి ఆరాధనా పద్ధతి ప్రభావం ఇతర పద్ధతులపై పడుటయేగాక క్రొత్త పోకడలకు దారి తీసింది.

శైవ సంప్రదాయ పూర్వక నృత్యములు చురుకుదనము, పవిత్రమైన ఉద్వేగభూయిష్ఠమైన మనోభావాల్ని వ్యక్తం చేస్తాయి.

కరణములు, అంగహారములు వీటికి ఉపకరణాలు. వైష్ణవ సంప్రదాయ నృత్యము సుకుమార భక్తిభావ ప్రదర్శకము. దీనిలోని అందమైన భంగిమలు భక్తితో పరవశం చేస్తాయి.

'అభినయం' నవరసాలను, సంచారి భావాలను వ్యక్తంచేసే కళ. ఈ కళ వల్లభాచార్య రాధామాధవ మధురభక్తి సంప్రదాయంతో మొదలైంది. 'క్షేత్రయ్య' కాలం నాటికి ఈ కళకు విశిష్ట స్థానం లభించింది. ఈ సంప్రదాయాన్ని అనుసరించేవారు తమ్ము రాధగాను, జగన్నాథుని సర్వోత్కృష్ట ప్రభువుగాను భావిస్తారు. వారు తమతో జగన్నాథుని కలయికను ఆత్మ పరమాత్మల సంయోగమే కాక సృష్టికి మూలంగా గ్రహించేవారు. ఆ దివ్య ప్రేమికుల ప్రేమ, విరహవ్యథ, పునః సమాగమములను ఉత్కృష్ట ప్రేమకు చిహ్నమని తలచేవారు. వీరు తమకు కలిగే ఆధ్యాత్మిక ఆనందాన్ని మానవాళికి పంచిపెట్టే తలంపుతో రాధామాధవ ప్రేమను ఆధారంగా కలిగిన ఐతిహ్యాలను శ్రేష్ఠ భక్తికి చిహ్నంగా రూపొందించారు. ఈ సుందర అభివ్యక్తికే 'పదములు' అని పేరు ఏర్పడింది. ఇవే ఆంధ్ర నాట్యకళా సరస్వతికి వెలలేని ఆభరణాలుగా శోభించ సాగినాయి. మరపురాని కమనీయ కవితా కల్పనతో కూడుకున్న ఈ పదాలకు నాయికా నాయకులు రాధామాధవులు. వైష్ణవ సిద్ధాంత ప్రచారంతో ఇంత వరకు వృద్ధిలో ఉంటున్న నాట్య, నృత్త, నృత్య సంప్రదాయాలకు అభినయం తోడైంది.

విజయనగర సామ్రాజ్యం వైభవంతో తులతూగుతున్న రోజులలో ఆంధ్రుల లలిత కళారమ నుదుట కుంకుమ దిద్దుకుని, అందమైన కాలివేళ్ళ పారాణితో, గజ్జెల సవ్వడితో ఆలయ గర్భ గృహాలలో అమర నాట్యం ప్రదర్శిస్తూ ఉండేది. ఒకచోట అననేల ప్రతిచోట నాట్యరమ తమ కౌశలాన్ని ప్రదర్శిస్తూ ఉండేది. అప్పటి నృత్య పద్ధతులలో ఆంగిక అభినయం కంటే సాత్విక అభినయమే ప్రధానంగా ఉండేది. దీనిద్వారానే కృష్ణుని జీవిత గాథలు చిత్రింపబడేవి.

విజయ నగర సామ్రాజ్య అస్తమయంతో మన కళకు గొప్ప అఘాతం కలిగింది. కాని ఆంధ్ర నృత్య సరస్వతి తంజావూరును ఏలిన నాయక రాజుల ఆదరాభిమానాలకు పాత్రఅయింది. ఈనాడు మన దేశంలోని నలుమూలల్లోనే కాక ప్రపంచంలోని పలు దేశాలలో ఖ్యాతినార్జించిన 'భరత నాట్యము' నాయక రాజుల కాలంలోనే రూపొందినదని తెలుస్తున్నది. రఘునాథ నాయకుని ఆస్థానంలో వెలసిన నాట్యాచార్యులు, నర్తకులు ఈ కళకు చక్కని రూపాన్ని ప్రసాదించారు. క్షేత్రయ్య ఈ కాలానికే చెందడం మరొక విశేషం. ఈయన రచనల వల్ల 'రసాభినయమునకు' (హస్త, ముఖ భంగిమల ద్వారా భావాభివ్యక్తి)తోడ్పాటు లభించింది.


'రసాభినయమే' భారతీయ నృత్యానికి మూలకందము. నాయక రాజుల పిదప తంజావూరును పాలించిన మహారాష్ట్రులు తేనెకంటే తీయని ఆంధ్రభాషను ఆదరించి పోషించారు. ఈ భాష వల్లనే క్రొత్త సంప్రదాయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కాలంలో ఆంధ్రదేశంలోని జమీందారీలలో నూతన నాట్య రూపాలు వృద్ధి పొందాయి. అటువంటి జమీందారీలలో ముఖ్యమైనవి కొన్ని: కాళహస్తి, వెంకటగిరి, కొల్లాపురము, నూజువీడు, బొబ్బిలి వెలమ సంస్థానములు; విజయనగరం, తుని, పెద్దాపురం, కార్వేటి నగరం క్షత్రియ సంస్థానములు; గద్వాల, వనపర్తి సంస్థానములు; చల్లపల్లి, ముక్త్యాల సంస్థానములు.

నాయక రాజుల తర్వాత విజయనగర, కార్వేటి నగర రాజులు సంగీత, నాట్యకళలను పోషించ సాగారు. వీరి పోషణలో సరిక్రొత్త రచనలు సాగడమేకాక, ఒకరికంటే మరియొకరు అందములైన రచనలు చేయ పోటీలు పడేవారు. భరతనాట్య ప్రదర్శనలలో మనం చూచే కొన్ని మార్పులకు కూడా ఇది ఒక కారణం కావచ్చును.

రసాభినయం మీద ఆంధ్రులకు ఎనలేని మక్కువ. దీనికి క్షేత్రయ్య ఉత్తమ సృష్టి ముఖ్య కారణం. ఈ రసాభినయంలోని సౌందర్యాన్ని గ్రహించడానికి తెలుగు భాషా మాధుర్యాన్ని కనుగొనడం అత్యవసరం. దక్షిణాదిలో నాట్యకళ వృద్ధిచెంది, నేడుకూడా చెందుతున్నదంటే దీనికి తెలుగు భాషయే ప్రముఖ కారణం.

ఇంత వైభవోపేతమైన తెలుగు భాషను మాట్లాడే ప్రాంతంలోనే నాట్యకళకు ప్రాముఖ్యం లేకపోయింది. కాని కూచిపూడి, భాగవతమేళ నర్తకులు, శ్రీకాకుళ, విజయనగర, కోటకొండ భాగవత నర్తకుల అవిరళ కృషి ఈ కళను అంతం కాకుండా కాపాడుతున్నది. స్వాతంత్ర్య ప్రాప్తికి తర్వాత యువతీ యువకులకు ఈ కళపై ఆదరాభిమానాలు ఎక్కువై ఈనాడు ఎందరో యువతీ యువకులు ఈ కళను పోషించ కంకణం కట్టుకున్నారు. ప్రజలు కూడా ఈ కళను పోషించడంలో చాలా తోడ్పాటు ఇస్తున్నారు. ప్రభుత్వం కూడా సంగీత, నాటక అకాడమీలను స్థాపించడంతో ఊరుకోక, ఇతర విధాలుగా చాలా సహాయ సహకారాలు చేస్తున్నది. నాట్యకళా వికాసానికి ఇప్పుడేర్పడిన మంచి వాతావరణం వల్ల ఆంధ్రులు ఈ కళను ప్రదర్శించడంలో దేశంలోనేకాక, ప్రపంచంలో కూడా 'సాటిలేని మేటి' అని కీర్తి నార్జిస్తారని ఆశిద్దాము.

["Andhras and the art of dance"
అనువ్యాసం ఆధారంగా]



శిక్షణ పొందిన కార్మికులకు మాజీ కేంద్ర మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా ఫిబ్రవరి 4 వ తేదీన హైదరాబాదులోని నెహ్రూ జంతు ప్రదర్శనశాలలో సర్టిఫికేట్లను అందజేస్తున్న దృశ్యం



ఐ. టి ఐ. ఉత్తమ వృత్తి పనివారుగా ఎన్నికైనవారికి జనసంబంధ శ్రామిక మంత్రి ఫిబ్రవరి 4 న హైదరాబాదులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్సులో టూల్‌కిట్‌లను అందజేస్తున్న దృశ్యం

వికలాంగులకు ఉద్యోగాలు

వికలాంగుల ప్రత్యేక ఉపాధి కల్పనా కేంద్రం, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదుకు సంబంధించిన ఉపాధి కల్పన సలహా మండలి నాలుగవ సమావేశం ఫిబ్రవరి 27 వ తేదీన ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టరు శ్రీ వి. శ్రీనివాసాచారి, ఐ.ఎ.ఎస్. అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల యజమానుల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సాంఘిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సరోజినీదేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శివారెడ్డి, ఇ. ఎన్. టి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వి. ఎస్ కృష్ణమూర్తి, పిచ్చాసుపత్రి సూపరింటెండెంట్ డా. శివకుమార శాస్త్రి హాజరయ్యారు.

శారీరకంగా అంగవైకల్యంగల వారి పునరావాసానికి సంబంధించిన వివిధ సిఫారసులను యీ సలహా మండలి చేసింది. వీటిలో కొన్ని ఈ ప్రత్యేక ఉపాధి కల్పనా కేంద్రం కృషిని విస్తృత పరచే సిఫారసులుకూడా వున్నాయి. మానసికంగా దెబ్బతిన్న వారికి ఉపాధి సౌకర్యాలను కల్పించడం, హైదరాబాదులోగల భారత ప్రభుత్వం తాలూకు వయోజన బధిరుల శిక్షణ కేంద్రంలో చేర్చుకునేవారి సంఖ్యను అధికంచేయడం, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ప్రవేశానికై వికలాంగుల వయః పరిమితిని సడలించడం వంటి చర్యలద్వారా ఎక్కువ మందికి ఉపాధి సౌకర్యాలను కల్పించే వివిధ సిఫారసులను ఈ మండలి చేసింది.

కార్మిక, పునరావాస మంత్రిత్వ శాఖ ప్రారంభించిన వృత్తి పునరావాస కేంద్రం సూపరింటెండెంట్ శ్రీ పి. ఎం. సుబ్బయ్య వృత్తి పనులకు సంబంధించిన పునరావాస కేంద్రం చేస్తున్న పని తీరును గురించి వివరించారు. ఈ కేంద్రం హైదరాబాదులో ఇంజనీరింగ్ కళాశాల వద్దగల ఇనస్ట్రక్టర్ల కేంద్ర శిక్షణ సంస్థ ఆవరణలో నెలకొల్పబడింది.

వికలాంగులకు ఉపాధి కల్పించే విషయంలో యజమానులకు ఆసక్తిని కలిగించేందుకై సంస్థల యజమానులతో ఒక ఉప సంఘాన్ని ఏర్పాటుచేయడం జరిగింది.

కుటుంబ నియంత్రణ

ప్రపంచంలోని భూభాగంలో మన దేశం భూప్రాంతం 2.4 శాతం మాత్రమే వుంటుంది. అయితే జనాభా మాత్రం 14 శాతం వుంది.

1961 లో మన జనాభా 43 కోట్ల 39 లక్షలు వుంది. 1951_61 మధ్యలో మన దేశ జనాభా 780 లక్షలు పెరిగిపోయింది. 1966 నాటికి మన జనాభా 50 కోట్లయ్యింది.

ఏడాదికి 2.4 శాతం చొప్పున మన జనాభా పెరిగిపోతోంది. ఈ తీరున పెరిగితే మరో ముప్పయ్యేళ్ళకు మన దేశ జనాభా 100 కోట్లు అవుతుంది!

జనాభా పెరుగుదలను మనం అణచివేయాలి. లేకపోతే మనం సాధిస్తున్న ఆర్థికాభివృద్ధిని అది తినివేస్తుంది. ఉదాహరణకు – తలసరి లభ్యమయ్యే ఆహార ధాన్యాలు, పప్పుధాన్యాలనే తీసుకోండి. 1955 నాటికన్న 1965 లో కాయధాన్యాలు 46 శాతం పెరిగాయి. అంటే 200 లక్షల టన్నులు పెరిగాయన్నమాట. అయితే తలసరి లభించే ఆహార దాన్యాలు మాత్రం దీనికి అనుగుణంగా పెరగలేదే. 10.6 శాతం మాత్రమే పెరిగాయి. ఎందువల్లనంటే ఈ మధ్యకాలంలో జనాభా 25 శాతం పెరిగిపోయింది. పప్పుధాన్యాల విషయంలో అయితే తలసరి లభ్యమయ్యే పప్పుధాన్యాలు 1955 నాటికన్న 65 నాటికి 16 శాతం తగ్గిపోయాయి. నిజానికి పప్పుధాన్యాలు దిగుబడి నికరంగా 7.1 శాతం పెరిగాయి. అయితే యిది ఎందువల్ల జరిగింది? జనాభా పెరుగుదలవల్ల.

అందుకే_

ఈనాడు ప్రతి వెయ్యిమంది జనాభాకు 41 చొప్పున వున్న జననాల రేటును 1976 సంవత్సరాంతానికి 25 కు తగ్గించాలి.

కుటుంబ నియంత్రణా కేంద్రాలు అందుకే ఏర్పడ్డాయి. గత సంవత్సరాంతానికి దేశంలో 25,569 కుటుంబ నియంత్రణ కేంద్రాలు వున్నాయి. వీటిలో 23,928 కేంద్రాలు గ్రామీణ ప్రాంతాలలోనే వున్నాయి.

స్టెరిలైజేషన్, ఐ. యు. సి. డి., డయాఫ్రమ్, ఫోమ్ మాత్రలు, జెల్లీలు మొదలైన గర్భ నిరోధక సాధనాలు, ప్రక్రియలు అనేకం బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి.

బాగా పరిశీలనలు జరిపిన పిమ్మట లూప్ (ఐ.యు.సి.డి.) సాధనం మనదేశానికి తగినదని నిపుణులు నిరూపించారు. 1966లో సుమారు 8,00,000 లూపులను 1966_67 లో 9,00,000 లూపులను అమర్చారు. 1967_68 లో 10 లక్షల లూప్‌లను అమర్చాలని ఉద్దేశించారు. అంటే మన జనాభాలో ప్రతి 1000 మందికి యిద్దరికి లూప్‌లను అమర్చడం జరుగుతుందన్న మాట. 1975_76 నాటికి వెయ్యికి 8 మందికి యిది వర్తింపజేయాలని ఉద్దేశిస్తున్నారు. కాన్పూరులోని కర్మాగారం రోజుకు 30,000 ప్లాస్టిక్ లూప్‌లను తయారు చేస్తున్నది.

ఇంతవరకు 33.5 లక్షల మందికి స్టెరిలైజేషన్ ఆపరేషన్లు జరిపారు.

కుటుంబ నియంత్రణకు సంబంధించిన సేవలన్నిటినీ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగానే అందచేస్తున్నది. ★

అల్ప సంఖ్యాక వర్గాలు

18 సంవత్సరాల సెక్యులర్ రాజ్యం

18 సంవత్సరాల రిపబ్లిక్ రాజ్యంలో సెక్యులరిజాన్ని జీవన విధానంగా అనుసరించడం జరిగింది.

1950 జనవరి 26వ తేదీన దేశం, మతాతీత ప్రజాస్వామ్యాన్ని ఎన్నుకోవడంతో, జాతి అభీష్టం, చారిత్రక సత్యం ప్రతిఫలించింది.

భారతదేశం సంక్లిష్ట పరిస్థితులనుఎదుర్కొన్న సందర్భంలో మతాతీత విధానం సడలకుండా ఉండడమేగాక మరింతగా పటిష్టమై, నూతన బలాన్ని పుంజుకున్నది. భారత స్వాతంత్ర్యానికి సెక్యులరిజం వాస్తవంగా అపూర్వమైన అంశంగా భావించవచ్చు.

భారతదేశ సెక్యులరిజంలో ప్రత్యేకమైనవే అయినా అవినాభావ సబంధంగల మూడు అంశాలు ముడిపడి ఉన్నాయి. అవి ప్రభుత్వం, మతం, వ్యక్తి. మతము. – వ్యక్తుల మధ్యఉన్న సంబంధం (మత స్వాతంత్ర్యం) ; ప్రభుత్వం. – వ్యక్తి (పౌరసత్వ అధికారాలు, విధులు) ; ప్రభుత్వమూ_ మతం (రెండింటి వేర్పాటు).

రాజ్యాంగంలో యీ మూడు అంశాలను గూర్చి విపులంగా పేర్కొన్నారు. వ్యక్తులు – ఒకే అభిప్రాయం ఉన్న వ్యక్తులు గల సంఘాల మత స్వాతంత్ర్యాన్ని దానిలో కల్పించారు. దీనికి సంబంధించిన ప్రాతిపదిక హామీలను 25 (1) ఆర్టికల్‌లో పొందు పర్చారు : శాంతి భద్రతలు, నైతిక విలువలు, ఆరోగ్య తదితర అంశాలకు లోబడి, వ్యక్తులందరూ మత స్వాతంత్ర్య మత ప్రబోధ స్వాతంత్ర్యం, మత ప్రచార స్వాతంత్ర్యం కలిగి ఉంటారు.

అల్ప సంఖ్యాక వర్గాలవారు తమ ప్రత్యేకమైన సంస్కృతి సంప్రదాయల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు సెక్యులర్ రాజ్య స్థాపనలో ప్రముఖమైన పాత్ర నిర్వహించారు.

రిపబ్లిక్ ఏర్పడిన నాటినుండి వివిధ మతాలకు చెందిన ప్రజలు, తమకు లభించిన సమాన అవకాశాలను యితోధికంగా

వినియోగించుకుని, అత్యున్నత స్థానాలను, అత్యున్నత గౌరవాలను సంపాదించి, స్వేచ్ఛా జీవితాన్ని అనుభవిస్తూ, శక్తి కొద్ది తమ మాతృభూమికి సేవచేస్తున్నారు.

1961 జనాభా లెక్కల్ని అనుసరించి భారత దేశం జనాభా 43.90 కోట్లు. ఇందులో 36.60 కోట్లు హిందువులు, 4.70 కోట్లు మహమ్మదీయులు, 1.10 కోట్లు క్రైస్తవులు, 20 లక్షలు జైనులు, 80 లక్షలు సిక్కులు, 30 లక్షలు బౌద్ధులు, కొద్దిసంఖ్యలో పార్సీలు, యూదులు, యితరులు ఉన్నారు.

అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ప్రముఖులు డా. జాన్ మత్తయ్, శ్రీ రఫీ అహమ్మద్ ఖిద్వాయ్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సర్దార్ బల్దేవ్ సింగ్, శ్రీ ఎం.సి. చాగ్లా, హుమాయూన్ కబీర్, శ్రీ ఫకృద్దీన్ అలీ అహమ్మద్, శ్రీమతి వాలెట్ అల్వా, శ్రీ స్వర్ణసింగ్ కేంద్ర మంత్రి వర్గంలో మంత్రి పదవులు నిర్వహించారు.

దేశ స్వాతంత్ర్యం తర్వాత భారతదేశ ప్రజా జీవనంలో ఈ దిగువ తెల్పిన ప్రముఖులు ప్రముఖపాత్ర నిర్వహించారు: డా. జాకిర్ హుస్సేన్, (యిప్పుడు భారత రాష్ట్రపతిగా ఉన్నారు.) ఫ్రాంక్ ఆంథోనీ, సర్దార్ హుకుంసింగ్, సంత్ ఫతేసింగ్, శ్రీ ఫిరోజ్‌గాంధి, బి. హెచ్. ఇత్యాబ్జీ, జె. ఆర్. డి. తాతా, హెచ్. పి. మోడి, హెచ్. జె. బాబా, ప్రొఫెసర్ ముజీబ్, సయ్యద్ ఫజల్ అలీ.

నేటి భారతదేశంలో అల్ప సంఖ్యాక వర్గాల ప్రజల స్థితి గతులను గూర్చి ప్రస్తావించినప్పుడు రాజ్యాంగంలో వారికి యిచ్చిన భద్రతలను గూర్చి తెలుసుకోవడం చాలా ముఖ్యం. 29 వ ఆర్టికల్‌లో దిగువ అంశాలు ఉన్నాయి:

1. భారత దేశంలోగానీ, యీ దేశంలోని ఏ ప్రాంతంలోగానీ నివసిస్తూ ప్రత్యేక భాష, లిపి, సంస్కృతి కలిగిన యే వర్గం ప్రజలకైనా వాటిని పరిరక్షించుకునే హక్కు ఉంటుంది.

2. ప్రభుత్వ విద్యా సంస్థలలోగానీ, ప్రభుత్వ సహాయం పొందుతున్న విద్యా సంస్థలలోగానీ, కుల, మత, వర్గ, వర్ణ, భాషా కారణాలపై యే పౌరునికీ ప్రవేశం నిరాకరించబడదు.

విద్యా సంస్థలను నెలకొల్పి, నిర్వహించుకునే హక్కు కూడ వారికి యివ్వబడింది.

భారత దేశంలో సెక్యులర్ రాజ్యం కేవలం సిద్ధాంత లక్ష్యంగానే నిలిచిపోలేదు. ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధి నుడివినట్లు, "మేము సెక్యులర్ రాజ్యాన్ని కోరుకున్నాము. అయితే అది అన్ని మతాల పవిత్రతను గుర్తించడమేగాని, మత రహితమే ఆశయమని భావించరాదు. మన ప్రజలకు పూర్తి స్వేచ్ఛ నివ్వడం, జాతి వ్యవహారాలలో గరిష్ట స్థాయిలో ప్రజలందరు పాల్గొనాలనే ఉద్దేశంతో ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని మనం ఎన్నుకున్నాము. రాజ్యాంగంలో నిర్దేశించిన సమానత అంశానికి వాస్తవ రూపం యివ్వడానికి వీలుగా ప్రతి పురుషుడు, స్త్రీ ప్రయోజనం పొందే విధంగా ఆర్థిక అభివృద్ధి రంగంలో సోషలిజాన్ని ఎన్నుకున్నాము. అంతేగాక యింతవరకు బడుగు స్థితిలో వున్న పీడిత ప్రజలకు సహాయపడి, అభివృద్ధి పరచడానికి ప్రత్యేక కృషిని ప్రారంభించాము."

రాజ్యాంగంలో నిర్దేశించిన అవిచ్ఛిన్న స్వేచ్ఛా సమాజం, ప్రజల జాతీయ సమైక్యతా భావాన్ని పటిష్ఠం చేసిందేగానీ బలహీన పరచలేదని 18 సంవత్సరాల భారత సెక్యులర్ ప్రజాస్వామ్య చరిత్ర రుజువుచేస్తున్నది. ★

గిరిజన సంక్షేమం

గిరిజనాభివృద్ధి

గతంలో మాదిరిగానే యీ సారికూడ రిపబ్లిక్ దినోత్సవాలలో గిరిజనులు సంగీత నృత్య ప్రదర్శనలద్వారా తమ సంస్కృతీ సంప్రదాయ రీతులను వెల్లడించారు.

తమ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించు కుంటూనే దేశ సాంఘిక ఆర్థికాభివృద్ధి కృషిలో వారుకూడ పాల్గొంటున్నారు. అభివృద్ధి రంగంలో తమవంతు కృషిని నిర్వహిస్తూ వాటి ఫలితాలను వారుకూడ అనుభవిస్తున్నారు. దేశం నలుమూలలా వ్యాపించిఉన్న 300 లక్షల మంది గిరిజనులు స్వాతంత్ర్య సముపార్జన తర్వాత తమ ఆర్థిక సాంఘిక పరిస్థితులను చాలావరకు మెరుగుపరచుకున్నారు.

గిరిజన సంక్షేమ కార్యక్రమాలనిమిత్తం ప్రథమ ప్రణాళికలో రు. 19.23 కోట్లు, రెండవ ప్రణాళికలో రు. 42.92 కోట్లు, మూడవ ప్రణాళికలో రు 59.90 కోట్లు కేటాయించారు.

ఉచిత విద్యాబోధన, స్టయిఫండ్స్, స్కాలర్‌షిప్పులు, పాఠ్యగ్రంథాల సరఫరా మొదలైన రూపాలలో విద్యా సౌకర్యాలు, రాయితీలు కల్పించ బడుతున్నాయి. అనేక సాంకేతిక విద్యా సంస్థలలో గిరిజన విద్యార్థుల నిమిత్తం సీట్లు రిజర్వు చేశారు. వయః పరిమితి సడలింపు, కనీసవిద్యార్హతల తగ్గింపు సౌకర్యం కల్పించారు.

1965_66 విద్యాసంవత్సరంలో ప్రీమెట్రిక్ స్థాయిలో దాదాపు 1.022 మిలియన్‌మంది గిరిజన విద్యార్థులకు రాష్ట్ర స్కాలర్‌షిప్పులు, స్టయిఫండులు మంజూరుచేశారు. 1955_56 నాటికన్నా యీ సంఖ్య మూడొంతులు ఉంటుంది. మూడవ ప్రణాళికా కాలంలో పోస్టు_మెట్రిక్ స్థాయిలో 57,000 మందికి స్కాలర్‌షిప్పులు మంజూరుచేశారు.

మూడవ ప్రణాళికా కాలంలో వ్యవసాయ వృత్తిగల గిరిజన కుటుంబాలకు 51,017 ఎకరాల భూమిని కేటాయించారు.

గిరిజనుల నిమిత్తం 416 గిరిజన అభివృద్ధి బ్లాకులు, 43 ప్రత్యేక బహుళార్థసాధక గిరిజన బ్లాకులు ఏర్పాటుచేశారు. కోటీ 25 లక్షలకుపైగా గిరిజనులకు వీటివల్ల ప్రయోజనం కలుగుతున్నది. మూడవ ప్రణాళికా కాలంలో యీబ్లాకులలో రు. 15.53 కోట్లు ఖర్చుచేశారు.

ప్రభుత్వఉద్యోగాలలో 5 శాతం గిరిజన అభ్యర్థుల నిమిత్తం రిజర్వుచేశారు. వయః పరిమితి, విద్యార్హతల సడలింపు సౌకర్యం కలిగించారు. ఐ. ఎ. ఎస్, ఐ.పి.ఎస్. వంటి అఖిల భారత ఉన్నతోద్యోగ సర్వీసులలో గిరిజన అభ్యర్థులు ప్రవేశం పొందుతున్నారు. 1961 లో 37,704 మందికి యీ ఉద్యోగాలు లభించగా 1966 లో 51,655 మందికి లభించాయి.

వివిధ రాష్ట్రాలలో నెలకొల్పబడిన గిరిజన పరిశోధనా సంస్థలు, ప్రత్యేకంగా గిరిజన ప్రాంతాలను పరిశోధిస్తున్నాయి. ఇప్పటికి 9 సంస్థలు పనిచేస్తున్నాయి.

శాసన సభలలో గిరిజనులకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించడానికి వీలుగా లోక్‌సభలో 37 సీట్లు, రాష్ట్ర శాసన సభలలో 262 సీట్లు గిరిజనులకు రిజర్వుచేశారు.

స్నేహగీతి

దాశరథి


తైలాలు లేకుండ వెలిగేటి దీపం
విద్యుత్తు లేకుండ వెలిగేటి దీపం
హృదయాలలో ఎపుడు నిలచేటి దీపం
నిజమైన దీపం, మా స్నేహ దీపం
మనసులో దీపం, మలిపితే పాపం.

వర్ణాలు వర్గాలు వదిలితే స్నేహం
వేషాలు రోషాలు మానితే స్నేహం
ప్రాణాల నర్పించ గలిగితే స్నేహం
కష్టాల నష్టాల నోర్చితే స్నేహం.

నిరుపేద అయితేమి ఎవడైతె ఏమి?
చదువేమి రానట్టి చవటయితె ఏమి?
అందచందాలు లేకుంటేను ఏమి?
నిన్ను కాచినవాడె నిజమైన నేస్తం.

దోస్తీని మించింది లేదు లోకాన
రత్నాలకంటె అది మిన్న తూకాన
మిత్రుడే కావాలి సుఖమునా శోకాన
అతడు లేకున్నచో నగరమే కాన.

చీకట్లలో దారి చూపేది నేస్తం
కళ్లు తలకెక్కితే దింపేది నేస్తం
మనలోని లోపాలు తెలిపేది నేస్తం
నిజమైన మనిషిగా నిలిపేది నేస్తం.



శిక్షణ పొందిన కార్మికులకు మాజీ కేంద్ర మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా ఫిబ్రవరి 4 వ తేదీన హైదరాబాదులోని నెహ్రూ జంతుప్రదర్శనశాలలో సర్టిఫికేట్లను అందజేస్తున్న దృశ్యం



ఐ. టి. ఐ. ఉత్తమ వృత్తి పనివారుగా ఎన్నికైనవారికి జనసంబంధ శ్రామిక మంత్రి ఫిబ్రవరి 4 న హైదరాబాదులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్సులో టూల్‌కిట్‌లను అందజేస్తున్న దృశ్యం

వికలాంగులకు ఉద్యోగాలు

వికలాంగుల ప్రత్యేక ఉపాధి కల్పనా కేంద్రం, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదుకు సంబంధించిన ఉపాధి కల్పన సలహా మండలి నాలుగవ సమావేశం ఫిబ్రవరి 27 వ తేదీన ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టరు శ్రీ వి. శ్రీనివాసాచారి, ఐ.ఎ.ఎస్. అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల యజమానుల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సాంఘిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సరోజినీదేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శివారెడ్డి, ఇ. ఎన్. టి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వి. ఎస్ కృష్ణమూర్తి, పిచ్చాసుపత్రి సూపరింటెండెంట్ డా. శివకుమార శాస్త్రి హాజరయ్యారు.

శారీరకంగా అంగవైకల్యంగల వారి పునరావాసానికి సంబంధించిన వివిధ సిఫారసులను యీ సలహా మండలి చేసింది. వీటిలో కొన్ని ఈ ప్రత్యేక ఉపాధి కల్పనా కేంద్రం కృషిని విస్తృత పరచే సిఫారసులుకూడా వున్నాయి. మానసికంగా దెబ్బతిన్న వారికి ఉపాధి సౌకర్యాలను కల్పించడం, హైదరాబాదులోగల భారత ప్రభుత్వం తాలూకు వయోజన బధిరుల శిక్షణ కేంద్రంలో చేర్చుకునేవారి సంఖ్యను అధికంచేయడం, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ప్రవేశానికై వికలాంగుల వయః పరిమితిని సడలించడం వంటి చర్యలద్వారా ఎక్కువ మందికి ఉపాధి సౌకర్యాలను కల్పించే వివిధ సిఫారసులను ఈ మండలి చేసింది.

కార్మిక, పునరావాస మంత్రిత్వ శాఖ ప్రారంభించిన వృత్తి పునరావాస కేంద్రం సూపరింటెండెంట్ శ్రీ పి. ఎం. సుబ్బయ్య వృత్తి పనులకు సంబంధించిన పునరావాస కేంద్రం చేస్తున్న పని తీరును గురించి వివరించారు. ఈ కేంద్రం హైదరాబాదులో ఇంజనీరింగ్ కళాశాల వద్దగల ఇనస్ట్రక్టర్ల కేంద్ర శిక్షణ సంస్థ ఆవరణలో నెలకొల్పబడింది.

వికలాంగులకు ఉపాధి కల్పించే విషయంలో యజమానులకు ఆసక్తిని కలిగించేందుకై సంస్థల యజమానులతో ఒక ఉపసంఘాన్ని ఏర్పాటుచేయడం జరిగింది.

కుటుంబ నియంత్రణ

ప్రపంచంలోని భూభాగంలో మన దేశం భూప్రాంతం 2.4 శాతం మాత్రమే వుంటుంది. అయితే జనాభా మాత్రం 14 శాతం వుంది.

1961 లో మన జనాభా 43 కోట్ల 39 లక్షలు వుంది. 1951_61 మధ్యలో మన దేశ జనాభా 780 లక్షలు పెరిగిపో యింది. 1966 నాటికి మన జనాభా 50 కోట్లయ్యింది.

ఏడాదికి 2.4 శాతం చొప్పున మన జనాభా పెరిగిపోతోంది. ఈ తీరున పెరిగితే మరో ముప్పయ్ యేళ్ళకు మన దేశ జనాభా 100 కోట్లు అవుతుంది!

జనాభా పెరుగుదలను మనం అణచివేయాలి. లేకపోతే మనం సాధిస్తున్న ఆర్థికాభివృద్ధిని అది తినివేస్తుంది. ఉదాహరణకు - తలసరి లభ్యమయ్యే ఆహార ధాన్యాలు, పప్పుధాన్యాలనే తీసుకోండి. 1955 నాటికన్న 1965 లో కాయధాన్యాలు 46 శాతం పెరిగాయి. అంటే 200 లక్షల టన్నులు పెరిగాయన్నమాట. అయితే తలసరి లభించే ఆహార దాన్యాలు మాత్రం దీనికి అనుగుణంగా పెరగలేదే. 10.6 శాతం మాత్రమే పెరిగాయి. ఎందువల్లనంటే ఈ మధ్యకాలంలో జనాభా 25 శాతం పెరిగిపోయింది. పప్పుధాన్యాల విషయంలో అయితే తలసరి లభ్యమయ్యే పప్పుధాన్యాలు 1955 నాటికన్న 65 నాటికి 16 శాతం తగ్గిపోయాయి. నిజానికి పప్పుధాన్యాలు దిగుబడి నికరంగా 7.1 శాతం పెరిగాయి. అయితే యిది ఎందువల్ల జరిగింది? జనాభా పెరుగుదలవల్ల.

అందుకే_

ఈనాడు ప్రతి వెయ్యిమంది జనాభాకు 41 చొప్పున వున్న జననాల రేటును 1976 సంవత్సరాంతానికి 25 కు తగ్గించాలి.

కుటుంబ నియంత్రణా కేంద్రాలు అందుకే ఏర్పడ్డాయి. గత సంవత్సరాంతానికి దేశంలో 25,569 కుటుంబ నియంత్రణ కేంద్రాలు వున్నాయి. వీటిలో 23,928 కేంద్రాలు గ్రామీణ ప్రాంతాలలోనే వున్నాయి.

స్టెరిలైజేషన్, ఐ. యు. సి. డి., డయాఫ్రమ్, ఫోమ్ మాత్రలు, జెల్లీలు మొదలైన గర్భ నిరోధక సాధనాలు, ప్రక్రియలు అనేకం బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి.

బాగా పరిశీలనలు జరిపిన పిమ్మట లూప్ (ఐ.యు.సి.డి.) సాధనం మనదేశానికి తగినదని నిపుణులు నిరూపించారు. 1966లో సుమారు 8,00,000 లూపులను 1966_67 లో 9,00,000 లూపులను అమర్చారు. 1967_68 లో 10 లక్షల లూప్‌లను అమర్చాలని ఉద్దేశించారు. అంటే మన జనాభాలో ప్రతి 1000 మందికి యిద్దరికి లూప్‌లను అమర్చడం జరుగుతుందన్న మాట. 1975_76 నాటికి వెయ్యికి 8 మందికి యిది వర్తింపజేయాలని ఉద్దేశిస్తున్నారు.

కాన్పూరులోని కర్మాగారం రోజుకు 30,000 ప్లాస్టిక్ లూప్‌లను తయారు చేస్తున్నది.

ఇంతవరకు 33.5 లక్షల మందికి స్టెరిలైజేషన్ ఆపరేషన్లు జరిపారు.

కుటుంబ నియంత్రణకు సంబంధించిన సేవలనన్నిటినీ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగానే అందజేస్తున్నది. ★

అల్పసంఖ్యాక వర్గాలు

18 సంవత్సరాల సెక్యులర్ రాజ్యం

18 సంవత్సరాల రిపబ్లిక్ రాజ్యంలో సెక్యులరిజాన్ని జీవన విధానంగా అనుసరించడం జరిగింది.

1950 జనవరి 26వ తేదీన దేశం, మతాతీత ప్రజాస్వామ్యాన్ని ఎన్నుకోవడంతో, జాతి అభీష్టం, చారిత్రక సత్యం ప్రతిఫలించింది.

భారతదేశం సంక్లిష్ట పరిస్థితులనుఎదుర్కొన్న సందర్భంలో మతాతీత విధానం సడలకుండా ఉండడమేగాక మరింతగా పటిష్ఠమై, నూతన బలాన్ని పుంజుకున్నది. భారత స్వాతంత్ర్యానికి సెక్యులరిజం వాస్తవంగా అపూర్వమైన అంశంగా భావించవచ్చు.

భారత దేశ సెక్యులరిజంలో ప్రత్యేకమైనవే అయినా అవినాభావ సబంధంగల మూడు అంశాలు ముడిపడి ఉన్నాయి. అవి ప్రభుత్వం, మతం, వ్యక్తి. మతము, - వ్యక్తుల మధ్యఉన్న సంబంధం (మత స్వాతంత్ర్యం) ; ప్రభుత్వం. - వ్యక్తి (పౌరసత్వ అధికారాలు, విధులు) ; ప్రభుత్వమూ- మతం (రెండింటి వేర్పాటు).

రాజ్యాంగంలో యీ మూడు అంశాలను గూర్చి విపులంగా పేర్కొన్నారు. వ్యక్తులు - ఒకే అభిప్రాయం ఉన్న వ్యక్తులు గల సంఘాలు మత స్వాతంత్ర్యాన్ని దానిలో కల్పించారు. దీనికి సంబంధించిన ప్రాతిపదిక హామీలను 25 (1) ఆర్టికల్‌లో పొందుపర్చారు : శాంతి భద్రతలు, నైతిక విలువలు, ఆరోగ్య తదితర అంశాలకు లోబడి, వ్యక్తులందరూ మత స్వాతంత్ర్య మత ప్రబోధ స్వాతంత్ర్యం, మత ప్రచార స్వాతంత్ర్యం కలిగి ఉంటారు.

అల్ప సంఖ్యాక వర్గాలవారు తమ ప్రత్యేకమైన సంస్కృతి సంప్రదాయల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు సెక్యులర్ రాజ్య స్థాపనలో ప్రముఖమైన పాత్ర నిర్వహించారు.

రిపబ్లిక్ ఏర్పడిన నాటినుండి వివిధ మతాలకు చెందిన ప్రజలు, తమకు లభించిన సమాన అవకాశాలను యితోధికంగా

స్నేహమతం

పాతూరి ప్రసన్నం

ఒక్కొక్కరికి ఒక్కొక మతంలో విశ్వాసం వుంటుంది. కొందరికి మతాలపట్ల విశ్వాసం లేకపోవచ్చు.

కానీ అందరికీ స్నేహమతంలో మాత్రం తప్పకుండా విశ్వాసం వుంటుంది స్నేహం మానవ జీవితాన్ని మధురానుభూతులతో నింపివేసే ఒక దివ్యమైన వరం.

మనిషికి స్నేహ మాధుర్యాన్ని అనుభవించగల హృదయము వుంది. అదే మనిషిని సహృదయునిగా చేస్తుంది. అన్ని బాంధవ్యాలకూ అతీతమయింది స్నేహ బాంధవ్యం. దానిని చేతులారా ఎవ్వరూ విడనాడరు.

మనిషి పుట్టిన నాటినుంచీ మనిషితోనే పెరుగుతుంది స్నేహలత. స్నేహలత పూచిన కుసుమ పరిమళాలు జీవిత వనములో గుబాళిస్తాయి. జీవిత ఫలకాన్ని చిత్ర విచిత్రమైన వర్ణాలతో నింపుతుంది స్నేహం.

నేస్తం లేనిదే నిరుత్సాహ పడతాడు పాపాయి. స్నేహితుడు లేనిదే ఆడుకోలేడు కుర్రవాడు. తోడూనీడా లేనిదే బ్రతుకు పథంలో చేయీ చేయీ కలిపి ముందుకు పోలేరు నరుడూ నారీ.

త్యాగశీలత

అభిమానం, గౌరవం, ప్రేమ, ఆదరణ–ఇవన్నీ స్నేహంలో వుంటాయి. మనసులు కలిసినప్పుడూ, మమతలు పెరిగినప్పుడూ పరస్పర స్నేహం మనిషికి ఒక పరమార్థాన్ని కూడా నేర్పుతుంది. ఒకరి ప్రయోజనాలను మరొకరు నెరవేర్చటం కాకుండా, ఒకరికై మరొకరు ఎంతైన త్యాగం కూడా చేస్తారు స్నేహితులు. స్నేహశీలతలో త్యాగ శీలత కూడా వుంది. ఇలాటి స్నేహం యొక్క పవిత్రతను మనం ప్రపంచ సాహిత్యం అంతటా చూస్తాం.

సజ్జనమైత్రి మొదట్లో కొంచెమే వున్నా రాను రాను అధికమవుతుంది. స్వార్థ కలుషితమైన దుర్జనమైత్రి మొదట్లో గొప్పగా వుంటూ తుదకు కురుచయై పోతుంది అని భాషిస్తాడు భర్తృహరి. ఉదయం పూట నీడవంటిది దుర్జనమైత్రి. సాయంత్రపు నీడ వంటిది సజ్జనమైత్రి. ఒకటి తరిగిపోయేది మరొకటి పెరిగిపోయేదీ. "పాప కృత్యాల నుంచి మరల్చుతూ, హిత కార్యాలు చేస్తూ, రహస్య గోపనం చేస్తూ, ఆపదల్లో ఆదుకుంటూ, లేని వేళల సహాయం చేస్తూ వుండటం మిత్ర ధర్మం" అంటాడు భర్తృహరి. పాలూ నీరూవలె కలిసి వుంటారు స్నేహితులు. శ్రీరామ లక్ష్మణుల మనః ప్రవృత్తులు అలా కలిసి వుండేవి. "సౌమిత్రి నాకు ముఖ్య స్నేహితుడు" అంటాడు శ్రీరాముడు (అయోధ్యా కాండ).

పవిత్రమైన స్నేహ సంబంధాన్ని కూడా అగ్ని సాక్షిగా. సప్రమాణంగా మానవుడు ఒకనాడు ఏర్పరచు కొనేవాడని రామాయణంవల్ల తెలుస్తుంది "నా స్నేహం కోరటంవల్ల నాకు గొప్ప లాభం చేశారు నా చేతులు చాచుతున్నాను. వీటిని పుచ్చుకొని అనుల్లంఘ్యమైన ఒక శాశ్వత బంధాన్ని ఏర్పాటు చేసుకుందాం" అంటాడు రామునితో సుగ్రీవుడు హనుమంతుడు జ్వలింప జేసిన అగ్ని చుట్టూ రామ సుగ్రీవులు ప్రదక్షిణం చేస్తారు "నీ దుఃఖమే నాకు దుఃఖము నీ సుఖమే నాకు సుఖము." అని వారిద్దరూ ప్రమాణం చేస్తారు వారు మైత్రి నెరపుకున్న శుభ సమయంలో లంకలోగల సీతమ్మయొక్క కలువ వంటి యెడమ కన్ను, రావణుని నిప్పువంటి కుడి కన్ను అదరినవట. దేశకాల పరిస్థితులు మనుష్యలలోని మైత్రికి కారణభూతములవుతై. మిత్ర ద్రోహం కూడా మహాపాతకాల్లో ఒకటిగా ధర్మ శాస్త్రాలు వ్రాసాయి. "మిత్ర ద్రోహేచ పాతకం", అని గీతలో విషాదయోగంలో అర్జునుడు వాపోతాడు.

జీవితం సుఖవంతం కావాలంటే కీడు తలపెట్టే విరోధుల సంఖ్య తగ్గుతూ వుండాలి అభివృద్ధిని కోరే మిత్రుల సంఖ్య పెరుగుతూ వుండాలనటం యథార్థం. అందుకే "రాముడు కొత్తవారితో స్నేహం చేస్తున్నాడా? వారు కూడా అతని స్నేహం కోరుతున్నారా?" అని సీత హనుమంతుని ప్రశ్నిస్తుంది, లంకలో. ఆదికావ్యంలోనిండా స్నేహ తత్వాన్ని బోధించే ఘట్టాలు చాలా వున్నాయి.

పంచమ వేదంగా ప్రసిద్ధి పొందిన మహా భారతంలోనూ మిత్ర ధర్మ ప్రస్తావన విపులంగా వినిపించుతుంది.

ధనంకంటె ఎక్కువ

మర్త్యుని దారిద్ర్యాన్ని పోగొట్టటానికి నాలుగు కారణాలున్నాయిట. మిత్రుడు, రజితము, కనకమూ, బుద్ధి అనేవి నాలుగూ మానవునికి సంపదలు కలుగజేస్తాయి. కానీ ధనం కంటె మిత్రునికే ఎక్కువ విలువ ఇచ్చారు. కారణం ధనం ఐహిక సుఖానికే కారణ భూతం అయితే, మిత్రుడు ఐహిక సుఖానికీ, ఆముష్మిక సౌఖ్యానికీ కారణ భూతుడు కాగలుగుతాడు. అలాటి

మిత్రుడు ఉత్తముడైనప్పుడూ, సుగుణాన్వితుడైనపుడూ, సుస్నేహమతి అయినపుడూ అతని మనస్సును రంజింపజేస్తూ, అతనితో స్నేహాన్ని పెంపొందించుకుంటూ, అతని పొత్తున బ్రతుకుతూ శుభాలు పొందాలి అని భారత సంహిత బోధిస్తుంది శాంతి పర్వంలో. ఇలాటి స్నేహానికి ముఖ్యంగా కావాల్సినవి కొన్ని సాధారణ లక్షణాలు. విరుద్ధ భావాలు గల వ్యక్తుల్లో వికసత్వమే పెరుగుతుంది. సారూప్య, సామరస్య భావాలు కలవారిలోనే స్నేహాంకురాలు మొలకెత్తుతాయి. కనుకనే ధనపతితో దరిద్రుడుగానూ, విద్వాంసునితో మూర్ఖుడుగానూ, ప్రశాంతునితో క్రూరుడుగానూ, రణశూరునితో భీరుడుగానూ, వమాధితో అవమాధికీ, సజ్జనునితో దుర్జనుడుగానూ సఖ్యం నెరవేరదని స్నేహధర్మ నీతిజ్ఞులు తెలియజేస్తారు.

కర్ణుని పాత్ర

మహాభారతంలో కర్ణుని పాత్ర మిత్రధర్మాన్ని పరమోత్కృష్టంగా చిత్రించుతుంది. కర్ణుడు ఒక ఆదర్శమిత్రుడు. తనను చేరదీసి తనకు రాజరికాన్ని కల్పించి, తన భుజబలంపై, పరాక్రమంపై ఎంతో విశ్వాసం కలిగిన దుర్యోధనుని ఎంత క్లిష్టమైన స్థితిలోనూ వంచించలేదు కర్ణుడు. అలాగే భాగవతంలోనూ ఉద్ధవ శ్రీకృష్ణుల మైత్రి, కృష్ణార్జునుల మైత్రి స్నేహ మాధుర్యాన్ని రుచిచూపుతాయి. "నీవు నా సఖుడవు. కనుక నీకు రహస్యము, ఉత్తమము అయిన యోగ విద్యను ఉపదేశిస్తాను," అంటాడు కృష్ణుడు. అర్జునునితో గీతోపదేశం చేస్తూ. విశ్వ రూప సందర్శనం చేసిన అర్జునుడు కృష్ణునితో "హే కృష్ణా! హే యాదవా! హే సఖా! అంటూ నిన్ను ఎన్నో రీతులుగా సంబోధిస్తూ నీతో సరసాలాడాను. విహార శయ్యాసన భోజనాది సమయాల్లో మిత్రుడవని నీతో పరిహాసాలాడాను. నన్ను క్షమించు. నీవు లోకాలకు పితవనీ, జగత్తుకు పూజ్యుడవనీ తెలుసుకోలేకపోయాను." అంటూ శ్రీకృష్ణుని అర్జునుడు వేడుకుంటాడు. భాగవతంలోని కృష్ణ కుచేలుర గాథ ఆబాల్య స్నేహ తత్వానికి కలిమిలేములు అభ్యంతరాలు కావనీ అంతరంగంలోని ప్రేమాభిమానాలే స్నేహ చిహ్నాలనీ రుజువు చేస్తుంది.

పంచతంత్రం కూడా మిత్రులను గురించీ, ఏ సమయాల్లో ఎవరితో ఎలా మైత్రిని సాధించేదీ తెలియ జేస్తుంది. మనిషిలో జ్ఞానోదయం కలగటానికి సజ్జన సాంగత్యం కూడా ఒక సాధనం అంటుంది పంచతంత్రం.

పూవులతోగల దారమునకూ పరిమళములు అబ్బినట్లుగా సుజనుల సాంగత్యంవల్ల పామరుడు కూడా పండితుడు కాగలుగుతాడు. నైతిక సూత్రాల్లో సత్సంగానికి ఎంతో ప్రాధాన్యత వుంది "దుస్సంగః సర్వదైవ త్యాజ్యః". దుష్ట సాంగత్యం ఎల్లవేళలా విసర్జించ తగింది అనేది నారదీయ భక్తి సూత్రాల్లో ఒకటి. కపిలుడు తల్లియైన దేవహూతికి జ్ఞానోపదేశం చేసినప్పుడూ, శ్రీరాముడు విభీషణునకు ధర్మ ప్రబోధం చేసినప్పుడూ మంచివారి సహవాసంలోని విలువలు కీర్తించబడ్డాయి. బుద్ధదేవుడు ధమ్మపథ సూత్రాలోనూ ఇలా ఉపదేశిస్తాడు. జీవిత పథంలో ముందుకు సాగిపోయే యాత్రికుడా! నీ కంటె వివేకి, కనీసం నీ వంటి వాడూ నీకు తోడుగా లభించకపోవచ్చు గాక. ఒంటరిగానే నిర్భయంగా పయనించు. కానీ మూర్ఖునితోటి సహవాసం చేయకు." దుర్జనుల స్నేహం విడనాడు. సజ్జనులతో స్నేహం చేయి, అనేది బుద్ధ వచనం. "నీ విరోధులు నిన్ను ద్వేషించెదరు గాక. నీ విరోధులను మాత్రము నీవు ద్వేషించకు. నీ తోటివారిని నీవలెనే ప్రేమించు" అనేది క్రీస్తువాణి.

మత గ్రంథాల్లో

ఇలాటి ప్రామాణిక వచనాలు అన్ని మత గ్రంథాల్లోనూ మనకు లభిస్తాయి. "సత్సంగత్వే నిస్సంగత్వం. నిస్సంగత్వే నిర్మోహత్వం, నిర్మోహత్వే నిశ్చల తత్వం. నిశ్చలతత్వే జీవన్ముక్తిః" అని శ్రీ శంకర భగవత్పాదుల వచనం. అలాటి సజ్జనులను నడయాడే తీర్థములుగా పుణ్య క్షేత్రములుగా పూజిస్తారు. వారిని రూపు దాల్చిన ధర్మ దేవతలుగా స్తుతిస్తారు. తమ కార్యములను పరిత్యజించియూ పరహితార్థ ప్రాపకులైన సజ్జనులమైత్రి వల్ల జీవితానికి తరుణోపాయం లభిస్తుందని విజ్ఞులు భావిస్తారు.

ఎంతైనా కష్టపడి ఎన్నెన్ని సంపదలనైనా సాధించవచ్చును గాని, నిస్వార్థ మైత్రిగల మిత్రుని పొందగలగటం దుర్లభం. అలాటి మిత్రులు లేకపోవటంకూడా దరిద్ర లక్షణాల్లో ఒకటిగా చెప్తారు. నష్టాలను ఏడువిధాలుగా నీతిజ్ఞులు వ్రాశారు. ఇల్లు కాలిపోవటం, భార్య మరణించటం, పశువులు కోల్పోవటం, మిత్రులు నశించటం, కొడుకులు చెడిపోవటం, ధనము కోల్పోవటం, ధాన్యము కోల్పోవటం. క్రొత్త స్నేహితుని వయస్యుడని, ఆంతరంగిక మిత్రుని ఆప్తుడని, అంతరంగుడని, హితవుచెప్పే మిత్రుని హితుడని, హితవుడనీ, క్షముడని వివరిస్తారు. మిత్రులు రెండు రకాలుగా వుంటారు. తాత్కాలిక మిత్రులు, ఆజన్మాంత మిత్రులు. 'నష్టాశ్వ దగ్ధ రథన్యాయము' తాత్కాలిక మిత్రత్వానికి ఒక ఉదాహరణగా చెప్తారు. అంటే ఒకనికి యుద్ధంలో తన గుర్రం చనిపోయింది. ఒకనికి రథం కాలిపోయింది. ఉభయులు కలిసి ఒకరి రథాన్ని ఒకరి గుర్రాన్ని జోడించి రథికులౌతారు. ఇది తాత్కాలికమైన అవసరంవల్ల నెరవేరే మిత్రత్వం. కష్టాల్లో ఇలా పరస్పర సహాయాలు జరుగుతూ వుంటాయి.

ఆరు నెలలు సహవాసంచేస్తే వారు వీరవుతారు, వీరు వారవుతారు అనటంలో సందేహంలేదు. తన స్నేహితుని సద్గుణాలనో, దుర్గుణాలనో తనవిగా స్వీకరించేవరకూ మనిషికి తృప్తికలగదు. మానవ ప్రకృతి అలాటిది. ఎలాటి వాతావరణంలో ఎలాటి వ్యక్తులతో కలిసి మనిషి జీవిస్తాడో అతనిలో కలిగే మానసికమైన మార్పులూ తదనుగుణంగానే వుంటాయి అందుకే మంచి మనుషుల సహవాసం, మంచి పరిస్థితులూ జీవితాన్ని ఎంతగానో సత్ప్రభావంతో నింపుతాయి అంటారు చదివి సులభంగా నేర్చుకోలేనివి సహృదయుల సాహచర్యంలో సులభంగా నేర్చుకోవచ్చు.

స్నేహంకూడా ఒకవిధమైన ఆరాధన. తనలో లేని వుత్తమ లక్షణాలను, విశిష్టతను తన స్నేహితునిలో చూసి ఆ ఉత్తమత్వాన్ని, విశిష్టతను మనిషి అభినందిస్తూ, ఆరాధిస్తూ వుంటారు. ప్రతి మనిషిలోనూ సద్గుణాలూ, దుర్గుణాలూ రెండూ వుంటాయి. బలహీనతలు లేనిమనిషి వుండడు కనుక, స్నేహితునిలోని బలహీ

నతలను తెలిసీ, సద్గుణాలను తెలిసీ, సద్గుణాలనే ఎంచుతూ సద్గుణాలనే పెంపొందించే స్నేహం గొప్పది. అలాటి స్నేహం సహనానికి మూలం. అది సహకారానికీ, సహజీవనానికీ, క్షమకూ శాంతికీ నిలయం.

భగవంతుని సాక్షాత్కరించుకోవటం కొరకు స్నేహమార్గం కూడా అంగీకరించ బడించే 'పరమాత్ముని కూడా నీ స్నేహితునిగా స్వీకరించు. స్నేహపరవశుడవై మిత్రుని పిలిచినట్లే పరమాత్ముని పిలు. నీకు దైవదర్శనం లభిస్తుంది", అంటుంది భక్తియోగం. తొమ్మిది విధములైన భక్తిమార్గాల్లో స్నేహ మార్గంకూడా ఒకటి. కృష్ణుని అర్జునుడు ఇలాగే ఆరాధించాడు. శ్రీరాముని విభీషణుడూ ఇలాగే భజించాడు. "జీవిత సాగరంలోని కష్ట నష్టాల పెనుతుఫానులనుంచి రక్షించే నావికుడూ, స్నేహితుడూ పరమాత్ముడే" అంటాడుభక్తుడు

మనసే మిత్రుడు

ఎవరి మనస్సు వారికి ఉత్తమోత్తముడైన మిత్రుడు. ఎవరి మనస్సు వారికి శత్రువు కూడాను. నిజమైన మిత్రుడూ, నిజమైన శత్రువూ మనలోనే వున్నారు. "నిన్ను నీవే ఉద్ధరించుకో. నీకునీవే బంధువు నీకునీవే శత్రువు." అని అర్జునునితో గీతలో కృష్ణుడు చెప్పాడు. సన్మార్గంలో నడిపించే మనసే మన మిత్రుడు. దుర్మార్గంలో చరింపజేసే మనస్సే మన అంతశ్శత్రువు. "సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వామాం శాంతి మృచ్ఛతి", అన్నది కృష్ణ సందేశం. సర్వ భూతముల యందూ దాగివున్న ఆత్మమిత్రునిగా నన్ను గుర్తిస్తే నీకు శాంతి లభిస్తుంది అని కృష్ణుడు అర్జునునకు అభయం ఇస్తాడు. పారమార్థిక సాధనలో ఈ సందేశం అమూల్య మయింది.

స్నేహ తత్వాన్నిగూర్చి పాశ్చాత్య సాహిత్యంలోనూ మనకు అనేక అమూల్య భావపరంపరలు లభిస్తాయి. గ్రీకు దేశంలో క్రీస్తుపూర్వం నాల్గవ శతాబ్దంలో ఎపిక్యూరస్ అనే తత్వవేత్త జన్మించాడు. అందరినీ ప్రేమిస్తూ, అందరితోనూ ఒక స్నేహితుడుగా ఆయన జీవించాడు. "తినేది రొట్టెముక్క అయినా, త్రాగేది నీరే అయినా నలుగురితో కలసి అనుభవించు. మనం ఏమి తింటున్నామో ముఖ్యంకాదు. ఎవరితో కలసి తింటున్నామో అది ముఖ్యం", అన్నాడు ఎపిక్యూరస్. "సహృదయుడవై సాటి వారితో సహచరిస్తూ బ్రతుకు. అస్థిరమైన ఈ జీవితం నీకో దివ్యమైన వరం అవుతుంది." అంటాడు ఆయన. అంతిమ ఘడియల్లో ఒక దుష్టవ్యాధికి గురియై బాధపడుతూ ఒక స్నేహితుడికి లేఖవ్రాస్తూ "మధురమైన మన స్నేహ జీవితాన్ని గుర్తు చేసుకుంటూ ఈ మరణ బాధనుకూడా విస్మరించ గలుగుతున్నాను.," అని అన్నాడు. ఎపిక్యూరస్ బోధించినమతం స్నేహమతం.

ఆంగ్లదేశంలో జన్మించిన ఫ్రాంసిస్ బేకన్ కూడా ఒక తత్వవేత్త. "జీవన సౌలభ్యం, హృదయ సౌకుమార్యం అనేవి స్నేహఫలాలు. మన ఆలోచనలు మనకు విస్పష్టంగా స్నేహితులవల్లనే తెలుస్తాయి. ఒంటరిగా ఒకరోజు ధ్యానించే బదులు ఒక్కగంట స్నేహితునితో వైజ్ఞానికంగా సంభాషిస్తేచాలు. జ్ఞానవంతులం అవుతాం" అంటాడు బేకన్.

మనిషికీ మనిషికీ మధ్యగల సంబంధాల విలువలు గుర్తించటంలోనే స్నేహంయొక్క అందంవుంది. నీవూ నేనూ ఒకటే నన్న సహజజ్ఞానం స్నేహ ధర్మానికి సారం. మిత్రులు వహించే మౌనంలో కూడా దివ్యశ్రవ్యంమెల్లగా ధ్వనిస్తుంది. ఈ మౌన సంగీతంలోనే ఇర్వురు మిత్రుల ఆత్మలూ కరిగి ఒకటైపోతాయి. ఇరువురు మిత్రులు గంచోట మూడవ వ్యక్తికూడా వుంటాడట. ఆయనే భగవంతుడు. "స్నేహశీలంలో అనుదినం నేను భగవంతుని దర్శిస్తూ, ఆయన సౌందర్యం చూడగలుగుతున్నాను. స్నేహ మాధురిని ఎంత త్రాగినా తనివి తీరదు," అంటాడు ఎమర్సన్ అనే అమెరికన్ తత్వవేత్త.

సమవర్తి

స్నేహదృష్టి మానవునిలో వికసించిననాడు సృష్టి రహస్యం కూడా అర్థం అవుతుంది. సృష్టిలోని ప్రతి జీవి స్నేహపాత్రం అవుతుంది. వైరుధ్యం ఎక్కడా కనిపించదు. ఆనాడు నిర్వైరిగా మనిషి మారిపోతాడు. అజాత శత్రువుగా కీర్తి గడించుకున్న వారిలో ధర్మరాజు అగ్రగణ్యుడు. క్రీస్తు ఎవ్వరినీ ద్వేషించలేక పోయాడు. ఆయన విరోధులను సైతం స్నేహ కారుణ్య దృష్టితో వీక్షించాడు. లోక కల్యాణంకోసం సిలువమీద ఆత్మ బలిదానంచేశాడు. బుద్ధ దేవుడు క్రూరుడైన అంగుళీమాలుని కూడా స్నేహపూరితంగా ఆహ్వానించాడు. బుద్ధదేవుని ప్రేమమయ. స్నేహమయ వీక్షణంలో మానవులేకాదు. పశు పక్ష్యాదులు కూడా పవిత్రమైనాయి. బాపూజీ, నెహ్రూజీ పసిపిల్లలను కూడా స్నేహపూర్వకంగా దరికిజేర్చి ఆడుకునేవారు.

స్నేహం సమవర్తిత్వానికి మూలం. స్నేహంలో తారతమ్య భేదాలుండవు. అంతా సమానులేనన్న జ్ఞానం ఉదయిస్తుంది.

మానవులేకాదు, దేశాలుకూడా శాంతియుతంగా అభ్యుదయం సాధించటానికి మైత్రిభావం ఎంతో అవసరం. మిగిలిన ప్రపంచం నుంచి వేరై తనకుతానే మనుగడను మానవుడు సాధించలేడు ప్రతి మనిషియొక్క భవిష్యత్తూ, ప్రపంచ మానవానీకపు సమష్టి భవిష్యత్తుపై ఆధారపడి వుంది. ప్రపంచంయొక్క భవితవ్యం, వ్యక్తిగత మానవ జీవితాలపై ఆధారపడి వుంది. మనుష్యుల నడుమ మైత్రీభావం ఈనాడెంత అవసరమో దేశాల మధ్యకూడా అంతే అవసరం. అనేక రంగాల్లో స్పర్ధలూ, ప్రతి స్పర్ధలూ పెంచుకుంటూ స్వప్రయోజనాలకోసం దేశాలు ప్రాకులాడే రోజులకు స్వస్తిచెప్పి, సుహృద్భావంతో శాంతియుత సహజీవనం కొనసాగటంలోనే ప్రపంచ మానవాళియొక్క ఉజ్జ్వల భవితవ్యం వుంది. వ్యక్తుల మధ్యగల వైరంవల్ల కలిగే దుష్ఫలం కొద్దిపాటిదే కావచ్చు. కానీ దేశాల నడుమగల స్నేహ సంబంధాలు తెగిపోయి, వైరం వెర్రితలలు వేస్తే ఈ అణ్వస్త్ర యుగంలో కలిగేఫలితాలు దారుణంగా వుంటాయి. అందువల్ల మానవాళి మనుగడకే ముప్పువాటిల్లే ప్రమాదం కూడా అనివార్యం అవుతుంది. కనుకనే వ్యక్తుల మధ్య స్నేహ సంబంధంవలెనే, దేశాలనడుమకూడా స్నేహపూరిత వాతావరణం నేడెంతో అవసరం

నానాటికీ క్షీణించి పోతూన్న మానవత్వపు విలువలు మరింత తేజోవంతం కావటంలో స్నేహమతం మనకెంతో సహకరించ గలదు.

**

తిరస్కృతి

—వాసిరెడ్డి సీతాదేవి

జరిగిన కథ

సత్యం, సూర్యం అన్నదమ్ములు. సత్యం చిత్రకారుడు. సూర్యం పట్నంలో చదువుకుంటున్నాడు. సరళ చిన్నప్పుడే తల్లి దండ్రులను కోల్పోయి ఆ యింట ఆశ్రయం పొందింది. సరళను సత్యానికి యిచ్చి పెళ్ళి చెయ్యాలని చిన్నప్పటినుంచీ అనుకుంటున్నారు. అయితే సూర్యం నాజూకు చూస్తే సరళకు వ్యామోహం కలిగింది. ఒకసారి సరళ స్నేహితురాలు వసంత వచ్చి పట్టణ విశేషాలు చెప్పడం ప్రారంభించింది.



సరళ వసంత వైపు కళ్లు వెడల్పుచేసుకొని చూసింది. వసంతకూడా కమల కట్టుకున్నలాటి చీరే కట్టుకుంది. రెండు జడలు వేసుకొని రిబ్బన్లు కట్టుకుంది. కాళ్లకు జరీ చెప్పులు కూడా వేసుకుంది నాచీరనూ, జడలనూ, చెప్పుల్నీ చూశావా అని ప్రశ్నిస్తున్నట్లుంది వసంత ప్రతి కదలిక.

"చూశావా సరళా! మా అక్కయ్య నాకోసం ఇవన్నీ తెచ్చింది. రెండు జడలు వేసింది. నువ్వుకూడా వేసుకోరాదూ అక్కయ్య నేర్పిస్తుందిలే. ఆ మర్చిపోయాను. నేనుకూడా అక్కయ్యతో పట్నం వెళ్ళిపోతున్నాను." గడ గడ సుమతీ శతకం పద్యం అప్పజెప్పినట్లు వాగేసింది వసంత.

సరళ నిట్టూర్పు ఎవరూ గమనించలేదు.

"అవును సరళా! వసంతను కూడా తీసుకెళుతున్నాను. మావారు వసంతకుకూడా అక్కడే సంబంధంచూస్తున్నారు. ఆ అబ్బాయి మేనమామ డాక్టరంట"

"మా చిన్నబావకూడా డాక్టరయిపోతాడు." అంది సరళ.

"సూర్యం డాక్టరయితే నీకేం ఒరుగుతుంది. సూర్యం చేసుకోపోయే అమ్మాయి అదృష్టం అదంతా. వస్తాను సరళా! అమ్మ పిలుస్తుందట."

కమల మాటలకు వళ్లు మండిపోయిన సరళ, ఊఁ అని మాత్రం అనగలిగింది.

"రేపు ఒకసారి మా ఇంటికి రాకూడదూ! నా చీరలన్నీ చూపిస్తాను." అంటూ బయలు దేరింది కమల.

సరళ కోపం చిన్న బావ వైపు తిరిగింది. పట్నంనుంచి వచ్చాడు. కనీసం తనకోసం రిబ్బన్లూ, చెప్పులన్నా కొనుక్కురాకూడదేం! అన్నీ దొంగమాటలే. నాటకం. దుఃఖాన్ని దిగమింగుకుంది సరళ.

"సూర్యం డాక్టరయితే నీకేం ఒరుగుతుంది. సూర్యం చేసుకోపోయే అమ్మాయి అదృష్టం అదంతా."

"నువ్వు చేసుకొనేది మీ పెద్ద బావనేగా!"

కమల మాటలు సరళ చెవుల్లో మాటికి మాటికి వినిపించ సాగాయి.

దిగాలుపడి కూర్చున్న సరళను చూసి శాంతమ్మ అంది. "ఏమిటే అలాకూర్చున్నావు? కమల వెళ్ళి పోయిందా! ఆ వేషం ఏమిటి? పిచ్చికగూడులా ఆ ముడీ, వళ్ళు కనిపించే ఆచీరలూ."

సరళ మాట్లాడ లేదు. "పొద్దుకూడా వాటారి పోతుంది. ఇంకా పెద్దవాడు భోజనానికే రాలేదు. ఎక్కడకు పోయాడో ఏమిటో" గొణుక్కుంటూ గొడ్లపాక వైపు వెళ్ళింది శాంతమ్మ.

సరళ యాంత్రికంగా లేచి సూర్యం ఉన్న గదిలోకి వచ్చింది. సూర్యం పుస్తకం చదవటంలో ఈ ప్రపంచాన్నే మర్చి ఉన్నాడు. సరళ సూర్యాన్ని చూస్తూ గడప పట్టుకొని నిల్చుని పోయింది.

"ఏం సరళా! ఎందుకలా నిల్చున్నావు?" ప్రశ్నించాడు అప్పుడే బయటనుంచి వచ్చిన సత్యం.

సరళ తలెత్తి చూసింది. సత్యం ఎందుకో చాలా సంతోషంగా ఉన్నట్లు కనిపించాడు.

సరళ "ఏంలేదు" అంటూ ముక్తసరిగా జవాబిచ్చింది

అన్న గొంతు విన్న సూర్యం, పుస్తకం వదిలి లేచి బయటకు వచ్చాడు.

"ఏరా తమ్ముడూ! ఇంకా ఎన్ని రోజులకు నువ్వు బయలుదేరాలి?" ప్రశ్నించాడు సత్యం.

"నాలుగురోజుల్లో వెళ్ళాలి ఇంతవరకు నాన్నగారు... " నీరసంగా ఉంది సూర్యం స్వరం.

డబ్బు గురించి నువ్వేం బెంగపెట్టుకోకు. ప్రయాణానికి కావల్సిన ప్రయత్నాలు చేసుకో. అన్ని ఏర్పాట్లూ అయిపోయాయి."

సూర్యం ఆశ్చర్యంగా అన్న ముఖంలోకి చూశాడు.

"రామయ్యగారి ఇంటినుంచే వస్తున్నాను. మన తూరుపొలం తాకట్టు పెట్టుకొని నాలుగు వేలు ఇచ్చాడు. ఇప్పుడే రాతకోతలన్నీ అయిపోయాయి' ఉత్సాహంగా అన్నాడు సత్యం.

సూర్యం హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది.

'నాన్నకు తెలుసా అన్నయ్యా!'' అన్నాడు ఏదో సందేహం పీడిస్తున్నవాడిలా.

నాన్నగారికి తెలియకుండా నేను ఏపనీ చెయ్యను. ఆ బెంగ నీకేం అక్కరలేదు"

"పొలం తాకట్టు పెట్టటానికి నాన్న ఒప్పుకున్నారా?'' ఆశ్చర్యంగా ప్రశ్నించాడు సూర్యం.

"పోనిద్దూ పొలానికేం? నువ్వు డాక్టరయాక ఇలాంటి ఎకరాలు ఎన్నయినా కొనవచ్చు'' గర్వంగా అన్నాడు సత్యం.

"అన్నయ్యా!'' అని మాత్రం అనగలిగాడు సూర్యం.

"నా నాయనే, డాక్టరవుతావు'' మురిపెంగా చూసింది సూర్యంవైపు శాంతమ్మ.

"పదరా సత్యం. పొద్దుననగా భోజనం చేశావు. పదమ్మ సరళా, పెద్ద బావకు వడ్డించు" అంది శాంతమ్మ.

"బట్టలు మార్చుకు వస్తాను" అంటూ తన గదివైపుకు వెళ్ళుతున్న సత్యంవైపు చూస్తూ "నువ్వెంత మంచివాడివి బావా!'' అనుకుంది సరళ.

3

రాత్రి పన్నెండు కొట్టింది. అయినా సరళకు నిద్ర పట్టటంలేదు. పక్కమీద అశాంతిగా పొర్లుతుంది. కమల మాటలు విన్నప్పటినుంచీ, ఆమెను చూసినప్పటి నుంచి సరళలో అశాంతి పొడచూపింది. ఇంత వరకు సరళ తను పెద్ద బావను చేసుకోవాలా, చిన్న బావను చేసుకోవాలా అనే విషయాన్ని గురించి ఆలోచించ లేదు. చిన్నప్పటి నుంచి సరళనూ సత్యాన్ని అందరూ భార్యాభర్త లనేవారు. సరళలో వయస్సుతో పాటు ఆ భావంకూడా పెరిగింది. సత్యం అంటే సరళకు అమితమైన గౌరవం. కాని ఈసారి సూర్యం పట్నంనుంచి వచ్చినప్పటి నుంచీ సూర్యం అంటే ఆమెలో ఓ విధమైన వ్యామోహం పెరగసాగింది. సూర్యం సిగరెట్లు కాలుస్తాడు. ఫాంట్లు వేసుకుంటాడు. రంగురంగుల బొమ్మల బుష్‌కోట్లు కూడా వేసుకుంటాడు. సరదాగా మాట్లాడతాడు. నవ్వుతాడు, నవ్విస్తాడు, ఏడిపిస్తాడు, ఉడికిస్తాడు, ఉడుక్కుంటాడు. ఇవన్నీ కూడా సరళను సూర్యం వైపుకు లాక్కున్నాయి. కాని ఆమె ఆ విషయం గురించి ఆలోచించలేదు. ఈ నాడు కమల మాటలు ఆమెలో ఆలోచనలను రేకెత్తించాయి.

చిన్నబావ డాక్టరవుతాడు. పట్నంలో కాపరం పెడతాడు. కారూ, పెద్దబంగళా, ఆ బంగళా ముందు పెద్దపూల తోటా, ఇంట్లో వంటమనిషీ, వాకిటిముందు జవానూ-ఇవన్నీ ఉంటాయి. రోజూ భార్యాభర్తలు సినిమాలకు వెళతారు. షికార్లకు వెళతారు. వాళ్ళ పిల్లల్ని పెంచటానికి దాయిలు ఉంటారు. చిన్నబావను చేసుకొనే అమ్మాయి ఎంత అదృష్టవంతురాలో! సరళకు ఏదో అంతరాంతరాల్లో కదిలినట్లయింది, లేదు చిన్నబావ పక్కన ఉండేది తనే తను చిన్నబావనే చేసుకుంటుంది. చిన్నబావను చేసుకొని తను పట్నం వెళ్ళిపోతుంది. వెధవ పల్లెటూరు! జీవితమంతా ఇక్కడే ఎవరు పడిఉండగలరు? కమల్లా ఎంచక్కా జుట్టు కట్టుకోవచ్చు! మీగడ తరగలాటి మెత్తటి చీరలు కట్టుకోవచ్చును. తన అందాన్ని చూచి చిన్నబావ ఎంత మురిసిపోతాడో!

మరి పెద్ద బావ? సరళకు ఎక్కడలేని దిగులూ పుట్టుకొచ్చింది. పెద్ద బావ ఎంతో మంచివాడు. ఆ ఒక్క లోపం లేకపోతే? పెద్ద బావ చిన్న బావకంటే కూడా ఎంత అందంగా ఉంటాడు! పెద్ద బావకు తనంటే ప్రాణం. చిన్న బావకు ఎంత మందయినా పెద్ద పెద్ద కట్నాలు ఇచ్చి పిల్లల్ని ఇస్తామంటారు రేపు డాక్టరయితే. కాని పెద్ద బావకు? వివాహం అయినా, ఆ అమ్మాయి బావను సరిగా అర్థంచేసుకోగలదా? తనలా గౌరవించి ఏ సమయానికి ఏం కావాలో చూస్తూ కనిపెట్టుకొని వుండగలదా? పెద్దబావ కూడా బాగానే చదువుకున్నాడు. పట్నంలో ఏ చిన్న ఉద్యోగమైనా చూసుకో కూడదూ. ఈ పల్లెటూర్లో బొమ్మలేసుకుంటూ కూర్చోకపోతే? -సరళకు సత్యంబావ మీద ఎక్కడలేని కోపం వచ్చింది.

తనకు ఇక్కడే బాగుంటుందట? బాగుంటే ఉండమను. ఇక్కడే కూర్చోమను బొమ్మలేసుకుంటూ. తను మాత్రం ఈ పల్లెటూర్లో పడి వుండలేదు తను తప్పక చిన్న బావనే చేసుకుంటుంది! సూర్యం బావకు తనంటే చాలా ఇష్టం. తనను ప్రేమిస్తున్నాడేమో? లేకపోతే తను పెద్దబావతో మాట్లాడితే ఎందుకు ముఖంముడుచుకుంటాడు? పెద్దబావను పొగిడేస్తుంటే ఏడుపు ముఖం పెట్టేస్తాడు. కాని పెద్ద బావకు అదేం పట్టదు. తను సూర్యం బావతో అంతగా నవ్వుతూ చెబుతూవున్నా పట్టించుకోడు. అంటే తనంటే మామూలు ఇష్టమేకాని ప్రేమ లేదన్నమాట! తను చిన్న బావను చేసుకుంటే తన తప్పేముంది ఇందులో! తను తప్పక చిన్న బావనే చేసుకుంటుంది.

అత్తయ్యా, మామయ్యా ఒప్పుకుంటారా? -సరళకు దుఃఖం వచ్చినంత పనయింది. ఒప్పుకోక ఏం చేస్తారేం? తనకు ఇష్టం లేదని స్పష్టంగా చెప్పేస్తే సరి. పెద్ద బావతో ఒక్క మాట చెబితే చాలు. తనే అత్తయ్యనూ, మామయ్యనూ ఒప్పిస్తాడు. పెద్ద బావ చాలా మంచివాడు. అంత మంచి బావనేనా తను మోసం చెయ్యబోతుంది? తలను దిండు మీద అటూ ఇటూ అశాంతిగా తిప్పింది.

అమ్మే బ్రతికిఉంటే తనను చస్తే అవిటివాడికి ఇవ్వటానికి ఒప్పుకోదు. తల్లి దండ్రిలేని పిల్లను పెంచారు అత్తయ్యా మామయ్యా నిజమే! కాని అందులో ఎంత స్వార్థంలేదు? తన్ను పెంచి అవిటివాడయిన కొడుక్కు కట్టిపెట్టాలనేగా వాళ్ల ఉద్దేశం? మరి అది మోసంగాదూ?

ఛ! తనేమిటి ఇలా ఆలోచిస్తుంది. కన్న తల్లిదండ్రులను మరిపింపంచేసి అతి గారాబంగా పెంచిన అత్తయ్యను గురించీ, మామయ్యను గురించీనా తను ఇంతదారుణంగా ఆలోచిస్తుంది!

పెద్దబావమీద ఉన్న ప్రేమా, చిన్న బావమీద ఏర్పడిన వ్యామోహం మధ్య తనకు ఎవరంటే ఇష్టమో, తనకు ఎవరు కావాలో తేల్చుకోలేక సరళ మనస్సు గజిబిజిగా అయింది. ఆరాత్రంతా కలత నిద్రలోనే గడిపింది. సరళ కలత నిద్రలోంచి కలల్లోకి జారిపోయింది.

వెన్నెలరాత్రి. ఆకాశంలో చంద్రుడు ఒంటరిగా చుక్కలకు దూరంగా, దిగులుగా, కనిపిస్తున్నాడు. తామర పూలతో సరస్సు వంటినిండా ధగ ధగలాడే రాళ్ళనగలతో అలంకరించుకున్న అమ్మాయిలా వయ్యారంగా మెరిసిపోతుంది. సరస్సు మధ్యన బోటు. బోటులో సరళ మరో అబ్బాయితో కూర్చొని వుంది. ఆ అబ్బాయి ఎవరోగాదు సత్యం బావ ఒక్కచేత్తో తెడ్డువేస్తూ పడవ నడుపుతున్నాడు. సరళ తన్మయత్వంతో బావనే చూస్తూ కూర్చుంది. చూస్తుండగానే ఒక్కసారిగా సత్యం నీళ్ళలోకి పడిపోయాడు. సత్యం స్థలంలో సూర్యం కూర్చొని చిరునవ్వుతో సరళనుచూస్తూ పడవ నడపసాగాడు. సరళ కెవ్వున కేక వేసింది.''

''సరళా! సరళా! ఏమిటి అలా నిద్రలో ఏడుస్తున్నావు?'' అని ఎవరో తనను ఊపడంతో సరళ ఉలికిపడి లేచి మంచం మీద కూర్చుంది. ఎదురుగా సత్యం నిలబడివున్నాడు

''ఏమిటి సరళా! ఏమయినా పీడకల వచ్చిందా?'' మృదువుగా ప్రశ్నించాడు సత్యం.

సరళ ఒక్కసారిగా 'బావా'అంటూ సత్యాన్ని చుట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. సత్యం గాబరాపడ్డాడు ఏనాడూ సరళ అలా చెయ్యలేదు. సరళ తనకాబోయే భార్యఅని తెలిసివుండే సత్యం ఏనాడూ ఆవేశంగా సరళను దగ్గరకు తీసుకోలేదు.

సత్యం సరళను గోముగా మంచంమీద కూర్చోబెడుతూ ''పిచ్చిపిల్లా! కలకే ఇంత బెదిరి పోతున్నావేం? పడుకో.'' అన్నాడు సత్యం.

''నాకు భయంవేస్తుంది.'' అంది సరళ

నువ్వు నిద్రపోయిందాకా నేను ఇక్కడే వుంటాను పడుకో'' అన్నాడు సత్యం.

(సశేషం)

దృష్టి వున్నవాళ్లకు అంధురాలనయిన నా సలహా ఒక్కటి. రేపు నీకు అంధకారం అలుముకుంటుందని అనుకుని నీనేత్రాలను ఈ రోజే విప్పారచేయి. రేపు చెవిటి వారమవుతామని కోయిల గానాన్ని వాయిద్యాల నాదాన్ని విని ఆనందించు. రేపు నీ స్పర్శజ్ఞానం లోపిస్తుందని ఈ రోజే నీవు ముట్టుకోదలచిన ప్రతి వస్తువునూ తాకి చూడు. పూవుల పరిమళాన్ని ఆస్వాదించు.


హెలెన్ కెల్లర్

చైతన్యమూర్తులు

శ్రీ కళా వెంకట్రావు

మన రాష్ట్రంలో కాంగ్రెసు నిర్మాతలలో శ్రీకళా వెంకట్రావు ఒకరు. పంతొమ్మిది వందల ఇరవై లలో జాతిపిత పిలుపు విని విద్యాభ్యాసాన్ని విడిచి ఆయన కాంగ్రెసు ఉద్యమంలో ప్రవేశించారు. ఆతర్వాత రెండుదశాబ్దాలకు పైగా కాంగ్రెసు లోనే వుండి పనిచేశారు. ప్రకాశంగారి నాయకత్వంలోను, పట్టాభి సీతారామయ్యగారి నాయకత్వంలోను ఆయనచరిత్రను సృష్టించారు.

1929_1946ల మధ్య ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘం ప్రధాన కార్యదర్శులలో ఒకరుగ ఉండి, దక్షిణాదిలో కాంగ్రెసును బలమైన పార్టీగా నిర్మించారు. 1942లో జరిగిన పోరాటంలో ఆంధ్ర దేశంలో "క్విట్ ఇండియా" మహోద్యమాన్ని ప్రజ్వలింపజేసి సైనికదళాలను సహితం చకితులనుగావించిన ఆయన అజ్ఞాతవాస కార్యక్రమ పథకం బ్రిటిష్ పార్లమెంటులో ప్రముఖంగా ప్రస్తావించ బడింది. భూసమస్యలలో శ్రీ కళాకు ప్రావీణ్యతఉంది.



భూసంస్కరణలు ప్రవేశపెట్టాలని అభిలషించారు. సమిష్టి మద్రాసు రాష్ట్రంలో రెవిన్యూమంత్రిగా ఉన్నప్పుడు, యుగాల తరబడి పాతుకు పోయిన స్వారపరశరులను రూపుమాపే ఉద్దేశంతో చరిత్రాత్మక మైన, చిరస్మరణీయమైన జమీందారీ రద్దు శాసనాన్ని ఆయన ప్రవేశ పెట్టారు. ఈ చట్టం ఫలితంగా అఖిల భారతదేశంలో ఒకకొత్త దృక్పథం, ఉద్వేగం రూపందాల్చింది. భారతదేశంలో ప్రజల, ప్రముఖ నాయకుల మన్ననలు లభించాయి. ఇతర రాష్ట్రాలలో కూడ భూసంస్కరణలను ప్రవేశపెట్టడానికి యిది మార్గదర్శకత్వం వహించింది.

సమిష్టి మద్రాసు రాష్ట్రంలో కుమారస్వామిరాజా, రామస్వామిరెడ్డియార్ మంత్రి వర్గాలలోను, ఆంధ్రరాష్ట్రంలో గోపాలరెడ్డి, సంజీవరెడ్డి మంత్రి వర్గాలలోను కళా వెంకట్రావుగారు మంత్రిగా వ్యవహరించారు.

గోపాలరెడ్డి మంత్రివర్గంలో ప్రజారోగ్యశాఖ మంత్రిగాను సంజీవరెడ్డి మంత్రివర్గంలో రెవిన్యూశాఖ మంత్రిగాను వ్యవహరించి తన సహచరులకు ఉత్తేజాన్ని కలిగించి, అండగా నిలిచారు.

రెండు దశాబ్దాల అనుభవంతో ఆయన తమ జీవితంలో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ప్రసిద్ధి గాంచారు. ఆయన విషయ పరిజ్ఞానం, రాజకీయ చతురత, లక్ష్యశుద్ధి అధికార పార్టీ సభ్యులకు అమూల్యమైన పెట్టనికోటగా నిలిచాయి. శాసన సభ సమావేశాలలో ఆయన తరచుగా ప్రదర్శించే చతురత, చమత్కృతి, చిరుహాస్యం ఆయన సమకాలీనులకు చిరస్మరణీయమైనవి. శ్రీ కళా తీవ్రస్వభావులే అయినా ఉద్రేకాలు, ఉద్వేగాలను వెనకకునెట్టి దూరదృష్టితో ఆలోచించేతత్వం గలవారు. దున్నేవానిదే భూమి అనే సూత్రాన్ని త్రికరణ శుద్ధిగానమ్మి, సహకార సేద్యంపై నాగపూర్ తీర్మానాన్ని నిస్సంకోచంగా ఆమోదించారు. రైతుల నేటి దైన్యస్థితికి పరిష్కార మార్గం సహకార సేద్యవిధానమేనని ఆయన దృఢ అభిప్రాయం

నిరుపమాన సేవానిరతితో దేశసేవకు తమ జీవితాన్ని అంకితంచేశారు ఆయన. తమ త్యాగనిరతితో ప్రజాసంక్షేమానికి అహరహం కృషిచేసి ప్రజలహృదయాలలో శాశ్వతస్థానం ఆక్రమించు కున్నారు.

(1959 మార్చి 28 న మరణించారు.)

మహర్షి బులుసు సాంబమూర్తి

(జననం : 4 మార్చి 1886)

1923లో శీతకాలంలో కాకినాడలో కాంగ్రెసు మహాసభలు జరిగిన సందర్భంలో గాంధీనగర్ వెలిసింది. కాంగ్రెసు చరిత్ర రచయిత డా. భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి మాటలలో "గతంలో కనీవినీ ఎరుగని రీతిలో కాకినాడ కాంగ్రెసు మహాసభలు మహావైభవంగా జరిగినాయి. రోడ్లనిర్మాణం, శాశ్వతంగా కాంగ్రెసు అధీనంలో ఉండే గుడారాలు, ఏర్పాట్లలో ప్రతిచిన్న విషయాన్ని ఎంతో శ్రద్ధాసక్తులతో నిర్వహించడం, అధ్యక్షుడు, యితర నాయకుల నివాసానికి జరిపిన ఏర్పాట్లు శ్లాఘనీయమైనవి."

ఎ.ఐ.సి.సి. ఆహ్వాన సంఘం కార్యదర్శిగా వ్యవహరించిన బులుసు సాంబమూర్తి గారి నిర్విరామ కార్యదీక్ష, సంస్థాగత దక్షతల ఫలితంగానే యీ సభలు విజయవంతం అయినాయి. తన ఏకైక పుత్రుడు మరణించిన మనోవ్యధనుకూడా లెక్కచేయకుండా ఎంతో గుండెనిబ్బరంతో యీ కార్యభారాన్ని సమర్థతతో నిర్వహించారు ఈ శోకతప్తనాయకుని గుండెనిబ్బరాన్ని సరోజినీనాయుడు ఎంతగానో శ్లాఘించారు.

1929లో సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో ప్రముఖ పాత్ర వహించారు. శాసనోల్లంఘన సందర్భంగా కాకినాడలో జరిగిన చరిత్రాత్మకమైన సభలో ప్రసంగిస్తూ, పోలీసులు జరిపిన అమానుషమైన లాఠీచార్జీ ఫలితంగా స్పృహ కోల్పోయారు.

1919లోనే లక్షలార్జించే న్యాయవాదవృత్తిని త్యజించి బుద్ధిపూర్వకంగానే దారిద్ర్యాన్నీ, దేశసేవనూ వరించారు. ఆడంబరాలన్నింటిని వదలి నిజమైన గాంధీమార్గాన్ని అనుసరిస్తూ ధోవతి, అంగవస్త్రంతో ఆయన గడిపారు.

1937లో ప్రప్రథమంగా కాంగ్రెసు మంత్రివర్గాలు ఏర్పడినప్పుడు సమిష్టి మద్రాసు రాష్ట్రం శాసనసభ అధ్యక్షులుగా ఆయన ఎన్నికైనారు.

నిస్వార్థ సేవాతత్పరత, త్యాగనిరతి, నిర్భయత్వం కారణంగా ఆయన మహర్షిగా ప్రఖ్యాతి గాంచారు.

సాంబమూర్తిగారు, స్వాతంత్ర్య సముపార్జనకు అకుంఠిత దీక్షతో అహరహం పోరాడారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు తీవ్రంగా కృషిచేశారు. విశాలాంధ్ర నిర్మాణానికి కలలు కన్నారు. ఈ త్రివిధ లక్ష్యాలు నెరవేరడాన్ని కనులారా గాంచే అదృష్టం ఆయనకు దక్కింది.

శ్రీ దామెర్ల రామారావు

(జననం : 1897 మార్చి 8)

'శ్రీ వాణీ గిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాంగేషుయే'

మహాభారత రచనను ప్రారంభిస్తూ సుమారు వెయ్యేండ్ల క్రిందట నన్నయ తాటియాకుల మీద యీ శ్లోకాన్ని ఏనాడైతే వ్రాశాడో ఆనాటి నుండీ రాజమహేంద్రవరం సరస్వతీ నిలయమై విలసిల్లుతూ వస్తున్నది. నన్నయ మొదలుకొని శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి వరకు అనేకమంది సాహితీ దిగ్గంతులు ప్రభవించి రాజమహేంద్రవర పురాన్ని జగజ్జేగీయమానంగా వెలుగొందించి, ఆ కాంతితో ఆంధ్రదేశాన్నే ప్రకాశింప జేశారు. బ్రిటిష్ వారి పరిపాలనా కాలంలో రాజమహేంద్ర వర పట్టణానికి ఆంగ్ల విద్యా గంధ వాయువులు, సంఘ సంస్కరణ, జాతీయతా భావకిరణములు ప్రసరించాయి.

ఇట్టి రాజమహేంద్రవర పురము ఆంధ్ర సాహిత్యపు తొలి వెలుగులకు జన్మ కారకమైంది. ఆంధ్ర చిత్రకళ పునరుద్ధరణ వీచికలకు తొలి విహార స్థలి అయింది. ఈ ఆంధ్ర చిత్రకళ పునరుద్ధరణ కాలంలో గోదావరీ తీరాన రాజమహేంద్రవరంలో ప్రభవించి గుబాళించిన తొలి సురభిళసుమము–దామెర్ల రామారావు.

రామారావుకు చిన్నతనం నుంచీ పాఠశాలకు వెళ్ళి క్లాసు పుస్తకాల్ని వల్లించడమంటే యిష్టముండేదికాదు. మనసు రంగుల వెంట పరుగెత్తేది. వ్రేళ్ళు కుంచెలనూ, పెన్సిళ్ళనూ వెతికేవి. ఆరోజుల్లో ఎ. ఎస్. రాం అనే చిత్రకారుడు నాటకాలకి సీనరీలు వేస్తుంటే వెళ్ళి ఆసక్తిగా చూస్తుండేవాడు. ప్రకృతిని అనుకరించి బొమ్మలు గీస్తుండేవాడు.

అప్పట్లో ఆస్వాల్డ్ జేమ్స్ కూల్డ్రే అనే ఆంగ్లేయుడు గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీకి ప్రిన్స్‌పాల్‌గా రాజమండ్రి వచ్చాడు. రామారావు అన్న వెంకట్రావుగారు ఆయనవద్ద చదువు కొంటుండేవారు. కూల్డ్రే స్వతహాగా చక్కటి చిత్రకారుడు. వెంకట్రావుగారిద్వారా పరిచయమైన రామారావును, కూల్డ్రే అభినందించి అతనిని ప్రోత్సహించాడు.

1916లో రామారావు బొంబాయిలోని జె. జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు చిత్రకళాధ్యయనానికై వెళ్ళారు. అక్కడి అధికారులు రామారావు చిత్రకళా ప్రతిభకు ఆశ్చర్యపడి నేరుగా అతనిని మూడో సంవత్సరం కోర్సులో చేర్చుకున్నారు. విద్యార్థి దశలో రామారావు ఎన్నో బహుమతులను సంపాదించుకున్నారు. అందరికన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకుని 'మేయో' పతకాన్నికూడా గెలుచుకున్నారు. చిత్రకళాభ్యాసం పూర్తయిన తర్వాత అక్కడే అధ్యాపకుడిగా ప్రవేశించారు.

జె. జె. స్కూలులో వుంటున్నప్పుడే ఒక ఏడాది వేసవి సెలవలలో రామారావు కూల్డ్రేవెంట అజంతా, ఎల్లోరాలను సందర్శించారు. అజంతా చిత్రాలలోని రేఖల సొంపు, ఆకృతుల లావణ్యము, అపూర్వమైన అలంకార శోభ రామారావును ముగ్ధుణ్ణి చేశాయి. రామారావు దేశంలోని అనేక కళా ప్రాంగణాలను దర్శించారు. వాటి నుండి కొత్త కొత్త విశేషాల నెన్నిటినో నేర్చుకున్నారు.


1920 లో స్వస్థలం రాజమండ్రికి తిరిగి వచ్చారు. రామారావు తన యింటినే ఓ కళా మంటపం చెయ్యాలనుకున్నారు. వివాహం జరిగింది. భార్య సత్యవేణికూడా ఆయనవల్ల ప్రతిభావితయై చక్కటి చిత్రకారిణిగా రూపొందింది. ఆదర్శ వంతమైన దంపతులు వారు.

కలకత్తాలో 1921 లో రామారావు తన చిత్రాలను ప్రదర్శించారు. అప్పటి వైస్రాయ్ అయిన లార్డ్ రీడింగ్ 'గోదావరి లోయ' అన్న వీరి చిత్రాన్ని కొనుక్కున్నారు. రామారావు అవనీంద్రనాథ్ ఠాగూరు, నందలాల్ బోసులను కలుసుకుని బెంగాలు చిత్రకళను నిశితంగా పరిశీలించారు.

1922లో భారతీయ చిత్రకళ ఆంధ్ర సంఘాన్ని ఒకదానిని ఆయన నెలకొల్పారు. ఆంధ్రదేశంలో అఖిల భారత చిత్రకళా ప్రదర్శనను తొలిసారి ఏర్పాటు చేశారు. 1924 లో లండన్‌లోని బ్రిటిష్ ఎంపైర్ ఎగ్జిబిషన్‌లో రామారావు చిత్రాలు ప్రదర్శితమయ్యాయి. ఆ తర్వాత అక్కడి ప్రధాన నగరాలలో సంవత్సరంపాటు ప్రదర్శింప బడ్డాయి.

కళాకారులు భగవంతునికి చేరువలో వుంటారని అంటూ వుంటారు. అంతేకాదు, భగవంతుడు మంచివారిని ఎప్పుడూ త్వరగానే తీసుకు పోతాడని కూడా చెప్తారు. రామారావు తన 28 వ యేట 1925 ఫిబ్రవరి 6వ తేదీన మరణించారు. విషాద మేమంటే అపూర్వ లావణ్య స్నిగ్ధ సౌందర్యాం బొ్రవుంనదగిన రూపాలను సృష్టించిన యీ యువ చిత్రకారుడు, ఆంధ్రదేశానికి గర్వకారణ మనదగిన యీ ప్రతిభావంతుడైన చిత్రకారుడు మశూచికారణంగా మరణించ వలసి వచ్చింది।

ఇద్దరు సౌందర్య స్రష్టలు—ఒకరు ఆంగ్లకవి కీట్సు, మరొకరు ఆంధ్ర చిత్రకారుడు రామారావు చాలా చిన్న వయస్సునే పరమపదించారు. వారు లోకానికి ప్రసాదించిన కళాసృష్టి అపూర్వమైనది.



డా. బూర్గుల రామకృష్ణారావు

(జననం : 1898 మార్చి 13)

అవి 1948 నాటి కల్లోల దినాలు. హింసా చర్యలు విజృంభించిన రోజులవి. రజాకార్ల సంక్షోభం ఎక్కువగావున్న సమయం. అంతటా అంధకారం అలముకున్న కాలం. నిజాం సంస్థానం స్వతంత్ర దేశంగా అవతరించడానికి పోరాటం జరుపుతున్న రోజులవి.

భారత ప్రభుత్వపు ఏజెంట్ జనరల్ శ్రీ కె. ఎం. మున్షీ సంకట పరిస్థితుల్లో పడ్డారు. ఇంచు మించు నిర్బంధంలాంటి ఒంటరితనంలో ఆయన వుండవలసి వచ్చింది. నిజాం అనుమతి లేకుండా ఎవరూ శ్రీమున్షీని చూడడానికి వీల్లేదు. అయితే ఒక పొట్టి వ్యక్తి తెగించి ముందుకొచ్చి ధైర్యంగా మున్షీని కలుసుకుని, హైదరాబాదును భారత యూనియన్‌లో విలీనం చేయడం ఎలాగో ఆ విషయాలన్నీ చర్చించాడు. ఇందుకుగాను ఆ వ్యక్తి జైలుశిక్షను అనుభవించవలసి వచ్చింది. నిజానికి ఆయన పొట్టిమనిషే అయినా అతని సాంఘిక, రాజకీయ వ్యక్తిత్వంమాత్రం అతి సమున్నతమైనది. ఎంత ఉన్నతమైనదంటేం, నిజాము ఆ వ్యక్తికి మంత్రి పదవి ఎరచూపి అతనిని తనకు సుముఖుడిగా చేసుకోవాలని చూసినా, అందుకు ఆవ్యక్తి ఒప్పుకోలేదు. జైలు కటకటాలు ఆయనను ఎంతమాత్రమూ భయ పెట్టలేదు, మంత్రి పదవి ఆశ కలిగించ లేదు. ఆ వ్యక్తేబూర్గుల రామకృష్ణారావు గారు. అకలంక దేశభక్తు డాయన.

సరిగ్గా సమయానికి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దృష్టి యిటు ప్రసరించింది. హైదరాబాదును భారత దేశంలో విలీనం చేసే చర్యలు తీసుకున్నారు. అది భారత యూనియన్‌లో అంతర్భాగమై పోయింది. స్వార్థాన్ని అంటిపెట్టుకోవడంకన్న దేశశ్రేయస్సే ప్రధానంగా భావించిన రామకృష్ణారావుగారు హైదరాబాదు సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడానికి కృషిచేశారు.

ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడడానికి అవిరళకృషి చేశారు. ఆయన సేవలను దేశం పూర్తిగా వినియోగించు కున్నదనే చెప్పాలి. కొంతకాలం వారు ఉత్తరప్రదేశ్ గవర్నరుగా, తర్వాత కేరళ గవర్నరుగా వున్నారు. రాజ్యసభ సభ్యులు. అనేక సంఘాలలోనూ, కమీషన్లలోనూ సభ్యులుగా వుండి వివిధ రంగాలలో విశేషించి కృషిచేశారు.

రామకృష్ణారావుగారు సౌజన్యత, ఉదారత మూర్తీభవించిన వ్యక్తి. విశాల మనస్కులాయన. మతరహిత సర్వమానవ సమానతాధోరణి వారిది. హిందూ, ముసల్మాను సంస్కృతులకు వారధి. సంస్కృతం వారికి ఎంతబాగా వచ్చో పారసీకమూ అంత బాగానూ వచ్చు. బహుభాషావేత్త.

సంస్కృత విశ్వపరిషత్తు నెలకొల్పడానికి ఆయన కృషి చేసి, దానికి ఉపాధ్యక్షుడుగా విశేషసేవ జేశారు. భారతీయ విద్యాభవన్‌వారి హైదరాబాదు కేంద్రానికి ఆయన అధ్యక్షులు. బూర్గుల రామకృష్ణారావుగారు 1967 సెప్టెంబరు 14న తమ అరవై తొమ్మిదో యేట పరమపదించారు.

శ్రీ కోలాచలం శ్రీనివాసరావు

(జననం : 1854 మార్చి 13)

తెలుగు కవిత్వం పదకొండవ శతాబ్దం తొలి అర్థభాగం లోనే ఒకానొక ప్రత్యేకతను నింపుకొని, స్వంత వ్యక్తిత్వాన్ని కలిగి ఆవిర్భవించినప్పటికీ తెలుగు నాటకం మాత్రం పంథొమ్మిదవ శతాబ్దం రెండో అర్థభాగం నాటికిగాని ప్రభవించలేదు. 1860 లో కోరాడ రామచంద్రశాస్త్రిగారు తొలిసారిగా 'మంజరీ మధుకరీయం' అనే నాటకాన్ని తెలుగులో వ్రాయడంతో తెలుగు నాటక రచనకు నాంది జరిగింది.

చాలాకాలంపాటు తెలుగు నాటక కార్యకలాపాలకు బళ్ళారి కేంద్రంగా వుంటూ వచ్చింది. కన్నడ, తెలుగు సంస్కృతుల

సమ్మేళనంగా, సంగమంగా యిది వుండేది. ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు, కోలాచలం శ్రీనివాసరావుగారు యీ యిద్దరూ నాటక రంగానికి ఎనలేని సేవజేశారు. దాని అవిర్భావానికి కారకులయ్యారు. వీరిద్దరూ స్వతహాగా లాయర్లూ, నటకులూను పైగా వాళ్లు దీనివల్ల ఏర్పడే ఎలాటి పరిస్థితులనూ లక్ష్యపెట్టలేదు. ఆ రోజుల్లో వాళ్ళని జనం షేక్స్పియర్, జాన్సన్‌లతో పోల్చేవారు. ధర్మవరం కృష్ణమాచార్యులవారి 'చిత్ర నళీయం', కోలాచలం శ్రీనివాసరావుగారి 'రామరాజు చరిత్ర' ప్రసిద్ధిచెందిన నాటకాలు. వారు ఒక్కొక్కరూ సుమారు ముప్పయ్యేసి నాటకాల్ని వ్రాశారు. ఆంధ్రనాటక పితామహుడిగా ధర్మవరం కృష్ణమాచార్యులవారు వాసికెక్కితే, చారిత్రక నాటక పితామహుడిగా కోలాచలం శ్రీనివాసరావుగారు ప్రసిద్ధికెక్కారు.

రామకృష్ణమాచార్యులవారు నాటకకళా వికాసానికి 'సరస వినోదిని' సభను నెలకొల్పితే శ్రీనివాసరావుగారు 'సుమనోరమ' సభని స్థాపించారు. సుప్రసిద్ధ నటకుడు బళ్ళారి రాఘవగారు ఈ సుమనోరమ సభ ద్వారానే వెలుగులోకి వచ్చారు. అన్ని హంగులూ గల 'వాణీవిలాస నాటక శాల'ని నిర్మించిన ఘనత శ్రీనివాసరావు గారిదే. దీనికి లోకమాన్య బాలగంగాధర తిలక్ ప్రారంభోత్సవం చేశారు.

వీరు సుప్రసిద్ధ వ్యాఖ్యాత మల్లినాథ సూరి వంశంలోనివారు. శ్రీనివాసరావుగారు గ్రాంథిక శైలిలో సిద్ధహస్తులు. వ్యవహారిక భాషను పాత్రోచితంగా వాడడానికికూడా ఆయన యిష్టపడరు. దుఃఖాంత నాటకాలను వ్రాయడంలో వీరు ప్రసిద్ధికెక్కారు.

ధర్మవరం కృష్ణమాచార్యులవారివలెనే శ్రీనివాసరావుగారు కూడా ప్రబంధశైలిని తమ నాటకాల్లో సంభాషణల్లోనూ, పద్యాల్లోనూ వుపయోగిస్తుండేవారు. వీరు రాసిన చాలా పద్యాలూ, సంభాషణలు యీ నాటి కొందరునటకులకు పలకడానికి నోరు తిరుగక పోవచ్చు. తెలుగు నాటకానికి శ్రీకారంచుట్టి పునాదులు వేసిన యిద్దరిలోనూ ఒకరైన శ్రీనివాసరావుగారు చిరస్మరణీయులు. 'ప్రపంచ నాటక చరిత్ర' అన్న ఇంగ్లీషు గ్రంథాన్నికూడా వీరు రచించారు.

మహా మహోపాధ్యాయ
శ్రీ కొక్కొండ వేంకటరత్నం పంతులు

(జననం : 1842 మార్చి 14)

కొక్కొండ వేంకటరత్నం పంతులుగారు విద్వన్మణి. ప్రజలు ఆయనను 'ఆంధ్ర జాన్సన్' అనేవారు. మహా మహోపాధ్యాయ అన్న ఘనమైన బిరుదుపొందిన తొలి తెలుగు వ్యక్తి ఆయనే. వారి పాండిత్య రిమ అగణితమైనది. పంతులుగారు మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలోనూ, రాజమండ్రి ఆర్ట్సు కాలేజీలోనూ అధ్యాపకులుగా పనిచేశారు.

పండితులు ఘాటైన సాహిత్య విమర్శలు జరుపుతున్న రోజులవి. వెంకటరత్నం పంతులుగారు 'ఆంధ్ర భాషా సంజీవిని'అనే పత్రికను ప్రారంభించారు. అప్పట్లోనే కందుకూరి వీరేశలింగం పంతులుగారు 'వివేకవర్ధని' అనే పత్రికను ప్రచురించేవారు.

ఈ నాటి యువతరానికి కొక్కొండవారి పుస్తకాలు అంత ఆసక్తిని కలిగించకపోవచ్చుకాని ఆరోజుల్లో వాటికున్న ప్రాచుర్యం, ప్రాముఖ్యత వాటికుండేవి. గ్రాంథిక భాషావాది ఆయన. ఆయన ఆ వాదాన్ని ఎంతగా పాటించేవారంటే ఆయన గ్రాంథిక భాషాభిమానాన్ని హాస్యంపట్టిస్తూ అనేక కథలు వాడుకలో వున్నాయి నేడు. ఇంట్లో భార్యతో మాట్లాడినా, వీధిలో ముష్టివాడితో మాట్లాడినా గ్రాంథిక భాషలోనే మాట్లాడేవారు వాళ్ళని పలకరించినా, పొమ్మన్నా వ్యాకరణ యుక్తంగా, గ్రాంథిక శైలిలోనే!

శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యులు

నిఘంటువుల్ని పుక్కిట పట్టడానికీ, గణితాన్ని సైతం పద్యాల్లో గంథస్థంచేయడానికీ అలవాటు పడిన ఆంధ్రులకు ఒక నూతన దృక్పథంతో అక్షరక్రమంలో నిఘంటువుల్ని రూపొందించినవారు యిద్దరు ఆంగ్లేయులు. ఒకరు-ఎ డి. కేంప్‌బెల్, మరొకరు- సి పి. బ్రౌన్.

స్వచ్ఛమైన సరళమైన తెలుగులో ఒక నిఘంటువును రూపొందించాలని సుప్రసిద్ధ వైయాకరణి, పండితుడూ అయిన చిన్నయసూరి తలపోశారు గాని అది నెరవేరకుండానే కన్ను మూశారు.

చిన్నయసూరిగారి కోరికను పరిపూర్తిచేసే అదృష్టం బహుజనపల్లి సీతారామాచార్యులు గారికి లభించింది. చిన్నయసూరి 1862లో మరణించారు. తాను రూపొందించే నిఘంటువులో తత్సమ శబ్దాలను చేర్చాలని చిన్నయసూరి భావించలేదు. ఈ బృహద్భారాన్ని సీతారామాచార్యులవారు చేపట్టారు.

ప్రామాణికమైన గ్రంథాలను సేకరించడం ప్రారంభించారు. ఇద్దరుముగ్గురు లేఖకులను ఏర్పాటు చేసి, వారికి జీతం చెల్లించేవారు. అయిదారేళ్ళపాటు వీరు అవసరమైన గ్రంథాలని సేకరించడంలోనే మునిగివున్నారు. పాతికేళ్ళ పాటు శ్రమించి, కృషిచేసి చివరకు శబ్దరత్నాకరాన్ని సృష్టించారు.

జాన్సన్ నిఘంటువు యీనాడు పాతబడిపోయివుండవచ్చు. అయితే భాషఅనేది దానిస్వచ్ఛతను పరిరక్షించుకోవాలి అనే అంశాన్ని కాదనేవారు ఎవరూ వుండరు. ఈ విషయాన్ని

జాన్సన్ గురించారు. తన గ్రంథానికి వ్రాసిన పీఠికలో ఆయన యిలా అన్నారు "జీవభాషలోని ఏ నిఘంటువుకూడా పరిపూర్ణమైనదికాదు. ఎందుకంటే అది ముద్రితమవుతుండగానే కొన్ని కొత్త మాటలు వాడుకలోకి రావడమూ, మరి కొన్ని వాడుకలోంచి తొలగిపోవడమూ జరుగుతుంది" శబ్దోత్పత్తిని, చారిత్రక సూత్రాలను, పరిణామాన్నీ ఆధారంగా చేసుకుని పాశ్చాత్య నిఘంటువుల ధోరణిలో సమగ్రంగానూ, శాస్త్రీయంగానూ వున్న తెలుగు నిఘంటువు రూపొందింప బడవలసి వుంది. అటువంటి నిఘంటువు రూపొందింపబడే వరకు సీతారామాచార్యులవారు రూపొందించిన నిఘంటువు తెలుగు కవులకు, విద్యార్థులకు అత్యంత ఉపయుక్తమైన గ్రంథం అనడంలో ఎట్టి సందేహమూ లేదు.

(మరణం : 1891 మార్చి 20)

డా. కె. ఎన్. కట్జూ

మాజీ కేంద్ర హోంమంత్రి, పశ్చిమ బెంగాల్ గవర్నరు, డా. కైలాస్‌నాథ్‌కట్జూ, ఫిబ్రవరి 17 వ తేదీన మరణించారు. 1887 జూన్ 17 వ తేదీన అప్పటి మధ్య భారత్ రాష్ట్రంలోని జౌరాలో జన్మించిన డా. కట్జూ లాహోరులో విద్యాభ్యాసం చేశారు అలహాబాదులోని మూర్ సెంట్రల్ కళాశాలనుండి న్యాయ శాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారు.

1962 నాటివరకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు.

రాజకీయ రంగంనుండి విరమించుకున్న తర్వాత డా. కట్జూ అలహాబాదులో నివాసం ఏర్పరచుకున్నారు.

శ్రీ దీనదయాళ్ ఉపాధ్యాయ

" శ్రీ దీనదయాళ్ ఉపాధ్యాయ ఆకస్మిక మృతి దేశానికి తీరని లోటు శ్రీ ఉపాధ్యాయ సరళ స్వభావులు, సరసులు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వేసిన రాజకీయపునాదులను పటిష్ఠంచేసి వినూత్న నిర్మాణాన్ని ప్రతిష్ఠించారు.

ఆయన తన పార్టీకి (జనసంఘం) అధ్యక్షులుగా కొద్దినెలల క్రితమే ఎన్నిక అయినప్పటికీ దశాబ్దానికి పైగా ఆ పార్టీకి నాయకులుగా వ్యవహరిస్తూ చైతన్య విలసితం చేశారు.

అకళంక దేశభక్తుడు ఆయన. రాజకీయ సిద్ధాంతాలు లక్ష్యాలు ఏవైనప్పటికీ ఆయన నిజాయితీ, నిరాడంబర వ్యక్తిత్వాన్ని ఆయన వ్యతిరేకులు కూడ స్తుతించారు. 51 సంవత్సరాల పిన్నవయస్సులో అకాల మరణానికి గురికాకుండా ఉంటే దేశ ఔన్నత్యాన్ని యినుమడింపజేసేవారనడంలో సందేహం లేదు. ఆయన మరణానికి కారణమైన పరిస్థితులకు అంతా ఆందోళన చెందుతున్నారు."

(ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 13 ఫిబ్రవరి)

మహాభారతము

తిప్పెగంటుల లక్ష్మణశాస్త్రి

15

వారు ముఖద్వారమునకుమీద 'చైత్యకము' అను ఉన్నత పర్వతముపై జేరిరి. ఆ పురజనులా పర్వతమును సేవింతురు. ఆ పర్వతముపైన బృహద్రథుడు వృషభరూపమును ధరించిన ఋషభుడు అను రాక్షసుని జంపి అతని చర్మముతో మూడు నగారాలు చేయించి యుంచెను. వాటిపై ఒక్కసారి దెబ్బకొట్టినచో నాధ్వని నెలవరకు మ్రోగుచుండును. ఆ మూడు నగారాల నారాజు తన పురము నందుంచెను. వాటిని వాయించినపుడు పుష్పవర్షము గురియుచుండెను. కృష్ణభీమార్జునులు ఆ రీత్రయమును పగుల గొట్టి చైత్యకపర్వత ప్రాకారము నాక్రమించిరి. ఆ పర్వత శిఖరమును పడగొట్టిరి. గిరివ్రజ నగరములో ప్రవేశించిరి. అప్పుడు వేదవిదులైన బ్రాహ్మణులు జరాసంధుని జేరి యతనికి కలుగు దుర్నిమిత్తములను జూపి యెన్నియో శాంతికర్మలను చేసిరి.

కృష్ణభీమార్జునులు అస్త్రశస్త్రములను వదలి బ్రాహ్మణ వేషములను ధరించి నగరములో ప్రవేశించి జరాసంధుని రాజసదనమును జేరిరి. ఆ దృఢకాయులను జూచి పురవాసులాశ్చర్య పడిరి. ఆ బ్రాహ్మణుల నెదుర్కొని జరాసంధుడు పూజించెను. కృష్ణుడు జరాసంధునితో " రాజా! ఈ యిరువురు అర్ధరాత్రములో పల మాటలాడకుండునియమము గలిగియున్నారు. ఆ తరువాత నీతో వీరు సంభాషింతురు.'' అని చెప్పెను. ఆ మాట విని రాజు వారిని యజ్ఞశాలలో నివసింప జేసెను. అర్ధరాత్రము తరువాత జరాసంధుడు వారిని దర్శించుటకు యజ్ఞశాలకు పోయెను. " మీరెవరు ? క్షత్రియ తేజస్సు గలిగి బ్రాహ్మణుల వలె నున్నారు. చైత్యక గిరి శృంగంరమును పడగొట్టి యిట్లు వచ్చుటకు కారణ మేమి ? మీ కర్మ, మీ వేషమునకు విరుద్ధ ముగానున్నది. ఎందులకు వచ్చితిరి ? చెప్పుడు. " అని అడిగెను.

ఆ మాటకు కృష్ణుడిట్లనెను "రాజా ! మేము వ్రత నిష్ఠలో నున్న బ్రహ్మణులము కాము. విశేష నియమమును పాలించు క్షత్రియుడు లక్ష్మిని పొందగలడు. అతడు పుష్పమాల్యాములచే నలంకరింపబడి యుండును. కనుకనే మేము పుష్పాలంకృతులమై యున్నాము. మా భుజ బలమును జూడదలచినచో నీవు చూడుము. శత్రు గృహమువెనుక ద్వారము ద్వారా, మిత్రుని గృహము ముఖ ద్వారము ద్వారా ప్రవేశించవలెనని ధర్మ శాస్త్రములు చెప్పు చున్నవి. కనుక మేము ముఖద్వారము విడచి వెనుక ద్వారము గుండా వచ్చితిమి. శత్రువు చేయు పూజలను గ్రహింప జాలము."

ఆ మాట విని జరాసంధుడిట్లనెను "మీతో నేను వైరము చేసినట్లు, మీ కపరాధము చేసినట్లు నాకు జ్ఞప్తికి రాకున్నది. అట్టి మీరు నన్ను శత్రువుగా నెట్లు భావించుచున్నారు." ఆ మాటకు కృష్ణుడు "ఒక కులమునకు సంభవించిన కష్ట నష్టములను కులాధిపులు దీర్చవలెను. మా క్షత్రియ కులములో పుట్టిన వారందరిని నీవు క్రూరముగా బంధించి యున్నావు. నీవు చేసిన ఈ అపరాధము మా కందరికి సంప్రాప్తమైనది. ఒక దేవతను పూజించుటకు నరవధను నేనెచటను చూడ లేదు. జగత్కల్యాణమును చేయు భగవంతుడగు శివుని పూజను నీవు మానవ హత్య ద్వారా చేయుచున్నావు. ఇదియే నీవు చేయు దోషము. నీవును క్షత్రియుడవు. నీ సమాన జాతీయుల నీ విధముగా బాధించుట నీకు తగునా? నీ వంటి క్రూరుడు మరి యొకడు లేడు. నీవు ఏ కర్మచేత నితరులను బాధించుచున్నావో అట్టి కర్మచే నిన్ను శిక్షింప దలచినాము. కనుక నీతో యుద్ధము చేసి నిన్ను వధించ దలచినాము. నేను కృష్ణుడను. వీరిద్దరు భీమార్జునులు. నీవు వెంటనే నీ బందీలలో నున్న రాజులను విడువుము. లేక మాతో యుద్ధమునకై నను సిద్ధుడవు కమ్ము".

ఆ మాట విని జరాసంధుడు "కృష్ణా ! నేను క్షత్రియులను జయించకుండ వశపరచుకొన లేదు. శత్రు పరాజయము క్షత్రియుల ధర్మము. వశపరచుకొన్న వారితో యథేష్టముగా వ్యవహరించవచ్చును. కనుక వారిని నేను దేవతా పూజకు బలియివ్వ దలచినాను. నేను వీరిని బంధ విముకులను చేయజాలను. మీలో ఒకరు కాని ముగ్గురు గాని యుద్ధముచేసి శక్తి యున్నచో నన్నోడించి వారిని విడిపించుకో గలరు ? అని చెప్పి జరాసంధుడు వారితో యుద్ధము చేయదలచి తన పుత్రుడగు సహదేవునకు రాజ్యాభిషేకము చేయుటకు ఆనతియిచ్చెను.

'కృష్ణ జరాసంధులకు వైరమేల ఏర్పడెను ?' అని జనమేజయుడు వైశంపాయనుని అడిగెను. వైశంపాయనుడిట్లు పూర్వ వృత్తాంతము జనమేజయునకు చెప్పదొడగెను :—

యదు వంశమునందు మిక్కిలి బుద్ధిశాలియైన వసుదేవుడు పుట్టెను. అతడు ఉగ్రసేన మహారాజునకు విశ్వాసపాత్రుడైన

మంత్రిగా నుండెను. ఉగ్రసేనునకు మహాబలశాలియైన కంసుడు అను పుత్రుడు ఉండెను. జరాసంధుడు తన కూతురును కంసునకిచ్చి వివాహము చేసెను. వివాహ సమయమునందు కంసుని రాజుగా చేయు ఒడంబడికను ఉగ్రసేనునితో కోరెను. ఆ కోరిక ప్రకారమే ఉగ్రసేనుడు కంసుని రాజుగా చేసెను. స్వయముగా మహా బల పరాక్రమ సంపన్నుడగు కంసుడు రాజ్యాధికార ప్రాప్తిచేత మద గర్వితుడై తన తండ్రియగు ఉగ్రసేనుని కారాగారములో ఉంచి తాను మంత్రులతో మధుర రాజ్యమును పాలించుచుండెను. అప్పుడు మంత్రిగా నుండిన వసుదేవుని ధర్మోపదేశములను కంసుడు విన కుండ ఉండినప్పటికిని వసుదేవుడు శాంతుడై మంత్రిగా ధర్మ పాలనమును నిర్వర్తించుచుండెను. అతని పరిపాలన దక్షతకు కంసుడు ప్రసన్నుడై తన సోదరి ఉగ్రసేనుని సోదరుడగు దేవకుని పుత్రియగు దేవకిని ఇచ్చి వివాహము చేసెను. సోదరిని పతితో పంపునపుడు కంసుడు వసుదేవునితోపాటు ఆ రథములోనే కూర్చుని ఆమెను పతియింటికి చేర్చుటకు పోయెను. అప్పుడు ఆకాశవాణి 'కంసా! యీమె అష్టమగర్భము నీకు వినాశహేతువగును' అని పలికెను. ఆమాట విని కంసుడు ఒరనుండి కత్తిని దూసి దేవకి కంఠమును నరకబోయెను. అప్పుడు వసుదేవుడు కంసుని నివారించి, 'రాజా! స్త్రీవధ కూడదని అన్ని ధర్మములు ఘోషించుచుండగా అబలయగు నీ సోదరిని నీవు వధించుట ఉచితముగాదు. ఈమె అష్టమగర్భమునుండి నీకు హాని సంప్రాప్తమగునుగదా! ఆ శిశువు పుట్టగనే నీవు సంహరింపుము. దానివలన నీ యాపద తొలగి పోవును' అని చెప్పెను. ఆమాటను కంసుడు అంగీకరించి వారిని విడిచెను. దేవకీ గర్భమునుండి పుట్టిన సూర్యతేజస్సులగు అనేక పుత్రులను కంసుడు, వారు పుట్టగనే చంపుచువచ్చెను. దేవకి యొక్క సప్తమ గర్భమునందు బలరాముడు ప్రవేశించినతోడనే యముడు ఆ శిశువును తన మాయచేత దేవకి ఉదరమునుండి తీసి రోహిణీదేవి ఉదరమునందు స్థాపింపజేసెను. తల్లి గర్భమునుండి ఆకర్షింపబడినవాడు గనుక బలరామునకు లోకములో 'సంకర్షణుడు' అను పేరు ప్రసిద్ధమయ్యెను. మహా బలశాలిగనుక 'బలదేవుడు' అను పేరుతోగూడ ప్రసిద్ధుడయ్యెను.

దేవకీదేవి అష్టమగర్భము ధరించిన వెంటనే కంసుడాగర్భమును చాల జాగ్రత్తతో కనిపెట్టుచువచ్చెను. చివరకు ప్రసవ కాలమునందు శ్రీకృష్ణుని మాయచేత రక్షకులు నిద్రితులైరి. అందుచేత వసుదేవుడు వారికి తెలియకుండ బాలకుని తీసికొనిపోయినంద పురమును చేర్చెను. ఆ శిశువు స్థానములో, ఒక గోపకన్యను కొనితెచ్చి ఉంచెను. అష్టమగర్భమునుండియే తనకు భయము ఉండెనుగనుక కంసుడాకన్యను ఎత్తి, భూమిపైన చరచెను. కాని, ఆ శిశువు ఆ దెబ్బను తప్పించుకొని ఆకాశ గమనముచేత 'ఆర్య' అను శబ్దమును ఉచ్చరించుచు ఎగిరిపోయెను. అందుచేత ఆమెకు 'ఆర్య' అను పేరు ప్రసిద్ధమయ్యెను.

ఈ విధముగా వసుదేవుడు శ్రీకృష్ణుని రక్షించి గోకులములో దించి కాపాడెను. శ్రీకృష్ణుడు గోకులమునందు కొయ్యలో అగ్నివలె దాగియుండి కంసునకు తెలియక దినదినము జలములో కమలమువలె పెరుగుచువచ్చెను. పెరిగి పెద్దవాడై కృష్ణుడు గోపకులమును కూడగట్టుకొని ఉగ్రసేనుని అనుమతితో కంసుని పెడాడి సలిపి ఆతనిని సంహరించి తిరిగి ఉగ్రసేనుని మధురలో పట్టాభిషిక్తుని జేసెను.

కృష్ణుడు కంసుని సంహరించెనను వార్త విని జరాసంధుడు కంసుని కొడుకును శూరసేనుని దేశమునకు రాజుగా జేసెను. మహా పరాక్రమశాలియైన జరాసంధుడు కృష్ణుని జయించి తన దౌహిత్రుని రాజ్యమును స్థిరపరచెను." అని చెప్పి వైశంపాయనుడు, 'జనమేజయా! కృష్ణజరాసంధులకు వైరము గలుగుటకు ఇది కారణము' అని చెప్పెను.

జరాసంధ వధ

యుద్ధమునకు కృత నిశ్చయుడైన జరాసంధునితో శ్రీకృష్ణుడు "మాముగ్గురిలో నొకరితో పోరాడుటకు సంసిద్ధుడవు కమ్ము" అని చెప్పెను. జరాసంధుడు భీమసేనునితో పోరాడుటకు సిద్ధపడెను. పురోహితుడు జరాసంధుని గంధమాల్యములతో నలంకరించెను. కృష్ణుని మంగళాశీర్వాదములనుగొని భీమసేనుడు ముందుకు వచ్చెను. ఆ యిరువురు తొలుత కరగ్రహణము చేసి భుజముల చరచుకొని బాహుయుద్ధమునకు తలపడిరి. వివిధములైన పట్లు పట్టి యుద్ధముచేసిరి. సింహములవలె పోరాడుచున్నవారి యుద్ధమును చూచుటకు పురవాసులందరు నచ్చట చేరిరి. ఈ విధముగా ద్వంద్వయుద్ధము కార్తీక పాడ్యమినాడు ఆరంభింపబడి పదమూడు దినములు రాత్రింబవళ్ళు జరిగెను. పదునాలుగవనాటి రాత్రి జరాసంధుడు మిక్కిలి శ్రమచెంది యుద్ధభూమిని వదలుటకు సంసిద్ధుడుగా కనపడెను. కృష్ణుడు వాని పరిస్థితిని జూచి భీమసేనునితో "శత్రువు అలసినప్పుడు అతనిని పీడించుట యుక్తముకాదు. కనుక ఇతనితో సమభావముతోనే బాహుయుద్ధము చేయుము" అని చెప్పెను.

ఆ మాట విని భీముడు అలసియున్న శత్రువును చంపుటకిదే సమయమని తలచి మిక్కిలి క్రోధముగలవాడై ఇతడుసులభముగా నాకు వశముకాడు కనుక ఏలాగైనను చంపియే తీరవలెను అని చెప్పి కృష్ణుని అనుమతిగైకొని జరాసంధుని పైకిలేవనెత్తి భీముడు గిరగిర త్రిప్పి, క్రింద పడవైచి, తన మోకాలు అతని వీపుపైన నదిమిపట్టి యతనిని విరిచి, అతని రెండు కాళ్ళను పట్టుకొని రెండు భాగములుగా చీల్చివైచెను. ప్రాణములు వీడునప్పుడు జరాసంధుడు అరచినధ్వని, అతనిని చంపు భీమసేనుడుచేసిన సింహనాదము రెండును ఏకమై సర్వప్రాణిభయంకరమయ్యెను. అది మహా పర్వతములు పగిలినప్పటి ధ్వనిగా నుండెను.

ఆ శవశకలములను ఆ రాత్రి రాజభవన ద్వారము నందు పడవేసిరి. జరాసంధుని రథముపైన ఆ ముగ్గురు ఎక్కిపోయి అతడు బంధించిన రాజులనందరిని విడిపించిరి. వారు కృష్ణునకు నమస్కరించిరి. ఆ రాజులతో గిరివ్రజమును విడిచి కృష్ణ భీమార్జునులు ఆ రథముపైననే కూర్చొని వెడలిపోయిరి. ఆ రథమునకు 'సోదర్యవంతము' అని పేరు. అనగా ఇరువురు మహా

రథికులు దానిపై నుండి ఒక్కసారిగా యుద్ధము చేయుట కనువైనదని భావము. భీమార్జునులు రథికులుగానుండిరి. కృష్ణుడు సారథిగా వ్యవహరించెను. కృష్ణుడుతలచిన వెంటనే గరుత్మంతుడు వచ్చి రథముపై ధ్వజముగానిలచెను. ఆ రథము ఇంద్రుని నుండి వసువు, అతనినుండి బృహద్రథుడు బృహద్రథునినుండి జరాసంధుడు బడిసియుండిరి.

ఆ ముగ్గురు పురబహిర్భాగమందు మైదానములో రథమును నిలిపిరి. బ్రహ్మణాదులైన పురవాసులు వారి వద్దకువచ్చి వారిని పూజించిరి. విముక్తులైన రాజులు "దుఃఖపంక పూరితమైన జరాసంధుడనెడు మురికి గుంటలో మునిగి యుండిన మమ్ము ఉద్ధరించిన మిమ్ము ఎంతగా ప్రశంసించవలెనో, ఎట్లు కృతజ్ఞత తెలుపవలెనో తెలియ కున్నది" అని పలికిరి. " కృష్ణుడు వారినాదరించి వారితో నిట్లనెను "యుధిష్ఠిరుడు రాజసూయ యాగమును చేయుటకు తలపెట్టినాడు. అతనికి మీరందరు సహాయము చేయుడు" ఆ మాటకు వారంగీకరించిరి.

తరువాత జరాసంధుని కొడుకగు సహదేవుడు వినీతుడై రత్న భండారములతో వచ్చి కృష్ణునకు సమర్పించి అతనిని శరణుచొచ్చెను. కృష్ణుని యాజ్ఞచేత సహదేవుడు తండ్రికి ఉత్తర క్రియలు జరిపి ధర్మరాజునకు అనేక ధనకనక వస్తు వాహనములను కానుకలుగా బంపెను. కృష్ణుడు సహదేవున కభయమిచ్చి మగధ రాజ్యమందతనిని పట్టాభిషిక్తుని చేసెను.

రత్నరాసులతో కృష్ణుడు ఇంద్రప్రస్థమునకు పోయి జరాసంధవధ వార్తను, రాజులను విడిపించిన వార్తను ధర్మరాజునకు తెలిపెను. ధర్మరాజు కృష్ణుని పూజించి, భీమార్జునుల నాలింగనము చేసికొనెను. కృష్ణుడు ఇంద్రప్రస్థమునందు అందరిని వీడ్కొని జరాసంధుని రథమునందు ద్వారకానగరికి పోయెను.

పాండవుల దిగ్విజయము

అర్జునుని ఉత్తర దిగ్విజయ యాత్ర

అర్జునుడు, ధర్మరాజు ననుమతిగొని ధనుర్బాణములు తీసికొని సైన్యముతో ఉత్తర దిగ్విజయమునకై బయలుదేరెను. పాండవుల దిగ్విజయమునకు వ్యాసమహాముని వచ్చి వారిని ఆశీర్వదించెను.

ఉత్తరదిక్కునయున్న అనేక దేశములను ద్వీపములను జయించుచుపోయి అర్జునుడు, భగదత్తుని ప్రాగ్జ్యోతిష పురమును ముట్టడించెను. భగదత్తునితో ఎనిమిది దినములు యుద్ధముచేసి చివరకు అతనిని ఓడించెను. ధర్మరాజు చేయబోవు యాగములో సహాయము చేయుటకు అతనిని ఒప్పించెను.

అచటినుండి బయలుదేరి అర్జునుడు పర్వత ప్రాంత దేశములపై దాడివెడలి ఉత్తరదిశనున్న పర్వతీయ ప్రాంతములను వశపరచుకొనెను. కాశ్మీరదేశములను, త్రిగర్త దేశములను జయించి వానినుండి కప్పములను కొనెను. మానస సరోవరము వద్ద గంధర్వ రక్షితమైన దేశమునుగూడ జయించి వశపరచుకొనెను. తాను జయించిన దేశములనుండి కప్పములను గొని రాజసూయ యాగమునకు వారు సహాయము చేయునట్లు అంగీకరింపచేసి ధన, ధాన్య, వస్తు, వాహనములతో నింద్రప్రస్థమునకు తిరిగి వచ్చి వాటిని యుధిష్ఠిరునకు ఒప్పగించెను.

భీముని పూర్వదిగ్విజయ యాత్ర

భీమసేనుడు పూర్వదిగ్విజయమునకై వెడలియుండెను. పూర్వదిక్కునందున్న పాంచాలాది దేశములను జయించి అనేక రాజులను వశపరచుకొనెను. శిశుపాలునిగూడ జయించి వశపరచుకొనెను. ఆ దిక్కులలోనుండిన రాజులనుండి కప్పములను, ధన, ధాన్యములను గైకొని ఇంద్రప్రస్థమునకు వచ్చి ధర్మరాజునకు సమర్పించెను.

సహదేవుని దక్షిణ దిగ్విజయ యాత్ర

సహదేవుడు గొప్ప సేనతో దక్షిణ దిగ్విజయమునకుపోయి ఆ దిక్కునందు ఉన్న అనేక రాజన్యులను యుద్ధములో జయించుచు మాహిష్మతీ నగరరాజైన నీలునితో యుద్ధముచేసెను. నీలునకు ప్రాణాపాయ సమయము ఆసన్నమైనప్పుడు అగ్నిదేవుడు అతనికి సహాయముచేసెను. అప్పుడు సహదేవుని సేనలోని రథాశ్వగజాదులు అగ్నిలో జ్వలించుచున్నట్లు కనపడెను. దానినిచూచి సహదేవుడు మిక్కిలి భయపడి ప్రతిఘటించ జాలకుండెను.

జనమేజయుడు వైశంపాయనునితో "మహాత్మా! సహదేవుడు యజ్ఞముకొఱకే ఈ ప్రయత్నమును చేయుచుండెను గదా? అట్లుండగా అతనికి అగ్నిదేవుడు యుద్ధములో విరోధి ఎందుకయ్యెను?" అని అడిగెను. ఆ మాటకు వైశంపాయనుడు జనమేజయునితో ఇట్లనెను.

"మాహిష్మతీ నగరమునందు అగ్నిదేవుడు, నీలరాజ కూతురైన 'సుదర్శన' అను కన్యపై ప్రేమగలవాడై యుండెను. ఆమె అతి సౌందర్యవతిగా నుండెను. తన తండ్రియొక్క అగ్నిహోత్ర గృహమునందు అగ్నిని ప్రజ్వలింపజేయుట ఆమె కర్తవ్యమై యుండెను. విసనకఱ్ఱలతో ఎంతసేపు విసరినను అగ్ని మండకుండెను. ఆ కన్య తన పెదవులతో ఊదినప్పుడే సుగంధియగు ఆమె ముఖ వాయువులకు ప్రీతుడై అగ్ని మండుచుండెను. అంత కొన్ని నాళ్ళకు అగ్నిదేవుడు సుదర్శనను ప్రేమించెను. ఆ సంగతి నీలరాజుకు, పౌరులకు అందరికి తెలిసెను. ఆ తరువాత ఒకనాడు అగ్ని బ్రాహ్మణ వేషమును ధరించి ఆ కన్య కడకు వచ్చి ఆమెను కామించెను. నీలరాజు శాస్త్రానుసారముగా అట్టి దోషమునకు బ్రాహ్మణులకు విధించవలసిన దండమును అగ్నికి విధించబోయెను. అప్పు డతడు కోపించి స్వస్వరూపమునుదాల్చి ప్రకాశించిన వెంటనే నీలరాజు అగ్నికి నమస్కరించి అతనికి సుదర్శన నిచ్చి వివాహముచేసెను. అగ్ని అతనియందు దయగలవాడై అతనికి ఆపద వచ్చినప్పుడు సహాయము చేయుటకు ప్రతిజ్ఞ చేసెను. ఆనాటినుండి ఎవరు ఆ నగరముపై తెలియక దాడిచేసి ఆ రాజును జయింపజూచినను వారిని అగ్నిదేవుడు దహించుచుండెను. అప్పటినుండి మాహిష్మతీ

పురమునందలి స్త్రీలు వారి యిచ్ఛానుసారముగా భర్తలను వరించు నట్లు అగ్నిదేవుడు వరమిచ్చెను. ఏ రాజుయుకూడ అగ్నిదేవుని భయముచేత ఆ రాజ్యమును ముట్టడించ జాలకుండిరి." అని వైశంపాయనుడు చెప్పెను.

ధర్మాత్ముడగు సహదేవుడు అప్పుడు అగ్నిచేత చుట్టబడిన తన సైన్యము భయ కంపితమగుటను చూచి పర్వతమువలె అవిచలితుడై నిలబడి భయపడకుండెను. అతడు ఆచమనము చేసి పవిత్రుడై అగ్నిదేవునితో నిట్లనెను:-

"మహాత్మా! మేము చేయు ఈ ప్రయత్నమంతయు నీకొరకే కదా! నీవు యజ్ఞ స్వరూపుడవు. అందరిని పవిత్రులను చేయుదువు గనుక 'పావకుడవు,' హవ్యము లన్నిటిని వహించుచు 'హవ్యవాహ'డవైతివి. వేదములు నీకొరకే పుట్టినవి గనుక నీవు 'జాతవేదుడు' అనబడితివి. హోమము చేయబడిన వస్తువులను తినుచున్నావు గనుక 'హుతాశన నామము గలవాడవైతివి. ఈ విధముగా అనేక ప్రతిభలు నీకు గలుగుటచేత అనేక బిరుద నామములచే విరాజిల్లుచున్నావు. నీవు నాకు తేజోబల సంపదలను ప్రసాదించి రక్షింపుము," అని అనేక విధములుగ అగ్ని సూక్తములచేత స్తుతించి 'దేవా! మా యజ్ఞమునకు విఘ్నమును చేయకుము, అని సహదేవుడు ప్రార్థింపగా అగ్నిదేవుడు ప్రసన్నుడై 'సహదేవా! నిన్ను పరీక్షించుటకు ఇట్లు చేసితిని. ధర్మాత్ములగు మీ సోదరులను నే నెరుగుదును. మీకు అపాయము కలుగనీయను. ఈ మహిష్మతీ పురముపైకి ఎవరు వచ్చినను వారినుండి యీ పురమును కాపాడుచుందును.' అని చెప్పి నీలరాజుతో సహదేవునకు మైత్రి కల్పించి అగ్నిదేవుడు అంతర్ధానమును చెందెను. నీలుడు సహదేవునికి సత్కరించెను. సహదేవుడు అచటినుండి ముందుకు దిగ్విజయార్థమై సాగిపోయెను.

అచటినుండి సహదేవుడు దక్షిణదిక్కునకు వెడలి ఆ దిశలోనున్న పాండ్య, చోళ, పాఖండ, ఆంధ్రాది దేశములను జయించెను. తరువాత తన అన్న భీమసేనుని పుత్రుడగు ఘటోత్కచుని స్మరించగనే అతడు ప్రత్యక్షమై వచ్చెను. సహదేవుడాతని నాలింగనము చేసికొని 'వత్సా! లంకాపురికి పోయి విభీషణునకు మనముచేయు రాజసూయ సమాచారమును చెప్పి అతడు మనకు అనుకూలుడై పక్షుడగునట్లుగా చేసిరమ్ము.' అని చెప్పెను. ఆ మాట విని ఘటోత్కచుడు వెంటనే లంకాపురమునకుపోయి విభీషణునితో సమాచారమంతయు తెలిపి కప్పము నిమ్మనికోరెను. ధర్మాత్ముడగు విభీషణుడు మిక్కిలి సంతుష్టుడై అనేక రత్నాభరణములతో ధన రాసులను యుధిష్ఠిరునకు కప్పముగా రాక్షసులవెంట పంపెను. యుధిష్ఠిరుని సార్వభౌమాధిపత్యమును అంగీకరించెను. రాక్షసులు ధనరాసులతో ఘటోత్కచుని వెంబడించి వచ్చి సహదేవునకు సమర్పించిరి.

సహదేవుడు సంతుష్టుడై రాక్షసులకు సెలవిచ్చి తనకు దక్షిణ దిశలో తోడుగానున్న ద్రవిడ సైన్యమునకు గూడా వీడ్కోలుచెప్పి సమస్త ధనములతో ఇంద్రప్రస్థమునకు పోయెను. ధర్మరాజునకు ధనరాసులను సమర్పించి అతనిని సంతోషపరిచెను.

నకులుని పశ్చిమ దిగ్విజయయాత్ర

నకులుడు శ్రీకృష్ణుని అధికారమునకు లోబడియున్న పశ్చిమ దిక్కునకు విజయార్థమై వెడలెను. మొదట 'రోహితకి' యను పర్వతమును చేరి దాని సమీపముననున్న రాజులను జయించెను. తరువాత అనేక దేశములను క్రమముగా జయించుచు పోయి శ్రీకృష్ణునకుగూడా తన ఆగమనవార్తను దూతలద్వారా తెలిపెను. కృష్ణభగవానుడు పాండవుల యందలి ప్రేమచేత వారికి లోబడితినని చెప్పి పంపెను. అచటినుండి మద్రదేశమునకు పోయి నకులుడు తన మేనమామయగు శల్యునిగూడ ప్రేమపూర్వకముగానే వశుని చేసికొనెను. శల్యుడు అనేక ధనరత్న రాసులను కానుకగా నిచ్చెను. అచటినుండి సముద్ర గర్భములోనున్న మ్లేచ్ఛాదులను జయించి వారినుండి కైకొనిన ధనరాసులతో గూడా తిరిగి ఇంద్రప్రస్థమునుచేరి అన్నగారికి వాటిని సమర్పించి అతనిని సంతోష పరచెను.

యుధిష్ఠిరుని రాజసూయ దీక్ష

ధర్మరాజు మిక్కిలి ధర్మముతో ప్రజాపాలనము సలుపుచుండెను. బంధువులు, మిత్రులు, ప్రజలు రాజసూయయాగము చేయుటకు ధర్మరాజును మిక్కిలి ప్రోత్సహించిరి. అందరును చాలా ఉత్సాహముతో నుండిరి.

అట్టి సమయమునందు శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థమునకు సేనతోను, ధనరాసులతోను వచ్చెను. ఆయనకు స్వాగత సత్కారములు చేసి యుధిష్ఠిరుడు ఇట్లనెను. "మహాత్మా! నీ దయచేత సమస్త భూమండలము ఇప్పుడు నాకు వశమైయున్నది. విశేష ధనముకూడ లభించియున్నది. రాజసూయయాగమును చేయుటకు నాకు ఆజ్ఞనిమ్ము. నీవు స్వయముగా యజ్ఞదీక్ష గొని యాగము చేసినచో నీ పాపములన్నియు తొలగిపోవును. లేదా నా సోదరులతో నేను యజ్ఞము చేయుటకైనను ఆజ్ఞనిమ్ము."

ఆ మాటకు కృష్ణుడిట్లనెను. "రాజా! నీవే చక్రవర్తి వగుటకు యోగ్యుడవు. కనుక నీవు యజ్ఞ దీక్షితుడవైనచో మేమెల్లరము కృతార్థుల మగుదుము. నీవు యజ్ఞము చేయుచుండగా నీకు శుభములు గలుగునట్లు సర్వదా ప్రయత్నము చేయుచుందును. నీ ఆజ్ఞ ప్రకారము సమస్తకార్యములను నెరవేర్చుచుందును".

కృష్ణునిచేత అనుజ్ఞాతుడై ధర్మరాజు యజ్ఞ కార్యముల నారంభించెను. సోదరులను, మంత్రులను ఆయా కార్యములను నిర్వహించుటకు నియమించెను. ఆ యజ్ఞమందు వ్యాస భగవానుడు స్వయముగా బ్రహ్మత్వమును స్వీకరించి బ్రహ్మ సమానులైన అనేక ముని పుంగవులను ఋత్విజులనుగా నియమించెను. శిల్పులు యజ్ఞశాలను నిర్మించిరి. దేశములోని ప్రజలను అందరిని ఆహ్వానించుటకుగాను ధర్మరాజు తమ్ములను, ఇతర బాంధవులను నియమించెను.

(సశేషము)

సర్వకళానిలయం శ్రీ కాళహస్తీశ్వరాలయం


—రావుల సూర్యనారాయణమూర్తి

విశిష్ట కళావైభవంతో విలసిల్లుతూ అవనికంతటికీ ఆధ్యాత్మిక జ్యోతిర్లీలా రోచులను ప్రసరింపచేయగల పుణ్యనిలయాలు ఆంధ్రదేశంలో అసంఖ్యాకంగా వున్నాయి. ఈ పుణ్యభూమిలో వేద పురుష సమారాధనం, యోగిజన సంసేవనం, పవిత్రక్షేత్రాటనం, భవ్యవాక్య సంశ్రవణం, దివ్య ధర్మాచరణం నిత్యానుభవంలో నేర్వని విద్యలుగా పరివ్యాప్తాలయ్యాయి. శతాబ్దాలనాటి శిలా శిల్పసంపద మనకు ప్రశస్తపరచబడ్డ దేవాలయాలలో శ్రీ కాళహస్తీశ్వరాలయం ఒకటి. మానవుడి గమనం అనంత కాలజలధిలో నిరుపమాన నిత్యసత్యమై నిలిచివున్న పరంజ్యోతిని దర్శించి తరించడమే ధ్యేయంగా సాగింది. అలాంటి భగవద్భక్తుడైన ప్రతివ్యక్తిలోగల దైవత్వాన్ని ఉద్దీపింపజేసే దేవాలయాలలో అత్యంత ప్రసిద్ధి, అపార పవిత్రత గలది శ్రీ కాళహస్తీశ్వరాలయం.

దక్షిణాపథంలోని దేవాలయాలు సర్వలక్షణ సంపన్నాలుగా శోభిల్లుతున్నాయి. ప్రతి దేవాలయ పరిసరంలోనుగల ప్రకృతి సౌందర్యసంపద భక్తజనులను ఆకర్షిస్తుంది. సాధారణంగా దేవాలయాలు నదీతీరాలలోను, సాగరసంగమ ప్రాంతాలలోను, శైలాగ్ర సీమలలోను, సముద్రసమీపాలలోను నెలకొల్పబడ్డాయి. కాలక్రమేణా ప్రాంతీయప్రజలకు అందుబాటులో వుండే విధంగా ఊరూర దేవాలయాలు నిర్మించబడ్డాయి

జనులకనులకు విందులుసలిపే గంభీర సుందర గమనంతో ప్రవహించే పవిత్ర స్వర్ణముఖీ నదీతీరానగల కాళహస్తి పురాణ ప్రసిద్ధినీ, చారిత్రక ప్రఖ్యాతిని సముపార్జించుకున్నది. ఈ శైవక్షేత్రం జ్ఞాని అయిన మానవుడు మాత్రమేకాకుండా, క్రిమి కీటక జంతుజాలాలుకూడా నిశ్చలభక్తితో భగవదర్చనచేసి తరించడానికి వీలున్నదనే విషయాన్ని నిరూపించింది.

వినిర్మలమైన శ్రీపురం, ముమ్మిడిచోళపురం పర్వతాల మధ్య విలసిల్లుతున్న పరమరమణీయమైన ఈ క్షేత్ర రాజంలోగల శ్రీకాళహస్తీశ్వరాలయం ఎప్పుడు నిర్మితమయిందో ఎవరికీ తెలియదు. ప్రాచీన కావ్యమైన మహాభారతంలోను, ఇతర పురాణ గ్రంథాలలోను దీని ప్రసక్తి వున్నందువల్ల సర్వకళాశోభితమూ, ఆకర్షణీయమూ అయిన ఈ ఆలయం ఆదికాలం నుంచీ అలరారుతున్నట్లు వ్యక్తమవుతున్నది కైలాసపర్వతం నుంచి ఒక లింగాన్ని కైవల్యామృతం భక్తజనులకు ప్రసాదించే పరమేశ్వరుడు నివసించే నిమిత్తం బ్రహ్మతెచ్చి యిక్కడవుంచినట్లు స్కంద, శైవ, లింగ పురాణాలు వెల్లడిస్తున్నాయి. తన్మూలంగా ఈ దివ్యక్షేత్రం దక్షిణకైలాసమని జగద్విఖ్యాతిగాంచింది. ఇక్కడగల శివుడు వాయులింగమని ప్రసిద్ధి. గర్భాలయంలో గాలి ప్రవేశించడానికి ఎంతమాత్రం అవకాశం లేకపోయినప్పటికీ నిరంతరం జ్యోతి చలిస్తుండడమే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. పంచభూత లింగాలలో మిగిలిన పృథివీలింగం కంచీపురంలోవున్న ఏకామ్రనాథుడనీ, అబ్లింగం జంబుకేశ్వరంలోవున్న జంబుకేశ్వరుడనీ, తేజోలింగం తిరువణామలైలోవున్న అరుణాచలేశ్వరుడనీ, ఆకాశలింగం చిదంబరంలో వున్న నటేశ్వరుడనీ ప్రజల విశ్వాసం.



కాళహస్తీశ్వరాలయం

కృతయుగంలో సాలెపురుగు, పాము, ఏనుగు యిక్కడ అనేక సంవత్సరాలు అచంచలమైన భక్తితో తపస్సుచేయగా ఆ

ముగ్గురికీ ఈశ్వరుడు సాక్షాత్కరించి సాయుజ్యం ప్రసాదించి, వారి కోర్కె ప్రకారం శిలామయ లింగాకారం చెందాడని స్థలపురాణం చెబుతున్నది. కనుకనే యిక్కడి లింగానికి శ్రీ కాళహస్తీశ్వరుడనే దివ్యనామం కలిగింది. పూర్వం కాళహస్తిప్రాంతం దుర్గమారణ్యం. ఆ భయంకరమైన ప్రదేశంలో కన్నప్ప అనే ఎరుకలవాడు క్రూర భీకరమృగాలను వధించి దేహయాత్ర సాగించేవాడు. ఆ నిషాదుడు ఒకనాడు పొదలలోవున్న శ్రీకాళహస్తీశ్వర లింగాన్ని చూచి, పురాకృత పుణ్యవిశేషంవల్ల అమితమైన భక్తిశ్రద్ధలతో చర్మనిర్మిత పాదరక్షలతో పరమేశ్వరుణ్ణి శుభ్రపరచి, స్వర్ణముఖీ నదీజలతో అభిషేకించి, తాను కొరికి రుచిచూచిన పందిమాంసం ఫాలాక్షుడికి నివేదించాడు. ఆ విధంగా అనునిత్యం అభిషేక నైవేద్యాలు కావించాడు. కొంతకాలం తరువాత కన్నప్ప చిత్తశుద్ధిని భక్తులకు వ్యక్తంచేసే సంకల్పంతో ఈశ్వరుడు ఒక కంటితో నీరు స్రవించాడు. దానిని చూచిన కిరాతుడు భగవంతుడి కన్నునెవరో గాయపరచారని భావించి, వెంటనే విటికోపుతో తన కన్నును పెకిలించి త్రిలోచనుడి లోచనానికి బదులుగా పెట్టాడు. అనంతరం రెండవ కంటినుంచి నీరు కారడం మొదలుపెట్టింది. కన్నప్ప దానికి మారుగా మళ్లీ తన రెండవ కన్నునుపెట్టే తలంపుతో, అది పెరికిన తరువాత తనకు ఈశ్వరుడి నయనముండే చోటు తెలియడానికి వీలుగా చెప్పులతో కూడిన తన పాదాగ్రం అక్కడవుంచి, రెండవ కంటిని పెరుకుతుండగా ఈశ్వరుడు ప్రత్యక్షమై ఆ భక్తుడికి ముక్తిని ప్రసాదించాడు. ఈ విషయం పురాణాలనుబట్టి మనకు విదితమవుతున్నది. ఆది శంకరాచార్యులవారు తమ శివానందలహరిలో కన్నప్పనైనారును గురించి గానం చేశారు. ఈ పరమభక్త శిఖామణి శిలాప్రతిమను ముఖ్య లింగానికి అభిముఖంగా మనం తిలకించవచ్చు.

ఆటవికయుగంలో జీవించిన కన్నప్పనైనారునుంచి మనం క్రీస్తుశకం మూడవ శతాబ్దానికి వచ్చినట్లయితే అంతిమ తృతీయ తమిళ సంఘాధ్యక్షుడూ, మహర్షీ, మహాకవీ అయిన శ్రీనక్కీరార్ ఈ దివ్య స్థలాన్నిగురించి మధురమంజులగానం చేసినట్లు వ్యక్తమవుతుంది. క్రమేపీ కైలాసగిరి దిగువభాగంలో పల్లవరాజులు, కాళహస్తికి ఐదుమైళ్ల దూరంలో నేటికీ ప్రాచీనభవనం శిథిలావశేషాలుకల తొండమనాడులో నివసించిన తొండమాను చక్రవర్తి ప్రస్తుతమున్న దేవాలయాన్ని నిర్మించినట్లు విశ్వసించబడుతున్నది. పదకొండవ శతాబ్దంలో కులోత్తుంగచోళుడు దీన్ని పునరుద్ధరించి, పట్టణంనుండి విచ్చేసేభక్తులకు ప్రథమ ప్రవేశద్వారమై దక్షిణాభిముఖంగాగల భిక్షాలగోపురాన్ని నిర్మించాడు. తరువాత శతాబ్దంలో నారాయణపరాన్ని పరిపాలించిన శ్రీ వీరనరసింహయాదవరాయలు దేవాలయానికి చుట్టుగల అత్యున్నత ప్రాకారాలను నాలుగు ఆలయద్వారాలను కలుపుతూ నాలుగు గోపురాలను నిర్మించాడు. సర్వ భౌతికసంపదలతో నిండి, సంస్కృతికి నిలయంగాను, ఆధ్యాత్మికవికాసానికి ఆలవాలంగాను, ఆదర్శ ప్రజారాజ్యంగాను విశ్వవిఖ్యాతిగాంచిన విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన శ్రీ కృష్ణదేవరాయాదులు శ్రీ కాళహస్తీశ్వరాలయంలో ఎన్నో మండపాలను నిర్మించారు 1646లో ఈ దేవాలయం గోల్కొండ నవాబుల క్రూరకఠోరదాడికి గురయినప్పటికీ ప్రధానమైనలింగానికి మాత్రం ప్రమాదమేమీ సంభవించలేదు.

పరమేశ్వర సందర్శనార్థం ఈ దివ్యక్షేత్రానికి విచ్చేసే వేలాది భక్తులకు ఆలయప్రాకారంలో ప్రప్రథమంగా సర్వాభీష్టప్రదాయిని అయిన బాలజ్ఞానప్రసూనాంబ సన్నిధి, తరువాత పాతాళవిఘ్నేశ్వరస్వామి సన్నిధి కనుపిస్తాయి. మొదటిప్రాకారందాటి లోపల ప్రవేశిస్తే శిల్పుల ప్రజ్ఞాసంపద, హస్తనైపుణ్య విశేషం, ఆధ్యాత్మికవికాసం వేనోళ్ల చాటే కళాఖండాలు కానవస్తాయి. ఇందు శేఖరమందిరంలోగల శ్రీ కాళహస్తీశ్వరలింగం భక్తజన నయనానందకరం. అనంతరం వరప్రదాయిని అయిన జ్ఞానప్రసూనాంబ సన్నిధి సందర్శకులను సమ్మోహితులనుచేస్తుంది. ఇటీవల శ్రీ కంచికామకోటి పీఠాధిపతుల ప్రోత్సాహప్రోద్బలాలతో పునరుద్ధరించబడ్డ నటరాజ రంగస్థలం దివ్య శిల్పప్రాభవానికీ, కళాకౌశలానికీ తార్కాణం.

మహాశివరాత్రినాడు యిక్కడ పరమ పుణ్యప్రదమని ప్రతీతి. ఆ పర్వదినాన ఆంధ్రావని నలుమూలల నుంచీ వేలాదిభక్తులు విచ్చేసి దైవదర్శనం చేసుకుని మహానంద సంభరితాంతఃకరణులవుతారు. శ్రీ వేంకటేశ్వరస్వామి నిలయమైన తిరుపతికి ఇరవై రెండు మైళ్ల దూరంలో కళాసంపదలను వెదజల్లుతూ గణనీయ పావనకీర్తికి నిధానమై సమస్త భక్తజన హృదయాలలో శాశ్వతస్థానాన్ని గడించగల్గిన ఈ దివ్యస్థలం తప్పక దర్శించదగ్గది.

"నీ నాసందోడబాటు మాటవినుమా నిన్నేమి జీతంబునే
గానింబట్టక సంతతంబు మది వేడ్కంగొల్తు నంతస్సప
త్నానీకంబుల కప్పగింపకుము నా కాపాటియేచాలు నే
జీనొల్లన్ కరులొల్ల నొల్లసిరులన్ శ్రీ కాళహస్తీశ్వరా!"

— ధూర్జటి

ఆదర్శఘట్టాలు

లక్ష్యాన్ని అధిగమించిన ఆంధ్రప్రదేశ్

కేరళకు బియ్యాన్ని సరఫరాచేయడంలో ఆంధ్రప్రదేశ్ తన లక్ష్యాన్ని గత జనవరిలో అధిగమించడం జరిగింది. కేరళకు 37,000 టన్నుల బియ్యాన్ని సరఫరాచేయవలసి వుండగా ఆంధ్రప్రదేశ్ సుమారుగా 46,000 టన్నులను సరఫరాచేసింది.

కార్మికుల ఆదర్శం

కార్మికుల ఆందోళనలు, సమ్మెలు మొదలైనవి విపరీతంగా వున్న యీ రోజుల్లో బొంబాయిలోని రెండు వేల మంది కార్మికులు, మూసివేసిన తమ మిల్లును తిరిగి పనిచేయించడానికి ప్రభుత్వానికి డబ్బు పెట్టుబడి పెట్టడం చాలా విచిత్రంగావుంది. ఎడ్వర్డ్ టెక్స్‌టైల్స్‌కు చెందిన 2,000 మంది కార్మికులు 1967 జూలై 7 నుంచి మూత పడివున్న తమ మిల్లును తిరిగి ప్రారంభించడానికై రాష్ట్ర ప్రభుత్వానికి రూ 43 లక్షల్ని నిర్వహణ పెట్టుబడిగా యిచ్చారు.

కార్మికులు అంత పెద్ద మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి మదుపు పెట్టడం ఆశ్చర్యంగానే వుంటుంది. గత నెలలో తమకు చెల్లించిన ప్రావిడెంట్ ఫండులో ప్రతి కార్మికుడు తన స్వంతానికి 250 రూ. వుంచుకుని మిగతా మొత్తాన్ని మిల్లును తిరిగి ప్రారంభించడానికై ప్రభుత్వానికి అందచేశారు. మొదట్లో యిది కొంతకాలం పాటు దానికి వచ్చినలాభాలు దాని నిర్వహణకు సరిపోయే విధంగా నడుస్తుంది.


మిల్లును రాష్ట్ర ప్రభుత్వం నడపడానికి సంబంధించిన పథకాన్నొక దానినికూడా కార్మికులు ప్రభుత్వంముందు వుంచారు. దీని ప్రకారం తరువాత యీ మిల్లును కార్మికులే నడుపుకుంటారు. మొత్తం భారత దేశంలో యాభై మిల్లులు మూతపడిపోయాయి. కార్మికుల వద్దనుంచి కొద్దిగా గాని, లేదా పూర్తిగా గాని పెట్టుబడితో తిరిగి యీ మిల్లులు ప్రారంభించడం జరిగితే దేశ అభివృద్ధికీ, పారిశ్రామిక ప్రగతికీ సముజ్జ్వలమైన భవిష్యత్తు నిరూపితమౌతుంది. సరిగా నడవని మిల్లులను ప్రభుత్వం తీసుకునేందుకు అధికారాలు యిస్తూ యిటీవలే లోక్‌సభ, నూలుబట్టల కంపెనీల నిర్వహణ యాజమాన్యం చేపట్టుట, పునర్వ్యవస్థీకరించుటకు సంబంధించిన బిల్లును ఆమోదించింది. ప్రభుత్వం హస్తగతంచేసుకున్న సరిగానడవని మిల్లుల నిర్వహణకు ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది. ఈ ప్రయోగం అభిలషనీయమైనది.

గ్రామ సేవకులకు అలారం టైంపీసుల బహుమతి

షాద్‌నగర్ పంచాయతీ సమితికి చెందిన వి.ఎల్. డబ్ల్యులు ప్రతిముగ్గురిలోనూ ఒకరికి అలారంటైంపీసులను రాష్ట్ర జనసంబంధ, కార్మికశాఖా మంత్రి శ్రీ కొండాలక్ష్మణ్ బాపూజీ బహూకరించారు. కుటుంబ నియంత్రణ పక్షోత్సవ సమయంలో ఏర్పాటుచేసిన వెసెక్టమీ శిబిరానికి శస్త్రచికిత్సల నిమిత్తం వీరు ఎక్కువమందిని తీసుకొని వచ్చినందుకు, వారి సేవకుగుర్తింపుగా యీ బహుమతులు యివ్వబడ్డాయి.

అధిక దిగుబడి రకాలను పండిస్తున్నందుకు, వయోజన విద్య, కుటుంబ నియంత్రణ, జనసంబంధాల విషయంలో యీ సమితి చేస్తున్న కృషికి మంత్రి శ్రీ బాపూజీ, సమితి అధికార్లను అభినందించారు.

పంటల పోటీలు



రాష్ట్ర పంటల పోటీలో గెలుపొందిన వారికి కేంద్ర ఆహార, వ్యవసాయశాఖ స్టేట్ మంత్రి శ్రీ అన్నా సాహెబ్ షిండే బహుమతులను పంపిణీ చేస్తున్న దృశ్యం

హైదరాబాదులోని అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనవారు రాష్ట్రంలో నిర్వహించిన పంట పెంపకం పోటీలలో గెలుపొందిన వారికి కేంద్ర ఆహార, వ్యవసాయశాఖ స్టేట్ మంత్రి శ్రీ అన్నా సాహెబ్ షిండే బహుమతులను పంపిణీచేశారు ఈ బహుమతీ ప్రదానోత్సవానికి, ముఖ్య మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహించారు.

అనంతపురం జిల్లాలోని మడకసిర తాలూకాకు చెందిన గోవిందపురం గ్రామ రైతు శ్రీ జి. సిద్ధలింగ గౌడుకు ప్రథమ బహుమతి లభించించింది. ఈయన ఎకరాకు 5,600 కి. గ్రాములు ధాన్యాన్నిపండించారు. అంటే సగటు దిగుబడికి యిది ఆరురెట్లు ఎక్కువవుంది.

చెరకుపంటలో బొబ్బిలి కుమారరాజా శ్రీ పి.వి.జి.కె. రంగారావుకు ప్రథమ బహుమతి లభించింది. ఎకరాకు 120.372 టన్నుల చెరకును యీయన పండించారు. ఇది సగటు ఎకరాదిగుబడికి ఆరు రెట్లు ఎక్కువ.



ఎకరాకు 6,600 కిలోల ధాన్యం పండించి రాష్ట్ర పంటల పోటీలలో వరి పంటలో ప్రథమ బహుమతి పొందిన అనంతపురం జిల్లా, మడకసిర తాలూకా, గోవిందపురం గ్రామనివాసి శ్రీ సిద్ధలింగ గౌడు

కర్నూలుజిల్లా నందికొట్కూరు తాలుకాకు చెందిన శ్రీ కొత్త చిన్నఫకీర్ రెడ్డి, అనంతపురంజిల్లా కదిరి తాలూకాకు చెందిన శ్రీ నారాయణ రెడ్డి వేరుశెనగ పంటలో సమంగా పండించి ప్రథమ బహుమతిని పంచుకున్నారు. వీరిరువురు ఎకరాకు 2,230 కి. గ్రా. వేరుశెనగను పండించారు. సగటు ఎకరా దిగుబడికి యిది ఆరురెట్లు ఎక్కువవుంది. ఈ ఏడాది జరిగిన పంటల పోటీలో 25,000 మంది పోటీదార్లు పాల్గొన్నారు.

ఎకరాకు అధిక దిగుబడి

తీవ్రతర వ్యవసాయ జిల్లా కార్యక్రమాలు అమలు పరచబడుతున్న పశ్చిమగోదావరి జిల్లాలో గత ఖరీఫ్ పంటకాలంలో (1967_68) అత్యధిక దిగుబడి_అంతే ఎకరాకు 14.2 బస్తాలు_ పండిచడం జరిగింది. ఇంతకుముందు ఇక్కడ గరిష్ఠ దిగుబడి 13.5 బస్తాలువుంది.

వ్యవసాయనిపుణులు దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత వున్నదంటున్నారు. ఇంచుమించు జిల్లాలోని మెరక ప్రాంతాలంతటా పంట పాడై వుండగా యిక్కడ యింత ఎక్కువ దిగుబడి సాధించడం ప్రత్యేకమైన విషయంగా వీరు పేర్కొంటున్నారు.

పాఠకుల లేఖలు

నమస్సులు. జన్మభూమి_గేయం ప్రచురించడం చాలా బాగుంది. అవిధమైన గేయాలు తరచు ప్రచురించటం సముచితం. "ప్రపంచ పరిస్థితులు" శీర్షిక ప్రకటిస్తున్నందుకు కృతజ్ఞతలు. "మన పంటసీమలు" శీర్షిక క్రింద ప్రచురించిన మనరైతు_నూతన సేద్యపు విధానాలు వ్యాసం చదువ ముచ్చటగావుంది. తరచు ఇలాంటి వ్యాసాలు ప్రచురిస్తారని ఆశిస్తున్నాను.

ఐ. మైథిలీ. గుంటూరు

మీరు ప్రచురిస్తున్న " ఆంధ్రప్రదేశ్ " మాసపత్రిక మమ్ముల నెంతో సంతోషింపచేయుచున్నది. కప్పగంతుల లక్ష్మణ శాస్త్రిగారి వచన భారతము చదువరులకు చాల లాభదాయకముగా నున్నది. కౌసల్యాదేవి, సీతాదేవి గార్ల సీరియల్స్ చదువరులకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. డిసెంబరు సంచికలో అరిపిరాల విశ్వం గారి గేయం చాలబాగుంది. ఇంత మనోరంజకముగా వున్న దానికి ఒకటేలోటు. అది, అన్నీ సీరియల్స్ వుండటమే ; దానివలన క్రొత్తవారు కొనేందుకు సందేహించడం జరుగుతోంది. వారికై ప్రస్తుతం చదివేందుకు కనీసం ఒక్కకథైనా విడిగా పూర్తిగా ప్రచురించడం అవసరం. కనుక ఈ విషయంలో కొంత యోచించి చదువరులకుత్సాహము కలుగునట్లు యొనర్తురని భావించుచున్నాను.

సుమ, హైదరాబాదు

ఆంధ్ర ప్రదేశ్ నవంబరు సంచిక కంటె 1967 డిశంబరు సంచికను ఎంతో విలువైన, నిండైన సమాచారాన్ని ఎక్కువ పుటలతో ఆకర్షణీయముగా తయారుచేసి పాఠకులకు అందించుట అభినందించ దగ్గ విషయం. మీ సమాధాన వేదికలో ఒక్క వ్యవసాయ సంబంధిత విషయాలకే కాకుండా మిగతా అన్ని రంగాలకు చెందిన విషయాలకు స్థానం యిస్తే 'సమాధాన వేదిక' విస్తరించి పాఠకుల విజ్ఞాన కుతూహల ప్రశ్నల సందేహములు తీరును. ఈ విషయాన్ని స్వీకరించుతారని ఆశించుచున్నాను.

__జంగాల విష్ణుమూర్తి
విజయనగరం

ఆంధ్ర ప్రభుత్వము అకాడమీలు స్థాపించి సంగీత సాహిత్యములను పోషించి ప్రోత్సహించు చున్నది. అట్టి ప్రభుత్వము తరపున వెలువడు 'ఆంధ్ర ప్రదేశ్' పత్రికలో కవితకు, గ్రంథ సమీక్షలకు, సాహిత్య విమర్శలకు స్థానముండుట సముచితము, అవసరముకూడ. గ్రంథ సమీక్షలకు తిరిగి పత్రికలో స్థానము కల్పించుచున్న, మీరు అభినందనీయులు.

బైరెడ్డి సుబ్రహ్మణ్యం,
తిరుపతి

సీరియల్

గృహిణి

పిలకా గణపతి శాస్త్రి


జరిగిన కథ

పార్థసారథికి నాటకాలపిచ్చి. రాఘవ నాట్యకళా మండలి ద్వారా నాటకాలు వేస్తుండేవాడు. నాటకాల పిచ్చిలో పడి అతను సరిగా యింటికే వచ్చేవాడుకాడు. అతని భార్య విజయలక్ష్మి ఎంతగా చెప్పినా అతను వినిపించుకోలేదు. ఒకసారి పార్థసారథి వాళ్ళ నాటకంలో హీరోయిన్‌తో ఏలూరువెళ్ళి చాలా రోజులవరకూ రాలేదు. విజయలక్ష్మి బెంగతో మంచం పట్టింది.

వర్ధనమ్మ కృష్ణమూర్తితో అంది–

'అసలా జ్వరం కూడా అదే పనిగా దిగులు పడశంమూలాన్నే వచ్చి ఉంటుంది. లేకపోతే నిక్షేపంగా తిని తిరుగుతూన్న దానికి అంతటి జ్వరం ఎందుకు ముంచుకు వస్తుంది?'

'ఎందుకు బామ్మ గారూ అంతటి మథన. ఇంతకి ఏమిజరిగిందని ? ఈ వేళ కాకపోతే రేపయినా ఆయన గారు తిరిగి వచ్చేస్తాడు గాని, ఆ ఏలూరులోనే కాపరం ఉండిపోడుగా. ఒక వేళ ఏదయినా అవసరంవస్తే నేనున్నానుగా !'



కృష్ణమూర్తి రెట్టించిన జిజ్ఞాసతో మరింత ఆత్రంగా ప్రశ్నించాడు వర్ధనమ్మ అతనివైపు చూస్తూ ఏదో ఆలోచిస్తూ రవంత సేపు తటపటాయించింది. ఆ పైన సరోజా పార్థసారథుల మధ్య ఏర్పడిన సంబంధం సంగ్రహంగా అతి రహస్యంగా అతని చెవిని వేసింది. ఆ గొడవ సంగతి ఇంకెవ్వరికీ తెలియనియ్యొ వద్దని గట్టిగా హెచ్చరించింది. అది వినీ వినగానే అతడిక తన కన్నుల్నే నమ్మలేక నిలువునా నిర్ఘాంతపడి, రవంత సేపేదో ఆలోచించి మళ్ళీ అడిగాడు. 'ఇదంతా నిజమేనా ? లేకపోతే విజయ అనవసరంగా అనుమాన పడుతుందా ?'

'అబ్బే ! అది అనవసరంగా అనుమానపడే మనిషి కాదు నాయినా ? అంతా నిజమే ! లేకపోతే ఉత్త పుణ్యాని కని నీతో చెబుతానా ?'

'ఇలాగ ఈ వ్యవహారం ఎన్నాళ్ళ నించి సాగుతూంది?' కృష్ణమూర్తి మరింతగా ఆందోళనపడి అడిగాడు.

'అబ్బో ! ఇప్పటి మాటా ? ఇంచు మించుగా రెండు మూడేళ్ల నించి ఈ గొడవ సాగుతూనే ఉందిట. ఈ మధ్యన అది మరింతగా మితిమీరి పోయింది. అప్పటినించి నాటకాల్లో వచ్చిన సొమ్మంతా ఆ సరోజ ఒళ్ళోనే గుమ్మరిస్తున్నాడట !'

'అలాంటప్పుడు మీరో, మామయ్యో, కాస్త కలగజేసుకుని ఇలాంటి పని కూడదని అతనికి నచ్చజెప్పలేక పోయారా ?'

లోకం పోకడ లోతుగా గమనించలేని ఆ ప్రశ్న మీద వర్ధనమ్మ మనస్సులో రవంత నవ్వొచ్చింది. అంతలోనే అతని అమాయికతే దాని కొక కారణమని సమాధానపడి పొడిగా నవ్వి అందుకుంది.

'నీకేమన్నా వెర్రా ఏమిటి ? మీ మామయ్య మాట గాని, నా మాట గాని లక్ష్యపెడితే ఇక కావలిసిందేమిటి ? అతనిప్పుడు ఆ వెనకటి మనిషి కాదు నాయినా ? బాగా మారి పోయాడు !...... అయినా ఉండబట్టలేక నేనొక సారి పరస్పరంగా కలగజేసుకుని మామయ్యచేత అతని పేర నాలుగయిదు ఉత్తరాలు రాయించాను. వాటికి సమాధానాలు కూడా రాయలేదట ! ఇంట్లో పడి ఉన్నదానిని కనక దాని బాధ చూడలేక రెండు మూడు సారులు నేను కొంచెం సూచనగా ఆ సంగతి ప్రస్తావించాను. కాస్త పసి పిల్లల సంగతి

ఆలోచించి లేని పోని దుబారా ఖర్చు కట్టిపెట్టమని బతిమాలుకున్నాను. అయితేమాత్రం లాభమేమిటి? అసలు అతను నా మాటే తిన్నగా వినిపించుకున్నట్టు కనబడ లేదు. ఆ పైన నేను మరి బాగుండదని మాట్లాడ కూరుకున్నాను. చెప్పద్దూ! ఏదో పెద్ద దాన్ని కను. ఆ మాత్రమయినా చెప్పాను గాని, లేకపోతే నేనెవరిని నాయనా, అతనిని అదుపులో పెట్టడానికి?....ఇంతకీ ఆ చల్లని తల్లి దయ ఎలాగుంటే అలాగవుతుంది! మనమేం చెయ్యగలం?'

అయినా కృష్ణమూర్తి అంతర్యంలో స దేహం పూర్తిగా తొలగి పోలేదు. పొటమరిస్తున్న మానసిక వ్యధతో, మేళవించిన జిజ్ఞాసతో తిరిగి ప్రశ్నించాడు.—

'అయితే ఇన్నాళ్ళనించి ఉన్న దానికి విజయ ఇప్పుడింతగా బాధపడవలసినంత అవసరం ఏమి వచ్చింది?'

'అబ్బే! అంత పెద్ద బెడద ఏమిలేదు. ఆ సరోజ, ఇతనూ కలిసి ఒకే రైల్లో ఏలూరు వెళ్ళారట! ఆ పైన ఇద్దరూ కలిసి మళ్ళీ చెన్న పట్టణం కూడా వెళ్ళారుట! ఆ సంగతి తెలిసినప్పటినించి ఇది ఇలాగ కుమిలి కుమిలి దుఃఖ పడుతూంది. అవునుమరి దానికి బాధగా ఉండదూ?'

'ఎవరు చెప్పారీ సంగతి?'

'ఒకరు చెప్పేదేమిటి? లోకం అంతా కోడై కూస్తూంటేను! ఆ సరోజ పనిమనిషి, మన దాసీ దానితో చెప్పిందిట'

కృష్ణమూర్తి కప్పటికి విజయలక్ష్మి అంతర్యంలో కుతకుతలాడుతున్న దుస్సహ మానసికవ్యథ అంతరార్థం అంతా పూర్తిగా బోధపడింది. అందువల్లనే తానెంతో ఆప్యాయంగా అడిగినప్పుడు ఆమె ఆ విధంగా కుప్పగా పరుపుమీద కూలబడి వెక్కి వెక్కి ఏడ్చినదనికూడ గ్రహించుకున్నాడు. ఆ వ్యవహారం అంతా ఆలోచిస్తూంటే అతనికెంతయినా వేదన కలిగింది. ఉసూరుమని నిట్టూర్చి యథాలాభంగా అన్నాడు.

'నేనీ ఊరు వచ్చిన కొత్తలో విజయ కొంతముభావంగా ఉన్నట్టు కనబడింది. కాని ఈ మధ్యన మా ఇంటికివచ్చినప్పుడల్లా బాగా కులాసాగా ఉన్నట్టే మాట్లాడింది. మనస్సులో ఇంతటి మథనతో బాధపడుతున్నట్టు నాకు చూచాయగానయినా తెలియలేదు.'

వర్ధనమ్మ రవంత సేపు ఊరుకొని ఉసూరుమని నిట్టూర్చింది—

'అవును నాయనా! అసలు దాని ధోరణే అంత. ఆ పైన ఈ మధ్యన మరింత గుంభనగా ఉండడం మొదలు పెట్టింది. ఎంతగా బాధపడుతున్నా ఎప్పుడూ నవ్వు ముఖంతోనే కాలక్షేపం చేసింది. అతనినెన్నడు పల్లెత్తుమాటయినా అనలేదు. అన్నీ దిగమింగుకుని ఎంతో గుట్టుగా రోజులు గడుపుతూంది. ఒక్కనాడయినా ఎక్కడికి వెడుతున్నారనిగాని, ఏమి చేస్తున్నారనిగాని అడగలేదు! తెలుసునా?'

వర్ధనమ్మ రవంత గద్గదికతో మరి మాట్లాడలేక కంట నీరు పెట్టుకుంది. వణుకుతున్న చేతివేళ్ళతో కనుకొలుకులు తుడుచుకుంది. అంతలోనే కృష్ణమూర్తి అందుకున్నాడు.

'అదేమిటి బామ్మగారూ! మాలాంటి వాళ్ళకి ధైర్యం చెప్పవలసినవారు మీరుకూడా అలాగ అధైర్యపడితే ఎలాగ? ఇంక ఈ వేళ రాత్రికి మేమిద్దరము ఇక్కడే ఉండిపోతాములెండి. మరేం కంగారుపడకండి! నేను వెళ్ళి కాస్సేపు విజయ దగ్గిర కూర్చుంటానులెండి!"

కృష్ణమూర్తి లేచి ఏదో ఆలోచిస్తూ నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఆమె పడుకున్న గదిలోకి తిరిగివచ్చి ముఖకవళిక జాగ్రత్తగా పరిశీలించాడు. విజయలక్ష్మి కళ్ళు మూసుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నది. సావిత్రి పసిపిల్లలిద్దరికి కొంచెం పక్కగా కూర్చుని పరధ్యాన్నంగా ఏదో ఆలోచిస్తున్నది. ఇంక ఆ వేళ యింటికి తిరిగి వెళ్ళడంలేదని భార్యతో చెప్పి, కృష్ణమూర్తి విజయలక్ష్మికెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

రెండుమూడు రోజులనుంచి తల దువ్వుకోకపోవడం మూలాన ఆమె జుట్టు అంతా చిందరవందరగా ఉంది. ముంగురులన్నీ నుదుటిమీద పడి జీరాడుతున్నాయి. కుంకుమ తిలకం చెరిగింది. ఎంతగా కృశించినా ఆమె ముఖంలో సౌందర్యరేఖ రవంతయినా క్షీణించలేదు! నిద్రాముద్రితమయినందువల్ల అది ప్రసన్నంగా, రవంత ప్రశాంతంగా ప్రకాశిస్తున్నది. కొంచం తగ్గించిన హరికేన్ లాంతరు వెలుతురు లీలగా ఆమె నుదుటిమీద ప్రసరిస్తున్నది. కృష్ణమూర్తి ఇక ఆనాటి రాత్రి ఆమె సుఖంగా నిద్రపోగలదని సంతృప్తిపడ్డాడు అయినా కొంచం జాగ్రత్తగా కనిపెడుతూండ వలసిందని భార్యతో చెప్పి తానింకొక గదిలోకి వెళ్ళి మంచంమీద మేను వాల్చాడు.

కాని ఎంత సేపటికీ అతనికంటి కొక్కకునుకయినా పట్టలేదు. ముసలావిడ చెప్పిన సంగతులన్నీ తలుచుకున్న కొద్దీ అతని గుండెలో నిప్పులకుంపటి రాజుకుంటున్నట్టయింది. చిన్నతనంలో విజయలక్ష్మి, తాను కలిసి బళ్ళో చదువుకున్నప్పటి సంగతులు, పిల్లలతో కలిసి ఆడుకున్న ఆటలు, చేసిన అల్లరి పనులు మొదలయినవన్నీ ఆ సమయంలో అతనికి కళ్ళకికట్టినట్టు స్పష్టంగా జ్ఞప్తికివచ్చాయి. ఆ తరువాత విజయలక్ష్మిని తన కిచ్చి వివాహం చెయ్యాలని మేనమామ తలపెట్టినప్పుడు మేనత్త చేసిన రభస తలుచుకుని కృష్ణమూర్తి కొంత బాధపడ్డాడు. పెళ్ళి అయిన తరువాత అందరితోబాటే అతడు కూడా ఆమె చాలా అదృష్టవంతురాలనుకుని ఆనందించాడు. కాని ప్రస్తుతపరిస్థితినిబట్టి చూస్తే అదంతా ఒక్కమారుగా తారుమారయినట్టు కనబడింది. ఎంతలో ఆమె జీవితం ఎంత విడ్డూరంగా మారిపోయింది! ఆ సమయంలో అతనికి వెనకటి సంగతులు కొన్ని క్రమక్రమంగా విస్పష్టంగా జ్ఞాపకంవచ్చాయి. మరి పై సంబంధం చూడకతప్పనిపరిస్థితి ఏర్పడి నప్పుడు అతని మేనమామ అతి కష్టంమీద అయిదారు మంచి సంబంధాలు తీసుకువచ్చాడు. వాటిలో రెండు వర్ధనమ్మకి

నచ్చలేదు. ఇంకొక రెండు టొత్తిగా బాగాలేవని మేనత్త ఈసడించుకున్నది. ఆ పైన ఆ ఇద్దరికి నచ్చిన సంబంధాల వరులిద్దరు వారం పదిరోజుల వ్యవధిలో విజయలక్ష్మిని చూడడానికి వచ్చారు. ఆ తతంగాలన్నీ జరిగిన తరవాత ఆమె మూతి, ముక్కు ముడుచుకుని కూర్చున్నది. అంతేకాని ఇక పెదవి కదపలేదు! ముసలావిడ ఎన్నెన్ని విధాల బుజ్జగించినా రవంతయినా నచ్చినట్టు సూచించలేదు. అలాగే పెడముఖం పెట్టుకుని కూర్చున్నది. ఆపైన ముసలావిడ పోరు పడలేక మేనమామ, పార్థసారథి సంబంధం తీసుకు వచ్చాడు. అతడు పెళ్లి చూపుల కోసం వచ్చినప్పుడు అందరు ఆ సంబంధం అన్నివిధాల మంచిదని మెచ్చుకున్నారు. అంతేనా పైపెచ్చు ఆనాడు విజయలక్ష్మి ముఖం మంగళహారతిలా కలకలలాడింది. అమ్మమ్మ అది పసికట్టి అదే సంబంధం చేసి తీరాలని పట్టు పట్టింది. కాని మేనమామ తూగడం కష్టమేమోనని తటపటాయించాడు. అందుచేత నాలుగయిదు రోజులదాకా ఆ వ్యవహారం ఎటూ తేలకుండా నలిగింది. ఆ సమయంలో విజయలక్ష్మి తిన్నగా అన్నపానాలే ముట్టలేదు! చిట్టచివరికి అమ్మమ్మ బలవంతం వల్ల ఆమె అడకోవడం వల్ల ఆ సంబంధమే నిశ్చయించడం జరిగింది. తిరిగి విజయలక్ష్మి చెక్కిళ్ళ మీద చిరునవ్వు వెలుగు చుక్కలు తళ తళ మెరిశాయి!

వివాహమయిన తరవాత ఆమె పార్థసారథిని ఒక్క నిమిషమయినా విడిచి ఉండలేక పోయింది! ఇరుగు పొరుగు అమ్మలక్కలందరు అది పసికట్టి ఎంతో ఆశ్చర్యపడి 'ఇలాంటి విడ్డూరం ఎక్కడ చూడలేదమ్మా!' అని బుగ్గలు నొక్కుకున్నారు! ఎప్పుడయినా పుట్టింటికి వస్తే ఆమె కస్తమానము భర్తమీదనే ధ్యాస! అయితే ఆ తహతహ పైకి వ్యక్తీకరించడానికిష్టపడక ఏదో మిష కల్పించి తిరిగి తొందరగా అత్తవారింటికి ప్రయాణమయేది!

పార్థసారథి కూడా ఆరోజుల్లో ఆమెతోడిదే లోకమన్నట్టుండేవాడు! విజయలక్ష్మి ఎలాంటి అందమయిన చీర కావాలన్నా, నగ కావాలన్నా ఇట్టేవచ్చి వాలేది. అంతేకాదు అతడెన్నడు ఆమె గీసిన గిరి దాటలేదు. ఎప్పుడయినా పుట్టింటికి వెళ్లి వారం పదిరోజులుంటే ఏదోవంక పెట్టి వెనువెంటనే పంపించి వెయ్యవలసిందని ఉత్తరాలమీద ఉత్తరాలు టెలిగ్రాముల మీద అర్జంటు టెలిగ్రాములు గుప్పించాడు! ఒకవేళ తిరిగి రావడంలో నాలుగయిదు రోజులు ఆలస్యమయితే స్వయంగా తానే వచ్చి వెంటబెట్టుకుని వెళ్లాడు!

ఆ రోజుల్లో వారి పరస్పరానురాగం బంధువు లందరిలోను ఒక ఒరవడిగా మారింది! ఇరుగు పొరుగు లందరు వారి ఈడు, జోడు, అందచందాలు, సిరిసంపదలు అన్యోన్యత గమనించి ఎంతో సంతోషించారు! రత్నమాణిక్యాల వంటి పిల్లలిద్దరిని వెంటబెట్టుకుని విజయలక్ష్మి ఎప్పుడయినా పేరంటానికి వెడితే పెద్ద ముత్తయిదువ లందరు పుణ్యం కొద్ది పురుషుడు దాన కొద్ది పిల్లలు దొరకుతారమ్మా! అని ఆమెకు వినబడీ వినబడనట్టు మెచ్చుకున్నారు! అటువంటి విజయలక్ష్మి కీనాడు ఇంతటి దురవస్థ తటస్థించింది!

అక్కడ క్రొత్త ఉద్యోగం ప్రారంభించిన తరవాత కొంత కాలందాకా కృష్ణమూర్తి వారిద్దరు ఎంతో అన్యోన్యంగా ఉన్నారనే అనుకున్నాడు! కాని ఆ రాత్రి ముసలావిడ చెప్పిన సంగతులన్నీ విన్నతరువాత అతనికి అది అంతా భ్రమే అని తేలిపోయింది! హృదయానికొక పెద్ద ఆఘాతం తగిలినట్టయింది!

అయితే పార్థసారథికి సరోజ మీద అంతటి విపరీతమయిన వ్యామోహం కలగడానికేమిటి కారణం? ఎంతగా ఆలోచించినా అతనికి సరిఅయిన కారణమేమీ స్ఫురించలేదు. రెండుమూడు సార్లు స్నేహితుల బలవంతంమీదట నాటకాలకి వెళ్లినప్పుడు కృష్ణమూర్తికి రంగస్థలం మీద ప్రత్యక్షంగా సరోజ అభినయ చాకచక్యం పరిశీలించే అవకాశం కలిగింది. అప్పుడతనికి ఆమె నటనలో కొంత చలాకీ తనం మాత్రమే కనబడింది. అంతేగాని అంత గొప్పగా చెప్పుకొనదగినంత చాతుర్యాలేమి గోచరించలేదు. ఆతరువాత తలవని తలంపుగా ఆమె నొకసారి ఫ్యాన్సీ బజారులో కిషన్‌చంద్ చీరల షాపులో చూడడం కూడా జరిగింది. ఆమెలో అతనికి అందచందాలంతగా కనిపించలేదు. ఏదోసామాన్యంగా ఉన్నదని మాత్రమే అనుకున్నాడు. అంతే! విజయలక్ష్మితో సరిపోల్చినపుడు ఆమె దివిటీ ముందు దీపంలా ఉంటుందని తోచింది.

అయితే తానేదో గొప్ప అందకత్తెనని మిడిసిపాటు మాత్రమే ఆమెలో కొట్టవచ్చినట్టు కనబడింది! ఖరీదయిన చీర కట్టుకుని, పెళపెళ లాడుతూ ఒళ్లంతా నగలు పెట్టుకోగానే అందకత్తె అయిపోతుందా? నక్క ఎక్కడ? నాగలోకమెక్కడ? అందచందాలలో ఆమె విజయలక్ష్మి కాలిగోటి కయినా సరిపోగలదా? మరి పార్థసారథికి ఆమె మీద అంతటి వెర్రి వ్యామోహం ఎందుకు కలిగింది? సరోజ కట్టుకున్న భార్య కాకపోవడమే కారణం కాబోలు!

ఆ సమయంలో కృష్ణమూర్తి కింకొక సంగతి కూడా ఎంతో విచిత్రంగా కనబడింది.

(సశేషం)

పండుగలూ పర్వదినాలూ

హోలీ—ఉగాది

కమలా త్రివేణి

హోలీ హో హోలీ

ఒకటే కోలాహలం! ఒకటే అట్టహాసం! చిమ్మన గ్రోవులనుంచి రంగునీళ్ల ధారాపాతం, ఎక్కడచూచినా బగ్గుండిదుమారం, ఆనందోత్సాహాల అతిశయం, హోలీ హో హోలీ!

హోలీ పర్వాన్ని గురించిన వివిధ గాథలు ఉన్నాయి. హోలిక హిరణ్యకశిపుని చెల్లెలు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని విష్ణుభక్తి నుంచి విముఖుణ్ణి చేయలేకపోయాడు. ఎన్నో హింసలు పెట్టించాడు. ఏనుగులచేత తొక్కించాడు. పాములచేత కరిపించాడు. సముద్రంలో తోయించాడు. కొండమీదినుంచి క్రిందికి దొర్లించాడు. తుదకు అగ్నికి ఆహుతి చేయించాలనుకొన్నాడు. హోలికకు అగ్ని స్తంభనం తెలుసును. ఆమెను అగ్నిలో కూర్చోబెట్టి ప్రహ్లాదుని ఆమె ఒడిలో కూర్చోబెట్టాడు. భగవంతుని మాయవల్ల హోలిక భస్మమైపోయింది. ప్రహ్లాదుడు బ్రతికి బయట పడ్డాడు.

ఫాల్గున పూర్ణిమనాడు ఇంటిముందర ఒక గొయ్యి త్రవ్వి, దానిలో ఆముదపు కొమ్మను నాటి, గోతిలో చెత్తా చెదారం, వంట చెరుకు, పిడకలువేసి నిప్పంటిస్తారు.

రఘు మహారాజు పరిపాలనచేసే కాలంలో ఢుంఢా అనే రాక్షసి ఇంటింటా ప్రవేశించి పిల్లలను బాధించి పెద్ద ఉపద్రవం చేస్తూ ఉండేది. ఆ రాక్షసి చావడానికి వశిష్ఠులవారు చెప్పిన ఉపాయం ఇది: బాలలు కత్తి కటారులు చేత పుచ్చుకొని యుద్ధ వీరులలాగ అట్టహాసం చెయ్యాలి. కట్టెలు, చెత్తా చెదారం చేర్చి నిప్పుచేసి హోమం చెయ్యాలి. నవ్వుతూ, అరుస్తూ, హోమం చుట్టూ ప్రదక్షిణం చేసి నోటికి వచ్చినట్లు నానా తిట్లు తిట్టాలి. దానితో ఢుంఢా రాక్షసి భయపడి నశించిపోతుంది. వశిష్ఠుని ఆదేశం ప్రకారం ప్రజలుచేసి రాక్షసి బాధ తొలగించుకొన్నారట.

యుద్ధభూమిలో మరణించిన వారి జ్ఞాపకార్థం వారి సంతతి వారు హోలీ మంటల చుట్టూ నాట్యంచేసే ఆచారం మహారాష్ట్రంలో ఉంది. వారికి పూనకం రావడం కూడా కద్దు.

హోలీ మంట చుట్టూ శిశువులను ఎత్తుకొని తిప్పితే వారికి భూతబాధ నివారణం అవుతుందనే నమ్మకం ఉంది. హోలీ బూడిదను నుదుట విభూతిలాగ పూసుకుంటారు. పశువులు కట్టిన రాటకు ఈ బూడిద పూస్తే పశువ్యాధులు రావంటారు.

మధురా బృందావన క్షేత్రాలలో ఈనాడు డోలోత్సవం జరుగుతుంది.

హోలీ ఒక విధంగా వసంతోత్సవం కూడా. సంఘంలోని తరతమ భేదాలు విస్మరించి తన్మయం చెందవలసిన పర్వం హోలీ. కాని ఆనందం హద్దుమీరి ఉత్సాహం ఉన్మాదంగా మారకుండా చూచుకోవాలి.

ఉగాది

సొనదేరి పొటమరించి నెరె వాసినయట్టి
యాకు రాలుపు గండ్లయందు దొరగి

యతిబాల కీరచ్ఛదాంకురాకృతి బొల్చి
కరవీర కోరక గతి క్రమమున

నరుణంపు మొగ్గలై యరవిచ్చి పికిలి యీ
కలదండలట్లు గుంపు లయి పిదప

రేఖ లేర్పడగ వర్ధిలి వెడల్పయి రెమ్మ
పసరు వారుచు నిక్క బసరు కప్ప

పూటపూటకు నెక్క గప్పునకు దగిన
మెరుగు నానాటికిని మీద గిరికొనంగ

సోగయై యాకు వాలంగ జొంప మగుచు
జిగురు తళుకొత్తె దరులతా శ్రేణులందు.

సొన తేటపడి, ఆకులు డుల్లిన పల్లాల నుంచి బయటికివచ్చి చిలక పిల్లల చిరు రెక్కలలాగ మెరిసి, ఎర్ర గన్నేరు మొగ్గల లాగ ఎరుపెక్కి, సగం విడిచి, పికిలి యీకల దండల లాగ గుబురుగానై, ఈనె చారలు పెరిగి, వెడల్పయి, రెమ్మ పచ్చబడి సాగి, పసరు పూట పూటకూ ఎక్కువ నీలమై, ఆ నీలిమకు తగిన కాంతి క్రమక్రమంగా హెచ్చి, ఆకు పొడవుగా వాలగా చెట్లలోనూ లతలలోనూ చిగురు తళుకొత్తిందని పెద్దన చక్కగా వర్ణించాడు.



చిగురు తళుకొత్తడం అంటే నవజీవనం వికసించడం అన్నమాట. వసంతంలో చిగురు తళుకొత్తుతుంది. నవ జీవనం వికసిస్తుంది. ఆ వసంతం చైత్ర శుద్ధ పాడ్యమితో ప్రారంభం అవుతుంది. ఆనాడే ఉగాది.

చైత్ర శుద్ధ పాడ్యమి నాడే బ్రహ్మ సృష్టి ప్రారంభం అయిందని ప్రసిద్ధి. అది దాని విశిష్టత. ఉగాదితో కొత్త సంవత్సరం ఆరంభం అవుతుంది.

ప్రాప్తే నూతనవత్సరే ప్రతిగృహం
ధ్వజారోహణం
స్నానం మంగళ మాచరే ద్ద్విజవరైః
సాకం సుపూజోత్సవైః
దేవానాం గురుయోషితాం చ విభవా
లంకార వస్త్రాదిభిః
సంపూజ్యో గణకః ఫలం చ శృణుయా
త్తస్మాచ్చ లాభప్రదమ్.

ఉగాదినాడు ధ్వజారోపణం, అభ్యంగస్నానం, పంచాంగ శ్రవణం, సంవత్సర పూజనం విధింప బడ్డాయి. సంవత్సర పూజ చేసేటప్పుడు చెప్పవలసిన సంకల్పం ఇది:

మమ సకుటుంబస్య సపరివారస్య స్వజన
పరిజన సహితస్య వా ఆయురారోగ్యైశ్వర్యాది
సకల శుభ ఫలోత్తరోత్తరాభి వృద్ధ్యర్థం
బ్రహ్మాది సంవత్సర దేవతానాం పూజన
మహం కరిష్యే

ఈ పూజలో బ్రహ్మ మొదలు అనేక దేవతలే కాక యక్ష గంధర్వ ఋషి మనుష్య నదీ పర్వత పశు పక్ష్యాదుల ప్రస్తావన కూడా వస్తుంది.

పూజాదుల విషయం ఎలా ఉన్నా సాంప్రదాయికంగా వస్తున్న ఒక ఆచారం మాత్రం ఇంకా మిగిలిఉంది. అది వేప పూవు పచ్చడి తినడం.

పారిభద్రస్య పత్రాణి కోమలాని విశేషతః
సపుష్పాణి సమాదాయ చూర్ణే కృత్వా విధానతః
మరిచం లవణం హింగు జీరకేణ చ సంయుతమ్
అజమోదయుతం కృత్వా భక్షయే ద్రోగశాంతయే.

లేత వేప చిగుళ్ళూ, పువ్వులూ పొడిచేసి అందులో మిరియాలూ, ఉప్పూ, ఇంగువా, జీలకర్రా, వామూ కలిపి తింటే రోగ శాంతి అవుతుందని చెప్పబడింది.

చైత్ర ఆషాఢ ఆశ్వీయుజ మాఘ మాసాలలో నవరాత్రులు చెప్పబడ్డాయి. కాని చైత్ర ఆశ్వీయుజ మాసాలలో వచ్చే నవరాత్రులే ముఖ్యంగా పరిగణింపబడతాయి. ఆశ్వీయుజ మాసంలోని నవరాత్రులను శారద నవరాత్రు లంటారు. వాసంత నవరాత్రులు దేవీ నవరాత్రులే కాక రామ నవరాత్రులు కూడా. శ్రీరామ నవమి ఉత్సవాలు ఉగాదినుంచే మొదలు.

ప్రకృతిలో చిగురు తళుకొత్తినట్లే మనసులో ఆశలు రేకెత్తడం సహజం ఉగాదినాడు. అదే నవజీవన వికాసానికి నాంది.

నాటక రచనా రీతులు

---ప్రఖ్య శ్రీరామమూర్తి

"క్రీడనీయకమిచ్ఛామో దృశ్యం శ్రవ్యంచయద్భవేత్"- చూసి, విని ఆనందించడానికి వీలైన, వినోద వస్తువును కోరు చున్నాము-

ఈ కోరినది: లోకపాలురు.

సమయం: యుగసంధి.

సమయ విశేషం: ప్రజలంతా స్వధర్మ బాహ్యులై కామ క్రోధ మద మాత్సర్యాలకు లోనై గ్రామ్య ధర్మ ప్రవృత్తులైపోయిన పరిస్థితి।

ఈ కోరిక విని బ్రహ్మదేవుడు___"అంతేకాదు- ధర్మాన్ని నిరూపించేది- పురుషార్థాల్ని సాధించేది-కీర్తి ప్రతిష్ఠలు కలుగజేసేది- సమ్యగర్థాని- సర్వ శాస్త్రార్థ సంపన్నమైనది అయిన నాట్యవేదం సృష్టించి ఇస్తాను" అన్నాడు. అని ఆ ఐదవ వేదాన్ని ప్రసాదించాడు. అది అంచెలంచెలుగా దివినుండి భువికి దిగి వచ్చింది. ఆ దివ్యవాణి ఆదేశానుసారం ధర్మ ప్రవృత్తులైనవారి ధర్మము, కాముకుల కామము, దుర్వినీతుల దుండగాలు, పండితుల పాండిత్యము, క్లీబుల హాస్యాస్పదత్వము, శూరుల శౌర్యము, మూఢుల అజ్ఞానము మొదలైనవాటి నెన్నిటినో సంతరించుకుని, నానా భావాలూ నానావస్థలూ లోక వృత్తానుకరణంగా చిత్రించిన వేద విద్యేతి హాసాఖ్యాన పరి కల్పితాలైన నాటకా లనేకం వచ్చాయి. ఇక్కడ నాటక శబ్దం రూపకార్థంతో వాడబడుతోంది.

వేద విద్యేతిహాసాల్లోంచి కథావస్తువుల్ని తీసుకుని నాటకాలు రచింపబడ్డాయి. అంటే అవన్నీ సుప్రసిద్ధమైన-అంటే గతకాలానికి సంబంధించిన సంఘటనలను మాత్రమే వస్తువుగా తీసుకుని వ్రాయబడ్డాయన్న మాట। లేదా కల్పితమైన వస్తువుతో రచింపబడ్డాయన్న మాట। దీన్నిబట్టి వర్తమాన చరిత్రగాని, ప్రత్యక్ష సంఘటనలు గానీ వర్జింపబడ్డాయని ఊహ్యం. ఈ వివర్జన సార్వకాలికమైన, విశ్వజనీనాలైన రచనలోనే కనిపిస్తోంది. స్ఖలితమై పోయినవి పోగా, మరిచిపోయినవి పోగా, అడుగూ బొడుగూ మిగిలినవేళ్ళ మీద లెక్కింప దగిన ప్రహసనాదికాల్లో తప్ప సమకాలీని వ్యష్టి, సమిష్టి చిత్రణ మృగ్యం। ఎందువల్లనంటే సమకాలీన చిత్రణ ఎప్పుడూ రాగద్వేషాలకు అతీతం కాదు కనక। తత్ఫలితం క్రోధాది రాగవిజృంభణమూ ఇతోధిక ధర్మచ్యుతీ కనుక।

ఇవి నాటి నాటకరచనా రీతులు కొన్ని. ఆ నాటి నాటకాలు ప్రస్తుతకాలమాన పరిస్థితుల్ని బట్టి మనకు చాలా విచిత్రంగా కనుపిస్తాయి. నాటినాటకం ఏదితీసుకు చూసినా ఒక్కొక్కటి నాలుగు రోజులపాటు (ఇంకాకొన్ని వారం రోజులపాటు కూడా) వేస్తేగాని పూర్తి కానిది। ఒక్క సంస్కృతాంధ్ర నాటకాలే కాదు-దేశ్యమైన యక్షగానాదికాలూ, తోలుబొమ్మ లాటలూకూడా వెనుకటి రోజుల్లో ఇంతింత పొడవూ వుండేవి। దీనికి కారణం నాటి సమాజ పరిస్థితి. కాశీకి వెళ్ళడం కాటికి వెళ్ళడమేనని అనుకునే రోజులు। ఊరికీ ఊరికీ మధ్య అనంతమైన దూరం। ఎక్కడికక్కడే సర్వ సమృద్ధులూ కలిగిన గ్రామీణ, పట్నవాసజీవితాలు। ఉన్న నాలుగడుగుల చెక్క దున్నుకోవడమో, లేకపోతే తమ పాండిత్యంతో గానీ కవిత్వంతో గానీ రాజాదరణ పొంది సుఖంగా కాలంవెళ్ళ బుచ్చడం తప్ప వేరెరుగని నిర్మల మనః ప్రవృత్తి। నిత్య కృత్యాలన్నీ పూర్తి చేసుకుని, పొద్దు గుంకగానే సుష్టుగా భోంచేసి సవిలాసంగా, కేవలం వినోదార్థం కానీ, సత్సంగంతో తమ బుద్ధిని సన్మార్గాల్లో పెట్టాలని గానీ, సత్కాలక్షేపం చేద్దామని గానీ రచ్చబండకు వచ్చే అంతః కరణలు ఆనాటివి। అందుకనే ఆనాటి నాటకాలుకూడా అంత తీరుబాటుగానూ ప్రారంభం అయ్యేవి। ముందు సూత్రధారుడు వస్తాడు-ఇంకా పూర్వనాటకాల్లో అయితే అంతర్యవని కాంగాలూ, బహిర్యవని కాంగాలు, శుద్ధ చతురశ్ర పూర్వరంగ విధీ వగైరాలు నిర్వర్తించిన తర్వాత-నాందీ గీతం ఆలాపించబడుతుంది. ఆ నాందీగీతంలో దేవ, గో, బ్రాహ్మణులకు స్వస్తి, రాజ ప్రశస్తి చెపుతూ, తమ నట సమాజం యొక్క విజయాన్నీ, నాటక రచయిత యశస్సునూ ఆశిస్తూ-

"పాదతలాహతి పాతిత శైలం
క్షోభితభూత సమగ్ర సముద్రం।
తాండవ నృత్తమిదం ప్రళయాన్తే
పాతు జగత్సుఖదాయి హరస్య॥"

అంటూ ప్రళయంలోంచి ప్రాదుర్భావాన్ని ఆశంసించి, ప్రేక్షక లోకాన్ని ఆశీర్వదించి, క్రమ క్రమంగా ఆ ప్రేక్షకుల్ని నాటక సందర్శ నోత్సాహుల్ని చేసి, నటీ పారిపార్శ్వ కాదుల సహాయంతో సమయోచితమైన ఋతుగానాదులుచేసి వారి హృదయాలను ఆహ్లాదపరచి ప్రదర్శనీయమైన నాట్య వస్తూన్ముఖుల్ని చేసేవాడు సూత్రధారుడు।

కాని ఇంత ఓపిక ఈ నాటి ప్రేక్షకులకూ లేదు_ అంత విశ్రాంతి ప్రదర్శకులకూ లేదు. Fastness is the epidemic of Present day life! ఈనాడు మనం అందరం పరుగెత్తుతున్నాం! ఎందుకో ఎక్కడికో అడిగి ప్రయోజనంలేదు_ సమాధానం తెలీదు! కాని పరుగెత్తడం మటుకు తప్పడంలేదు. ఆఫీసుల్లోంచో, షాపుల్లోంచో, వ్యాపార సంస్థల్లోంచో_అన్నీ ఎక్కడి వక్కడ వదిలేసి ఏదో తృష్ణతో, ఏదో ఆనందంకోసం పరుగెత్తుకు వస్తాం. మళ్లీ అక్కణ్ణుంచి ఎందుకో దేనికోసయో పరుగెత్తుకు పోయేదాకా కాలు నిలవదు! మనం వచ్చి, వెళ్లిపోయేలోగా మనం చూడాలనుకున్నది, చూపించాల్సిన బాధ్యత ప్రదర్శకులది! మనం ఇచ్చే రూపాయో రెండో అన్యాయార్జితం కాదని నిరూపించాల్సింది వాళ్లు! మళ్లీ వస్తే మరో టిక్కెట్టు తిట్టుకుంటూనైనా కొనే మనః ప్రవృత్తిలో మనల్ని పెట్టి భద్రంగా చూసుకోవాల్సిన అవసరం ప్రదర్శకులది! మనకున్న కాస్త సమయంలో పంచ కార్యావస్థలూ, అర్థ ప్రకృతులూ, పంచ సంధులూ గల వస్తువుని మన కందించి ఆనందింప జేయాల్సిన బాధ్యత నాటక కర్తది!

దీనితో నాటక రచనా విధానంలోనే విప్లవాలు పుట్టుకొచ్చాయి. పూర్వరంగము, నాంది, విష్కంభం మొదలైనవన్నీ అంతరించాయి. నటీమణి లలితమంద పదవిన్యాసం, ఆ మధుర మంజీర రవళి, ఋతుగానం అన్నీ మృగ్యమైపోయాయి. కథా వస్తువును ముఖసంధి నిబంధితమైన ఉపోద్ఘాతాలేవీ లేకుండానే సరాసరి గర్భసంధితోనో, నియతఫల ప్రాప్తితోనో ప్రారంభించి ప్రేక్షకుల్ని ఆకట్టుకోవాల్సి వచ్చింది. ఒక స్త్రీ ఆర్తనాదమో, ఓ రివాల్వరు ప్రేల్పుడో, ఒక గావుకేకో నాందీభూతమైంది. మళ్ళీ కాస్త వెనక్కి వెళ్ళి అక్కణ్ణుంచి నరుక్కు రావడం గానీ, లేదా లోపించిన ఇతివృత్తాన్ని Flash Back మొదలైన పద్ధతులలో కాస్త పరామర్శించి గానీ Tempo పేరిట గబగబా ముక్తసరిగా ఫలావాప్తి అందుకోవడం అత్యవసరమైంది.

ఈ లోగానే నాట్య శరీరభూతమైన 'ఇతివృత్తం' క్రమ క్రమంగా అనేకమైన అవతారాలు ఎత్తడం ప్రారంభించింది. మహనీయమైన, మహా మహితాత్మకమైన గుణాలకు రూపకల్పనలో, ఆశ్రయాలో అయిన మహాపురుషుల చిత్రణ కాలక్రమానా సమయానుకూలంగా మార్పు చెందింది. దేశకాల సామాజిక వ్యవస్థ ననుసరించి తత్కాలికమైన సమస్యలు ఆ దర్శపాత్రల స్థానాన్ని ఆక్రమించాయి. కడుపునిండాతిండి, ఒంటినిండాబట్ట దొరికినన్నాళ్లూ రాజుల్ని పొగిడిన నాట్యాలు, అవి లేనినాడు_ ప్రజలు దాస్య శృంఖలా బద్ధులై స్వరాజ్య సిద్ధిని ఆశిస్తూ అలమటిస్తున్ననాడు విప్లవ ధోరణులను లేవదీసి స్వపరిపాలనావసరాన్నీ, తదంగ భూతమైన సామాజిక పునరుజ్జీవనాన్నీ కోరుతూ ప్రయోజనాత్మకమైన కళా రూపాలై విశృంఖలంగా విలసిల్లాయి! విదేశ ప్రభుత్వాన్నో, జమీందారీ విధానాన్నో దుయ్యబట్టసాగాయి! మరో ప్రక్కనుంచి నిరంకుశమైన సామాజిక వ్యవస్థను కూడా మార్చివేయాలనీ సమాజంలోని కుళ్లునూ గుడ్డి విశ్వాసాల్నీ మౌఢ్యాన్నీ కడిగి పారేయాలనీ బద్ధ కంకణంతో అనేక నాటకాలు రూపొందాయి. వీటన్నిటిమధ్యా జాతి మత సంస్కృతులనూ, గ్రాంథిక వ్యావహారికాది భాషా వాదాల్నీ పురస్కరించుకునికూడా వివిధ రచనలు ఆవిర్భవించాయి! ప్రస్తుత విషయాన్ని సూటిగా చెప్పడం అవసరం అయింది_ కావల్సింది అనుసరణ, ఆచరణ కనుక! పద్యాలు_ పాటలు_ ఏవి ప్రేక్షకుల్ని ఉత్తేజపరుస్తాయో అవన్నీ వెలిశాయి! పద్యాలు శ్లోకాలు అర్థంకాని గ్రామీణుల చైతన్యంకోసం తిట్లు పోట్లు అవసరమయ్యాయి. ప్రఖ్యాత వస్తువులు; మహనీయ గుణ ప్రశంస అనవసరం అయ్యాయి. మధ్య తరగతివారు, సామాన్యులూ కథా నాయకులయ్యారు. సామాజిక దోషాలని అనుకొనబడే వన్నీ కథా వస్తువులయ్యాయి! సంఘ సంస్కరణ పరమధ్యేయమైంది!

ఇటీవల ఈ ఉడుకు చల్లారింది! ఆ నాటకాల ప్రభావమో లేక సంఘపు కట్టుబాట్ల యడల ప్రజల్లో బలిసిన నిర్లిప్తతో ఏదైనా కారణం కావచ్చు! కాల ప్రభావం అనడం ఛాందసంగా భావింప బడవచ్చు. ఏది ఏమైనా ఇక ముందీ సంఘ సంస్కరణ నినాదాలకు అర్థమూ లేదు_ సార్వకాలికాల విశ్వజనీనాలూ కాని ఈలాంటి ఇతి వృత్తాల అవసరమూ లేదు!

అవసరమైనవేవో చెప్పే ముందు ఓ చిన్నసంగతి:_ నాటకేతి వృత్తం ప్రఖ్యాతం కానక్కర లేకపోవడంతో నాయకులు ఉదాత్తులో, లలితులో, శాంతులో ఐన ధీరులు కానవసరం లేకపోవడంతో, కథా వస్తువుల పాత్రలు సామాజికాలు, సమకాలీనికాలు కావడంతో పూర్వపు కట్టుబాట్లు విదళించబడ్డాయి! ప్రదర్శనీయాలు కావని భావించబడే యుద్ధము, హత్య, భోజనాదికాలు, ఆలింగన చుంబన సమానాలైన క్రియలు రంగస్థలంలోకి ప్రవేశించాయి. ఛాయా మాత్రంగా ఐతే ఫరవాలేదేమో! ఐనా 'తండ్రి, తల్లి, కొడుకు, కోడలు కలిసి చూస్తూంటారు నాటకం_ అందరూ ఆనందించేవీ హరించేవీ చూపాలని భరతుడు నిర్దేశించాడు. గర్హించేవీ భరించరానివీ వద్దని మొత్తుకొన్నాడు! నేటి రంగస్థలంమీద కనుగ్రుడ్లు పీక్కుని రక్తధారలు వర్షించడం, ఖూనీచేసి పచ్చినెత్తురు తాగడం మొదలైనవిచూస్తే ఆయన ఏమనేవాడో గాని ప్రేక్షకులు చాలామందిలో సానుభూతికి బదులు జుగుప్స కలుగుతుందనడంలో సందేహంలేదు. పసిపిల్లలు హడలిపోయి గోలపెట్టడం నామటుకు నే నెరుగుదును.

సరే_ ప్రస్తుతాంశానికి వచ్చి, స్థూలంగా విచారిస్తే నేటి సమాజానికి ఏ లోటూ లేదు. ఏది కావాలంటే అది చేసుకోడానికి అన్ని వీళ్ళూ వున్నాయి. ప్రభుత్వం మనది! పరిపాలకులం మనం! ఐనా అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు మనకు లేని దారిద్ర్యం మరొరికి లేదు, మనలో వున్న వ్యత్యాసాలూ విద్వేషాలూ మరో చోట లేవు. ఇప్పుడున్న స్వార్థమూ, సామాజిక శ్రేయోభిలాషా రాహిత్యమూ ఇంకెక్కడా ఎప్పుడూ లేవు.

అందుకని నాటక పాత్రల్లోంచి వ్యవస్థలూ విధానాలూ ఇప్పుడిప్పుడే మాయమై పోతున్నాయి. వ్యక్తులు నాయకులౌతున్నారు. వ్యక్తిత్వాలూ అంతస్సంఘర్షణలూ ఇతి వృత్తాలు అవుతున్నాయి! మానవుడు మనిషి కావాలి! వ్యష్టి సంస్కారం జరిగితే గాని సమాజం సంస్కరించ బడదు! ఇది ప్రస్తుత

ధోరణి : నాటకం చూస్తూంటే ప్రేక్షకులు కుంగిపోరాదు—కుంచించుకు పోరాదు ! రెక్కలు చాచి తమకుతెలేని అంతస్తులో విహరించాలి : ఆ స్వచ్ఛ వాయువులు పీల్చి అంతస్సంస్కరణ చేసుకోవాలి : ఇప్పుడు రెచ్చగొట్ట వలసింది ఉద్రేకాల్ని కాదు—అంతః కరణల్ని :

"అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజా పతిః ।
యధాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే ॥"

కవి సృష్టి కర్త ! బ్రహ్మ సృష్టించిన ఈ ప్రపంచానికి విభిన్న ప్రపంచాలు—తన కిష్టమైనవి—ఇష్టమైన రీతుల్లో సృజించగల ప్రతి బ్రహ్మ : సహజ ప్రపంచంలో ఏ ఒక్కచోటా సమకూడని సమస్త కళలనూ పుంజీ భూతం చేసి భూతల స్వర్గం నిర్మించగల కళా ద్రష్ట : శిల్పము, సంగీతము, సౌందర్యమూ ఒక్క మూసలో పోసి అచ్చులు దింపగల నిపుణుడు : అతను ఏం వ్రాస్తే ఏది అందిస్తే అది చూసి, విని ప్రేక్షక లోకం ఆనందించ వలసిందే : మునుముందు గద్య పద్యాత్మకాలు—తర్వాత కోకొల్లలుగా పాటలతో—ఆ తర్వాత వచన రీతి గీతాలతో—ఇక నేడు స్వచ్ఛ గద్యాత్మ కాలైన నాటకాలు : ఈ నాటి నాటకాల్లో కనిపిస్తున్న వైవిధ్యము, పాత్ర చిత్రణ రీతి, మానసిక తత్త్వవిశ్లధీకరణమూ నాటి నాటకాల్లో లేవని చెప్పడం అతిశయోక్తి కాదేమో : దీనికి కారణం వ్యష్టి సంస్కారావసరమూ, ప్రాచ్య ప్రతీచ భావ సమ్మేళనమూ కూడానూ : దీంతో పాత భావాలకూ, పాత దృక్పథాలకూ స్వస్తి చెప్పే ప్రయత్నం ప్రారంభమైంది : పురాణ పాత్రలు కూడా కొత్త బట్టలు వేసుకుని మన ముందు సాక్షాత్కరించ నారంభించాయి. ఇటీవలి తమిళ నాటకాల్లో ఈ కోవ బాగా అభివృద్ధి చెందింది. ఉదాహరణ లంకేశ్వరన్, సంభవామి యుగే యుగే, తెలుగులో అశోకం, సామ్రాట్ అశోక మొదలైనవి.

ఒక కవి చిత్రణ ప్రకారం మనుజుల పుర్రెలతో చర్లాట లాడగలిగిన వేనరాజు—సనాతనాచార మర్యాదా విహీనుడైన వేనరాజు—ఆర్ష ధర్మాల్ని ధిక్కరించి వధార్హుడైన వేనరాజు మరో రచయిత చిత్రణలో మత సంస్కర్తగా సాటి మానవులయెడ అత్యంత ప్రేమాభిమానాలు గల ధర్మరాజుగా అతని వధ ఖూనీ అనిపించేటంత ప్రజా రంజకుడుగా అవతరించాడు. వేరొకరి రచనలో అదే వేనరాజు "స్వార్థపరులై, మూఢ నమ్మకాలతో దురహంకార ప్రేరితులైన నిరంకుశుల బారినుండి నిరక్షరాస్యులైన ప్రజా బాహుళ్యాన్ని సముద్ధరించగోరి, భావదాస్య నిర్మూలనకే తన జీవితాన్ని అర్పించిన త్యాగశీలి, విప్లవకారుడు" అయ్యాడు. చారిత్రకంగా నిజమో అబద్ధమో—అబద్ధమేనని తేలుతోంది—చిత్రాంగిని చూడండి ! ఒకరి కలంలోంచి శుద్ధకాముకిగా అవతరించిన చిత్రాంగి, కవి భేదంతో ప్రబంధ యుగం నాటి పతివ్రతగా, సుక్షత్రియ వీరకన్యగా, మూర్తీభవించిన ప్రేమ త్యాగాలుగా రకరకాలుగా రూపు మారింది :

ఇలాంటి విలా జరుగుతూండగా ఆంధ్ర నాటక కళా పరిషత్తు అమెచ్యూర్ నాటకాలను ఆదరించ ప్రారంభించడంతో పోటీ నాటకాలు వచ్చాయి. ఇందాకటి నుంచీ చెప్పిన నవీన భావాలన్నీ ఇముడ్చుకుంటూనే hero worshipకు కూడా అవకాశాలు కల్పించాయి. ఈ నాటకాలు ఉత్తమ నట బహుమానం—దీనికి అవకాశం వుంటేనేగాని ఏ అమెచ్యూర్లూ ఏ నాటకమూ చేపట్టడం లేదు ఈ రోజుల్లో : సందేశం అందించ నక్కర్లేదు—సంస్కారము చెయ్యనక్కర్లేదు—తన నటనా వైదుష్యం ప్రేక్షకుల ముందు అలా అలా విరజిమ్మే అవకాశం వున్న పాత్ర కావాలి—అలాంటి పాత్ర వున్న నాటకం కావాలి : కనుక అవీ వచ్చాయి· ఇంకా వస్తున్నాయి : రాక తప్పదు. కనీసం స్వపాండితీ ప్రకర్ష చూపుకునైనా సంతృప్తి పడవద్దా నేటి నటలోకం? ఈ అమెచ్యూర్ నాటక సమాజాల ఉత్సాహం ఎక్కువౌతున్న కొద్దీ వారి నియమిత అవకాశాలు కూడా నాటక రచన రూపు మారడానికి కారణాలయ్యాయి. సమగ్రమైన దృశ్యాలు—అంటే సీనరీలు గాని సెట్టింగులు గాని తయారు చేయించుకోడానికి తగిన అర్థ బలం లేదు గనుక ఒకటి రెండు సెట్లతో పని పూర్తి అయిపోవాలి. మూడు నాలుగు మంచి పాత్రలువుంటే అంత మంది మంచి నటులు కావాలి కనుక, అంతమంది మంచి నటులు ఒకే సమాజములో కలిసి కట్టుగా వుండటం ఈ నాడు సామాన్యంగా సృష్టి విరుద్ధం కనుక, ఏకైక నాయక పాత్ర మాత్రమే వుండాలి : అమెచ్యూర్స్ కనుక, తగినంత మంది స్త్రీ నటీమణులు దేశంలో లేరు గనుక, వున్నా భరించరానంత కిరాయి ఇవ్వాలి కనుక ఒకటి రెండు స్త్రీ పాత్రలకంటె ఎక్కువ వుండరాదు : అంచేత ఒక హీరో, ఒక సెట్టు, ఒక స్త్రీ పాత్ర—ఇవీ ప్రస్తుత నాటకకర్తల పరిధులు : అసలు స్త్రీ పాత్రలే లేని నాటకాలు నాటికలు కూడా, వర్తమాన పరిస్థితుల్ని బట్టే ననుకోండి, కోకొల్లలుగా అవతరిస్తున్నాయి.

ఏది ఏమైనా కావలసింది ఆనంద లబ్ధి :

"ఆనందా దేవ ఖల్విమాని భూతాని జాయంతే,
ఆనందా దేవ జాతాని జీవంతి,
ఆనందం ప్రయాన్త్యభి సంవిశంతి"

ఈ భూత సృష్టి అంతా ఆనందం నుంచి ప్రభవిస్తోంది : ఆనందంలో వర్ధిల్లుతోంది : ఆనందాన్ని వెతుక్కుంటూ అందులో లీనమై పోతోంది! ఈ ఆనందానికి ముఖ్యాలంబనాల్లో సాహిత్యాంతమైన నాటకం ఒకటి : ఈ నాటకాల్లో ఎన్ని ఎన్నాళ్లు ఆనందోత్పత్తిని కలిగిస్తాయో, ఏవి సార్వకాలికాలై నిలబడతాయో కాలమే నిరూపించాలి.

జిల్లాలనుంచి

ఆదిలాబాదు ఆసుపత్రిలో పేడ్యాట్రిక్ వార్డు

ఆదిలాబాదులో, జిల్లా హెడ్ క్వార్టర్స్ ఆసుపత్రి మహిళా విభాగంలో రూ. 50,000 ల స్వచ్ఛంద విరాళాలతో నిర్మించిన పేడ్యాట్రిక్ వార్డుకు, ఆరోగ్యశాఖా మంత్రి శ్రీ పి. వి. నరసింహారావు ఫిబ్రవరి 14 వ తేదీన ప్రారంభోత్సవం చేశారు.

ఖానాపురంలో వయోజన విద్యాకేంద్రం


వరంగల్ జిల్లా గూడూరు పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ ఇ. జనార్దనరెడ్డి, ఫిబ్రవరి 2 వ తేదీన ఖానాపురంలో, వయోజన విద్యాకేంద్రాన్ని ప్రారంభించారు. మొదట కూరగాయల ప్రదర్శన క్షేత్రానికి ప్రారంభోత్సవం జరిగింది. ఈ క్షేత్రానికి ఉచితంగా విత్తనాలు సరఫరా చేయడానికి గూడూరు పంచాయతీ సమితి అంగీకరించింది.

భువనగిరిలో కోళ్ల పెంపకం

భువనగిరి పట్టణంలో ప్రజలు శాస్త్రీయ పద్ధతులలో కోళ్లను పెంచి తమ ఆదాయాన్ని పెంపొందించు కోవడం నానాటికీ పెరుగుతున్నది. గత సంవత్సరం అనేక మంది వ్యక్తులు తమ ఇళ్ళలో, పెరళ్ళలో కోళ్ళ పెంపకం క్షేత్రాలను నెలకొల్పుకున్నారు. గ్రుడ్ల అమ్మకం ద్వారా వారు లాభాలు ఆర్జించారు.

విద్యుచ్ఛక్తి సరఫరా

యెల్లారెడ్డి తాలూకా మచ్చాపూర్ గ్రామంలో విద్యుద్దీపాలకు బి. డి. ఓ. ప్రారంభోత్సవం చేశారు.




అంతర్జాతీయ యాత్రా వారోత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లా ఎల్లందు గ్రామరైతులు 60 మంది నాగార్జునసాగర్ ఆనకట్ట సందర్శించినప్పటి చిత్రం

పట్టా పత్రాల పంపిణీ

హైద్రాబాదు జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఎం. భోజిరెడ్డి ఫిబ్రవరి మొదటి తేదీన చేవెళ్ళ గ్రామంలో భూములు లేని పేదలకు పట్టా పత్రాలను పంపిణీచేశారు. పట్టాలు పొందినవారు తమ భూములను తగినంతగా రసాయనిక ఎరువులు వాడడం ద్వారా సారవంతంచేసి వ్యవసాయోత్పత్తిని పెంచాలని ఆయన ఈ సందర్భంలో విజ్ఞప్తి చేశారు.

గుంటూరు జిల్లాలో సాంద్ర వ్యవసాయ కృషి

నరసారావు పేట, పొన్నూరు, అమృతలూరు సమితుల సర్వతోముఖాభివృద్ధికి, ముఖ్యంగా వ్యవసాయాభివృద్ధికి, సాంద్ర వ్యవసాయ కృషిని జరిపించాలని గుంటూరు జిల్లా అభివృద్ధిమండలి నిశ్చయించింది.



ఖమ్మం జిల్లా, బూర్గంపహాడ్ తాలూకా రావిగూడెంలోని కేదారేశ్వరస్వామి

వెనుకబడిన తరగతుల విద్యార్థులకు స్కాలర్ షిప్పులు

ఖమ్మం జిల్లా పరిషత్తు ఇంతవరకూ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులు, షెడ్యూలు తరగతుల విద్యార్థులు, హరిజన విద్యార్థులు మొత్తం 7,105 మందికి నాన్ రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులు, యితర విద్యా విషయక సౌకర్యాల క్రింద మొత్తం రూ. 3,17,300లను మంజూరు చేసింది. ఈ మొత్తాలను 1967-68 సంవత్సరానికి సాంఘిక సంక్షేమ శాఖ యీ పరిషత్తుకు అందజేసిన నిధులనుండి వెచ్చించడం జరిగింది.

పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం

కోదాడ పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ కె. జతిందర్ రెడ్డి కృష్ణాపురం, తమ్మారం గ్రామాలలో ప్రాథమిక పాఠశాలల భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ గ్రామాలు బ్లాకు ప్రధాన

కార్యస్థానానికి 60 కిలో మీటర్ల దూరంలో వుండి రాక పోకల సౌకర్యాలు అంతగా లేక వెనుకబడిన ప్రాంతాలుగా పరిగణింప బడుతున్నాయి.

వ్యవసాయ శిక్షణ శిబిరం


ఆర్మూరు పంచాయతీ సమితికి చెందిన వి. ఎల్. డబ్ల్యులు, గ్రామ సేవికల నిమిత్తం రెండు రోజులపాటు వ్యవసాయ శిక్షణ శిబిరం ఒకటి బాలకొండలో ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించబడింది.

ఊడ్పు పనివారికి యిళ్లు

విజయనగరం పురపాలక సంఘం ఫిబ్రవరి 7వ తేదీన జరిగిన సమావేశంలో కంటోన్ మెంట్ ప్రాంతంలో ఊడ్పుపని వారి నిమిత్తం యిళ్ళను నిర్మించేందుకు రూ. 81,689లను మంజూరు చేసింది.

గుంటూరులో ఆటోనగర్

మోటారు వర్క్‌షాపుల్నీ, స్పేర్‌పార్ట్‌ల షాపుల్నీ నెలకొల్పేందుకై గుంటూరులో ఒక ఆటోనగర్‌ను ఏర్పాటు చేయడానికి గుంటూరు జిల్లా ఆటోమొబైల్ కార్మికుల సంస్థ నిర్ణయించింది.



నిజామాబాదులో పారిశ్రామిక ప్రదర్శన

ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు శ్రీ శంకర్‌జీ నిజామాబాదులో ఫిబ్రవరి 15న పారిశ్రామిక ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేశారు. ప్రదర్శన సంఘం అధ్యక్షులూ, జిల్లా కలెక్టరూ అయిన శ్రీ టి. ఎల్. శంకర్ అధ్యక్ష నివేదిక చదివారు. ఈ ప్రదర్శనలో సుమారు 200 స్టాలులు వున్నాయి. బాలల నిమిత్తం చిన్న రకం రైలు ఒకటి ఏర్పాటు చేశారు. హైదరాబాదులోని పారిశ్రామిక ప్రదర్శనలో పెట్టిన ప్రభుత్వ స్టాలులనే చాలావరకు యిక్కడ తిరిగి ఏర్పాటుచేశారు.

ఉత్తమ చలన చిత్రాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బహుమతులు

మన రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడానికీ, ఉత్తమ సాంకేతిక స్థాయి కలిగి రసాత్మకమైన చలన చిత్రాలు, విద్యా, సాంస్కృతిక విలువలు గలిగిన చలన చిత్రాలు నిర్మాణం కావడానికీ వీలుగా 1965లో ప్రభుత్వం ఉత్తమ చిత్రాలకు బహుమతులిచ్చే పథకాన్ని ప్రారంభించింది.

ఏటేటా (1) కథా చిత్రాలు (2) డాక్యుమెంటరీ చిత్రాలు (3) పిల్లల చిత్రాలు (4) విద్యా విషయిక చిత్రాలు అనే నాలుగు తరగతుల వారీగా బహుమతులు యిస్తారు.


ఈయేడు ఉత్తమ చిత్రాలను నిర్ణయించడానికిగాను ఆంధ్రప్రదేశ్ శాసన సభ అధ్యక్షులు శ్రీ బి. వి. సుబ్బారెడ్డి అధ్యక్షతన ఒక సంఘం ఏర్పాటు చేయబడింది. రిటైరైన ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్ శ్రీ ఆదిరాజు వీరభద్రరావు, వరంగల్లు సైన్సు, ఆర్ట్సు కళాశాల తెనుగు శాఖలో ప్రొఫెసర్ డా॥ బి. రామరాజు గారలు యీ సంఘంలో సభ్యులు.

జనసంబంధశాఖ డిప్యూటీ డైరెక్టర్ (చలన చిత్రాలు) శ్రీ వి. వి. మాణిక్యాలరావు యీ సంఘానికి కార్యదర్శి.

ఈ సంఘమే, చలన చిత్రాలు కనీస ప్రమాణాల దృష్ట్యా సబ్సిడీ పొందడానికి అర్హములో, కావో అనే విషయాన్ని నిర్ణయించడానికి ప్రత్యేక సంఘంగా కూడా వ్యవహరిస్తుంది.

నగరంలో . . .

కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖామంత్రి శ్రీ జగ్జీవన్‌రామ్ ఫిబ్రవరి 8వ తేదీన రాజేంద్ర నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో స్నాతకోపన్యాసం చేశారు. ఎకరా సగటు దిగుబడిని పెంపొందించడానికి అనుదినం పాటుబడాలని ఆయన వ్యవసాయ శాస్త్రజ్ఞులనూ, వ్యవసాయదార్లనూ కోరారు.



గత కొన్ని సంవత్సరాలలో ముఖ్యంగా క్రిందటి రెండు సంవత్సరాలలో తీవ్ర అనావృష్టి, కొరత పరిస్థితులు ఎదురైనప్పటికీ మనం మంచి అభివృద్ధి సాధించామనీ, దీని దృష్ట్యా వుత్పత్తి రంగంలో స్వయంసమృద్ధిని సాధించడం మనకు సులభసాధ్యమేననీ శ్రీ జగ్జీవన్‌రామ్ ఆశాభావం ప్రకటించారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ కళాశాలలు

రాజేంద్రనగర్‌లో 2,500 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి వుండే సమీకృత పోస్టు గ్రాడ్యుయేటు వ్యవసాయ కళాశాలలసముదాయం ప్రాచ్య దేశాలన్నింటిలోనూ యిటువంటి వాటిలో పెద్దదిగా రూపొందుతుంది. వీటి నిర్మాణానికి సుమారు రూ. 7 కోట్లు ఖర్చవుతుంది. ఈ ఖర్చునంతటినీ రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఇప్పటికి ఒక కోటి రూపాయలు కేటాయించింది. వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆరు వ్యవసాయ, పశు పోషణ, గృహ విజ్ఞానశాస్త్ర కళాశాలలను స్వాధీన పరుచుకున్నది. 45 పరిశోధన కేంద్రాలను ప్రారంభించింది. దాదాపు 110 పరిశోధనా పథకాలను చేపట్టింది. రాజేంద్రనగర్ ఆవరణలో, వ్యవసాయం, పశు వైద్యం, గృహవిజ్ఞానశాస్త్రం, వ్యవసాయక ఇంజనీరింగు సంస్థలు వుంటాయి. సుమారు 2.5 లక్షల చదరపు అడుగులు విస్తీర్ణంలో వ్యాపించివున్న పెద్దభవనాలు రెండు సంవత్సరాల కాలంలో నిర్మించబడినాయి. ప్రస్తుత పశువైద్య కళాశాలను జూలై నాటికి కొత్త భవనాలలోనికి మారుస్తారు.


మశూచి టీకాల మందు

గత సంవత్సరం ఆంధ్ర ప్రదేశ్‌లో సుమారు 1800 మంది మశూచి వల్ల చనిపోయారు. హైదరాబాదులోని రోగ నిరోధక ఔషధ సంస్థలో టీకాల మందును తయారు చేయడంలో ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి యిప్పుడు సాధ్యమవుతుంది. మశూచి టీకాల మందు మొదటి విడతను ఆరోగ్య మంత్రి శ్రీ పి.వి. నరసింహారావు విడుదల చేశారు.

రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి శ్రీ పి.వి. నరసింహారావు ఫిబ్రవరి 13వ తేదీన హైద్రాబాదులో కన్ను, ముక్కు, గొంతు వ్యాధుల ఆసుపత్రికి ప్రారంభోత్సవం చేశారు. ఈ ఆసుపత్రిలో 50 మంది రోగులకు పడక వసతులున్నాయి. దీనిమీద ప్రభుత్వానికి రూ. 2 లక్షల ఖర్చయింది. పోస్టు గ్రాడ్యుయేటు విద్యార్థులు శిక్షణ పొందడానికి యిందులో వసతులున్నాయి.



యు. ఎ. ఆర్. ప్రతినిధి వర్గం ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని సందర్శించినప్పటి చిత్రం



రష్యా సాంస్కృతిక ప్రతినిధివర్గం జనవరి 27 న నగరానికి విచ్చేసినప్పటి చిత్రం

ఊడ్పు పనివారల కాలనీకి ప్రారంభోత్సవం

ఫలక్‌నుమాలో రూ. 5 లక్షల ఖర్చుతో నిర్మించిన ఊడ్పు పనివారల కాలనీకి ఫిబ్రవరి 4వ తేదీన కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖామంత్రి శ్రీజగ్జీవన్‌రామ్ ప్రారంభోత్సవంచేశారు. మేయరు శ్రీ కొండారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రసంగించారు.

తమ సారథ్యం క్రింద రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పురోగమింప జేస్తున్నందుకు ముఖ్యమంత్రి శ్రీ కాసుబ్రహ్మానందరెడ్డిని శ్రీ జగ్జీవన్‌రామ్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖమైన అభివృద్ధి సాధించడం ముఖ్యమంత్రికి గర్వకారణమని కేంద్ర వ్యవసాయ మంత్రి అన్నారు.

పశువైద్యుల సంఘం భవనానికి శంకుస్థాపన

రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి ఫిబ్రవరి 7వ తేదీన హైద్రాబాదులో ఆంధ్రప్రదేశ్ పశువైద్యుల సంఘం భవనానికి శంకు స్థాపన చేశారు.

ఈ భవన నిర్మాణానికి లక్షరూపాయలు ఖర్చవుతాయి. సంఘం సభ్యులనుంచి ఇందుకు విరాళాలు సేకరించారు. సంఘం సభ్యత్వం 1,400. శ్రీ తిమ్మారెడ్డి ఈ నిధికి రూ. 100 ల విరాళం యిచ్చి విరాళాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు.

ఈ భవన నిర్మాణం పూర్తయినప్పుడు దేశంలో పశువైద్యుల సంఘం స్వయంగా నిర్మించిన తొలి భవనంయిదే అవుతుంది. 8 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈసంఘం భవనం కొరకు ప్రభుత్వంనుంచి 1,000 చదురపు గజాల స్థలాన్ని సేకరించింది. వృత్తి ప్రమాణాలనూ, సాంకేతిక నిపుణతనూ పెంపొందించడం ఈ సంఘం లక్ష్యాలు.

పత్రికాప్రపంచం

పాడిపరిశ్రమ


హైద్రాబాదులో జరిగిన అయిదవ అఖిల భారత పాడి పరిశ్రమ మహాసభ, ఈ పరిశ్రమకు సంబంధించిన వివిధ సమస్యలను ప్రముఖంగా చర్చించడానికి మరోసారి అవకాశం కలిగించిందని ఆంధ్ర ప్రభ (ఫిబ్రవరి 8) తన సంపాదకీయంలో పేర్కొన్నది. పశువులకు అడవులలోలభించే పశు గ్రాసాన్ని సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేయడం అవసరమని కూడా ఈ సంపాదకీయంలో వివరించబడింది. దేశమంతటా పాల ఉత్పత్తిదార్ల సహకార సంఘాలను నెలకొల్ప వలసిన ఆవశ్యకతను గురించి యిది నొక్కి వక్కాణించింది.



అయిదవ పాడిపరిశ్రమ సమావేశానికి ఫిబ్రవరి 5వ తేదిన ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహించారు. కేంద్ర స్టేట్ మంత్రి శ్రీ అన్నాసాహెబు షిండే సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు.

రాష్ట్ర బడ్జెటు


సమాజంలోని బీద వర్గాలు, వెనుక బడిన వర్గాల సంక్షేమార్థం సహాయక గ్రాంట్లు పెంచడానికీ, బాలురకు, బాలికలవలె సెకండరీ స్థాయి వరకు ఉచిత విద్యా సౌకర్యాలు కల్పించడానికీ, అడవులలో రుసుం లేకుండా ఉచితంగా పశువులను మేపుకోవడానికై అనుమతించడానికీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను "ఆంధ్ర ప్రభ" (ఫిబ్రవరి—16) శ్లాఘించింది. రాష్ట్రంలో వ్యావసాయిక పరిశ్రమల కార్పొరేషన్ను నెలకొల్పడానికి తీసుకున్న నిర్ణయంపట్ల "ఆంధ్ర జ్యోతి" (ఫిబ్రవరి-17) హర్షం వెలిబుచ్చింది. ఇదే విషయమై వ్రాస్తూ "ఆంధ్ర పత్రిక" (ఫిబ్రవరి-17) రాష్ట్రం సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం చాలా ప్రాముఖ్యం వహిస్తుందని పేర్కొన్నది.



హైదరాబాదు, జూబ్లీహాలువద్ద ఫిబ్రవరి 5న అయిదవ పాడిపరిశ్రమ సమావేశ సందర్భంగా ఏర్పాటైన ప్రదర్శన.

సీరియల్

భాగ్యచక్రం



ఆరికెపూడి కౌసల్యాదేవి

జరిగిన కథ

శ్రీ నగేష్, తన మేనమామ శ్రీపతి కారు ఏక్సిడెంట్‌లో చిక్కుకొని మతి స్థిమితం కోల్పోతే అతనికి చికిత్సచేసి బాగు చేశాడు. మేనమామ కూతురు జయశ్రీ ఒక కొరకరాని కొయ్య. శ్రీనగేష్, శ్రీలక్ష్మి అనే మెడికల్ స్టూడెంటుతో స్నేహం చెయ్యడం జయశ్రీకి నచ్చలేదు. ఉచితానుచితాలు ఆలోచించక కటువుగా శ్రీ నగేష్ తల్లి అయిన శ్రీదేవిని ఏమేమో అంది.

శ్రీదేవి మనసును సమాధాన పరచుకుని అతి సౌమ్యంగా అన్నది-

"చిన్న పిల్ల. తెలిసీ తెలియనిది. దాని మాటలకేమిగాని, నువ్వు చెప్పు అన్నయ్యా. నీ మాట జయ మాత్రం కాదంటుందా? ఏదోజరిగి పోయింది. పోయిన వాళ్ళు పోయారు. మనం మిగిలాం. ఈ మిగిలిన వాళ్ళమైనా వెనుక అనుకున్నట్టు కలసి సుఖంగా...'

"ఏమిటత్తయ్యా నువ్వనేది?" ఛస్సున లేచింది జయ. "చాలు. ఇంత వయస్సొచ్చినా నీకు జ్ఞానంరాలేదు. నాకేం ఖర్మ. ఇద్దరు పెళ్ళాలు చచ్చి నాలుగైదేళ్ళ కొడుకున్న నీ కొడుకుని పెళ్ళిచేసుకొనే పటకూ? ఇంత పథకంతోనే కాబోలు ఊరికే వైద్యం చేసింది! అక్కర్లేదు బిల్లు పంపమను; ఖచ్చితంగా యిస్తాను."

నిర్ఘాంతపడిన శ్రీదేవి మౌనంగా చూస్తూండగానే, జయశ్రీ వీధిద్వారం దెసగా నడిచి, నాలుగడుగులువేసి, ఉలికిపడి ఆగిపోయింది. ఎప్పుడనగా వచ్చాడో శ్రీ నగేష్ రెండు చేతులూ కట్టుకు నిల్చుని సావకాశంగా నిలబడి వున్నాడు దర్వాజా వద్ద.

ఒక్క నిముషంపాటు స్తంభించిపోయిన వాతావరణానికి హఠాత్తుగా శ్రీపతి చైతన్యం కల్పించాడు. "చూడు నగేష్! ఏదో నాజబ్బుతగ్గించావు. బాగానేవుంది. ఏదో మేనల్లుడవు, డాక్టర్ వైనందుకు ఆమాత్రం చేయకపోతే ఎలా మరి?....కాని అందుకని బొత్తిగా పిల్లని పెళ్ళిచేయమని అడిగిస్తే ఎలా? అందరూపోగా యింక నాకు మిగిలినది అదొక్కర్తి. నా ఆశలన్నీ యిక దానిమీదే పెట్టుకోవాలి. అది డాక్టరుపాసవ్వాలి. నేను కట్టించిన ఆసుపత్రి బిల్డింగ్ లో ప్రాక్టీస్‌పెట్టాలి: రెండుచేతుల లక్షలు లక్షలు ఆర్జించాలి. నాకు తృప్తికలగాలి. అంతేకాని, ఈ పల్లెటూళ్ళో పడుండే ఖర్మ నా చిట్టితల్లికేం? అదీకాక....... అహఁ మరేంఅనుకోకు. మాట వచ్చిందిగనుక చెప్తున్నానూ--- రెండు పెళ్ళిళ్ళయ్యాయటనీకు. కుఱ్ఱాడొక డున్నాడు కూడా-నా కూతురేకాదు, ఏ చదువుకున్న పిల్ల మాత్రం చేసుకుంటుంది నిన్ను ఇప్పుడు? ఏదో అంతకు తగిన దేవతో గతిలేక చేసుకోవాలి. అంతే. టింగురంగా మంటున్న చక్కటి కుఱ్ఱాడిని చేసుకుంటుంది నా తల్లి. వాడు డాక్టరే అవుతాడు. ఇద్దరూ సంపాదించి నా కలలు నిజం చేయాలి...... నీకు అంతగా కావాలంటే కావలసిన ఫీజు తీసుకో. అహ! నువ్వు తీసుకోవనుకో అయినా, నాకు తెలుసు!"

"లేదు, తీసుకుంటాను ఫీజు!!" గంభీరంగా అంటూ సూటిగా శ్రీపతి వైపే పరీక్షగా చూస్తూ నిదానంగా నడచి వచ్చాడు శ్రీనగేష్. శ్రీపతి సరసనే నిలబడి అన్నాడు: "మీ మతి చాంచల్యాన్నైతే పోగొట్టాను కాని, మీ అధిక ధోరణీ, ధన దాహం అనే రెండు రోగాలను పోగొట్టలేక పోయాను. అందుకే మీ దగ్గర ఫీజు తీసుకో రాదను కున్నాను. కాని మీరూ, జయా పదే పదే నిర్లక్ష్యంగా ఫీజు తీసుకో తీసుకో-అంటూంటే నాకూ తీసుకోవాలనే అనిపిస్తున్నది. తీసుకోక పోవటం మంచిది కాదు కూడా.

"ఇక వివాహం సంగతంటారా?" అంటూ ఒక్క చూపు తల్లి మీదికి విసిరాడు శ్రీనగేష్. "పాత్రా పాత్రత నాకు తెల్సు!"

శ్రీదేవి అవమాన పూర్వకమైన సిగ్గుతో తల వాల్చుకుంది. జయశ్రీ ముఖం క్రోధంతో, అశక్తతతో అరుణిమ దాల్చింది.

శ్రీనగేష్ తన మాటలను పొడిగించాడు: "పాత్రౌచిత్యం నాకుతెలుసు మామయ్యా! జయనుగురించి నేను ఆలోచించడం భాగ్యచక్రానికి పూర్వమే మానుకున్నాను. ఇక యిప్పుడు ఆమె తనంత తానుగావచ్చి అంగీకారం వెలిబుచ్చినా నేను స్వీకరించగల స్థితిలో లేను. ఆవిషయమై అధికంగా మాట్లాడి మీరు ప్రయాసపడ నవసరంలేదు. చక్కటివరుడు లభించి జయజీవితం బాగాగడచి ఆమెపై నిలుపుకొన్న మీ ఆశలన్నీ తీరాలనే నేను కోరుకునేది."

అతడు మాటలు ఆపి ఒక్కక్షణం ఆగడంతో తండ్రీ కుమార్తెలు తేలికగా గాలి పీల్చుకున్నారు.

తాపీగా కుర్చీలో కూర్చుంటూ అన్నాడు శ్రీనగేష్. "మీ యిష్టంవచ్చినప్పుడు మీరు వెళ్ళేహక్కు మీకేవున్నదికాని, ఇంత కాలం వైద్యం చేసిన బాధ్యతతో మాత్రం చెపుతున్నాను. మీరు మరికొంతకాలం ఈ ప్రశాంత వాతావరణంలో వుంటేతప్ప యిప్పుడు కోలుకొన్న మతి స్థిరత్వం పొందదు. అర్థమైందిగా? అదీకాక.........కొద్దిరోజులలోనే నావివాహం జరుగబోతున్నది. మాకు కావలసినమీరు ఆతరుణంలో స్వయంగా శుభాశీర్వాదాల నివ్వాలని నా కోరిక."

"పెళ్ళా! ఎప్పుడు? నీకే?" శ్రీపతి ప్రశ్నమీద ప్రశ్న కురిపించాడు.

శ్రీదేవి ఉలికిపాటుతో తలెత్తింది. అనిర్వచనీయానందం ఆమె కనులలో నాట్యమాడింది.

జయశ్రీ నేత్రాల కదలిక ఆత్రతను స్పష్టీకరించింది.

శ్రీనగేష్ హఠాత్తుగా లేచి తల్లివద్దకువెళ్ళి పాదాలు తాకుతూ అన్నాడు: "చల్లని తల్లివి. ఆశీర్వదించవమ్మా. నీ కోరికలకు అనువైన కోడలు వస్తున్నది. ఎటువంటి సంకోచాలు పెట్టుకోకుండా అంగీకరించి ఆహ్వానించాలి."

క్షణకాలంశ్రీదేవి కనులు ఆనందంతో లాస్యంచేశాయి. కుమారుని మస్తకంపై హస్తముంచి అన్నది: "ఆ దైవం చల్లగా చూస్తాడు. నీవిజ్ఞతా విమర్శనా వివేకాలపైనాకు నమ్మకం వున్నది. ఆమె ఎవరో కూడా నేనూహించాను. అయినా వీనుల విందుగా నీ నోటినుండి వినాలని వుంది!"

శ్రీనగేష్ వదనం తృప్తితో, ఆనందంతో వెలిగి పోయింది "అమ్మా!!" అంటూ ఆనందాతిరేకంతో సంబోధించాడు. అంతలో సర్దుకొని తనసహజ గంభీరత్వంతో సమాధాన మిచ్చాడు శ్రీనగేష్. "శ్రీలక్ష్మి! శ్రీలక్ష్మి నీకోడలు కాబోతున్నదమ్మా!"

"సంతోషం!"

శ్రీ దేవి మనఃపూర్వకంగా అన్నమాటలు విన్పించనీయ లేదు మిగిలిన శ్రోత లిరువురూ.

"ఆఁ!" మహాదారుణ విషయమేదో విన్నట్టు నోరావలించాడు శ్రీపతి.

"ఛీ." ఉరుముతూ ఛీత్కరించింది జయశ్రీ. "ఇంత వఱకూ చేసిన అవమానాలు చాలక మళ్ళీ యిదొకటా? నాజన్మ శత్రువును-మా కుటుంబ భక్షకినా నువ్వు వివాహం చేసుకొనేది? పైగా అది మేము కండ్లతో చూస్తామనే వుండమంటున్నావా? ఛ ఛ పద నాన్నా పోదాం."

కోపావేశంతో ఊగిపోతు నిష్క్రమింప బోతూన్న జయశ్రీ. కుమార్తెను అనుసరిస్తున్న శ్రీపతి, వెనుకనుంచి శ్రీనగేష్ మాటలు విన్పించి ఆగాడు.

"జయా!" తీక్షణంగా అన్నాడు శ్రీనగేష్. ఇక శ్రీలక్ష్మి విషయంలో నువ్వు జాగ్రత్తగా మాట్లాడ వలసి వుంటుంది. నువ్వామెను రెండుకండ్లతోనూ చూడలేవని నాకు ముందేతెల్సు. అయినా వివాహ విషయం చెప్పాలి గనుక చెప్పాను. నువ్వు ఆ వివాహం చూడకపోతే మాకువచ్చిన లోటేమీ లేదు కాని...... ఫీజు విషయం విని వెళ్లు. రెండువేలు!"

"ఆ!!!!" తండ్రికుమార్తె లొక్కసారే అరిచారు. "ఈ మాత్రపు వైద్యానికి రెండువేలా?" ముఖం చిట్లించి అడిగింది జయశ్రీ.

"అవును", శ్రీనగేష్ బింకంగా అన్నాడు. "దేశమంతా తిరిగి పదివేలు ఖర్చుపెట్టితే మాత్రం ఎక్కడైనా తగిందా మరి? అయినా నువ్వు ఫీజు ఎంతో చెప్పమని పదే పదే అడిగితే చెప్పాను కాని, యిష్టం లేకపోతే యివ్వనవసరంలేదు."

జయశ్రీ రోషం తలెత్తింది మళ్ళీ. "ఇష్టం లేకుంటే అనే కంటే 'ఇవ్వ లేకుంటే'—అంటే సరిపోతుందిగా? సరే, ఇప్పుడే పంపిస్తాను నీ ఫీజు నీకు. వైద్యం చేయించుకున్నప్పుడు అడిగినంతా యివ్వకపోతే ఎలాగు?" గిరుక్కున తిరిగి మరి సంభాషణ కవకాశమీయకుండా వెళ్ళిపోయింది జయశ్రీ. శ్రీపతి మౌనంగా కుమార్తె ననుసరించాడు. శ్రీదేవి నిస్సహాయంగా చూస్తూండి పోయింది.

* • •

"గృహానికి లక్ష్మివి వచ్చావు కళ కళ లాడుతూ. ఇక నాకు నిశ్చింత. సార్థకనామురాలివై—భాగ్యలక్ష్మివై యింటిని దిద్దుకో తల్లీ." పెండ్లి పీట దిగివచ్చి పాదాలకు నమస్కరించిన కోడలు శ్రీలక్ష్మిని ఆనంద బాష్పాలతో లేవనెత్తుతూ ఆశీర్వదించింది శ్రీదేవి.

"కోరి కోడలివై వచ్చావు మహాలక్ష్మిలాగా. నేను, శ్రీధర్, అమ్మ, భాగ్యచక్రం—నలుగురం నీకు బిడ్డలమే. అందర్నీ తల్లివై ఆదుకోవాలి లక్ష్మీ." మొదటిసారిగా భార్యను అక్కున జేర్చుకుంటూ శ్రీనగేష్ అన్నాడు.

"అర్ధాంగిగా, అమ్మగా, అనురాగమయిగా అధిక బాధ్యతలతో మెల్లగా అందరిచేతా 'ఔ' ననిపించుకోవాలనే నా ప్రయత్నం. పగలూ రేయీ, ఇంటా—బయటా, అన్నిటా సర్వకాల సర్వావస్థలలోను మీకు తోడు—నీడగా నిలవగలిగే సామర్థ్యాన్ని ఆ దైవం అనుగ్రహించాలని ఆశీర్వదించండి." వినమ్రురాలై నమస్కరించింది శ్రీలక్ష్మి.

అందరూ ఆశించినట్లుగానే అనతికాలంలోనే ఆ యింటిలో, ఆ పల్లెలో, ఆ పరిసరాలలో అందరికీ ఆత్మీయురాలై పోయింది శ్రీలక్ష్మి. శ్రీదేవికి యిప్పుడు శ్రీలక్ష్మిపై తన స్వంత కొమరుని పైకంటె అధిక మమకారం. అనునిత్యం "అమ్మా, లక్ష్మీ!" అని పిలిచిన నోరు పిలిచినట్లే వుంటుంది.

"కోడలొచ్చిన తర్వాత నీకు కొడుకు చేదు అయ్యాడు లేమ్మా" అంటాడు శ్రీనగేష్ హాస్యంగా.

గంభీరంగా నవ్వుతుంది శ్రీదేవి. "కాదునాయనా. ఇద్దరూ రెండు నేత్రాలూ అయ్యారు!"

ఇక శ్రీధర్ దృష్టిలో అమ్మ శ్రీలక్ష్మిని మించినవ్యక్తి ఈ ప్రపంచంలో ఎవరూలేరు. "నా కొడుక్కి క్రమశిక్షణ నేను యిచ్చుకోగలను. ఎక్కడో సైనిక్‌స్కూల్ అక్కరలేదు." అని మాన్పించి ఉన్న ఊళ్ళోస్కూల్లోనే శ్రీధర్‌ను చదివించుతూన్నది శ్రీలక్ష్మి. 'ఇదంతా శ్రీధర్ అదృష్టం' అనిపించిన శ్రీనగేష్ కనులు చమరించేవి.

"డాక్టరుబాబు దేవుడు. ఆ దేవుడికి తగిన దేవత దొరికింది. ఇది మా అదృష్టం. ఇక మాకు ఏ రోగమొచ్చినా భయంలేదు. ఈ డాక్టర హస్తవాసి మంచిది." భాగ్యచక్రంలో ప్రతిరోగినోటా, ఆ పల్లెలో, ఆ పరిసరాల్లో ప్రతి మనిషినోటా విన్పించే పలుకులివి.

అటువంటి సంభాషణలు నిత్యం అప్రయత్నంగానే విన్పిస్తూంటే శ్రీనగేష్ మది గర్వంతో, ఆనందంతో లాస్యంచేసేది.

"నా జీవితాన్ని తీర్చి, నా ఆదర్శాన్ని నిలిపి, నా గృహానికి లక్ష్మివై, నా భాగ్యచక్రానికి భాగ్యదేవత వయ్యావు. నేనింత అదృష్టవంతుని.కాగలనని ఎప్పుడూ అనుకోలేదు లక్ష్మీ." అన్నాడు శ్రీనగేష్.

హాస్పిటల్ పని అంతా ముగించు కున్నాక, భార్యాభర్త లిరువురూ కూర్చుని ఆరోజు టపా చూచుకుంటున్నారు. పల్లెలో అంతటి ఆసుపత్రిని నెలకొల్పి, భార్యాభర్త లిరువురూ చేస్తున్న సేవను కొనియాడుతూ ఇంకా ఎన్నో ఉత్తరాలు అనుదినం వస్తూనే వున్నాయి. ఒక ప్రముఖ పత్రిక శ్రీనగేష్ శ్రీదేవీల ఘనతనూ, భాగ్యచక్రం చేస్తున్న సేవనూ, తద్వారా ఆపల్లె పరిసరాలు గాంచుతూన్న అభివృద్ధినీ చక్కగా శ్లాఘిస్తూ పెద్ద శీర్షికతో వ్రాసింది. అవన్నీ సతీ సమేతంగా చూస్తున్న శ్రీనగేష్ భార్యపట్ల తన హర్షాన్ని పై విధంగా ప్రకటించాడు.

ఆ పొగడ్తకు శ్రీలక్ష్మి గాంభీర్యం చెదరలేదు. చిరునగవు చిందుతూన్న నేత్రాల నెత్తి అన్నది. "అంతపెద్ద మాటలువద్దు. ఇందులో నాదేముంది? 'భాగ్యచక్ర నిర్మాతలైన భాగ్యమూర్తి దగ్గఱ నా జీవన లతకు ఆలంబన లభించింది నా అదృష్టంకొద్ది."

"అవునులే. నువ్వు అలాగ అనక ఏమంటావ్?" భార్య వినమ్రత చూచినకొలదీ శ్రీనగేష్ ఆప్యాయత మితిమీరి పోతుంది.

అలా మాట్లాడు కూంటుండగానే డాక్టర్ శ్రీకాంత్ ప్రవేశించాడు.

అనుకోకుండా అతడలా ప్రవేశించడం, ఎప్పటి మాదిరిగా తమకు 'విష్' చేయకుండా ఠీవిగా నిలబడడం చూచి శ్రీనగేష్‌కు లోలోన కొంత ఆశ్చర్యమైంది. అయినా తన భావాలు పైకి ప్రదర్శితం కాకుండా జాగ్రత్త పడుతూ శ్రీనగేష్. "వాట్ మిష్టర్ శ్రీకాంత్?" అని తన సహజ ధోరణిలో పలుకరించాడు.

శ్రీనగేష్‌దెస ఠీవిగా చూస్తూ పాకెట్‌లోనుంచి కవరుతీసి బల్లపై వుంచాడు శ్రీకాంత్.

"ఏమిటది?" అని తీసి చూస్తూనే విపరీత విస్మయంతో చూచాడు శ్రీనగేష్ అతడిని. "రాజీనామా యిస్తున్నారా? ఏం, ఎందుకని? ఏమిటీ హఠాన్నిర్ణయం?"

శ్రీనగేష్ ఎంత ఆత్రంతో ప్రశ్నా పరంపర వర్షించాడో శ్రీకాంత్ అంత నిదానంగా, టెక్కుగా చూచాడతడిదెస. కాలర్

సరుకుంటూ, చేతిలోనున్న లెదర్ బ్యాగ్‌నుండి వివాహాహ్వాన పత్రికను తీసి బయటపెట్టి, దర్పంగా మరొకదెస చూడసాగాడు.

ఈ నడమంత్రపు సిరి ఏమిటో అర్థంగాని శ్రీనగేష్ ముఖం చిట్లిస్తూ అది తీసి చూచి నిర్వెరపోయాడు. క్షణాలలో తనను తాను సంబాళించుకుని "ఓ! వివాహమా? కంగ్రాచ్యులేషన్స్ అయితే స్వంత ప్రాక్టీస్ పెడతారన్నమాట!" అన్నాడు.

"ఏమో? ఇంకా నిర్ణయించుకోలేదు. గుడ్‌బై. మీరిద్దరూ తప్పక రావాలి వివాహానికి," అంటూనే నిష్క్రమించాడు శ్రీకాంత్ టెక్కుగా నడుస్తూ.

"ఏమిటి?" ఏమీ అర్థంకాని శ్రీలక్ష్మి భర్తను ప్రశ్నించింది. "ఇవ్వాళ శ్రీకాంత్ ధోరణి చాలా వింతగా వుందేమిటి? పెళ్ళైతే ఇక్కడ రాజీనామా యివ్వటం దేనికీ?"

"ఎందుకా?" శ్రీనగేష్ కంఠంలో బాధ స్పష్టంగా ధ్వనించింది. "ఇదుగో శుభలేఖ, చూడు. ఏకైక పుత్రికగల ధనవంతుడైన మామగారు దొరికాడు మరి! రాజీనామా యివ్వడూ?"

ఆ కళ్యాణ పత్రికను చూస్తూనే నివ్వెరపోయింది శ్రీలక్ష్మి. "పెండ్లి కుమార్తె జయశ్రీ! జయకూ శ్రీకాంత్‌కూ పెళ్ళా? ఎంత తెలివితక్కువది జయ! అమృత భాండాన్ని కాలదన్నుకుని అవివేకంగా విషపాత్రను కౌగలించుకుంటూన్నది. శ్రీకాంత్ స్వభావం ఆమెకు తెలియదా?"

పేలవంగా నవ్వాడు శ్రీనగేష్. "ప్రేమ గ్రుడ్డిదంటారు. యిందుకే. ఇక్కడుండగానే అప్పుడప్పుడు ఆమె శ్రీకాంత్‌తో మాట్లాడడం చూచేవాడిని కాని, ఆ పరిచయం యింత త్వరలో యిలా పరిణయంగా పరిణమించగలదని ఊహించనైనాలేదు. శ్రీకాంత్ తరహా చాలా చెడ్డది. జయను మోసంచేస్తాడనే నా భయం.

ఆలోచనా పూర్వకంగా అన్నది శ్రీలక్ష్మి. "పోనీ మనం వెళ్ళి చెప్పి, హెచ్చరిస్తే? వివాహాని కింకా పది రోజులు వ్యవధి వుంది కదా! ఈ లోపుగా............"

"వద్దు." ఖండితంగా అన్నాడు శ్రీనగేష్. "కానీయ్. విధి లిఖితం. ఎవరి అదృష్టాన్నెవరు దిద్దగలరు! మరెవరినైనా అయితే అనునయించి నచ్చజెప్పవచ్చు. స్నేహపూర్వకంగా హెచ్చరించవచ్చు. కాని ఈ మనుషుల విషయంలో మాత్రం అది పనిజేయదు. అహంకారులైన ఆ తండ్రీ కూతుళ్ళకు హితులెవరో, శ్రేయోభిలాషులెవరో, తేనెపూసిన కత్తులేవో విచక్షణ తెలియదు. మేలుకోరి సలహా యిచ్చినవారినీ, సపర్యలుచేసి సహాయం చేసినవారినీ కూడ తృణప్రాయంగా తీసిపారేస్తారు. వారి ఆనందంకోసం మనం ప్రయత్నిస్తే మనను అవమానించి, కించపరచి వాళ్ళు పంపిస్తారు. అవివేకులకు అయాచితంగా ఆలోచనలు చెప్పి, ఆత్మగౌరవం కోల్పోరాదు! ఇందుకు వాళ్ళ విషయాలలో మన అనుభవాలే నిదర్శనం! నిశ్చయమైన పెళ్ళి చెడగొట్టటాని కొచ్చావా—అని అంటే మనకు చిన్నతనం కాదూ?"

"నిజమే! కాని మన ప్రయత్నం మనం చెయ్యకపోతే ఏదో అసంతృప్తి బాధిస్తుంది మనస్సును."

* * * *

"నువ్వు ఆహ్వానం పంపించకపోయినా నేను వచ్చానే జయా." జయశ్రీ పలుకరించబోయినా తానే మాట్లాడింది శ్రీదేవి.

జయ విషపు నవ్వు నవ్వింది. "అదే చూస్తున్నాను. మనుష్యులు చచ్చి కుటుంబాలు కుటుంబాలే నాశనమైపోయిననాడే రానిదానివి ఇంత చిన్న విషయానికెలా ఇల్లు వదలివచ్చావా అని ఆశ్చర్యంగావుంది. పెళ్ళికేముంది? ఎవరురాకున్నా ఆగేదిలేదుగా?" నోటితో నవ్వుతూనే నొసటితో వెక్కిరించింది జయ మేనత్తను.

ఆ మాటలకు తనలో రేగిన కోపాన్ని దాచడానికి ప్రయత్నించలేదు శ్రీదేవి. తీక్షణంగా అన్నది, జయను సూటిగా చూస్తూ: "అవును తాళికట్టే వాడు వస్తేచాలు, మరెవరు రాకున్నా పెళ్ళి ఆగదు. కొడుకూ కోడలూ వద్దని వాదించినా, పెద్దదాన్ని–నువ్వు గోతిలో దిగుతూంటే చూస్తూ ఊరుకోలేక వచ్చాను. వచ్చినందుకు బాగానే బుద్ధిచెప్పావు వీధి గుమ్మంలోనే."

త్రాచులాగా బుస కొట్టింది జయశ్రీ. "నేను గోతిలో పడ్తూంటే ఉద్ధరిద్దామని వచ్చావా? ఏమిటా విశేషం? అందరూ చావగా మిగిలిన తండ్రి పిచ్చివాడై దిక్కుతోచక నేను ఏడుస్తున్ననాడే రానిదానవు ఇవాళ శుభమా అని పెళ్ళి జరుగుతూంటే వచ్చి ఇలా మాట్లాడడంలో అర్థమేమిటి? సూటిగా చెప్పు అత్తయ్యా, నీవు వచ్చిన పనేమిటో."


నిట్టూర్చింది శ్రీదేవి. "అవును నామటుకు నేను ఎన్నో విచారాలలో వుండి, ఇక జీవితకాలంలో ఆ గడప దాటి బయటకు రాకూడదని నిర్ణయించుకున్నాను అప్పట్లో. కాని మన నిర్ణయాలేపాటివి, ఆ భగవన్నిర్ణయంముందు– అన్పిస్తుందిప్పుడు. నా మేనకోడలి వైనందుకు నీకూ నాపెంకెతనమే వచ్చింది."

"ఇంతకూ అసలు సంగతేమిటి?" అసహనంగా ప్రశ్నించింది జయశ్రీ మరో దిశగా చూస్తూ.

"ఏమిటా?" కూర్చున్న చోటునుంచి లేస్తూ అన్నది శ్రీదేవి: "శ్రీకాంత్ పలుదుర్వ్యసన పరుడు, మన హాస్పిటల్‌లో పనిజేస్తున్నాడు గనుక మాకు అందరికీ అతడి గుణగణాలు బాగా తెల్సు. నీతివర్తనకూ అతడికీ చాలాదూరం. మరి నువ్వు అటువంటి వాడిని చేసుకుంటున్నావంటే కేవలం అమాయకురాలవు కాక యింకేమిటి?"

"ఆహాహా," హేళనగా నవ్వింది జయశ్రీ, "అమాయకురాలనని ఉద్ధరించ వచ్చావా లేక నీ కోడల్ని కాలేదనే దుగ్ధతో నా పెళ్ళిని చెడగొట్ట వచ్చావా? శ్రీకాంత్ విషయం నాకు బాగా తెల్సు. నీ అంతర్యం బాగా తెలుసు!" పొగలు సెగలు గ్రక్కాయి జయశ్రీ కండ్లు.

(సశేషం)




ఢిల్లీలోని రిపబ్లిక్ దినోత్సవ పెరేడులో పాల్గొన్న
ఆంధ్రప్రదేశ్ అలంకృత శకటం

ఈ యేడు ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ దినోత్సవాలలో ఆంధ్ర ప్రదేశ్ తరపున 38 మంది సభ్యులుగల జానపదనృత్య కళాకారుల బృందం పాల్గొన్నది. " తెలంగాణాలో వరిసాగు " అనే విషయం గురించి విశదపరిచే ఒక అలంకృత శకటం మన రాష్ట్రం తరపున ప్రదర్శించారు. జానపద కళాకారులు అరకులోయ ప్రాంతంలోని " కోంధ్ " తెగకు చెందినవారు. జనవరి 28వ తేదీన నేషనల్ స్టేడియంలో ఉపరాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి అలంకృతశకటాలు ప్రదర్శించిన రాష్ట్రాలన్నిటికీ బహుమతి ఫలకాలు ఇచ్చారు.



రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ బృందం మయూర నృత్యం ప్రదర్శిస్తున్న దృశ్యం



ఢిల్లీలోని రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ బృందం జనవరి 28న మార్షల్ టిటోకు నెమలి తురాయిని బహుమతి చేసినప్పటి దృశ్యం

మన అసెంబ్లీ ఆమోదించిన

అధికారభాషా తీర్మానం

తీర్మానం పూర్తి పాఠం:— "పార్లమెంటు ఇటీవల ఆమోదించిన 1967 సం. పు అధికార భాషల (సవరణ) చట్టం, దానితోబాటు జరిగిన తీర్మానం తర్వాత నెలకొన్న పరిస్థితి పట్ల ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆందోళనను వ్యక్తపరుస్తున్నది.

"హిందీతోపాటు అనుబంధ భాషగా లేదా అదనపు భాషగా ఇంగ్లీషు కొనసాగింపునకు సంబంధించి స్వర్గీయ ప్రధాన మంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ ఇచ్చిన హామీలకు చట్టబద్ధమైన పరిగణనను కల్పించినందుకు సభ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నది.

"పార్లమెంటు ఆమోదించిన తీర్మానం దురదృష్టంకొద్దీ హిందీయేతర భాషా రాష్ట్రాల ప్రజలకు తీవ్రమైన అసౌకర్యాలకు దారి తీసింది.

"తత్ఫలితంగా నెలకొన్న పరిస్థితిని పరిష్కరించడానికిగాను ఈ క్రింది చర్యలను సత్వరమే చేపట్టాలని ఈ శాసనసభ దృఢంగా భావిస్తున్నది.

"ఒకటి: విద్యా బోధనకు సంబంధించి అన్నిరాష్ట్రాలలో త్రిభాషా సూత్రంపట్ల ఖచ్చితమైన కట్టుబాటు ఉండాలి. హిందీయేతర భాషా రాష్ట్రాల్లో సముచితమైన దశలో విద్యార్థులకు మాతృభాష హిందీ, ఇంగ్లీషు భాషల్లో బోధించాలి.

"హిందీ భాష మాట్లాడే రాష్ట్రాల్లో హిందీ, ఇంగ్లీషు, రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూలులో ఉల్లేఖితమైన మరో ఆధునిక భారతీయ భాష-ముఖ్యంగా ఏదో ఒక దక్షిణాది రాష్ట్రాల భాషనేర్పాలని ఈ సభ భావిస్తున్నది.

"యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేదా మరోటి గాని సెంట్రల్ అఖిలభారత ఉద్యోగాలకు రిక్రూట్‌మెంటు చేసే సందర్భంలో ఏ భాషా వర్గానికి కూడా నష్టం వాటిల్లని రీతిలో పై మూడు భాషల్లో అభ్యర్థులకు పరీక్షలు జరగాలి. పార్లమెంటు తీర్మానాన్ని అందుకు అనుగుణ్యంగా సవరించాలి.

"రెండు: హిందీయేతర భాషా రాష్ట్రాలపై హిందీని రుద్దడానికి ఎలాంటి ప్రయత్నం జరగరానప్పటికీ హిందీ భాషను అభివృద్ధి పర్చడానికి బోధించడానికి ప్రయత్నాలు చేయడం ద్వారా రాజ్యాంగంలో లక్షించుకున్నట్లుగా భారతీయ భిన్న సంస్కృతీ సమ్మేళనంలోని అన్ని వర్గాల భావ వ్యక్తీకరణకు సాధనంగా దానిని రూపొందించుకోవాలి.

"ఈ అభివృద్ధి గతిలో రాజ్యాంగంలోని భారతీయ భాషలన్నీ సముచితరీతిలో హిందీని సుసంపన్నం చేయడానికి అవకాశ ముంటుంది.

"మూడు: అదేవిధంగా అన్ని ప్రాంతీయ భాషలను తీవ్ర స్థాయిలో అభివృద్ధి పర్చడానికి ప్రయత్నాలు సత్వరమే జరగాలి. అందుకు కావలసినంత ఆర్థిక తదితర సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందజేయాలి. ఆ భాషలు శీఘ్రగతిని సుసంపన్నమై ఆధునిక విజ్ఞాన పరివ్యాప్తికి సమర్థవంతమైన సాధనాలై విద్యారంగంలో అన్ని స్థాయిల్లోనూ బోధనా భాషలుగా, పాలనారంగానికి అనువైన భాషలుగా రూపొందగలగాలి.

"నాలుగు: అన్ని రాష్ట్రాల్లోని అల్ప సంఖ్యాక భాషా వర్గాలవారికి ఎలిమెంటరీ స్థాయివరకూ తమ మాతృ భాషలోనే బోధనను పొందే హక్కు ఉండాలి.

"ఇలాంటి మైనారటీలకు రాష్ట్ర ప్రభుత్వాలు తగు సౌకర్యాలు కల్పించాలి.

"ఐదు: సెంట్రల్, ఆలిండియా సర్వీసుల్లో ప్రాతినిధ్యం విషయమై ఆంధ్రప్రదేశ్‌తో సహా కొన్ని రాష్ట్రాల్లోని ప్రజల్లో కలుగుతున్న తీవ్రమైన ఆందోళనను ఈ సభ గుర్తిస్తున్నది.

"జాతీయ సమైక్యతా ప్రయోజనం దృష్ట్యా పై సర్వీసు లన్నింటిలోనూ భారతదేశంలోని రాష్ట్రాలన్నింటికీ సముచితమైన ప్రాతినిధ్యం ఉండాలి.

"దిగజారి పోతున్న పరిస్థితిని పరిష్కరించాలంటే, భాషా సమస్యపై శాశ్వతమైన పరిష్కారాన్ని సాధించుకోవాలంటే పైన పేర్కొన్న పద్ధతుల్లోనే సత్వరమే సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఈ శాసనసభ దృఢంగా అభిప్రాయపడుతున్నది.

"అయితే సెంట్రల్ అఖిల భారత ఉద్యోగాల్లో ప్రవేశానికీ కాలేజీల్లో పాఠశాలల్లో బోధన కొనసాగింపునకు సంబంధించి ఇక ముందుకూడా ఏదేని భాషావర్గానికి నష్టం కలిగినచో తన ప్రజల ప్రయోజనం దృష్ట్యా ఆ రాష్ట్రం తన విధానాన్ని రూపొందించు కుంటుంది.

ఇండిపెండెంట్ సభ్యులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య తీర్మానాన్ని బలపరచారు. రాష్ట్ర శాసన సభ దీనిని ఫిబ్రవరి 15 వ తేదీన ఆమోదించింది. ఈ సమస్యను విజయవంతంగా పరిష్కరించు కోడానికై అన్ని రాజకీయ పార్టీలనాయకులనూ, ముఖ్య మంత్రులనూ సమావేశపరచి సంప్రదించాలని ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీని కోరాలని సూచిస్తూ ప్రతిపక్షం వారు ప్రతిపాదించిన సవరణను ముఖ్యమంత్రి ఆమోదించారు. ★

గడచిన నెలలో....

1968-69 సంవత్సరపు బడ్జెటు అంచనాలు రూ. 5.67 కోట్ల లోటును సూచిస్తున్నాయి. మొత్తం ఆదాయం రూ. 199 కోట్లు కాగా, వ్యయం రూ. 204.67 కోట్లు. తమ బడ్జెటు ప్రసంగంలో ముఖ్య మంత్రి అదనపు పన్నుల్ని ప్రతిపాదించక పోయినప్పటికీ సాధారణ అమ్మకం పన్నుల చట్టం, మోటారు వాహనాల చట్టాల సవరణకు సంబంధించిన బిల్లులు రెండూ ఆమోదించ బడినందువల్ల యీ రెండింటి వల్లా రూ.3.5 కోట్ల ఆదాయం రావచ్చు. ఆర్థిక శాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్య మంత్రి స్వంతంగా బడ్జెటును అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. తెలుగులోనే బడ్జెటు ప్రసంగం చేశారు. ముఖ్యమంత్రి బడ్జెటు ప్రసంగంలో కొన్ని ముఖ్యమైన ప్రకటనలు చేశారు. సెకండరీ స్థాయి వరకు, బాలికలవలె బాలురకు కూడా, ఉచిత విద్యా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు తెలియజేశారు.

అయిదు రోజుల పాటు బడ్జెటు పై చర్చ జరిగింది. ఈ చర్చలో చాలా ఎక్కువ మంది సభ్యులు పాల్గొన్నారు. మాట్లాడిన వారి ప్రసంగాలు చాలా వరకు నిర్మాణాత్మకంగా వున్నాయి. ఈ చర్చకు సమాధానమిస్తూ ముఖ్య మంత్రి యించు మించు తొంభై నిమిషాలసేపు ప్రసంగించారు. ముందు ముందు దేశ సమైక్యతను విచ్ఛిత్తి చేసేది ప్రాంతీయ అసమానతేననీ, వచ్చే ఒకటి రెండు ప్రణాళికల్లో యీ ప్రాంతీయ అసమానతలని తొలగించకపోతే దేశ సమైక్యతకే ముప్పు రాగలదనీ హెచ్చరించారు.

బడ్జెటు పై చర్చ జరుగుతున్న సందర్భంలో చాలా మంది సభ్యులు కేంద్రం, రాష్ట్రానికి యిస్తున్న ఋణానికి మనం ఎక్కువ వడ్డీ రేట్లను చెల్లిస్తున్న విషయాన్ని ముఖ్య మంత్రి దృష్టికి తెచ్చారు. దీనికి సమాధానమిస్తూ ముఖ్య మంత్రి, ప్రణాళికా సంఘం నుంచి వివరాలు అందడంతోనే యీ విషయమై కేంద్రాన్ని గట్టిగా అడగగలమని అన్నారు. మొత్తం రాష్ట్రాలన్ని కలిపి రూ. 790 కోట్లను కేంద్రానికి చెల్లించ వలసివుంటుంది. వాటికి లభించిన ఋణం మొత్తం రూ. 590 కోట్లు. ఈ విషయాన్ని చెప్తూ ముఖ్య మంత్రి "వెనక బడిన రాష్ట్రాలను అలక్షించడం, ఒకొక్క రాష్ట్రానికి ఒకో పద్ధతి అనుసరించడం, కొన్ని రాష్ట్రాలని చల్లని చూపు చూడడం చూస్తే నాకు చాలా బాధగావుంది" అన్నారు.

ఈ బడ్జెటు సమావేశంలో శాసన సభ ఆమోదించిన బిల్లులలో ముఖ్యమైనవి– 1968 సం॥పు ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (డిసిప్లినరీ ప్రొసీడింగ్స్ ట్రిబ్యునల్) సవరణ బిల్లు, 1968 సం॥ పు ఆంధ్రప్రదేశ్ అబ్జెక్షనబుల్ పర్ఫారమెన్సెస్ (సవరణ) బిల్లు, 1968 సం॥పు ఆంధ్రప్రదేశ్ భూమి ఆక్రమణ (సవరణ) బిల్లు, 1965 సం॥ ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల (ఎన్నికల వాయిదా) చట్టం.

భాషా సమస్యపై తీర్మానం

బడ్జెటు సమావేశంలో ఫిబ్రవరి 14 వ తేదీన భాషా సమస్యపై అధికార తీర్మానం ప్రవేశ పెట్టబడింది. ఇది రాష్ట్రంలో ప్రజాభిప్రాయానికి అనుకూలమైనది. దీనిని పత్రికలు ప్రశంసించాయి. ఏ భాషా వర్గానికీ హాని జరుగని విధంగా, భాషా సమస్యపై పార్లమెంటులో ఆమోదించిన తీర్మానాన్ని సవరించాలని ఈ అధికార తీర్మానం కోరుతున్నది. శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య తీర్మానాన్ని బలపరిచారు. జాతీయ సమైక్యతను పెంపొందించడానికి త్రిభాషా సూత్రాన్ని ఖచ్చితంగా అమలు పరచడమే ఏకైక మార్గమని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. హిందీయేతర రాష్ట్రాలలో విద్యార్థులకు మాతృ భాషతో పాటు హిందీ, ఇంగ్లీషు భాషలను బోధించాలనీ, హిందీ రాష్ట్రాలలో ఇంగ్లీషుతో పాటు హిందీ మినహా రాజ్యాంగం 8 వ షెడ్యూలులో పేర్కొనబడిన ఏదైనా ఒక ఆధునిక భారతీయ భాషను బోధించాలనీ ముఖ్యమంత్రి అన్నారు. కేంద్ర ప్రభుత్వం సర్వీసులకూ, అఖిల భారత సర్వీసులకూ, యు. పి. ఎస్. సి. ద్వారా కానీ, లేక యితర విధంగా కానీ అభ్యర్థులను రిక్రూట్ చేసేటప్పుడు, ఏ భాషావర్గానికి నష్టం కలగనివిధంగా అభ్యర్థులను పైన పేర్కొన్న మూడు భాషలలోనూ పరీక్షించాలని శ్రీ బ్రహ్మానంద రెడ్డి పేర్కొన్నారు.

సమాన ప్రాతినిధ్యం

హిందీతోపాటు ఇంగ్లీషు భాషను అనుసంధాన భాషగా గానీ, అదనపు భాషగాగానీ కొనసాగించాలని కీ. శే. ప్రధాని నెహ్రూ యిచ్చిన హామీని చట్టబద్ధంగా గుర్తించడాన్ని ఆహ్వానిస్తూనే భాషావిషయంలో పార్లమెంటు చేసిన తీర్మానం "దురదృష్టవశాత్తు హిందీయేతర రాష్ట్రాల ప్రజలకు తీవ్రమైన నష్టం కలుగజేసిందని రాష్ట్ర ప్రభుత్వ తీర్మానంలో నొక్కిచెప్పారు. కేంద్రప్రభుత్వంలోను, అఖిలభారత సర్వీసులలోను అన్ని రాష్ట్రాలకు సమానమైన ప్రాతినిధ్యం యివ్వాలని చేసిన డిమాండు రాష్ట్ర తీర్మానంలోని ప్రధానమైన అంశం. ఈ సందర్భంలో నష్టం కలుగుతుందనే ఉద్దేశంతో ఫలానా భాష మాకు అవసరంలేదని వాదించే కొన్ని రాష్ట్రాలు, అఖిలభారత సర్వీసులలో అన్ని రాష్ట్రాలకు సమానమైన ప్రాతినిధ్యం యివ్వాలనే విషయంలో అనుకూలంగా ఒక్క మాట కూడ అనని విషయాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా పేర్కొన్నారు.

అపరిష్కృత సమస్య

రాష్ట్ర తీర్మానం భాషా సమస్య అపరిష్కృతంగా ఉన్నట్టుగానే భావించింది. ఇకముందు కేంద్రప్రభుత్వ ఉద్యోగాలలో అఖిలభారత సర్వీసులలో ప్రవేశాలు, పాఠశాల, కళాశాలల్లో విద్యాబోధన విషయాలలో ఏ భాషా వర్గానికి నష్టం వాటిల్లినా, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా ఆయా రాష్ట్రాలు తమ స్వంత విధానాలను రూపొందించుకునే అవకాశం

ఉంటుందని తీర్మానంలో పేర్కొన్నారు. హిందీభాష రుద్దడానికి ప్రయత్నించవద్దు. అంతేగాక ప్రాంతీయ భాషలను పెంపొందించే విధంగా అన్ని ప్రాంతాలవారి భావాలను వ్యక్తపరచే సాధనగా అది ఉపయోగ పడేట్టుగా వృద్ధిపొందాలి.

కేంద్ర ఉద్యోగాలలో నియామకాలకు సంబంధించి హిందీయేతర ప్రజలు ఎదుర్కొనే యిబ్బందులను తొలగించే విషయాన్ని కూడ తీర్మానంలో నొక్కిచెప్పారు. వాస్తవంగా యీ సమస్యే చాలా క్లిష్టమైనదిగా కనిపిస్తున్నది. ఎలిమెంటరీ స్థాయివరకు మాతృభాషలోనే విద్యాబోధన జరిగే విధంగా అల్ప సంఖ్యాక వర్గాలవారికి అవసరమైన సౌకర్యం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కూడ యీ తీర్మానంలో నొక్కిచెప్పారు.

రాకెటు కేంద్రం

డా. విక్రమ్‌సారభాయ్, ఫిబ్రవరి 1వ తేదీన ప్రకటించిన విధంగా కేంద్ర అణుశక్తి శాఖ ప్రతిపాదనలు రూపు దాల్చితే భారతదేశంలోని రెండవ రాకెటు ప్రయోగ కేంద్రం ఉన్న అపూర్వమైన ఘనత ఆంధ్రప్రదేశ్‌కు దక్కుతుంది. శాంతియుత ప్రయోజనాల నిమిత్తం అంతరిక్షంలో వైజ్ఞానిక ప్రయోగాలు కమ్యూనికేషన్స్ ఉపగ్రహాల ప్రయోగాల నిమిత్తం యీ కేంద్రాన్ని వినియోగిస్తారు. 1970 ప్రారంభంలో యీ కేంద్ర నిర్మాణం పూర్తి అవుతుంది. అప్పటికి భూభ్రమణ కక్షలోకి కమ్యూనికేషన్స్ ఉపగ్రహాన్ని ప్రయోగించడం జరుగుతుంది.

పురోభివృద్ధి

దేశవ్యాప్తంగా టెలివిజన్ ప్రసారం కల్పించడానికి యీ ఉపగ్రహం మనకు తోడ్పడుతుందని డా. సారభాయ్ అన్నారు. ఈ కార్యక్రమంద్వారా పెద్దపట్నాలకే గాక, గ్రామీణ ప్రాంతాలలో సహితం విస్తృత ప్రాతిపదికపై కమ్యూనికేషన్స్ సౌకర్యాలు కల్పించడానికి, విద్యావ్యాప్తి, కుటుంబ నియంత్రణకు సంబంధించిన సమాచారాన్ని ప్రచారం చేయడానికి వీలుకలుగుతుంది. జాతీయ సమైక్యత సాధన దృష్టితో నైనా దేశాభివృద్ధి కృషిలో భాగంగా యీ కార్యక్రమాన్ని అమలుజరపాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

ముఖపత్రం

కీసరలో మహాశివరాత్రి ఉత్సవం

కీసర క్షేత్రం హైదరాబాదు జిల్లా మేడ్చల్ పంచాయతీ సమితి ప్రాంతంలో వున్నది. ఏటేటా యిక్కడ జరిగే శివరాత్రి ఉత్సవాలకు వచ్చే తీర్థప్రజల సంఖ్య రాను రాను బాగా పెరుగుతున్నది. పంచాయతీ సమితి, హైదరాబాదు జిల్లా పరిషత్తు, యాత్రికుల సౌకర్యంకోసం యిక్కడ చేసిన అనేక సదుపాయలే దీనికి కారణం. యాత్రిక విశ్రాంతి శాలలు, అతిథిగృహాలు, మంచినీటి సౌకర్యాలు, రోడ్లు మొదలగు సదుపాయాలు యిక్కడ ఏర్పాటైనవి. మేడ్చల్, హయత్‌నగర్, రాజేంద్రనగర్, భువనగిరి పంచాయతీ సమితుల అధ్వర్యంలో వారం రోజులపాటు ఉత్సవ సన్నాహాలు జరిగినవి. సాంస్కృతిక ప్రదర్శనలు, శిశు ప్రదర్శనలు, బండ్లపోటీలు, ఉద్యానకృషి, పశు ప్రదర్శనలు, ఆటల పోటీలు, సినిమా ప్రదర్శనలు, ఎగ్జిబిషన్, వైద్యసలహా కేంద్రం మొదలగు అనేక ఆకర్షణల వల్ల ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. ఈ యేడు ఫిబ్రవరి 26వ తేదీన జరిగిన శివరాత్రి ఉత్సవంలో సుమారు లక్షమందికిపైగా యాత్రికులు పాల్గొన్నారు. ఇప్పుడు ఘాట్‌రోడ్డు మీదుగా ఏమాత్రం యిబ్బంది లేకుండా కొండదాకా చిన్న కార్లు పోవడానికి వీలున్నది. శివరాత్రినాడు వేలాది యాత్రికులు ఉపవాసాలు చేసి శ్రీరామ లింగేశ్వరస్వామిని దర్శించారు. హైదరాబాదు, నల్లగొండ జిల్లాల ప్రాంతాలనుండి చాలామంది యాత్రికులు వచ్చారు. ఈ యేడాది మంత్రులు, శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు మొదలగు అనేక మంది ప్రముఖులు యీ క్షేత్రాన్ని దర్శించారు.

ఉగాది తలపులు

కలిసి పోయెను కాలగర్భమ్మునం దింతవరకు లక్షల కోట్ల వత్సరములు
సమసి పోయెను సర్వ సర్వంసహా చక్ర పరిపాలకుల రాజ్య వైభవములు
శిథిల మయ్యెను గుర్తు చెప్పుకో లేకుండ వసుధ నసంఖ్యాక పట్టణములు
అడుగంటిపోయె మహాతపశ్శక్తి సంపాదిత విజ్ఞాన వారి నిధులు

ఎపుడు పుట్టినదో నేటి కెంతవయసో
ఏది గమ్యమొ భ్రమణ మింకెంత వరకో
క్రమము తప్పక విశ్వాంతరాళ మందు
తిరుగు ధరణికి! మానవుల్ తెలియగలరె?

ధైర్యంబుగా జలాంతర్గాములం బోయి కడలి లోతులు చూడ గలిగినాడు
అంధకారావృతం బవని గర్భము జొచ్చి ఖనిజ సంపద పొందగలిగి నాడు
శాస్త్ర విజ్ఞానంబు సాయంబు గైకొని గాలిలో పయనింప గలిగి నాడు
ప్రతిభాధికత చూపి రాకెట్లలో నేగి గ్రహము లైనను చేర గలిగి నాడు

కాని తన తోడి వారల కష్ట సుఖము
లెట్టివో కొంచమైన నూహింప లేక
శాంతి సౌఖ్యాలు లేని నిస్సారమైన
మనుగడను చిక్కుకున్నాడు మానవుండు

అజ్ఞాన భయద గాఢాంధకారమ్మున బడిన వానికి వెలు బాట చూపి
కూడు గుడ్డలు కూడ కొఱత యౌ పేదకు భౌతిక సౌఖ్య సంపదలు గూర్చి
తగు నిదానము చికిత్సయు లేని రోగికి వైద్య సాహాయ్య మేర్పాటు చేసి
అవకాశములు లేక అడుగంటు చున్న సామర్థ్యముల్ రాణించు మార్గమొసగి

మానవావళి యొక కుటుంబముగ మెలగి
సకల దేశాలు శాంతి సంస్థాపనమున
ప్రముఖ పాత్ర వహింపగా భవ్య దీక్ష
గైకొనుట లెస్స నేటి ఉగాది పూట.

శ్రీపాద లక్ష్మీనారాయణ మ

సాహితీ సదనం

గ్రంథ సమీక్ష

జీవన గీత-

ఖలీల్ జీబ్రాన్ రచన "ది ప్రాఫెట్" కు ప్రఖ్యాత కవి కాళోజీ అనువాదం. 94 పేజీలు. వెలలేదు. ప్రచురణ: యువ భారతి, 5 కింగ్స్‌వే, సికింద్రాబాదు.

ఖలీల్ జీబ్రాన్ ప్రపంచ ప్రఖ్యాతి పొందిన లెబనాన్ కవి, ద్రష్ట, తత్వవేత్త, చిత్రకారుడు. తన రచనలను అరబ్బీ భాషలో వ్రాసి తనకు తానే వాటిని ఆంగ్లంలోకి కూడా అనువదించుకున్నాడు. దిప్రాఫెట్, గార్డెన్ ఆఫ్ ది ప్రాఫెట్, ఎర్త్ గాడ్స్, ఫోర్‌రన్నర్ మొదలైన ఎన్నో రచనలు చేశాడు. జీబ్రాన్ 1931 లో 48 వ ఏట మరణించాడు. తన జీవిత కాలంలోనే ఆయన రచనలు సుమారు 25 ప్రపంచ భాషల్లోకి అనువదింపబడినవి. మరణానంతరం ఆయనకు యింకా ప్రఖ్యాతి లభించింది. హిందీ, తమిళం, మళయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, ఉరుదూ భాషల్లోకి కూడా జీబ్రాన్ రచనలు వ్యాపించాయి. తెలుగులో ఖలీల్ జీబ్రాన్ రచన ప్రకటించబడడం యిదే ప్రథమం. ఈ మంచి పనికి పూనుకుని పట్టుదలతో విజయవంతంగా నిర్వహించిన కవి కాళోజీ, ప్రచురణకర్తలు యువ భారతివారూ అభినందనీయులు.

"అర్ఫలీజు" పట్టణము నుండి "అలీముస్తఫ" పన్నెండేండ్ల స్థిరనివాసం తర్వాత స్వస్థలానికి తిరిగి వెళ్లబోతున్న ఘట్టంతో యీ కావ్యం ఆరంభించబడింది. ఆయన తమను వీడి వెళ్ళడం స్థానిక ప్రజలకు ఏ మాత్రమూ యిష్టంలేదు. ఆయన "తానుండిన కాలమునకు తానె ఉషస్సైనవాడు." అటువంటి వాని వియోగము వారు సహించలేరు. ఆయనకూడా, "చిట్టిపగిలి పోయినట్టి నాగుండియ తునకలెన్నో ఈ నగరపు వీథులనే చేతులార వెదజల్లి"న వాడు. ఆ ప్రజలను వదలి వెళ్ళడం ఆయనకూ కష్టంగానే వుంది. కాని తప్పక వెళ్లాలి ఆయన ఆ విధంగా ఆ నగరం వదలి స్వస్థానానికి వెళ్ళే సందర్భంలో అక్కడి ప్రజలు వేసే ప్రశ్నలకు ఆయన చెప్పిన సమాధానాలుగా యీ కావ్యమంతా నిర్వహించబడింది. ప్రేమ, వైవాహిక బంధము, పిల్లలు, దానము, తినుట-త్రాగుట, కాయకష్టము, సంతోషము, ఇండ్లు, ఉడుపులు, క్రయ విక్రయములు, నేరము-శిక్ష, శాసనాలు, స్వాతంత్ర్యము, వివేకము, వేదన, తననుతాను తెలిసికొనుట, విద్య, మైత్రి, సంభాషణ, కాలము, మంచి-చెడూ, ప్రార్థన, సుఖము, సౌందర్యము, ధర్మము, మృత్యువు మొదలగు విషయములను గురించి వేసిన ప్రశ్నలకు జవాబుల రూపములో ఒక్కొక్క ఖండము నిర్వహించబడింది. ఇదంతా ఉదయము నుంచి సాయంత్రమువరకు ఒక్క పగటిపూటలో జరిగిన కథగా వర్ణించబడింది. చివరకు శ్రోతలు అంటారు; "నేటి యీ మా పగలు ధన్యము, నేడు మా యీ స్థలము ధన్యము, మాతో యింతగా ముచ్చటించిన, మేటి! నీదగు ఆత్మ ధన్యము". అప్పుడు అలీముస్తఫ "నేనా పలికినదింతకు, నేనేనా? కానా? నేనును వినువాడను ఒకడకాన!" అని జవాబు చెప్తాడు.

"అలీముస్తఫ" ను ప్రజలు వదల్లేక వదల్లేక వదలబోతున్న ప్రథమ ఖండం చాలా కరుణరసపూరితంగా నిర్వహించబడింది. చివరకు ఎలాగూ అతనుపోవడం తప్పదని గ్రహించి 'అర్ఫలీజు' వాసులు "శాశ్వత తత్వము, సత్యము నిత్యము సాక్షాత్కారము గలిగినవాడవు కావున ఆ సత్యము మాకిచ్చి పొమ్ము, దాని తత్వమును గూర్చి పలికి మరీపొమ్ము" అని ప్రార్థిస్తారు.

పిల్లల విషయం చెప్తూ 'అలీముస్తఫ' చేసిన బోధ:

"వారి దేహాలను కాపాడెడి గేహాలను నిర్మించుడు
కాని వారి ఆత్మలకై పంజరాల నల్లకుడు"
"ప్రాణముగల బాణములటు బాలల సంధించివిడువ
ధనువులు మీ తనువులంతే
ధనుర్ధరుడు తన బాణము లతిదూరము రువ్వడిగా పోవాలని
తన శక్తిని ప్రయోగించు మిమ్ము లొంగదీసివంచు
ఆ ధనుర్ధరుని చేతులలో మీలొంగుట ఎల్లప్పుడు సుఖవంతమె
హాయిని చేకూర్చునదే అగును

ఏలన-

రివ్వునబోయెడి బాణము వలెనే
కదలక నిలిచిన ధనువును సయితము
ప్రేమించును ధనుర్ధరుడు."

ఇటువంటి తాత్విక చింతనగలిగి నిత్యజీవితానికి అన్వయింపదగిన మహార్థాలు యీ కావ్యం నిండా వున్నాయి.

కథా వస్తువు తత్వస్వభావం గలది కావడంచేత నేమో యీ కావ్యంలో కాళోజీగారు కృత్రిమమైన గ్రాంథిక కావ్య భాషా వ్యామోహానికి గురి అయినారు. స్వచ్ఛమైన వ్యవహారిక భాషలోని ప్రజా ప్రయోగాలను అతిసహజంగా వాడి, అందుకు పేరు వడిన ప్రజాకవి యీ విధంగా గ్రాంథికశైలిని అనుసరించడం ఆశ్చర్యకరమైన విషయమే. చాలాచోట్ల మాత్రాచ్ఛందస్సులవలలో జిక్కి, కొన్నిచోట్ల కేవలవచన ప్రాయమై గ్రాంథిక రూపంవల్ల కృత్రిమంగా భాసించే ఘట్టాలు యీ కావ్యంలో వున్నాయి. ఇంతకంటే చక్కని వ్యవహారిక వచనంలోకి అనువదిస్తే బాగుండేదేమో అనిపిస్తుంది.

"ఓ నా సోదరులారా
సనాతన జనని కూర్మిపుత్రులార
ఎన్నో మారులు మీరలు
నా కలలందున వచ్చి యున్న వారలేను"

"వచ్చి యున్న వారలేను" వంటి ప్రయోగాలు అనవసరం. వీటికేమి గాని, మొత్తంమీద కాళోజీగారు యీ కావ్యాను వాదాన్ని తెనుగు ప్రజలకు అందించి మన సాహిత్యానికి ఒక నూతన అలం

కారాన్ని సమకూర్చినారని చెప్పవచ్చు. చదివి మననం చేసుకుని, జీవితంలో అనుసరించదగిన అనేక మహాభావాలు యీ కావ్యం నిండా వున్నాయి.

"బాపు" వేసిన ముఖచిత్రం చాలా ఆకర్షణీయంగా వుంది. ఇటీవల వెలువడిన కావ్యాలలో యింత మనోహరమైన ముఖచిత్రం దేనికీ లేదంటే అతిశయోక్తి కాదేమో.

డోలిక–

(కథలసంపుటి)

రచయిత్రి : సి ఆనందారామం

ప్రతులకు : సుపర్ణపబ్లికేషన్స్,

శ్రీరామకృష్ణాపురం, కొత్తపేట, హైదరాబాదు – 35

ఇందులో కర్మభూమి, ముసురు, లోపలిలోకాలు, డోలిక మొదలైన పదికథలు వున్నాయి. వెనక వివిధ పత్రికల్లో ప్రచురితమై యిప్పుడీవిధంగా సంకలితంచేయబడ్డాయి. ఆనందారామంగారి కథలు సున్నితమైన యితివృత్తాలచుట్టు అల్లబడినవి. తేలిక సంఘటనలను తీసుకుని ఆకర్షణీయంగా కథను మలుస్తారు. ఈకథలన్నిటిలోనూ బాహ్యంగానో, అంతర్లీనంగానో యువతీయువకులప్రేమ ప్రధానమైన స్థానం వహించింది. ప్రేమకథల్ని చెప్పడంలో చూపించవలసిన నాజూకు ఈ కథలలోవుంది. తనకున్న నిర్దిష్టమైన అభిప్రాయాలను ప్రకటించడానికి రాసిన కథలుకూడా కొన్ని వున్నాయి. వాటిలో డోలిక చక్కటికథ. స్త్రీ హృదయం ఊయలవంటిది. అది అప్పుడప్పుడు అటూ యిటు వూగినా చివరకు అది తను ఆధారం చేసుకుని వున్న దూలాన్నే ఆశ్రయించి స్థిరత్వం పొందుతుంది. అలాగే స్త్రీ మనస్సు అప్పుడప్పుడు చలించినా, భర్తనే ఆశ్రయించి స్థిరంగావుంటుంది–అని రచయిత్రి వ్యాఖ్యానం, ఆవ్యాఖ్యానం మీద అల్లిన కథా బావున్నాయి. ఈ పుస్తకానికి ఆపేరేపెట్టడం బావుంది.

'అడవి పూలు' అన్న పేరుకూ, ఆ కథలోని యితివృత్తానికీ అతకలేదు. 'భర్తారూపయుతశ్శత్రుః' అన్న కథ స్త్రీరచన అనడానికి ఆపేరే నిదర్శనం. కర్మభూమి కథ ప్రారంభం పాత ధోరణిలో వుంది. 'నన్నుహత్య చేయవూ' కథ భయంకరమైన సత్యం. ఒకే వ్యక్తిని అక్కచెల్లెళ్ళు ప్రేమిస్తారు. అతి ప్రేమతో అక్కచెల్లెళ్ళ మధ్య యీ కారణంగా ఎంతో అగాధం ఏర్పడుతుంది. చివరికి చెల్లెలికి విషమిచ్చి అక్క చంపేస్తుంది. తననిచంపడానికి అక్క చేసిన ప్రయత్నం చెల్లెలు అర్థంచేసుకుని, చనిపోతూ కూడా అక్కమీద నేరం రాకుండా తనకు గుండె జబ్బని అబద్ధ మాడుతుంది. చివరకు చెల్లెలు మంచితనం అక్కకు తెలుస్తుంది. ఆమె పిచ్చిదైపోతుంది. కథనంలో కొంత సహజత్వం లోపించిందేమో అనిపించింది యీ కథలో.

'కర్మ భూమి' కథలో మరి కొంత తెలుగుదనంవుంటే బావుండేది.

మొత్తంమీద కథలన్నీ బావున్నాయి. అక్కడక్కడ పాత్రోచితంగా గోదావరిజిల్లా ప్రజలభాష వాడడంలో రచయిత్రి పరిశీలన అభినందించదగ్గది.

గ్రంథాలయ దర్శిని--1968:

సంపాదకుడు, వెలగా వెంకటప్పయ్య, సహాయ సంపాదకుడు యస్. పాండురంగా రెడ్డి. ప్రతులకు: నవజీవన్ బుక్‌లింక్స్, ఏలూరు రోడ్, విజయవాడ_2. వెల: మూడు రూపాయలు. మన రాష్ట్రంలో పౌర గ్రంథాలయ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రంథాలయోద్యమంలో ఒక క్రొత్తఘట్టం ప్రారంభ మైనదని చెప్పవచ్చు. గ్రంథాలయ ఉద్యమంలో వచ్చిన ప్రగతిని యీ గ్రంథం ప్రదర్శిస్తున్నది. ఇందులో గ్రంథాలయ సంఘాల పాత్ర, శిక్షణ, వయోజన విద్య, పంచవర్ష ప్రణాళికలు, తెలుగు పుస్తకాల ప్రచురణ మొదలగు ముఖ్యాంశాలను గురించి తెలుసుకోదగిన విషయాలు చాలా వున్నాయి. రాష్ట్రంలోని ప్రసిద్ధగ్రంథాలయాలు, వాటి కార్యదర్శులు, జన సంబంధశాఖ సమాచార కేంద్రాలు, జిల్లాలవారీ జనాభా, విద్యా వంతులు మొదలగు అనేక అవసరమైన వివరాలు యిచ్చారు. ఏటేటా జనవరిలో యిటువంటి గ్రంథాలయ దర్శిని వెలువరించాలనే ప్రకాశకుల అభిలాష అభినందించ దగినది.

స్వీ కా ర ం

(1) సరస్వతీ సాక్షాత్కారం : (కావ్యం)

రచన : అనుముల కృష్ణమూర్తి

ప్రచురణ యువ భారతి

(2) సంక్రాంతి కవి సమ్మేళనము

ప్రచురణ: పశ్చిమ గోదావరీమండల జన సంబంధ శాఖ, ఏలూరు

(3) విద్వద్గద్వాల (నాటకం)

రచయిత: కె. శ్యాలన్న, బి. ఎ.

ప్రచురణ: విద్యార్థి సంఘము, ప్రభుత్వోన్నత పాఠశాల, మహబూబ్‌నగర్ జిల్లా

వెల : 1రూ,

(4) హరిపురుషోత్తం (జీవితచరిత్ర)

రచయిత : త్రిపురనేని సుబ్బారావు. వెల : 3రూ

ప్రతులకు : కవిరాజ సాహితీ సదన్. మలక్‌పేట, హైదరాబాదు.

—చైతన్య

ముక్తకాలు

—మాదిరాజు రంగారావు

గ్రుడ్డివాడు అద్దంలో చూచుకొని ముఖం,
ఆనందంలో లీనమై మురిసి పోయినట్టు
కళ్ళు ఉన్నవాడు ఎదుటివాని ముఖంలో
తన మనస్సు చూడాలని పడతాడు తహతహా.

వెలుగు చీకటి - ఎన్నటికీ కలవని
ఒకే నదియొక్క రెండు తీరాలు
ఇవి స్వర్గ నరక సంకేతాలు
మనస్సులో ఒదిగి ఉన్న ఆనందం, దుఃఖం

ఖైదునుండి విముక్తులిద్దరు హంతకులు
ఒకరినొకరు చూచుకొని సాగారు ముందుకు
ఒకరి కళ్ళలో పరచబడిన నిర్మలాకాశం
మరొకరి కళ్ళలో తిరుగు అగ్నిగోళాలు

చచ్చి బ్రతికే వారి సంఖ్య అల్పం
బ్రతకడానికి చచ్చేవారు ఎక్కువ.
కొందరిని జీవితం అమావాస్యవలె
కొందరిని పూర్ణిమవలె వరిస్తుంది!

ప్రతివస్తువులోని అందాన్ని చూడడం
ప్రతిమనిషికీ సాధ్యం కాదు, నిజం.
ప్రతిమనిషినీ ఆనందమయుని చేయడం
ప్రతి వస్తుప్రకృతి కలితం, కూడా.

జీవితం గడుస్తుంది కొందరికి
యంత్రంవలె, ఆరిపోని దీపంవలె,
కొందరికి క్రమ్మిక వదలని నిద్రవలె
కొందరికి అవిచ్ఛిన్న యజ్ఞంవలె.

గ్రీష్మం వచ్చింది నిప్పురెక్కలు విప్పి
బంగరు కుప్పవలె భాసించి జగత్తు
రాత్రి వచ్చింది మసక కన్నులు విప్పి
బూది కుప్పవలె మారిందదే లోకం.

టోకియో లేఖలు

అట్లూరి
వెంకటేశ్వర రావు

టోకియో
10-11-'63

చిరంజీవులయిన బాబులకు మీ నాయన దీవించి వ్రాయునది ఏమనగా:— ఈ మధ్య ప్రపంచంలోకెల్ల అతివేగముగా నడచు రైలుపై ప్రయాణము చేసితిని. ఆ అత్యద్భుత అనుభవములను మీకు వివరించెదను.

కొత్త రైలుమార్గము

జపాను దేశస్థుడు ప్రపంచ ప్రజలకు తమ సాంకేతిక ఔన్నత్యమును ప్రదర్శించుటకుగాను ప్రపంచ ఒలింపిక్ క్రీడాపోటీల సందర్భముగా అత్యధిక వేగముతో పయనించు రైలును సిద్ధము చేయుచున్నారు. ఈ రైలుమార్గము టోకియోనుండి ఒసాకావరకు 515 కి. మీ. (320 మై.) పొడుగు ఉన్నది. దీనిలో చాల భాగము పని పూర్తయినది ఈ రైలు గంటకు 200 కి. మీ. (125 మై.) వేగముతో ప్రయాణముచేసి ఒసాకా చేరుటకు మూడుగంటల కాలము పట్టుచున్నది. ఇట్లు అత్యంత ఆధునిక పరికరముల సహాయముతో అత్యున్నత వేగముగా పయినించెడి రైలును విదేశ నిపుణులకు చూపించుట వలన వారి వ్యాపారముకూడ అభివృద్ధిచెందుటకు ఎక్కువ అవకాశమున్నది. ప్రపంచ ఒలింపిక్ క్రీడాపోటీలు ఇంకొక సంవత్సరం ఉన్నప్పటికి ఈ రైలుమార్గమును తయారు చేయుటకు అతి చురుకుగా పని సాగుచున్నది.

ప్రయోగములు

నిమిషమునకు రెండుమైళ్ళ వేగముతో పయనించు రైళ్ళలో ప్రయాణికులను తీసికొనివెళ్ళుటకై వాటిని నడిపించుటలోగల సాధక బాధకములను గూర్చి తెలిసికొనుటకు అనేక ప్రయోగములు చేయవలెను. అసలు ఈ రైలును నడిపించుటకు తర్ఫీదయిన సిబ్బంది కూడ అవసరము. ఈ ప్రయోగములను జరుపుటకును సిబ్బందిని తర్ఫీదు చేయుటకును ఆ రైలు మార్గములో కొంత భాగము అప్పుడే ఉపయోగించుచున్నారు. ఈ మార్గములో జరుగు ప్రయోగములను తిలకించుటకు ఎవరిని రానీయరు. కాని నాకు అతి సన్నిహితులయిన స్నేహితుల ద్వారా ప్రత్యేకానుమతిని పొంది ఆ ప్రయోగములలో పాల్గొనుటకు అచ్చటికి వెళ్లుటకు వీలు చిక్కినది.

ఎలక్ట్రానిక్ పరికరములు

నేను పయనించిన రోజున ఆ రైలు కొన్ని ప్రత్యేక ప్రయోగముల కొరకు గంటకు 230 కి. మీ. వేగముతో పయనించినది. అసలు ప్రపంచములోకన్న అతి వేగముగా పయనించెడి రైలులో, మామూలు వేగముకన్న ఎక్కువ వేగముతో ప్రయాణము చేయుచున్నానన్న విషయము తెలిసికొని అత్యానంద భరితుడనయితిని. ఇటువంటి అనుభవము ఎంతో అదృష్టము ఉన్నగాని దొరకదు. అంత వేగముగా ప్రయాణము చేయు రైలును ఆపవలెనన్న సుమారు రెండు మైళ్ల ముందుగానే బ్రేకులు వేయవలెను. అనగా రైలు మార్గమునకు ఏదయిన అడ్డములు ఉన్నయెడల రెండు మైళ్ళకు ముందుగానే డ్రయివరు చూచుకొనవలెను. ఇది అసాధ్యము. అందువలన ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరముల సహాయముతో కొన్ని మైళ్ళ దూరములోనున్న అడ్డంకులను డ్రయివరు చూడగలడు. రైలువేగముకూడ డ్రయివరు ప్రమేయము లేకుండానే అడ్డంకులు వచ్చినప్పుడు తగ్గించు ఏర్పాటులుకూడ కలవు. అసలు రైలు దారికి అడ్డంకులు లేకుండా నుండునటుల రైలు మార్గమంతయు ఎత్తయిన గట్టుపై నిర్మించిరి. అందువలన రైలుమార్గము దాటు రోడ్లన్నియు సొరంగములగుండా పోవునే గాని లెవల్ క్రాసింగులు లేవు. అదియును గాక ఒకవైపుకు వెళ్లే రైళ్ళన్నియు ఒకమార్గము ద్వారాను, తిరిగివచ్చు రైళ్ళన్నియు దాని ప్రక్కనే ఉన్న వేరొక మార్గము ద్వారాను, నడచుటవలన అతివేగముగా నడచుటకు వీలగును.

రమణీయమైన రైలు

ప్రయాణీకులకు అతి సుఖదాయకముగా నుండుటకుగాను ఈ రైలుపెట్టెలో అనేక ఏర్పాటులు ఉన్నవి. ప్రయాణము చేయునప్పుడు రైలునుండియే ఎచ్చటికయినను ఫోనులో మాట్లాడవచ్చును. రైలులో ప్రయాణీకులకు కావలసిన సౌకర్యములన్నియు ఏర్పాటు చేయబడి యున్నవి. అసలు ఈ రైలును జపానులో "హికారి" అని అందురు. హికారి అనగా జపాను భాషలో కాంతి అని అర్థము. అనగా కాంతిలాగా అతివేగముతో ప్రయాణము చేయునని అర్థము. అతివేగముతో ప్రయాణము చేయునప్పుడు ఎదురుగా వచ్చు బండ్లనుండి వచ్చెడి శబ్దముగాని, గాలి వేగముగాని ప్రయాణీకులకు సోకకుండ అనేక ఏర్పాటులు ఉన్నవి. అసలు ఈ రైలు ఆకృతియే ఎంతో రమణీయముగా నున్నది. ఈ ప్రయాణము ముగిసిన పిదప అక్కడి నా మిత్రుల నుండి అనేకమయిన సాంకేతిక విషయములను గూర్చి తెలిసికొని అత్యానంద భరితుడనయి ఈ అనుభవమును గూర్చి ఆలోచించుకొనుచు నేను బసచేసెడి హోటలుకు చేరుకొంటిని.

దూరపు ప్రయాణములు

ఈ మధ్య ఉద్యోగసంబంధముగా ఒక దూరపు ప్రదేశమునకు రైలులో వెళ్ళవలసివచ్చినది. ఇంతకుముందు ఇచ్చటి రైళ్ళను

గూర్చి వినియుండుటయేగాని ఎప్పుడు ప్రయాణము చేసియుండలేదు. అసలు ఈరైలుప్రయాణము ఒకవిధమయిన ప్రత్యేకానుభూతిని కలిగించినది. జపాను దేశములో ఒక సామెత గలదు. ఏమనగా మన గడియారములను రైళ్ళ రాకపోకలను బట్టి దిద్దుకొనవచ్చును అని. అనగా గడియారము తప్పు నడవవచ్చుగాని రైళ్ళుమాత్రము ఆలస్యముగా నడువవు అని వీరి ఉద్దేశ్యము. అంతకాలము అది అతిశయోక్తి అని భావించెడివాడను. నేను ప్రయాణముచేసిన 300 మైళ్లు ఒక్క నిమిషముకూడ తేడా లేకుండ గమ్యస్థానము చేరితిని. ఇట్టి అనుభూతి ఏకొద్ది మందికోతప్ప గలుగదు. కాని ఈ దేశములో ప్రతి రైలుప్రయాణికునకు ఇందలి సత్యము విశదమే.

భోజన సదుపాయములు

రైలులోని పెట్టెలన్నియు ఎయిర్‌కండిషన్ చేయబడి యున్నవి. విమానములో ఏర్పాటుచేసిన సీట్లులాంటి సీట్లు ఉన్నవి. రైలు ఒక పెట్టెనుండి ఇంకొకపెట్టెలోనికి వెళ్ళ వీలు వున్నది. అనగా రైలు నడచునప్పుడు ఒక చివరినుండి ఇంకొక చివరికి నడచి వెళ్ళుటకు వీలుఉన్నది. రైలు పొడవునా సీట్ల మధ్యగా ఒక దారి ఉన్నది. అందు వలన ప్రయాణికులు రైలు నడచునప్పుడు ఒకచోటునుండి ఇంకొకచోటికి సులువుగా వెళ్ళ వచ్చును. భోజనశాలకూడ ఉన్నది. అదిగాక రైల్వేసిబ్బంది ప్రయాణికులకు కావలసిన వస్తువులను సీట్లవద్దనే అందజేయుదురు. అనగా విమానములోనున్న ఏర్పాటులన్నియు ఇందులో అమర్చ బడియున్నవి.

శ్రావ్యసంగీతము

ప్రతి సీటువద్ద ఒక చిన్న పరికరము అమర్చబడియుండును. ఆ పరికరమును చెవిలో పెట్టుకొని స్విచ్ నొక్కిన రేడియోలో సంగీతము వినవచ్చును. ఈ సంగీతము ఇతరులకు విసుగు కలిగించకుండ వినవచ్చును. ప్రతిపెట్టెలోను లౌడ్‌స్పీకర్‌లు అమర్చ బడియున్నవి. ఎదయిన రమణీయ దృష్యములుగాని, చారిత్రాత్మక ప్రదేశములుగాని వచ్చినప్పుడు వానినిగూర్చి ప్రయాణికులకు విపులముగా ఆ లౌడ్‌స్పీకర్లద్వార వినిపింతురు. స్టేషనులలో బండి ఒకటి రెండు నిమిషములకన్న ఎక్కువ ఆగదుగాన స్టేషనువచ్చు విషయము గార్డు ముందుగానే ఈ లౌడ్‌స్పీకర్లద్వారా తెలియ పర్చి యుండుటచే ప్రయాణికులందరు సామానులను సర్దుకొని స్టేషను రాగానే క్రమపద్ధతిలో దిగుదురు.

పోర్టరులు లేని ప్రయాణము

ఇచ్చట సామానులు ఎక్కించుటకుగాని దింపుటకుగాని రైలు స్టేషనులలో పోర్టరులు ఉండరు. అందువలన ఎవరిసామానులు వారే మోసుకొనవలెను. అసలు ప్రయాణములలో సామానుల అవసరమే ఉండదు. ప్రతివారు చిన్న చేతి సంచితో ప్రయాణము చేయుదురు. ఎన్ని రోజుల ప్రయాణమయినను ఒకే ఒక్క జత బట్టలతో వెళ్ళుదురు అందువలన రైళ్ళలో సామాను రద్దీలేక విశాలముగా ప్రయాణము చేయుటకు వీలగుచున్నది.

హోటళ్ళు

ఇచ్చట ప్రయాణికులు బెడ్డులు, తుండుగుడ్డలు, రాత్రి ధరించు బట్టలు మొదలయిన వానిని తీసుకురారుగానీ, అటువంటి వస్తువులన్నియు ఇక్కడ హోటళ్ళలోనే ఏర్పాటు చేయుదురు. అసలు పండ్లు తోముకొనుటకు కావలసిన బ్రష్, పేస్టు, గడ్డము చేసికొనుటకు కావలసిన రేజరు, బ్లేడ్లు, సబ్బులన్నియు అచ్చట ఏర్పాటు చేయుదురు. ఈ బ్రష్‌లు, బ్లేడ్లు, సబ్బులు అన్నియు ఒకరు వాడినవి ఇంకొకరు వాడరు. అందువలన ఏరోజు కారోజు పారవేయుటకు వీలయిన చవక వస్తువులు ఈ దేశములో కలవు. రాత్రి ధరించు దుస్తులు మగవారికి ఆడవారికి ఒకటే రకమయినవి. వీనిని రోజు ఉతికి ఇస్త్రీ చేసి శుభ్రముగా ఉంచెదరు. ప్రతిరోజు ఇస్త్రీ చేసిన టవల్సు, బెడ్‌షీట్లు ఇచ్చెదరు. ప్రతిగదిలోను టెలిఫోను, రేడియో, టెలివిజన్‌లాంటి సాధనములు ఉండును. ఇచ్చట చలిగా నుండునుగాన గదిని వేడిగా నుంచుటకు కావలసిన పరికరములు కూడ అమర్చ బడియుండును.

హోటలులోని అతిధుల సౌకర్యములను చూచుకొనుటకు నిపుణులయిన సిబ్బంది ఉందురు. అసలు రైలు ప్రయాణము, హోటలు మకాము మొదలయిన అనేక ఆకర్షణీయమయిన సదుపాయములను కలిగించుట వలన ఈ దేశములోని ప్రజలు ఎక్కువగా విలాస యాత్రలకు వెళుటకు వీలుగు చున్నది. ఈ దేశస్థులే గాక విదేశస్థులు కూడ శ్రమలేకుండానే అన్ని ఏర్పాటులుచేసికొని దేశములోని వినోదయాత్రా స్థలములక్కు వెళ్ళుటకు వీలుగలుగుచున్నది. మన దేశములో కూడ ఇటువంటి ఏర్పాటులు చేసిన ఇంకను ఎక్కువగా విదేశస్థులను ఆకర్షించ వచ్చును.

ఇట్లు
మీ ప్రియమయిన నాన్న

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతులు

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1967 సంవత్సరానికి నలుగురు సుప్రసిద్ధ రచయితలకు ఒక్కొక్కరికి రూ. 1116 ల చొప్పున రొక్కం బహుమతులు ఇచ్చింది. శ్రీ కొడవటిగంటి కుటుంబరావు (నవల), శ్రీ మధురాంతకం రాజారాం (కథానిక), శ్రీ దివాకర్ల వెంకటావధాని (సాహిత్య విమర్శ), శ్రీ దాశరథి (కవిత).

శ్రీ వారణాసి రామమూర్తిరేణు (హిందీ), శ్రీమతి బుర్రా కమలాదేవి గార్లనుకూడా అకాడమీ 1116 లు యిచ్చి సన్మానించింది.

ఇద్దరు విఖ్యాత రచయితలు శ్రీయుతులు కోలవెన్ను రామ కోటేశ్వరరావు, శ్రీ మునిమాణిక్యం నరసింహారావు గారలను అకాడమీ విశిష్ట సభ్యులుగా సత్కరించింది.

క్రీడారంగం

— జైరాజ్

ఆంధ్రప్రదేశ్ టేబిల్ టెన్నిస్ సంఘం అధ్వర్యంలో ఇటీవల హైదరాబాదులోని సరోజినీదేవి స్మారక హాలులో జరిగిన ఇన్విటేషన్ టేబిల్ టెన్నిస్ టోర్నమెంటు ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. ఈ టోర్నమెంటులో జపాను ఆటగాళ్లు ప్రదర్శించిన అద్భుత నైపుణ్యానికి ప్రేక్షకులు ముగ్ధులయ్యారు. జపాను ఆటగాళ్ళ ఆటను తిలకించనివారు మంచి అవకాశాన్ని కోల్పోయారనడంలో సందేహంలేదు.

మనదేశంలో పర్యటిస్తున్న నలుగురు జపాను టేబిల్ టెన్నిస్ ఆటగాళ్లు— టొక్యూషునిషీ, షిగెయో ఇటో, టొక్యొటసకా, టోక్యో మయెడీలు ఈ టోర్నమెంటులో పాల్గొన్నారు. వీరు వరుసగా స్థానిక ఆటగాళ్ళయిన మహమ్మద్ ఆజం, దిలీఫ్‌రాజ్ సక్సేనా, మీర్ ఖాసిం అలీ, ఎన్. వి. అశోక్‌లతో ఆడారు. ఈ నాలుగు ఆటలలోను జపానువారే పైచేయిగా ఆడారు. అంతేగాక ఆటలో మంచి నైపుణ్యం, ప్రజ్ఞ ప్రదర్శించారు.

ఫైనల్సులో మయెడీ, టసకాను ఓడించి ఇన్విటేషన్ టోర్నమెంటు ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నాడు. ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, ఆటగాళ్ళకు సావనీర్లను అందజేశారు. జపాను ఆటగాళ్ల ప్రతిభావంతమైన ఆటద్వారా అనేకమంది అభిమానాన్ని చూరగొన్నారని ముఖ్యమంత్రి అనగానే ప్రేక్షకుల హర్షధ్వానాలతో ఆ ప్రాంగణమంతా మారుమ్రోగింది.

హాకీ

ఈ సంవత్సరం జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలో హైద్రాబాదు జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకొని తన ప్రతిభను మరోసారి చాటుకున్నది. క్వార్టర్ ఫైనల్స్‌లో పంజాబు హైదరాబాదును 2–1 స్కోరుతో ఓడించింది. సెంటర్ ఫార్వర్డ్ మాన్ సింగ్ అన్ని ఆటలలోనూ ప్రతిభావంతంగా ఆడాడు. కేరళతో జరిగిన పోటీలో మూడు గోల్స్ కొట్టాడు. ఇన్ సైడ్ లెఫ్ట్ లక్ష్మీనారాయణ, గోల్ కీపర్ ఖయూమ్‌లు కూడా మంచి ఆట ప్రదర్శించారు.

దక్షిణ మండలం లీగ్ మ్యాచ్‌లలో హైదరాబాదు, మద్రాసు, మైసూరులతో 'డ్రా' చేసింది.

అథ్లెటిక్స్

ఆంధ్ర ప్రదేశ్ క్రీడా వ్యవహారాల మండలి అధ్వర్యంలో జరిగిన నాలుగవ రాష్ట్ర క్రీడోత్సవాలు, ఆంధ్ర ప్రదేశ్‌లోని జిల్లా ప్రాంతాలలో ప్రతిభావంతులైన క్రీడా కారులు అనేక మంది వున్నారనే విషయాన్ని వెల్లడించాయి. స్పోర్ట్స్. గేమ్స్ నిర్వాహకులు చాలా మంది అభిప్రాయ పడుతున్నట్లు ప్రతిభావంతులైన క్రీడాకారులు జంటనగరాలలో మాత్రమే లేరు. వారు జిల్లా ప్రదేశాలలో కూడా వున్నారు. కాకపోతే నగరంలోని అథ్లెట్లకు వున్న శిక్షణ సౌకర్యాలు జిల్లాలలోని వారికి లేవు. జిల్లా అథ్లెట్లు అగ్రగణ్యులుగా వస్తున్నారంటే అది వారి స్వయం ప్రతిభ వల్లనే.

జిల్లాలనుంచి వచ్చిన అథ్లెట్లు ఫీల్డు పోటీలలో తమ ఆధిక్యం కనబరిచారు. 110 మీటర్ల హర్డిల్స్‌లో కరీంనగర్ మండలానికి చెందిన పెంటోనీ ప్రథముడుగా గెలుపొందాడు. మిగిలిన రెండు స్థానాలనుకూడా జిల్లాలవారే గెలుచుకున్నారు. తక్కిన పోటీ ఫలితాలు ఇలావున్నాయి :—

పోల్‌వాల్టు: పి. రామిరెడ్డి (కడప) డిస్కస్ థ్రో: విజేత–సయ్యద్ మన్సూర్ (కడప) వీటిలో మిగతా స్థానాలు పొందిన వారంతా కూడా జిల్లాలవారే. ట్రిపిల్ జంప్: విజేత–ఎ. జె. జె. రెడ్డి (పశ్చిమ గోదావరి) షాట్‌పుట్: విజేత–సయ్యద్ మన్సూర్. మొదటి రెండు స్థానాలను జిల్లాల క్రీడాకారులు గెలుచుకున్నారు.

పురుషుల విభాగంలో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ మెదక్ మండలానికి చెందిన ఎం. కె. మణికి లభించింది. ఈ ఛాంపియన్ షిప్ ఇతనికి ఏ పోటీలోనూ ప్రథముడుగా గెలువకుండానే వచ్చింది. 100 మీ., 200 మీ., 400 మీ. 110 మీటర్ల హర్డిల్స్‌లో ఇతను ద్వితీయుడుగా వచ్చాడు. తత్ఫలితంగానే ఇతనికి వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ లభించింది.

బాలుర విభాగంలో నెల్లూరు మండలానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కె. వెంకటేశ్వరరావుకు వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ లభించింది. ఇతను పోల్‌వాల్టు, షాట్‌పుట్, హైజంప్‌లలో ప్రథముడుగా గెలుపొందాడు.

హైద్రాబాదు మండలం ప్రతినిధురాలు బి. సరళ 100 మీ., 200 మీటర్ల పోటీలలో ప్రథమురాలుగా నెగ్గి బాలికల విభాగంలో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నది. జట్టుకు యిచ్చే ఛాంపియన్‌షిప్ హైద్రాబాద్ మండలానికి లభించింది. కడప, నెల్లూరు మండలాలు ద్వితీయ, తృతీయ స్థానాల నలంకరించాయి.

ఆర్థిక కారణాల వల్ల హాకీ, ఫుట్‌బాల్, రెజ్లింగ్, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ పోటీలను నిర్వహించలేదు.

క్రికెట్

బొంబాయి వరుసగా పదవ పర్యాయం రంజీట్రాఫీ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకొని క్రికెట్ చరిత్రలో కొత్త రికార్డు

సృష్టించింది. ఈ సంవత్సరం జరిగిన ఫైనల్స్‌లో బొంబాయి మద్రాసును ఓడించింది. బొంబాయి అగ్రశ్రేణి ఆటగాళ్లు ఇంజనీర్, వాడేకర్, నడ్కర్ణి, కుల్కర్ణి, రమాకాంత్ దేశాయ్ విదేశాలలో పర్యటిస్తున్నందు వల్ల వారు తమ జట్టులో పాల్గొనలేకపోయారు. అయినప్పటికీ యువ ఆటగాళ్ళు ప్రతిభావంతంగా ఆడి తమ జట్టు పేరు ప్రతిష్ఠలను నిలబెట్టారు. బొంబాయి మొదటి యిన్నింగ్స్‌లో అశోక్ మంకడ్ (వినూమంకడ్ కొడుకు) 112 పరుగులు సాధించి 31 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన తన జట్టును ఆపదనుంచి గట్టెక్కించాడు. రెండవ యిన్నింగ్స్‌లో మరో యువ ఆటగాడు ఏక్నాథ్ సోల్కర్ ఔట్ కాకుండా 66 పరుగులుచేసి తన జట్టుకు విషమ పరిస్థితిని నివారించాడు. జట్టు సారధి ఎం. ఎస్. హార్డీకర్ రెండు యిన్నింగ్స్‌లో 73,62 పరుగులు చేశాడు. రంజీట్రాఫి దక్షిణ మండలం ఛాంపియన్ షిప్‌లో మద్రాస్ హైదరాబాద్‌ను ఓడించింది.

క్రికెట్ టెస్టు పోటీలో ఇండియా న్యూజీలాండ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్ న్యూజీలాండ్‌లోని ట్యూన్‌డిన్‌లో జరిగింది. భారత క్రికెట్ జట్టు 1932వ సంవత్సరం నుంచి వివిధ దేశాలలో పర్యటించింది. కాని విదేశాలలో టెస్టు మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు గెలుపొందడం యిదే ప్రథమం. కనుక మన దేశ క్రికెట్ చరిత్రలో ఈ సంఘటన చిరస్మరణీయమైనది. భారత్ ఆడిన 44వ టెస్టు పోటీ యిది. దీనిలో యిండియా గెలుపొందడం వల్ల విమర్శలకు తావులేకుండా పోయింది. వాడేకర్ రెండు ఇన్నింగ్స్‌లో 80, 71 పరుగులు చేశాడు.

ఆస్ట్రేలియా పర్యటనలో భారత క్రికెట్ జట్టు బాగా విఫలమైంది దురదృష్టవశాత్తు మన జట్టులో పటౌడీ ఆసాంతం పాల్గొనలేకపోయాడు. ఆయన మొదటి టెస్టులో ఆడలేదు. తరువాత ఆయన పాల్గొన్న టెస్టులలో మంచిగా బ్యాట్ చేశాడు. వాడేకర్ కూడా చక్కగా ఆడాడు. యువఆటగాడు అబిద్‌అలీ గణ్యతలోనికి వచ్చాడు. సుశ్రీ బ్యాట్స్‌మన్‌గా, బౌలర్‌గా కూడా రాణించాడు. ఇంజనీర్ తన బ్యాటింగ్ ధాటితో ఆస్ట్రేలియా ప్రేక్షకుల అభిమానం చూరగొన్నాడు. తరువాత వెళ్ళి భారత జట్టులో చేరిన జయసింహ తాను పాల్గొన్న తొలి టెస్టు రెండవ యిన్నింగ్స్‌లో వంద పరుగులు సాధించాడు. ఈ టెస్టు పోటీల పరంపరలో మరే భారతీయ ఆటగాడూ వంద పరుగులు చేయలేదు.

Statement About Ownership and other Particulars about newspaper "Andhra Pradesh" to be published in the first issue every year after last day of February.

FORM IV

(See Rule 8)

Place of Publication	..	Hyderabad
Periodicity of Publication	..	Monthly
Printers, name	..	Director, Government Printing
Nationality	..	Indian
Address	..	Chanchalguda, Hyderabad-24
Publisher's name	..	B. N. Raman, I.A.S.,
Nationality	..	Indian
Address		Hyderabad - A. P.
	..	Sanchalak, Jana Sambandha Shakha, Hyderabad - A. P.
(Chief) Editor's name		B. N. Raman, I.A.S.
Nationality		Indian
Address		Sanchalak, Jana Sambandha Shakha, Hyderabad-A. P.
Name and address of Individuals who own the Newspaper and partners or share holders holding more than one percent of the total capital.	.	

I, B. N. Raman, hereby declare that the particulars given bove are true to the best of my knowledge and belief.

B. N. RAMAN,
Signature of the Publisher.

వికలాంగులకు మంచిరోజులు

డా॥ రాజ్‌బహదూర్ గౌడ్

సమాజంలో భౌతికంగా దుర్బలులైన వారిని గూర్చి "వికలాంగులకు మంచిరోజులు" అన్న అంశంమీద ఒక వ్యాసం వ్రాసి పంపమని జనసంబంధశాఖ సంచాలకుడు శ్రీ రామన్ నన్ను కోరారు. కాని ఎంత ఆలోచించినా నాకేమీ తట్టక యీ విషయంలో 'దుర్బలుణ్ణే' అనిపించింది. నేను రాయలేనని చెప్పేద్దామను కుంటుండగా సంచాలకుని కార్యదర్శి నాకు ఫోనుచేసి వ్యాసం సంగతి జ్ఞాపకం చేశారు. నాకు గట్టి చిక్కే వచ్చిపడింది. నన్ను అడిగినవారేమో సమర్థుడైన సంచాలకుడు. దుర్బలులు, వికలాంగులకు పునరావాసం కల్పించాలని గట్టిగా ఆలోచించే మనిషి ఆయన. ఇందులో నా సామర్థ్యమెంతో తెలుసుకోవాలని నన్ను "ఇంటర్వ్యూ" చేస్తున్నారేమోననిపించింది.

సంఘంలో మానసిక దౌర్బల్యం

దుర్బలుల సమస్యలను గురించి ఆలోచించేకొద్దీ మరింత గంద్రగోళంగా కనిపించింది. అసలు, నిజానికి ఏరకంగానూ దుర్బలుడుకానివాణ్ణినేనని గుండెలమీద చేతులేసుకొనిచెప్పే వ్యక్తి ఎక్కడైనా వున్నాడా? ఒక్క తప్పు కూడా చెయ్యని మనిషంటూ ఎవరూ లేడన్నాడు క్రీస్తు. కళ్ళతో చూచేవాళ్ళు అనేకులు వుండవచ్చు కాని యథార్థాన్ని చూడలేకపోవచ్చు. చెవులుండి వినపడినా అవసరమైనప్పుడు వినిపించుకోలేని వాళ్ళు అనేకమంది. అంటే కాలగతి స్వభావాన్ని గుర్తించలేనివాళ్ళు. నోరున్నా మాట్లాడలేని వాళ్ళెంతమందో! మెదడువుండి ఆలోచించగల్గినవాళ్లే కావచ్చుకాని వాళ్లుచేసే పనుల్ని చూస్తే, వారికి బుర్ర సరిగా పనిచేయడం లేదేమో అనిపిస్తుందిమరి. డాక్టర్ గున్నార్ డైబాద్ ఈ మానసిక మాంద్యాన్ని యిలా నిర్వచించారు: మనిషి బుద్ధి" సగటు స్థాయికంటే తక్కువ స్థాయిలో పనిచేస్తూ, ఫలితంగా కొంతవరకు సాంఘిక అసమానతకు కారణమయ్యేదే మానసిక మాంద్యం" అని. ఈ ప్రాతిపదిక మీద ఆలోచిస్తే తప్పులు చేసినవారూ, మందబుద్ధులు అందరూ ఈనాటి సమాజంలో మంచిహోదాలోనే వున్నారు.

ప్రస్తుత వ్యాసాంశము, శారీరకంగా దుర్బలులైనవారి గురించి —అంటే గ్రుడ్డివారూ, చెవిటివారూ, మూగవారూ, కుష్ఠువ్యాధికి గురైనవారూ, పిచ్చివారూ మొదలైనవారి గురించి. వారి భవిష్యత్తులను ఆశామయం చేయడాన్ని గురించి. ఈనాడు మన దేశంలో సుమారు 25 లక్షల మంది గ్రుడ్డివారు ఉన్నారు. 20 లక్షల మంది చెవిటివారున్నారు. 15 లక్షల మంది పిచ్చివాళ్ళు, మానసిక వ్యాధిగ్రస్తులూ వున్నారు. పుట్టుకతో వికలాంగులుగావున్న వీరుగాక, మరికొందరు ప్రమాదాలవల్లా, యితర రోగాలవల్లా వికలాంగులై ఈ సంఖ్య రాను రాను పెరుగుతోంది. మశూచివల్ల గ్రుడ్డితనం రావచ్చు. వెన్నుపూసకు వచ్చిన క్షయవ్యాధి వల్ల శాశ్వతంగా దుర్బలత్వం రావొచ్చు. కుష్ఠువల్ల ఆ శరీర భాగమంతా ఏ పనికీ కొరగాకుండా మొద్దుబారి పోవచ్చు.

ప్రమాదాలు సంఖ్యలో పెరగడమేకాదు; ఆ జరిగే ప్రమాదాలు కూడా రకరకాలుగా అనేక కారణాల వల్ల విస్తరిస్తున్నాయి! రకరకాల పరిశ్రమలు, శీఘ్రమైన రవాణా పద్ధతులు వ్యాప్తిలోకి వచ్చిన యీ రోజుల్లో రోజూ వందలాది మందిని ప్రమాదాలు పొట్టన పెట్టుకొంటున్నాయి. వికలాంగులుగా, దుర్బలులుగా చేస్తున్నాయి. పరిశ్రమలలో కొత్త విధానాలు తలెత్తుతుంటే కొత్త కొత్త ప్రమాదాలూ, కొత్త కొత్త వ్యాధులూ పుట్టుకొస్తున్నాయి. కార్మికులను కొద్దిగానో, లేక పూర్తిగానో దుర్బలుల్ని చేస్తున్నాయి.

జాతీయ సమస్య

అందువల్ల వికలాంగులు, దుర్బలులకు పునరావాసం కల్పించడం అనేది జాతీయంగానూ, సాంఘికంగానూ ప్రాధాన్యత గల సమస్య ఈ సమస్యను కేవలం మానవతా దృక్పథంతో ఆలోచించేవారు, వికలాంగులపట్ల జాలి ప్రదర్శించేవారు కొందరున్నారు. వారిది కేవలం ధర్మబుద్ధి. వికలాంగులను చూసి జాలిపడి సేవ చేయడంకన్న స్వభావసిద్ధంగానే వారు ఆసేవలను పొందే అవకాశాలను కల్పించేస్థితిని కలిగించాలి.

ఏ వ్యక్తిలోనయినా ఒక అంగం లోపిస్తే ఆ లోపాన్ని పూరించడానికో అన్నట్లు యితర అంగాలు ఎక్కువ సమర్థంగా పనిచేయగలగడం మానవ శరీర స్వభావం. ఉదాహరణకు గ్రుడ్డి వానినే తీసుకోండి. గ్రుడ్డి వానికి కనిపించదు. కాని అతడు మామూలు మనిషికంటె ఎక్కువగా శ్రవణశక్తి కలిగివుండవచ్చు. అందుచేత, శారీరకంగా వికలాంగుడైన వ్యక్తిలో అంతర్భూతంగా వున్న ఈ విధమైన విశేష ప్రతిభ ఏమిటో మనం నిర్ణయించాలి. దానిని బాగా అభివృద్ధిపరచి సమాజంలో మరింతగా అతడు ఉపయోగపడేందుకు వీలుగా ప్రయత్నం జరగాలి. అంతేగాని వ్యక్తికి గల శారీరక అవరోధాలు అతని వ్యక్తిత్వంలో ఆటంకాలు కాకూడదు.

వికలాంగులలోని యీ విశేష శక్తులను చక్కగా వినియోగించుకోవాలన్నా, వాటిని అభివృద్ధి పరచాలన్నా కృత్రిమ అంగసౌకర్యాలను, వృత్తి శిక్షణా సౌకర్యాలను కల్పించడం, తగిన వైద్య, శస్త్ర చికిత్సా సౌకర్యాలను కల్పించడం అవసరం.

ఈ విధమైన సేవాకార్యక్రమాలన్నీ ఏ స్వచ్ఛంద సంస్థలో, ధర్మ సంస్థలో జరిపించ వలసినవని భావించడం తప్పు. అలాభావిస్తే సాంఘికంగా మన బాధ్యతలను మనం విస్మరించడమే అవుతుంది. వికలాంగులు కూడా సమాజానికి సేవచేయగలరు. దేశ ప్రగతికీ, సంపద అభివృద్ధికీ వారు కూడా తమ వంతు కృషిని అందివ్వగలరు. అటువంటప్పుడు యీ మానవ శక్తియుక్తులు వృధా గావడం, అవి సమాజానికి భారం గావడం ఎందుకు కొనసాగనివ్వాలి?

అయితే యింతవరకు వికలాంగులు సానుభూతి మాత్రమే పొంద గలిగినారు. కాని యితరులకు వారిపైగల అపోహలను దూరం చేయలేక పోయారు.

గుడ్డి నమ్మకం

ఉదాహరణకు, వారి ఉత్పత్తి శక్తి తక్కువనీ, అందువల్ల యజమానులకు వారు "ఖరీదైన" కార్మికులనీ ఒక అపోహఉంది.

ఇది కేవలం గుడ్డినమ్మకం మాత్రమే. పనిలో నియుక్తులయి, సర్వేజరపబడిన వికలాంగులలో 7 శాతం మామూలుకు మించిన ఉత్పత్తి శక్తి గలవారనీ, 85 శాతం మామూలు ఉత్పత్తి శక్తిగలవారనీ, 11 శాతం మాత్రమే మామూలు కన్నా తక్కువ ఉత్పత్తిశక్తి గలవారనీ యిటీవల బొంబాయిలోని ప్రత్యేక ఉపాధి కల్పన శాఖ జరిపిన సర్వేద్వారా తెలుస్తున్నది. తత్ఫలితంగా వికలాంగులకు ఉత్పత్తిశక్తి తక్కువనేది కేవలం అపోహ మాత్రమేనని రుజువు అయింది.

వికలాంగుల ఉపాధి కల్పనను వ్యతిరేకించడానికి యాజమాన్యంలో అసమర్థత, వారి అలసత్వ భావమే కారణమవుతున్నదని నేను భావిస్తున్నాను. ఆధునిక పరిశ్రమలు ఎన్నోవిధాలైన ఉద్యోగాలను సృష్టించాయి. ఆ ఉద్యోగాలకు వివిధ అర్హతలు గలవారు కావాల్సిఉంటారు. అవసరమైన ఉద్యోగాలు, వాటి తీరుతెన్నులు, ఆయాఉద్యోగాలలో నియమించబడే వారికి ఉండాల్సిన అర్హతలు, సెలక్టు అయిన వ్యక్తుల శక్తిసామర్థ్యాలను గూర్చి యాజమాన్యానికి సరైన దృక్పథం ఉండాలి.

ఆయా ఉద్యోగాలలో యిమిడిపోయే విధంగా తమకుగల శక్తియుక్తులను పెంపొందించు కోవడంలో వికలాంగులకు చేయూత యివ్వడానికి అవకాశం వుంది. టెలిఫోన్ ఆపరేటరుగా కుంటి వాణ్ణి నియమిస్తే ఎందుకు పనికిరాడు? అలాచేయక పోవడం నిజానికి కుంటిసాకే.

వికలాంగుల విషయంలో మరో అపోహకూడ ఉంది. వారు ప్రమాదాలకు త్వరగా గురిఅవుతారని భావిస్తుంటారు. శారీరకంగా బాగా ఉన్నవారికన్నా ఎక్కువగా వికలాంగులు ప్రమాదాలుకోరుకుంటారని వారి అభిప్రాయం కాబోలు! దానివల్ల యజమానులకు ప్రమాదాల పరిహారం చెల్లింపుబాధ్యత పెరిగిపోతుంది. అజ్ఞానమే యీ అపోహకు కారణం అనవచ్చు. ఎందుకంటే వికలాంగులు తమకు మిగిలిఉన్న శక్తియుక్తులను సంరక్షించుకోవడానికి వారు ఎక్కువ శ్రద్ధతో అతిజాగ్రత్తగా వ్యవహరిస్తారనేది అందరికీ తెలుసు. శారీరకంగా బాగా ఉన్నవారికన్నా వికలాంగులలో ప్రమాదాల సంఖ్య చాలా తక్కువని పశ్చిమరాజ్యాలలో జరిగిన పరిశోధనలవల్ల తెలుస్తున్నది. భద్రతతో, శిక్షణతో శ్రద్ధగాను, చురుకుగాను వారు ఉంటారు.

అందువల్ల వికలాంగులకు ఉపాధి కల్పించడానికి వ్యతిరేకంగా ఉన్న అపోహలను దూరంచేయడం చాలా అవసరం. వికలాంగుల సంక్షేమం విషయంలోను దానికి సంబంధించిన అన్ని అంశాలను కూలంకషంగా చర్చించడానికివీలుగా కార్మికసంఘాల ప్రతినిధులు, యజమానులు, ప్రభుత్వం, ఆ విషయాలలో ఆసక్తిగల యితర అధికార, అనధికారసంస్థల ప్రతినిధుల సమావేశం జరగాలి. వికలాంగులకు తగిన శిక్షణయిచ్చి సరైన ఉద్యోగాలలో నియమించడానికి కృషిచేయాలి.

ఈ సందర్భంలో మరోవిషయం చెప్పాల్సిఉంది. ఈ రంగంలో పనిచేసే సంస్థల కార్యక్రమాలను సక్రమ రీతిలో సమన్వయం చేయడమేగాక వికలాంగులను ఉద్యోగాలలో చేర్చుకోవడానికికూడ పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి. శిక్షణ సౌకర్యాలు

కల్పించినంత మాత్రాన సరిపోదు. ఈ శిక్షణ ప్రయోజనాత్మకంగా ఉండి, వికలాంగులకు లాభసాటి అయిన ఉపాధి కలిగించేదిగా ఉండాలి. ఈ విషయంలో షెల్టర్ వర్క్‌షాపులు ఎంతో ప్రయోజనకరమైనవని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ వర్క్‌షాపుల్లో వికలాంగులు విజ్ఞానం ఆర్జించడంతోపాటు ధనార్జనకు ఉత్పత్తి చేస్తారు. నగరానికి దూరంగాఉండి, వికలాంగులు స్వేచ్ఛగా, స్వగృహంలో మాదిరిగా ఉండడం యిటువంటి వర్క్‌షాపులలోని ఉత్తమ అంశంగా పేర్కొనవచ్చు

వికలాంగులు, దుర్బలుల విషయంలో సమాజానికంతటికీ గురుతరమైన బాధ్యత ఉంది. వికలాంగులు కూడ తమ శక్తియుక్తులను వినియోగించి సమాజానికి సేవచేయాలి. వికలాంగుల విషయంలో స్పష్టమైన సాంఘిక దృక్పథం ఏర్పరచుకోవడం చాలా అవసరం. ఉపాధి సౌకర్యాలు, వికలాంగుల శక్తియుక్తుల పరిశీలన, వారికి తగిన వృత్తి విద్యా శిక్షణ, లాభసాటి అయిన ఉద్యోగాలలో నియమించడం వంటి విషయాల పరిశీలనలు యీ దృక్పథంలోని ప్రధాన అంశాలుగా పేర్కొనవచ్చు.

ఇవన్నీ కల్పించినప్పుడు "వికలాంగుల భవిష్యత్తు ఉజ్జ్వలం"గానే ఉంటుందని చెప్పవచ్చు. **

ఈ సంచికలోని రచయితలు

శ్రీ సి. వి. హెచ్. రావు, జర్నలిస్టు, హైదరాబాదు
శ్రీ పి. శేషాద్రి, లెక్చరర్, న్యాయశాస్త్ర కళాశాల, హైదరాబాదు
శ్రీ మధురాంతకం దొరస్వామి, దామల్ చెరువు, చిత్తూరు జిల్లా
శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి, కవి, హైదరాబాదు
శ్రీ పంద్రంగి రాజేశ్వరరావు, అడ్వకేటు, ఏలూరు
శ్రీ నటరాజ రామకృష్ణ, చిక్కడపల్లి, హైదరాబాదు
"దాశరథి", ఆకాశవాణి, మద్రాసు
శ్రీ పాతూరి ప్రసన్నం, సికిందరాబాదు
కుమారి వాసిరెడ్డి సీతాదేవి, ప్రకాశ్‌నగర్, హైదరాబాదు
శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, డిప్యూటీ డైరెక్టర్, విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయం
శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి, జన సంబంధశాఖ కార్యాలయం, తిరుపతి
శ్రీ పిలకా గణపతిశాస్త్రి, ఆంధ్రప్రభ, మద్రాసు
కమలాత్రివేణి, హైదరాబాదు
శ్రీ ద్రఖ్య శ్రీరామమూర్తి, మౌలాలి రైల్వే కాలనీ, సికిందరాబాదు
శ్రీమతి ఆరెకపూడి కౌసల్యాదేవి, ఇన్నీసుపేట, రాజమండ్రి
శ్రీ అట్లూరి వెంకటేశ్వరరావు, డివిజనల్ ఇంజనీర్, మల్లేపల్లి, హైదరాబాదు
శ్రీ రాజ్ బహదూర్ గౌడ్, కార్మికనాయకులు, హైదరాబాదు

'మనోరమ'లో ఒకరోజు

హైదరాబాదు యాత్రికులకు 'మనోరమ' లో ఒకరోజు మరపురాని అనుభూతి

ఆదివారిని

గోల్కొండ కోట
చార్మినార్
పబ్లిక్ గార్డెన్స్

ఉస్మాన్‌సాగర్
సాలార్జంగ్ మ్యూజియం
ఉస్మానియా విశ్వవిద్యాలయం

మొదలయిన స్థలాలకు తీసుకొని వెళ్తుంది

శుక్రవారం మినహా ప్రతిరోజూ పర్యటించవచ్చు

సాలార్జంగ్ మ్యూజియం

ప్రవేశరుసుముతో సహా

రూ. 8-00 మాత్రమే

రిజర్వేషన్లు చేయించుకోవలసిన స్థలము-మనోరమ బయలుదేరు స్థలము

రాష్ట్ర జన సంబంధ శాఖ

గాంధీభవనం ఎదుట, హైదరాబాదు.

ఫోన్ నం. 43281 మరియు 43282

PUBLISHED BY THE DIRECTOR OF JANA SAMBANDHA SAKHA, ANDHRA PRADESH, AND PRINTED BY THE DIRECTOR OF PRINTING GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD.

